
ఎమెస్కో

# రాజీగాడు రాజయ్యాడు

నాటకం



డా॥ డి.విజయ భాస్కర్

# రాజిగాడు రాజయ్యాడు

(నాటకం)

డా॥ డి. విజయభాస్కర్

ఎమెస్కో

**RAAJIGAADU RAAJAYYAADU** (NAATAKAM)
**Dr. D. Vijayabhaskar**

**రాజిగాడు రాజయ్యాడు** (నాటకం)
**డా॥ డి. విజయభాస్కర్**

సంపాదకులు
**దుర్గెంపూడి చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ : **మార్చి, 2016**

మూల్యం: రూ. **100/-**

ISBN: 978-93-85829-90-1

ప్రింటర్స్: **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ - 500 029.
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028.
e-mail : emescobooks@yahoo.com
www.emescobooks.com

పంపిణీదారులు
**సాహితి ప్రచురణలు**
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావుపేట, విజయవాడ - 2.
ఫోన్ : 0866-2436643
e-mail : sahithi.vja@gmail.com
www.sahithibooks.com

# వాగ్దానమిస్తున్న నాటకం

**ఈ** నాటకం మీముందు తెరతీయబోతున్న ప్రపంచంలోకి మీరు ప్రవేశించే ముందు రెండు మాటలు.

సుప్రసిద్ధ నాటక రచయిత, కవి, కేంద్ర సంగీత, నాటక అకాడెమీ పురస్కార స్వీకర్త డా. దీర్ఘాసి విజయభాస్కర్ తెలుగు సాహిత్యానికి సమర్పిస్తున్న మరొక విలువైన కానుక ఈ నాటకం 'రాజిగాడు రాజయ్యాడు'.

ఇందులో మూడు విశిష్టతలున్నాయి. మొదటిది, ఇది ఉత్తరాంధ్ర సాహిత్య వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న రచన, రెండవది సామాజికన్యాయ సాధనకోసం నేడు దేశమంతటా చెలరేగుతున్న ఉద్యమాల్లో ఇంతదాకా ఎవరూ స్పృశించని జీవితాన్ని, ఇతిహాసపు చీకటికోణం మరుగున పడిపోయిన ఒక కథనాన్ని మనముందుకు తెస్తున్న రచన. మూడవది, నాటకరచనలో, నిర్మాణంలో సిద్ధహస్తుడైన ఒక రచయిత ఇప్పటి అవసరాలకు తగ్గట్టుగా చేసిన కొత్త ప్రయోగం.

**2**

తెలుగు సాహిత్యంలోనే కాదు, భారతీయ సాహిత్యంలోనే, మనమిప్పుడు ఉత్తరాంధ్రగా వ్యవహరిస్తున్న కళింగాంధ్ర అద్వితీయమైన పాత్ర నిర్వహిస్తూ వస్తున్నది. 'కన్యాశుల్కం–19 వ శతాబ్ది భారతీయ నాటకాలు' అనే తన అత్యంత విశిష్ట పరిశోధనలో డా. ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి దీన్ని ఎంతో విశదంగా నిరూపించేరు. ఇటు గురజాడ అప్పారావు, అటు ఒరియాలో ఫకీర్ మోహన్ సేనాపతి–ఇద్దరూ కూడా సామాజిక వైరుధ్యాలపట్ల తమ ధర్మాగ్రహాన్ని పదునైన వ్యంగ్యంలో పలికించేరు.

అప్పుణ్ణుంచీ, సామాజిక న్యాయాన్ని సాధించడం కోసం సాహిత్యాన్ని ఒక పదునైన ఆయుధంగా వాడుకోవడంలో, ఉత్తరాంధ్ర తక్కిన దేశానికే దారిదీపంగా ఉంటూవస్తోంది.

ఆ విషయాన్నే రచయిత నాటకం మొదటి సన్నివేశంలో –

ఏ భూమిపై తూర్పువాకిట బలిదానాల తోరణం అమిరి ఉందో
ఏ నేలపై నూరు కొత్త ఉదయాలకై ఉద్యమం ఉప్పెనైందో
ఏ గడ్డపై సమభావంకోసం సమరం సాగిందో
ఏ మట్టిపై సాయుధ యోధులు నేలకొరిగి నింగికెగిశారో

అంటూ ప్రస్తుతించేడు.

'ఆ గడ్డపై గడ్డిపోచవంటివాడు గరుత్మంతుడై, గరళకంఠుడై సంప్రదాయ సర్పపు కోరలు పీకి, సామాన్యుని సామ్రాజ్యానికి పునాది వేసిన' కథని రచయిత నాటకంగా మలిచి మనముందుకు తీసుకొచ్చాడు.

సామాజికవాస్తవికతను విమర్శనాత్మకంగా చిత్రించిన రచయితగా మనం గురజాడను చెప్పుకుంటాం. ఇది ఒకప్పుడు రష్యాలో గోర్కీ, చైనాలో లూసన్ అనుసరించిన పద్ధతి. ఆ విమర్శ కేవలం వక్తృత్వంగా కాకుండా జీవితసన్నివేశాల్ని కఠోరవాస్తవాలుగా మనముందు చిత్రించడం ద్వారా చేపట్టే విమర్శ. మహనీయ కళింగాంధ్ర కథకులు, నాటకకర్తలు చాసో, రావిశాస్త్రి, భరాగో, బలివాడ కాంతారావు, పతంజలి, గణేష్ పాత్రో, గొల్లపూడి మారుతీరావు వంటివారు ఆ దారినే అనుసరించారు. భూషణం, అట్టాడ అప్పల్నాయుడు, గంటేడ గౌరునాయుడు ఆ వైరుధ్యాల్ని మరింత సూక్ష్మస్థాయిలో పట్టుకున్నారు. కొందరు రచయితలు పట్టణ, నాగరిక ప్రపంచంలోని వైరుధ్యాల్ని చిత్రించగా, కాళీపట్నం రామారావు గ్రామీణ జీవితం విధ్వంసమవుతున్న దృశ్యాన్ని ఒక ఐతిహాసిక స్థాయిలో చిత్రించారు. కాని ఆ రచయితలెవ్వరూ స్పృశించని మరొక విస్మృతకోణాన్ని ఈ రచయిత ఈ నాటకం ద్వారా మనముందుకు తీసుకురావడం ఈ నాటకంలోని మొదటి విశిష్టత.

## 3

సామాజిక న్యాయంకోసం కళింగాంధ్ర కథ, నవల, నాటకం వంటి ప్రక్రియల్లో ఎంతో గొప్ప సృజన చేసినప్పటికీ, గిరిజన జీవితాన్ని సమగ్రంగా చిత్రించడానికి చాలా ఏళ్ళే పట్టింది. భారతదేశంలో గిరిజన ప్రాంతాలకు కల్పిస్తున్న రాజ్యాంగ పరిరక్షణలకు

మూలం గంజాం జిల్లాలో 1839 కి పూర్వమే జరిగిన గిరిజన తిరుగుబాట్లు. కాని అంత విలువైన చారిత్రిక నేపథ్యముండి కూడా భూషణం 'కొండగాలి' (1970) కథలదాకా గిరిజనుడు ఉత్తరాంధ్ర సాహిత్యంలోకి ప్రవేశించలేకపోయాడు. అట్లానే, ఫకీర్ మోహన్ సేనాపతి 'ఛొమాణొ అఠొ గుంఠో'నవలలో కనిపించే మంగలి తెలుగు సాహిత్యంలో ఒక కథానాయకుడు కావడానికి మనం 2015 దాకా ఆగవలసి వచ్చింది.

బయట ప్రపంచంలో ఇంతదాకా అప్రధానీకరణకు గురవుతూ వచ్చిన ప్రజాసమూహాలు తమ అస్తిత్వ నిర్ధారణకోసం, తమదైన వ్యక్తిత్వ ముద్రకోసం, తమ ఉనికికోసం సాగిస్తున్న పోరాటాల ప్రభావమే ఇందుకు కారణం కావచ్చు. కాని మనం గమనించవలసిందేమంటే, భారతీయ సాహిత్యంలోనూ, సమాజంలోనూ ఆధునికత ప్రవేశించినప్పుడు, ఆ ఆధునికత కొందరికి విముక్తి కలిగించిన మాట నిజమే కాని, ఆ విముక్తి ఫలాలు ఆ కొద్దిమందికి మాత్రమే పరిమితమైపోయాయి. సామాజిక నిశ్రేణిలో అడుగున పడిపోయిన వాళ్ళకీ, పక్కకు నెట్టెయ్యబడ్డవాళ్ళకీ, సంఖ్యరీత్యా అల్పసంఖ్యాకులుగా ఉన్నవాళ్ళకీ విమోచన ఇంకా సుదూర స్వప్నమే. పందొమ్మిదో శతాబ్ది చివరలో మొదలైన ఈ విముక్తి స్రవంతి ఇంకా తమదాకా చేరడంలేదని ఆక్రోశిస్తున్న ప్రజాసమూహాలు ఈ దేశంలో అసంఖ్యాకంగానే ఉన్నాయి. అదంతా, చివరి సన్నివేశంలో, రాజిగాడినోటంట రచయిత ఎంతో స్పష్టంగా ఇలా చెప్పించేడు:

> ఈ దేశంలో బేమ్మర్ల గురించి దేవుడాలోచించాడు. రెడ్ల గురించి రాజ్యాలాలోచించాయి. కమ్మోళ్ళ గురించి సిద్ధాంతాలు ఆలోచించాయి. కాపులు, కాళింగులు, వెలమల గురించి రాజకీయ పార్టీలు ఆలోచించాయి. హరిజన గిరిజనుల గురించి రాజ్యాంగం ఆలోచించింది. మైనార్టీల గురించి ప్రభుత్వాలూ ఆలోచించాయి. ఇంతవరకూ ఎవ్వరూ ఆలోచించంది మా గురించే, దయచేసి మా గురించి ఆలోచించండి..

ఇది స్పష్టంగా ఆధునికానంతర చైతన్యం. ఇటువంటి వాక్యాలు యాభై ఏళ్ళకింద సాహిత్యంలో మనం ఊహించలేం. చివరికి కళింగాంధ్ర సాహిత్యంలో కూడా. అందుకనే 'ఛొమాణొ అఠొ గుంఠో' లో కనిపించే మంగలికీ, ఇందులో మంగలికీ మధ్య శతాబ్దాల దూరముంది. ఇతడు కన్యాశుల్కంలో కేవలం తాషామర్పాగా కనిపించిన మంగలి కాదు. ఈ మంగలి వ్యక్తిగా, ఒక సామూహిక శక్తిగా ఎదిగినవాడు. పరిణతి చెందినవాడు. తన విముక్తిలో, తన కులవిముక్తి మాత్రమే కాదు, మొత్తం సామాజిక విముక్తి కూడా ఉందని తెలుసుకోగలిగినవాడు:

కాబట్టే ఇలా అనగలిగాడు:

> మతం మైనార్టీ కన్నా కులం మైనారిటీ భరించలేనిది. అదెంత దారునంగా వుంటాదో మాకే కాదు, మీకూ తెలుసు కాని మమల్నెవరూ పట్టించుకోరు. పులుల్ని మేకల్ని ఒక గొడుక్కింద కట్టేసి మీరందరూ ఇది తినండంటే మాకు కోరల్లేవు, పంజాల్లేవు, ఆఖరికి గట్టిగా అడగడానికి నోరూ లేదు. మాకేది దక్కుతదో ఆలోసించండి. ఎక్కడినుండొ వచ్చిన ఎన్నో మతాల్ని మైనార్టీలని చేరదీస్తున్నారు. తప్పులేదు.కానీ ఈ దేశంలో పుట్టి ఈ దేశంలో పెరిగి ఈ దేశానికి సేవలు చేసినోళ్ళం, సరుకులు తయారు సేసినోల్లం, మీ అవసరాలు తీర్చినోల్లం. మా గురించి ఏటాలోసిస్తున్నారో సెప్పండి.. ఎన్ని కులాలు వృత్తులకు దూరమై పోయి తిండిలేక అల్లాడిపోతున్నయో మీకు అగుపించడం లేదా. అంతరించిపోతున్నయో మీకు అర్థం కావడం లేదా. ఇల్లూ వాకిల్లూ లేకంట కొన్ని కులాలున్నాయి. ఇంకా సంచారుల్లాగే మరికొన్ని కులాలు బతుకుతున్నాయంటే మీకు సిగ్గేయడం లేదా. వార్డుమెంబరు కూడా కాని కులాలున్నాయంటే ఇది పెజాస్వామ్యమేనా? మా సేతుల్లో ఎప్పుడూ పప్పుబెల్లాలేనా? కొన్ని రకాల పశువులు పచ్చులు అంతరించిపోకండ కాపాడాలనే అంత ఉబలాటపడతన్నరు, అంతకన్న మా కులాలు తీసికట్టా? మా పానాలు అంత పనికిమాల్నాయా? నీకు ప్రెసిడెంటు పదవి ఒక అలంకారం, కాని నాకు ఆత్మతృప్తి, ఒక గుర్తింపు, నన్ను మనిషిలాగ గుర్తించినారనే గొప్ప ధైర్యం. ఈ సమాజంలో, ఈ ప్రభుత్వంలో మాకు వాటా ఇచ్చినారనే ధీమా..

ఇంత విస్తృతంగా ఈ మాటలు ఎత్తిరాయడానికి కారణం, ఈ వాక్యాల్లో ఈ మొత్తం నాటకసందేశమంతా మనకి వినిపించడమే.

మన సాహిత్యంలో ఆధునిక దశలో వచ్చిన సాహిత్యానికీ (1967 కి ముందు) ఆ తర్వాత వచ్చిన సాహిత్యానికీ మరొక ముఖ్యమైన తేడా ఉంది. ఆధునిక దశలో సామాజిక వైరుధ్యాల్ని చూసేటప్పుడు, శిబిరాల్ని నిర్ణయించేటప్పుడు, చాలా సరళీకరణ ఉండేది. అంటే పెట్టుబడిదారుడు–శ్రామికుడు, సామ్రాజ్యవాది–స్వాతంత్ర్య యోధుడు, సవర్ణ హిందువు–దళితుడు, పురుషుడు–స్త్రీ.. ఇట్లా. కాని ఈ సరళీకరణలో కూడా మోసముందనేది ఆధునికానంతర మెలకువ. అంటే, పెట్టుబడిదారుడిని ఎదిరించే శ్రామికులంతా ఒక్కటి కాదు, వాళ్ళల్లో మళ్ళా సంఘటిత కార్మికులు వేరు, అసంఘటిత

రంగాల కార్మికులు వేరు, అట్లానే దళితులంతా ఒక్కటికాదు, వాళ్ళల్లో మళ్ళా ఎన్నో అంతరాలు, ఎన్నో అగాధాలు, స్త్రీల సమస్యలు కూడా ఒక్కలాంటివి కావు, చదువుకున్న, ఉద్యోగినులైన స్త్రీల సమస్యలు వేరు, దళిత, శ్రామిక, గిరిజన స్త్రీల సమస్యలు వేరు. గిరిజనుల్లో మళ్ళా ఆదిమ గిరిజనుల సమస్యలు వేరు.

ఒకరినొకరు అణచివేస్తున్న సామాజిక హింసాచక్రంలో అట్టడుగున ఉన్నవాళ్ళు ఇప్పుడు ఇద్దరితో యుద్ధం చేయాలి. మొదటిది, సామాజికనిశ్రేణిలో అందరికన్నా పైనున్నవారితోను, మరొకవైపు తమ పైనే వున్న తమవాళ్ళతోనూ. ఏకకాలంలో తనవాళ్ళతోనూ, తనకన్నా పరాయివాళ్ళతోనూ చేసే ఈ పోరాటంలో చాలాసార్లు తనవాళ్ళతో చేసే పోరాటం మరింత సూక్ష్మంగానూ, సంక్లిష్టంగానూ పరిణమిస్తుంది. దాన్ని పోల్చుకోవడం కష్టం, అర్థం చేసుకోవడం కష్టం, దానికి మద్దతు కూడగట్టుకోవడం మరీ కష్టం.

ఈ నాటకంలో చిత్రించబడ్డ పోరాటం ప్రభుత్వాలు బి.సి లుగా గుర్తించిన వివిధ కులాల్లో అందరికన్నా వెనకబడ్డ కులాలు తమకన్నా కొంత మెరుగైన జీవితం జీవిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల్ని తమదాకా రానివ్వకుండా చేస్తున్న తమ తోటికులాలతో చేస్తున్నదీ, చెయ్యకతప్పనిదీను. అందులోనూ ఆ వెనకబడ్డ కులాలు అల్పసంఖ్యాకులైతే ఆ సమస్య మరింత జటిలమవుతుంది.

సైద్ధాంతికంగా ఎంతో విశ్లేషించి వివరిస్తే తప్ప సుబోధకం చెయ్యలేని ఈ అంశాన్ని రచయిత ప్రేక్షకుల హృదయాల్ని చూరగొనేవిధంగా చిత్రించడంలో గొప్ప విజయం సాధించాడు. ఇది నాటకంలోని రెండవ విశిష్టత.

## 4

ఇక మూడవ విశిష్టత నాటక శిల్పానికి సంబంధించి. ఈ నాటకాన్ని సాంప్రదాయిక పద్ధతిలో అంకాలుగా విడదియ్యకుండా సన్నివేశపరంపరగా చూపించడం ఒక ప్రయోగం. ఒకప్పుడు బెర్టొల్డ్ బ్రెష్ట్ ఇటువంటి ప్రయోగమే చేసాడు. సాంప్రదాయిక అరిస్టాటిలీయ పద్ధతిని పక్కనపెట్టి సంఘటనాత్మక సన్నివేశాల్తో (ఎపిసోడిక్) రూపకాలు నిర్మించాడు. ఇక్కడ కూడా అదే పద్ధతిలో సన్నివేశపరంపరను నిర్మిస్తూ, అదే సమయంలో దీనికొక పౌరాణిక తరహా ప్రస్తావననీ, భరతవాక్యాన్నీ సమకూర్చడంద్వారా రచయిత ఇంతదాకా చరిత్రకెక్కని జీవితాలకు పౌరాణిక గౌరవాన్ని సమకూర్చే ప్రయత్నం చేసాడు.

సన్నివేశాలుగా నాటకాన్ని నిర్మిస్తున్నందువల్ల, ప్రేక్షకుల ఉత్కంఠని చివరిదాకా నిలపడం కోసం మొత్తం కథాప్రణాళికలో కొన్ని సబ్ ప్లాట్లు కూడా పొందుపరిచాడు. 2–4 సన్నివేశాలదాకా కమలమ్మ రాసిన ఉత్తరం చుట్టూ తిరిగిన కథ అటువంటి సబ్ ప్లాట్. దాదాపుగా కన్యాశుల్కంలో కంటె చుట్టూ తిరిగినంత నాటకమూ కమలమ్మ రాసిన చీటీ చుట్టూ నడిచింది. ఆ సన్నివేశాల్లో ఆ చీటీని పట్టుకున్న ప్రతి మనిషి వ్యక్తిత్వాన్నీ ఆ చీటీతో ఆవిష్కరింపచేసాడు రచయిత.

6 నుంచి 11 వ సన్నివేశం వరకు రాజన్నతో బలవంతంగా కులవృత్తి చేయించితీరాలనే నాయుడి పట్టుదల ప్రధాన ఇతివృత్తం కాగా, దానిపక్కనే రాజిగాడి తండ్రి నర్సింహులు జీవన్మరణ యాతన సబ్ ప్లాట్ గా నడిచింది. అణగారినవాళ్ళంతా నాటకం చివర ఏకంకావడానికి నర్సింలు అంత్యక్రియలఘట్టమే ప్రాతిపదిక సిద్ధం చేసిందని మనం గమనించాలి. రాజన్నని 2 వ సన్నివేశంలోనే కమలమ్మ తన పిల్లవాడికి సేవచెయ్యమని ఆదేశించినప్పుడే అతడు తన కులవృత్తి వదిలిపెట్టాలని నిర్ణయించుకోవడానికి బీజారోపణ పడింది. ఆ సన్నివేశం అతడిలో ఆత్మగౌరవాన్ని మేల్కొల్పింది. తన ఆత్మగౌరవం చదువుకోవడంవల్ల నిలబడుతుందని భావించి రాజన్న చదువుకోవడానికి చేసే ప్రయత్నాలు 7వ సన్నివేశంలో విఫలం కావడం చూస్తాం. అప్పుడే పురాణాల వల్లా పురాణ పఠనంవల్లా కాక, ఈ దేశంలో ఆత్మగౌరవం, రాజకీయాధికారం ద్వారానే సిద్ధిస్తుందని రాజన్న గుర్తుపట్టాడు.

రాజకీయాధికారం దిశగా ప్రయత్నం చేసి సఫలం కావడం 12 నుంచి 16 దాకా చివరి సన్నివేశాల్లో ఇతివృత్తం. అయితే తమలో తామిట్లా కలహించుకుంటూ ఉంటే తమ ప్రాంతం కాని పడమటోడు రాజకీయాధికారానికి దగ్గర కావడం ఆ సన్నివేశాల్లో సబ్ ప్లాట్.

ఇలా 16 సన్నివేశాల్నీ ఒకదానికొకటి గొలుసులాగా అల్లి, ఒక సన్నివేశంలో పడ్డ అంకురం మరొక సన్నివేశంలో వికసింపచేస్తూ, ప్రతి నాలుగు సన్నివేశాలకూ ఒక సబ్ ప్లాట్ చొప్పున ప్రేక్షకుల ఆసక్తిని, ఉత్కంఠని నిలుపుకుంటూ నాటకాన్ని చివరిదాకా నడిపించడంలో రచయిత చూపించిన ప్రతిభ నాటకరచనలో అతడెంత కౌశల్యం సాధించాడో తెలియచేస్తున్నది.

**5**

తెలుగు సాహిత్యంలో ప్రస్తుతం అన్ని ప్రక్రియల్లోనూ నవల, నాటకం చెప్పుకోదగ్గ ప్రగతి చూపించలేకపోతున్నాయి. సామాజిక గమనాన్నీ, పరివర్తననీ పట్టుకోవలసినంత నిర్దుష్టంగా పట్టుకోలేకపోతున్నాయి. చిత్రించవలసినంత నిశితంగా చిత్రించ లేకపోతున్నాయి. ఆ లోటును తీర్చగల రచయిత దీర్ఘాసి విజయభాస్కర్ అని ఈ నాటకం మనకొక వాగ్దానం చేస్తున్నది.

హైదరాబాదు **వాడ్రేవు చినవీరభద్రుడు**
డిశంబర్ 2015

# విప్లవ నాటకం

**"శ్రామికుల చేతికి పరిపాలనాధికారం రానంతవరకూ**
**వారి సమస్యలు పరిష్కరింపబడవు"**

**(డా. బి.ఆర్. అంబేద్కర్ 1938 నవంబర్ 7న శ్రామికుల సభలో)**

**ఆ**ధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలలో ఎక్కువ చరిత్ర కలిగినది నాటకమే. (1860 – 2015) అయితే మిగతా ప్రక్రియలకన్నా నాటక చరిత్రలో ఎక్కువ ఎగుడు దిగుడులున్నాయి. ఒక్కోసారి తెలుగులో నాటకం అదృశ్యమైపోయిందా అని కూడా అనిపిస్తుంది. ఆచార్య ఆత్రేయ మరణించినప్పుడు తెలుగు నాటకం దుస్థితి మీద చాలా చర్చ జరిగింది. సినిమా వల్ల తెలుగు నాటకం దెబ్బతినిందని అప్పట్లో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. అయితే కన్నడంలో సినిమా ప్రభావానికి బలై పోకుండా నాటకం సజీవంగా ఎలా నిలబడగలిగిందన్న ప్రశ్న కూడా అప్పుడే తలెత్తింది. ఏమైనప్పటికీ ఉన్నదేదో ఉన్నట్లు అన్నట్లు తెలుగునాటకం ఎన్ని ఒడిదుడుగులు ఎదురైనా తన ప్రయాణం తాను సాగిస్తున్నది. సంఘ సంస్కరణ ఉద్యమం మొదలుకొని ప్రపంచీకరణ ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమందాకా ప్రతి ఉద్యమంలోనూ నాటకం తన బాధ్యత ఎంతో కొంత నిర్వహిస్తూ వస్తున్నది. తెలుగు నాటకాన్ని గత మూడు దశాబ్దాలుగా సుసంపన్నం చేస్తున్న రచయితలలో డా. డి. విజయ భాస్కర్ ఒకరు.

విజయ భాస్కర్ ఇప్పటికే 25 నాటకాలు రచించారు. రచించడం, ప్రచురించడం, ప్రదర్శించడం మూడు ముఖాలుగా ఆయన కృషి సాగుతున్నది. విజయ భాస్కర్ నాటక కృషిని చూసినప్పుడు నాకు కోలాచలం శ్రీనివాసరావు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు గుర్తుకు వస్తారు. వాళ్ళు షేక్స్పియర్‌ను ఆదర్శంగా పెట్టుకొని

ముప్పైకి పైగా నాటకాలు రాసి ప్రదర్శించారు. వాళ్ళ తర్వాత నాటకమే ఊపిరిగా బతికిన వాళ్ళు తక్కువ. ఇటీవలి కాలంలో విజయ భాస్కర్ వాళ్ళ మార్గంలో పయనిస్తున్నారు.

సంఘ సంస్కరణ కోసం కాకపోతే నేను కలం ముట్టనే ముట్టను అన్నారు జార్జి బెర్నార్డ్ షా. అక్షరాస్యత చాలా స్వల్పంగా ఉన్న సమాజాన్ని జాగృతం చేయడానికి నాటకమే సరైన ప్రక్రియ అని నమ్మిన గురజాడ కన్యాశుల్కం వివాహాలు వంటి జాతికి తలవంపులు తెచ్చే దురాచారాలను ఎత్తి చూపి ఉన్నత నైతిక విలువల్ని ప్రచారం చెయ్యడం కన్న మించిన ప్రయోజనం సాహిత్యానికేమున్నది? అని పేర్కొన్నారు. చదువులేని సమాజానికి నాటకం సరైన ప్రక్రియ అని గురజాడ భావిస్తే అక్షరాస్యత బాగా విస్తరించిన సమాజంలో కూడా విజయ భాస్కర్ వంటి వాళ్ళు నాటకాలు రాస్తున్నారు. అందువల్ల చదువంటే మనం కొత్త నిర్వచనం చెప్పుకోవలసి ఉంది.

గిడుగు, గురజాడ వంటి తొలితరం ఆధునిక తెలుగు రచయితలు పుట్టిన గడ్డలో పుట్టిన విజయ భాస్కర్ వాళ్ళ మార్గంలోనే ప్రయాణిస్తున్నారు. గిడుగు, గురజాడల తర్వాత చాసో, రావిశాస్త్రి, భూషణం, కారా, బలివాడ కాంతారావు, ఎ.వి.రెడ్డి శాస్త్రి, శ్రీపతి వంటి వాళ్ళు ఉత్తరాంధ్ర నుంచి బలమైన ప్రజాసాహిత్యాన్ని సృష్టించారు. ఇటివల అట్టాడ అప్పల్నాయుడు, గంటేడు గౌరునాయుడు, జి.ఎస్.చలం, చింతా అప్పల్నాయుడు, బమ్మిడి జగదీశ్వరరావు, వివినమూర్తి, సువర్ణముఖి వంటి వాళ్ళు ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఈ తానులో సాగే డా. విజయ భాస్కర్, ఇవాళ తెలుగు నేలమీద వేళ్ళ మీద లెక్కబెట్టదగిన నాటక రచయితలలో అగ్రగామి.

డా. విజయ భాస్కర్ కాలక్షేప రచయిత కాదు. వాస్తవికవాద రచయిత. నాటకాన్ని సామాజిక పరివర్తనకు సాధనంగా ఉపయోగిస్తున్నారు. ఆయన శ్రామికవర్గ రచయిత. మనం నివసించే సమాజం అందరిచే నివాస యోగ్యంగా ఉండాలన్నది ఆయన తపన. కష్టజీవులకు ఈ రాజ్యం చెందాలన్నది ఆయన తపన. విశ్రాంతి వర్గం శ్రామిక వర్గం మీద స్వారీ చేయడం అన్యాయమని ఆయన భావన. ఈ తలక్రిందుల సమాజాన్ని నిటారుగా నిలబెట్టడానికి ఆయన నాటకాన్ని ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. మార్క్సిజాన్ని జీర్ణించుకున్న అంబేద్కరిజం ఆయన తాత్వికచింతనగా అర్థమౌతుంది. శ్రామిక కులాలకు చెందిన దళిత బహుజనులు పాలకులుగా ఎదగాలని ఆయన ఆకాంక్ష. రాజ్యాధికారం ద్వారానే వాళ్ళ సమస్యలు పరిష్కారమౌతాయని ఆయన అవగాహన. ఈ దృష్టితో రాసిందే "రాజిగాడు రాజయ్యాడు" నాటకం.

"రాజిగాడు రాజయ్యాడు" అన్నది 111 పుటల నాటకం. దీనిని పదహారు సన్నివేశాలుగా విభజించారు విజయ భాస్కర్. ఈ నాటకం శ్రీకాకుళం జిల్లాలో ఒక గ్రామంలో జరుగుతుంది. అక్కడి మానవ సంబంధాలను అక్కడి భాషలో ఆసక్తికరంగా ప్రదర్శించింది ఈ నాటకం. అయితే ఇది భారతదేశంలో ఎక్కడైనా జరగడానికి అవకాశం ఉన్న వస్తువు. స్థానికత నుండి జాతీయతలోకి ఈ నాటకం ప్రయాణిస్తుంది.

ఒక దేశంలో, ఒక వ్యవస్థలో ఎవరు బాగుపడ్డారో, లాభపడ్డారో వాళ్ళకు ఆ దేశం, ఆ వ్యవస్థ గొప్పవిగా కనిపిస్తాయి. వాళ్ళు వాటిని కీర్తిస్తారు. వాళ్ళ వారసులుకూడా అలాగే చేస్తారు. వీళ్ళ సామాజిక సందర్భం మారిపోయినా వాటినే కలవరిస్తూ ఉంటారు. ఒక దేశంలో, ఒక వ్యవస్థలో నష్టపోయిన వాళ్ళకు, అవమానాలకు అణిచివేతలకు గురైన వాళ్ళకు అవి గొప్పవిగా కనిపించవు. వాళ్ళు వాటిని కీర్తించలేరు. వాళ్ళ వారసులు కూడా ఆ పని చేయలేరు. సామాజిక సందర్భం మారినా వాటి పట్ల వాళ్ళు విమర్శనాత్మకంగానే ఉంటారు. ఒక వేళ నష్టపోయిన వాళ్ళు కూడా వాటిని కీర్తిస్తున్నారంటే ఇందుకు కారణం బాగుపడిన వాళ్ళు వేసిన సూదిమందే అయ్యుంటుంది. ఇవాళ వామపక్షవాదులు, దళిత బహుజన మైనారిటీ స్త్రీ ప్రాంతీయ అస్తిత్వవాదులు మన సామాజిక వ్యవస్థ మీద పెడుతున్న విమర్శంతా నష్టపోయిన వాళ్ళ విమర్శే. రచయితలు కూడా లాభపడిన వాళ్ళ పక్షంగాని, నష్టపోయిన వాళ్ళ పక్షంగాని వహిస్తారు. డి. విజయ భాస్కర్ నష్టపోయిన వాళ్ళ పక్షం వహించి ఈ నాటకం రాశారు.

రాజిగాడుగా పిలవబడుతున్న మంగలి వ్యక్తి తన పై వర్ణ వివక్ష, దౌర్జన్యం భరించలేక రాజ్యాధికారంతోనే తనకు విముక్తి కలుగుతుందని గ్రహించి తిరుగుబాటు చేసి, ప్రజల్ని సమీకరించి గ్రామ సర్పంచి కావడమే ఈ నాటకంలో ఇతివృత్తం. రాజిగాడు రాజయ్య కావడం పెద్దపోరాట ఫలితం.

గ్రామ సర్పంచి నాయుడు స్వతంత్ర భారతదేశంలో మనం చెప్పుకునే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో బాగుపడ్డ వర్గానికి ప్రతినిధి. నష్టపోయిన వర్గ ప్రతినిధి రాజయ్య. రచయిత రాజయ్య పక్షాన ఉన్నారు. ఓ గాయకుడా! నువ్వు గాంధర్వుడివి అయితే నువ్వెటు వైపు అని గోర్కీ ప్రశ్నించారు. అంటే ప్రభువుల వైపా? ప్రజల వైపా? విజయ భాస్కర్ ప్రజల వైపు ఉన్నారు. అరవయ్యేడేళ్ళ స్వతంత్ర భారత దేశంలో లాభపడిన నాయుడు వర్గానికి, నష్టపోయిన రాజయ్య వర్గానికి మధ్య సంఘర్షణ అనివార్యం. ఈ సంఘర్షణకు ప్రతిబింబమే ఈ నాటకం. వర్గపోరాటంలో శ్రామిక

జనపక్షానిదే అంతిమ విజయం. ఈ విజయంలో ఒక దశను ఈ నాటకం సూచించింది. భారతదేశానికి స్వతంత్రం వచ్చినప్పటి నుంచి సర్పంచి పదవిలో నాయుడు కుటుంబం వాళ్ళే ఉంటున్నారు. రాచరికం పోయినా వంశపారంపర్య వ్యవస్థ పోలేదు. ఒకప్పుడు మనం నెహ్రూ కుటుంబం మీద ఈ విమర్శ పెట్టే వాళ్ళం. ఇవాళ అలాంటి అధికార కుటుంబాలు భారతదేశంలో కుప్పలు తెప్పలయ్యాయి. ఇలాంటి వ్యవస్థ మీద తిరుగుబాటే ఈ నాటకం. సర్పంచి కాకముందు రాజయ్య రాజిగాడు, మంగల్నాకొడుకు. సర్పంచి కాగానే రాజయ్య. సామాజిక గౌరవం, వ్యక్తి గౌరవం, ఆత్మ గౌరవం దక్కాలన్నా అధికారం కావాలి. ఇది అందరిదీ కావాలి. ఇదే ఈ నాటక సారాంశం.

గ్రామంలో కులాల ఆధిపత్యంలో నలిగిపోయిన రాజిగానికి తిరగబడే చైతన్యం ఎలా వచ్చింది? ఆయనలో మొదటి నుంచి బాధ ఉంది. తాను కష్ట జీవినని, తన శ్రమ లేకుండా గ్రామ జీవతానికి అర్థం లేదని, అయినా తన శ్రమకు తగిన ఫలితమూ, తనకు గౌరవము దక్కలేదన్న ఆవేదన ఆయనలో మొదటి నుంచీ ఉంది. ఈ స్థితి నుంచి తాను విముక్తం కావాలన్న ఆకాంక్ష కూడా ఉంది. ఆయన విముక్తి ఆయన ఒక్కడి చేతిలో లేదు. తనలాంటి అనేక మంది పీడితుల విముక్తిలో తన విముక్తి దాగుంది. ఇది ఒక ప్రక్రియ, ఒక పోరాటం. దీనికి చైతన్యం అవసరం. ఈ నాటకంలో రాజయ్యకు ఈ చైతన్యం నూరి పోసింది ఒక బామ్మ. ఈమె ఒక బ్రహ్మణ వితంతువు. విద్యావంతురాలు, తెలుగు, సంస్కృతం, ఆంగ్లం బాగా చదువుకున్నది. ఈమె రాజయ్యను చేరదీసి చదువు చెప్పింది. ఈ చదువుతో రాజయ్యలో చైతన్యం రగుల్కొంది. బామ్మ నేర్పిన విద్య ఏమిటో ఈ నాటకంలో రెండు, మూడు సందర్భాలలో వ్యక్తమౌతుంది. అయిదవ సన్నివేశంలో బామ్మ ప్రవేశించడంతో నాటకంలో కథాగమనం వేగవంతమైంది. ఆమె మనుమడు కిష్టప్ప మాటల్లోనే, ఆమె కులం తక్కువ వాళ్ళందర్ని తీసుకొచ్చి వంటింట్లో విస్తళ్ళు వేసి వడ్డించి మరీ తినిపిస్తుంది. పూజగదిలోకి వెళ్ళి ప్రసాదం తినిపిస్తుంది. హెచ్చు తగ్గుల్లేకుండా చదువులు చెబుతుంది.

ఒక మాల పిల్లమీద కాపోళ్ళ కుర్రాడు అఘాయిత్యం చేస్తే వారిని జైల్లో పెట్టించేదాకా నిద్రపోలేదు. ఇంతటి చైతన్యవంతమైన మహిళ దగ్గర రాజయ్య చదువుకున్నాడు. అడిసం పట్టిన చేతుల్లో పుస్తకాలు పట్టుకున్నాడు. రాజయ్యతో పాటు కమల కూడా బామ్మ ప్రభవానికి లోనై తనను తాను కాపాడుకుంది. బామ్మకు ప్రకృతి, ప్రపంచం, మానవ జాతి పుట్టుక పరిణామాలపట్ల ఆధునిక భావాలున్నాయి. ఆమె భర్త సంగీతజ్ఞుడు, ఆమె సంఘ సేవిక. ఇద్దరి మధ్య అన్యోన్యత ఉండేది. భర్త మరణం

తర్వాత ఆమె తన కులనిరంకుశత్వంలోంచి బయటపడి విశాల ప్రపంచంలోకి అడుగు పెట్టింది. ఒక గ్రామాన్ని మార్చడానికి ప్రయత్నించి సఫలమైంది. ఒరేయ్ రాజిగా అని దబ్బాగాడితోనూ, రాజిగా అని కమలతోనూ, పడమటోడితోనూ, నాయుడుతోను అనిపించకుంటున్న రాజయ్య నాటకం ముగిసేలోపల పరిణామం చెందుతాడు. ఇతని పరిణామాం కన్యాశుల్కం నాటకంలో మధురవాణి, "ప్రజల మనిషి" నవలలో కంఠీరవంల పరిణామం వంటిది. ఇది వ్యక్తిగతం కాదు, సామాజికం. ఇదెలా సాధ్యమైంది? బోధించు, సమీకరించు, పోరాడు అన్న డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రబోధం వల్ల సాధ్యమైంది.

నిజానికి ఈ నాటకరచనోద్దేశం పీడిత కులాలలో అట్టడుగు కులాలకు రాజ్యాధికారం ద్వారా సామాజిక న్యాయం జరగాలన్నది. మనదేశంలోని కులాలు ఓసి, బిసి, ఎస్.సి, ఎస్.టి. లుగా విభజింపబడ్డాయి. అన్ని రంగాలలోనూ ఈ క్యాటగిరీలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. వందకుపైగా వెనకబడిన కులాలున్నాయి. ఇవి కూడా ఎ బి సి లుగా విభజింపబడినాయి. అయితే ఈ కులాలలో రిజర్వేషన్ సౌకర్యాలను శాశ్వతంగా అతి తక్కువ కులాలు అనుభవిస్తున్నాయి. చాలా కులాలు స్వాతంత్ర్య ఫలాలను, రిజర్వేషన్ సౌకర్యాలకు దూరంగానే ఉండిపోతున్నాయి. రిజర్వేషన్ సౌకర్యాలను ఉపయోగించుకొని పైకి వచ్చినవాళ్ళు, తమ కన్నా వెనకబడిన కులాల పట్ల బాధ్యత తీసుకోవడం లేదు. పైగా వాళ్ళు ఆధిపత్య కులాలతో సమానంగా పీడించడానికి తయారవుతున్నారు. ఈ వాస్తవాన్ని వాస్తవికంగా ప్రదర్శించి, దీని మీద తిరుగుబాటు చేయించింది ఈ నాటకం. ఈ నాటకంలో నాయుడు బి.సి. ఇతని పేరుకు వెనకబడిన కులానికి చెందిన వ్యక్తే గాని, బలవంతుడు కావడంవల్ల స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సర్పంచి పదవి ఈయన కుటుంబం చేతిలోనే ఉంది. దోపిడిలో, అహంకారంతో, అణచివేతలో ఈయన ఆధిపత్య కుల భూస్వామికి ఏమాత్రం తీసిపోడు. సాటి వెనకబడిన కులాల పట్ల ఆధిపత్య కులాల వారికి ఉండే శత్రు భావన ఈయనకూ ఉంది.

రాజయ్య 12వ సన్నివేశంలో 'నాయుడూ! మీ బోటి కులాలన్నీ మా వల్లే గెల్సి రాజ్యాలేలుతున్నారు. ఇక నుంచి రాజ్యాధికారంలో మా వాటా మాకివ్వకపోతే చూస్తూ ఊరుకోం' అంటాడు. అలాగే 16వ సన్నివేశంలో 'నీకన్నా ఎంతో తక్కువ స్థితిలో ఉన్నవాళ్ళతో సమానంగా నువ్వు రిజర్వేషన్లు అనుభవించడం మంచిపనా?' అని ప్రశ్నిస్తాడు. ఈ విమర్శల్తో నాటకం రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను మంది

పేరు చెప్పి కొందరే, అన్ని కులాల పేరుచెప్పి కొన్ని కులాలే అనుభవించడంపై అస్త్రాన్ని ఎక్కుపెట్టినది. ఈ నాటక రచనోద్దేశం ఈ అన్యాయాన్ని బహిర్గతం చేసి పీడిత కులాలలోనే అత్యంత పీడిత కులాలలో చైతన్యం తీసుకురావడం. ఇందుకు కావల్సిన జ్ఞానం ఈ నాటకమిస్తుంది. ఈ సంభాషణే ఇందుకు నిదర్శనం.

నాయుడు : పెసిడెంటు పదవి నువ్వు సేస్తవా?

రాజయ్య : నువ్వే సేయగలిగినప్పుడు నాను సెయ్యలేక పోవడమేటి? నువ్వు నాకన్నా దేంట్లో గొప్పోడివి?

నాయుడు : ఒరే రాజిగా

రాజయ్య : రాజిగా కాదు, రాజయ్య!

నాయుడు : నువ్వు నేను సమానమా?

రాజయ్య : ముమ్మాటికీ సమానమే

నాయుడు : కాదు ........ కాలేవు.

రాజయ్య : ఎందుకు కాదో .......... సెప్పు

నాయుడు : కొత్తగా సెప్పడానికేటుందిరా? నువ్వెన్ని జన్మలెత్తినా మాతో సమానం కాలేవు. నాయుడు వస్తున్నాడంటే చుట్టూ ఉన్నోళ్ళు భయంతో, భక్తితో లేచి చేతులు జోడించి మొక్కుతారు. అదే మంగలి రాజిగాడొస్తున్నాడంటే కూసున్నోడు కూడా లెగడు. అది నీకూ నాకూ మనిద్దరి మధ్య నున్న తేడా. ఏ గాడిద కొడుకురా నువ్వు నేను సమానమని సెప్పింది?

రాజయ్య : మరాలాంటప్పుడు ఏ గాడిద కొడుకురా నువ్వు నేను బి.సి.లమని చెప్పింది?

ఈ సంఘర్షణంతా ప్రజాస్వామ్య యుగంలో కూడా కొనసాగుతున్న మనువాద ఫలితమే.

రచయిత డి. విజయ భాస్కర్ రాజయ్యతో మరో ప్రశ్నను కూడా వేయించారు. అది అడగవలసిన ప్రశ్న. సమాధానం చెప్పవలసిన ప్రశ్న. ఆ ప్రశ్న రైతులు, రైతు వృత్తుల వాళ్ళలో ప్రభుత్వ పక్షపాతాన్ని ఎత్తి చూపుతుంది. 'ప్రభుత్వం డ్యాం కడితే భూములు కోల్పోయినోళ్ళకు నష్ట పరిహారమిత్తారు, పేకేజీలు ఇత్తారు. కాని మిషన్లు,

ఫ్యాక్టరీలు వచ్చి మా బతుకులే కోల్పోయినాం. మాకేదీ నష్టపరిహారం? మాకెవులిచ్చినారు పేకేజీలు?' ఇదీ ప్రశ్న.

పట్టణీకరణ, కార్పొరేటీకరణ కూడా మంగలి వంటి బాగా వెనకబడిన కులాల సమస్యను పరిష్కరించడంలేదనే అంశాన్ని కూడా ఈ నాటకం వెల్లడి చేసింది. రాజయ్య ఊరువదలి నగరం చేరిన మంగలివాళ్ళు దండిగా డబ్బు సంపాదిస్తున్నారని, తనను కూడా నగరానికి తీసుకుపొమ్మని డబ్బాగాడిని అడుగుతారు. డబ్బాగాడు నగరంలో సవరానికి వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నది మంగలోళ్ళు కాదని, పెద్దకులాల వాళ్ళని చెబుతారు. అందుకు రాజయ్య గొరిగే పని మాది, గడించే పని ఆళ్ళదన్నమాట, అని అవగాహనకొస్తాడు. గ్రామంలో వృత్తికారులుగా ఉన్నవాళ్ళు నగరంలో ఆ వృత్తి పరాయీకరణ చెంది అందులో కూలీలుగా మారుతున్నారని అర్థం చేసుకున్న రాజయ్య, ఉన్న ఊళ్ళోనే తమ వర్గానికి రాజ్యాధికారం సంపాదించడమే తమ సమస్యకు పరిష్కారమని గ్రహిస్తాడు. అందుకోసం ఉద్యమాన్ని నిర్మించి విజయం సాధిస్తారు.

బ్రాహ్మణ శివయ్య మృదంగం వాయించేవాడు. రాజయ్య తండ్రి నరసింహులు నాదస్వరం ఊదుతాడు. రెండూ సంగీత సాధనాలే. అయినా శివయ్య బాగుపడ్డాడు, నరసింహులు చెడిపోయాడు. సమాన నైపుణ్యం ఉన్నా కులం వాళ్ళ స్థాయిని నిర్ణయిస్తుందన్న సత్యాన్ని కూడా ఈ నాటకం ప్రదర్శించింది.

ఈ నాటకంలో కమల చిల్లర అంగడి పెట్టుకొని జీవనం సాగిస్తున్న ఒంటరి మహిళ. అయితే రకరకాల పోకిరిగాళ్ళు ఆమెను హింసిస్తూ ఉంటే, ఆమె అనివార్యంగా భూస్వామి నాయుడితో అక్రమ సంబంధం పెట్టుకొని తనను తాను రక్షించుకోవలసి వచ్చింది. రాజయ్య చైతన్యం గమనించిన కమల, తాను కూడా బామ్మ దగ్గర చదువుకోవాలని ప్రయత్నిస్తుంది. ఆమెతో పాటు కాశీకిపోయి, అక్కడ బామ్మ నుంచి తప్పించుకొనిపోయి ఒక పండితుని దగ్గర చదువుకోడానికి నిర్ణయించుకుంటుంది.

ఈ నాటకం మరో వాస్తవాన్ని కూడా రికార్డు చేసింది. కోస్తా ప్రాంతంలోని కృష్ణ, గోదావరి జిల్లాల నుండి ధనవంతులు ఉత్తరాంధ్రకు వలసపోయి అక్కడ ఆస్తులు సంపాదించి, రాజకీయాలలోకి ప్రవేశించి అక్కడి ప్రజల మీద పెత్తనం చేయడం చాలా కాలంగా జరుగుతున్నది. 2014 ఎన్నికల సమయంలో ఇద్దరు రాజకీయ నాయకులు విశాఖపట్టణం నియోజకవర్గం తనదంటే తనదని వాదించుకోవడం చూశాం. వాళ్ళిద్దరూ అక్కడి వాళ్ళు కాకపోవడం విశేషం. ఈ రాజకీయార్థికాంశాన్ని విజయ భాస్కర్ పడమటోడు పాత్ర ద్వారా ప్రదర్శించారు.

ఈ నాటకం సామాజిక న్యాయ ఉద్యమంలోనే ప్రత్యామ్నాయ ఉద్యమానికి పునాది వేసింది. ఆధిపత్య కులాలను నిందిస్తూ పబ్బంగడుపుకుంటున్న వెనకబడిన కులాలలోని ఆధిపత్య వాదుల దుర్మార్గాలను ఎండగట్టింది.

ఆధిపత్య కులాలకు, బి.సిలలోనే ఆధిపత్య వాదులకు అతీతంగా పీడిత బిసి.ఎస్.సి. లు ఏకం కావలసిన అవసరాన్ని ఈ నాటకం చిత్రించింది. రాజయ్య తండ్రి నరసింహులు మరణించినప్పుడు ఆయనను కాల్చడానికి కట్టెలు ఉన్న వాళ్ళు నిరాకరించిన సమయంలో వృత్తికారులందరూ తమ తమ వృత్తుల పనిముట్లు శిథిలమైపోయిన వాటిని శవాన్ని కాల్చడానికి సమకూర్చడం ఈ నాటకంలో ఒక చైతన్యవంతమైన సంఘటన. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఇదొక విశిష్ట సందర్భం. ఆధిపత్య వాదుల బలం తెలిసినా పీడితులు – మాలపల్లి నవలలో కూలి పెంపుదల కోసం రైతులకు చేసిన సహాయ నిరాకరణ చూసి కూలి డబ్బులు పెంచుతున్నట్లు ఈ నాటకంలో పనిబంద్ చేయించి విజయం సాధిస్తారు.

సమాజం ఎంతో మారిపోయినట్లు, మారిపోతున్నట్లు అనిపిస్తున్నా మారవలసింది ఇంకా ఎంతో ఉందని ఈ నాటకం చాటుతుంది.

బొమ్మ, కమల, ఈరమ్మ (రాజయ్య భార్య) అడ్డపొగది, నాయుడు భార్య మంగమ్మ వంటి స్త్రీలందరూ తమ తమ స్వస్వరూపాలతో ఈ నాటకంతో కనిపిస్తారు.

హైందవ పురాణ పురుషులైన అగ్నివత్సుడు, మిత్రాయువు, శామ్సపాయణుడు, శౌనకాది మహామునులకు బహుజనుడైన సూతుడు రాజయ్య కథను చెప్పి ప్రదర్శించి వాళ్ళకు కనువిప్పు కలిగించినట్లు విజయ భాస్కర్ ఈ నాటకాన్ని రాసారు. సమాజానికి విద్యా బుద్ధులు నేర్పవలసిన వర్గంగా ముద్రపడిన వర్గం సమాజం చేత బుద్ధి చెప్పించుకునే దశకు చేరడం గొప్ప సామాజిక విషాదం. సామాజిక సమస్యలు ఉత్తినే పరిష్కారం కావని, పూజలు, నోములు, వ్రతాలు, యాగాలు ద్వారా పరిష్కారం కావని విశ్రాంతి వర్గ భావజాలం నుంచి పీడిత కులాల వర్గాల ప్రజలు చైతన్యవంతులై ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారమౌతాయని ప్రజాస్వామిక ఉద్యమం ద్వారా విజయ భాస్కర్ ప్రతిపాదించారు.

ఈ నాటకం తెలుగు నాటక చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ నాటకానికి స్వాగతం పలుకుతూ డా. విజయ భాస్కర్ గారికి అభినందనలు తెలియజేస్తున్నాము.

**ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి**

ఈ నాటకాన్ని 2013 జులై 15, 16, 17 మరియు అక్టోబరు 16న హైదరాబాదులోని రవీంద్రభారతిలో, డిసెంబరు 27న గాంధీ కళామందిరం, శ్రీకాకుళంలో, డిసెంబరు 28న గురజాడ కళాక్షేత్రం, విజయనగరంలో, డిసెంబరు 30న మున్సిపల్ టౌన్ హాల్, నంధ్యాలయందు, 2014 ఫిబ్రవరి 13న మహతి కళాక్షేత్రం, తిరుపతిలో, ఏప్రిల్ 15 మరియు 16న కళాభారతి, విశాఖపట్నంతోపాటు 2015 ఏప్రిల్ 8న రవీంద్ర కళాక్షేత్ర, బెంగుళూరులో ప్రదర్శించడం జరిగింది. ఆ ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారుల వివరాలు.

| **పాత్రలు** | : | **పాత్రధారులు** |
|---|---|---|
| రాజిగాడు | : | వెంకట్ గోవాడ |
| డబ్బాగాడు | : | యం.సంతోష్ (సురభి) |
| కమల | : | కుమారి సుధ / జ్యోతి |
| బుడ్డన్న | : | స్వరాజ్ |
| పడమటోడు | : | పి.శ్రీనివాసరావు |
| ఈరమ్మ | : | వి.ప్రభావతి (సురభి) |
| నర్సింహులు | : | డి.జార్జి |
| కిష్టప్పంతులు | : | రమేష్ బలిజేపల్లి |
| బామ్మ | : | తెనాలి శకుంతల |
| అడ్డపొగది | : | యస్.వెంగమాంబ (సురభి) |
| మంగమ్మ | : | జ్యోతి |
| నాయుడు | : | యం.కేదార శంకర్ |
| అసిరిగాడు | : | ఎస్.ఎ.రాఘువ (సురభి), మురళీమోహన్ |
| బారికోడు | : | బి.గౌరీశంకర్ |
| కులపెద్ద | : | టి.వి.సుబ్బారావు, గోవిందరాజుల నాగేశ్వర రావు |
| పిల్లాడు | : | వి.మణిమోహన్ |
| కుర్రాడు | : | చెవుల రాజ్‌కుమార్ |
| పోస్టుమేన్ | : | డి.రాజు |
| వ్యక్తి 1 | : | సాదు శ్యాంప్రసాద్, ఆర్.శ్రీనివాస్ |
| వ్యక్తి 2 | : | చంద్రశేఖర్ |
| రైతు, వ్యక్తి | : | టి.సుధాకర్ |
| సాలోడు | : | డి.వి.కృష్ణారావు |

| | | |
|---|---|---|
| కుమ్మరోడు | : | ఎస్.రాజు, రాజ్‌కుమార్, గోవింద్ |
| కమ్మరోడు | : | జి.ఎల్.కుమార్ |
| ఊరి మనుషులు | : | పి.సంజీవ్ కుమార్, టి.సుధాకర్, చెగో, ఐ.తిరుమలరావు, ఎం.కృష్ణ, కె.టి.వి.సిహెచ్.రావు, నరేంద్ర |

## సాంకేతిక వర్గం

| | | |
|---|---|---|
| సంగీతం | : | టి.సాంబశివరావు, డా॥ రాధ, రమణ |
| డప్పు | : | వై.కర్ణ, వై.చిన్నరమేష్, వై.పెద్దరమేష్, వై.మనోజ్, వై.లింగయ్య, కె.నరేష్ |
| తప్పెటగుళ్ళు | : | కె.నీలయ్య, వి.తవుడు, వి.రాజులు, వి.భాస్కరరావు, ఎ.అప్పయ్య, కె.చిన్నోడు |
| ఆహార్యం | : | సారధి, థామస్ |
| కాస్ట్యూమ్స్ | : | డా॥ ఎస్.రాధ |
| రంగాలంకరణ | : | బి.సుభాష్ (సురభి), కృపాల్ (సురభి), నాగరాజు (సురభి) |
| రంగోద్దీపనం | : | ఉమాశంకర్ (సురభి), చిరంజీవి (సురభి), కుమార్ (సురభి) |
| సహాయకులు | : | గోవాడ శ్రీరామమూర్తి, మల్లీశ్వరి |
| ప్రొడక్షన్ మేనేజర్ | : | చాగంటి హనుమాన్ |
| పి.ఆర్.ఓ. | : | గీతిక – హారిక |
| పబ్లిసిటీ | : | గోవాడ క్రియేషన్స్ (హైదరాబాదు) కార్యవర్గం |
| ప్రొడక్షన్ ఇన్‌ఛార్జ్ | : | డా॥ ఎస్.రాధ |
| డిజైనర్ | : | ఐడియల్ గ్రాఫిక్స్ |
| దర్శకత్వం | : | వెంకట్ గోవాడ |

# పాత్రలు

1. సూతుడు
2. మునులు - 4
3. రాజిగాడు
4. డబ్బాగాడు
5. బుడ్డన్న
6. పడమటోడు
7. కమల
8. కమల కొడుకు
9. నర్సింహులు
10. ఈరమ్మ
11. కిష్టప్పంతులు
12. బామ్మ
13. నాయుడు
14. మంగమ్మ
15. అసిరిగాడు
16. బారికోడు
17. అడ్డపొగది
18. కులపెద్ద
19. కుర్రాడు
20. రైతు–1, రైతు–2
21. ఊరి జనం

# 1వ సన్నివేశం

(అది నైమిశారణ్యం. ఆ అరణ్యంలోనే సూతుడు శౌనకాది మహామునులకు పురాణం చెబుతుంటాడు. అనులోమ వివాహ వ్యవస్థలో క్షత్రియ పురుషునికి, శూద్ర స్త్రీకి జన్మించిన వారిని సూతులంటారు.

అదిగో అతనే ఏకాగ్రచిత్తుడై ఉన్న సూత మహర్షి. ఆ వస్తున్న వారే అగ్నివత్సుడు, మిత్రాయువు, శామ్సపాయణుడు, శౌనకాది మహామునులు).

నలుగురు : మహర్షీ ప్రణామములు!

సూతుడు : లోక కళ్యాణమస్తు! పురాణ శ్రవణానికి ముందు విశ్వశ్రేయోకారక ప్రార్థనలు ఆలపించండి.

నలుగురు : (శ్లోకాలు చదివారు)

హరిః ఓమ్ శం నో మిత్రఃశం వరుణ్ణః శం నో భవత్వర్యమా।
శం న ఇంద్రో బృహస్పతిః శం నో విష్ణు రురుక్రమః నమో బ్రహ్మణే ।
నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి।। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ
వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు।
తద్వక్తారమవతు। అవతు మామ్। అవతువక్తారమ్।।
ఓం శాంతిః శాంతిః శాంతిః

సూతుడు : మహర్షులారా? ద్వాదశ దీర్ఘ సత్ర యాగ విశేషాలేమిటి?

శౌన : మీ ఆశీర్వాదాలతో ఆ యాగం నిరాటంకంగా సమాప్తమైంది మహర్షీ

అగ్ని : యాగ విరామ సమయంలో మీరు చెప్పిన పురాణ కథా విశేషాలు మమ్మల్నెంతో అలరించాయి.

మిత్రా : కేవలం అలరించడమే కాదు, మా ఆధ్యాత్మిక భక్తి ప్రపత్తులకు వాస్తవికతను రంగరించినట్టయింది.

శామ్స : తత్ఫలితంగా యాగమంతా సామాన్య జన వినియోగంగా మారింది.

సూతుడు : చాలా సంతోషం

శౌన : కానీ మహర్షీ...

సూతుడు : ఏవిటి నాయినా !

శౌన : ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు.

సూతుడు : దేహంలో సందేహము ఉండకూడదు. చెప్పునాయనా!

శౌన : నిజానికిది నా ఒక్కడి సందేహం కాదు

అగ్ని : మా నలుగురిది కూడా కాదు

మిత్రా : ప్రాజ్ఞులు, విజ్ఞులు, బ్రహ్మజ్ఞాన సంపన్నులైన బ్రాహ్మణులదీకాదు

సూతుడు : మునుల మనసు, మాట, చేత, ఏవీ వారివి కాకూడదు. మునుల మాటకి, మౌనానికి మధ్య ప్రజా సంక్షేమమే తొణికిసలాడాలి. చెప్పండి. ఏవిటీ మీ ఆందోళన?

శౌన : చాతుర్వర్ణ ధర్మనిరతి నశించి మానవులు పరమపాపులుగా సంచరిస్తున్నారు.

అగ్ని : వేద విధులు విసర్జించి విప్రులు, క్షాత్ర ధర్మాన్ని కాదని క్షత్రియులు, వాణిజ్య వ్యాపారాలు వదలి వైశ్యులు, నిమ్న వృత్తులు చేయక శూద్రులు బరితెగించి ప్రవర్తిస్తున్నారు.

మిత్రా : ఒకప్పుడు శిష్ట జనాశ్రయ దేశంగా విలసిల్లిన భరతవర్షం ఇప్పుడు మ్లేచ్ఛ సంస్కృతికి ఆలవాలమై పోయింది.

సూతుడు : మీరన్నది నిజమే, కాని గమనించవలసినది ఇక్కడ మరొకటి ఉన్నది.

నలుగురు : ఏమిటది మహర్షీ?

సూతుడు : పురోహితులు చతుర్వర్ణ ధర్మాలను సరిగ్గా నిర్వచించక తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఆదిలో చెప్పిన శ్లోకాల్ని ఒక్కసారి గుర్తుచేసుకోండి. "చాతుర్వర్ణం మాయా సృష్టం– గుణ కర్మ విభాగశః" అన్నారు. నాలుగు వర్ణాలు గుణకర్మల చేత విభజింపబడాలి. కానీ జన్మతః కాదు. పైగా పూర్వమెందరో వారు జన్మించిన కులాలకు, వర్ణాలకు వ్యతిరేకంగా వ్యవహరించి కీర్తిపొందారు, కదా!

పరశురాముడు బ్రాహ్మణ్యాన్ని వదలి, క్షత్రియ వృత్తితో, దశావతారాలలో ఒకనిగా పేర్కొనబడలేదా! బుద్ధుడు క్షత్రియునిగా జన్మించి, ధ్యాన సంపన్నుడై లోకానికి జ్ఞాన కాంతులు పంచలేదా!

అంతెందుకు మహర్షులు, దేవర్షులు, బ్రహ్మర్షులైన మీరంతా ఒక సూతుడనైన నాచేత పురాణ కథలు చెప్పించుకోవడం లేదా? మనిషిని నడిపిస్తున్నది జన్మ సంస్కారం తప్ప జన్మకాదు.

(మునులు అసంతృప్తులయ్యారు. వారిలో గుసగుసలు మొదలైనాయి. వారి అసంతుష్టిని తెలియజేయడానికి శౌనకుడు సన్నద్ధుడయ్యాడు)

శౌన : మీరు ధర్మనిరతికి చుక్కానిగా, మీ పలుకు ఆర్ష ధర్మవ్యాప్తికి మేలుకొలుపుగా భావించాం. పంచభూతాలు, అష్టదిక్కులు, నవగ్రహాలు, ఆత్మ, అంతరిక్షం, సర్వ దేవతలు వినాశహేతువైన ఈ వర్ణ ధర్మ భ్రష్టత్వాన్ని అంగీకరించరు. కానీ మీరు సమర్థిస్తున్నారు.

అగ్ని : ఈ వర్ణ వ్యతిరిక్తతను, సంప్రదాయచ్యుతిని సమర్థించడం భావ్యం కాదు. మీరిలా సమర్థిస్తే అది సర్వనాశనానికి దారి తీస్తుంది.

మిత్రా : సకలలోక సంక్షేమ కాంక్షితులైన మునులు దైవాగ్రహాన్ని ప్రేరేపించే పనులు చేయకూడదు కదా, సూత మహర్షీ! ధర్మ విరుద్ధమైన పనులు చేయడమే కాదు– వినడం కూడా పాపమనే భావించాలి. పదండి వెళదాం.

(అందరూ వెళ్ళడానికి సిద్ధపడ్డారు)

సూతుడు : బ్రహ్మజ్ఞాన స్వరూపులారా! ఆగండి! నాలుగు విధాలైన వర్ణముల మధ్య జరిగిన క్రియా సంకరం గురించి తెల్సుకోవడంతోనే మీ బ్రహ్మజ్ఞానం ఆగిపోయింది. కానీ లోకం ఇంకా ఎంతో ముందుకు వెళ్ళింది– లోకంలో మీకు తెల్సిన వర్ణములు ఇప్పుడు లేవు. వర్ణములు కులాలయ్యాయి. కులాల్లో ఉపకులాలు వచ్చాయి. అవి తెగలుగా చీలాయి, ఆ తెగలు మళ్ళీ గుంపులయ్యాయి. గుంపులు గోత్రాల్ని తొడుగుకున్నాయి. ఆ తొడుగుల్ని బట్టి శాఖలు వచ్చాయి. వాటికి ఉప శాఖలు మొలిచి శాఖోపశాఖలుగా విస్తరించాయి. ఆ విస్తరణ ప్రాంతీయ, భాషా, భౌగోళిక భేదాలను పొందింది. ఆ భేదాలననుసరించి వృత్తులు వచ్చాయి. వాటికి సమాంతరంగా

ప్రవృత్తులు పొడచూసాయి. వృత్తి, ప్రవృత్తీ, కలిసి వ్యక్తుల్ని తీర్చిదిద్దాయి. వారిలో కొందరు వ్యక్తిత్వం లేనివారయ్యారు. మరికొందరు అస్తిత్వం లేని వారయినారు.

కర్మ సంకరం చేత దైవానుగ్రహం తప్పుతుందనేగా మీ భయం! ఈ పాపకర్మ ప్రళయ కారకమౌతుందనే కదా మీ భీతి! కానే కాదు. గొంగళి పురుగు సీతాకోకచిలుక కావడం దైవం సంతోషించే పరిణామమే తప్ప ప్రళయాంతకం ఎందుకవుతుంది?. అందుకే ఒక అత్యల్ప స్థాయిలో జన్మించి, ఊరికీ, ఉనికికీ దూరంగా నామమాత్రపు అస్తిత్వం కూడా లేని ఒక అతిశూద్రుడు తన తపనతో పోరాటంతో క్షాత్ర ధర్మాన్ని పాటించిన విధానాన్ని కథగా చెబుతాను. శ్రద్ధాళువులై వినండి. కూర్చోండి. (మునులు కూర్చున్నారు)

శౌన : ఏమిటీ! ఒక అతిశూద్రుడు క్షాత్ర ధర్మాన్ని పాటించి గొప్పవాడయ్యాడా? ఎక్కడయ్యాడు? ఎప్పుడయ్యాడు? ఇది మరొక విశ్వామిత్ర సృష్టి కాదుకదా!

సూతుడు : కాదు, భరత ఖండంలో, అత్యంత వెనుకబడిన ప్రాంతంలో...

"ఏ భూమిపై తూర్పు వాకిట బలిదానాల తోరణం అమరి ఉందో!

ఏ నేలపై నూరు క్రొత్త ఉదయాలకై ఉద్యమం ఉప్పెనైందో!

ఏ గడ్డపై సమభావం కోసం సమరం సాగిందో!

ఏ మట్టిపై సాయుధ యోధులు నేలకొరిగి నింగి కెగిశారో!

ఆ గడ్డపై గడ్డిపోచవంటివాడు, గరుత్మంతుడై, గరళకంఠుడై, సంప్రదాయ సర్పపు కోరలు పీకాడు. సామాన్యుని సామ్రాజ్యానికి పునాదులు వేశాడు.

మునులు : ఎవరా వీరుడు!

సూతుడు : మంగలి కులస్థుడైన రాజిగాడు

మునులు : మంగలి రాజిగాడా?

సూతుడు : అవును! మంగలిగా జన్మించిన అతనిలో క్షాత్ర గుణం ఎలా వీర విహారం చేసిందో చెబుతాను. సర్వేంద్రియాలు ఏకోన్ముఖం చేసి, అత్యంత శ్రద్ధాసక్తులతో వినండి.

శౌన : అంటే మీరు శూద్రకులస్థుని చరిత్రను గానం చేస్తారా?

సూతుడు : అవును.

అగ్ని : పురాణాల పంచ లక్షణాల్ని మర్చిపోయారా?

మిత్రా : సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరిత్ర ఇవే కదా పురాణ ఇతివృత్తాలకర్హమైనవి! ప్రజాపతుల నుండి సృష్టి క్రమంలో కొనసాగిన ఋషుల, రాజుల వంశ చరిత్రలు కదా, తమరు గానం చేయాల్సినది. ఒక శూద్రుని కథ ఎలా చెబుతారు?

సూతుడు : మునులారా! పురాపి, నవం "పురాణం" అన్నారు. అంటే మునుపు చెప్పబడిఇప్పటికీ ఉండి, మున్ముందుకు కూడా ఉండేదే పురాణం. అనగా భూత, వర్తమాన, భవిష్యత్తుల్లో వుండేది అని అర్థం. ఈ దేశ నాగరికత నిర్మాతలు శూద్రులు. తరతరాల సంస్కృతీ వారసులు శూద్రులు! ఈ జాతికి జీవగర్రలు శూద్రులు. వారి శ్రమైక జీవన విధానం, చారిత్రక వీర విజయ గాథలే భావితరాలకు స్ఫూర్తిదాయకం – మార్గదర్శకం, భరతవర్ష సాంస్కృతీ ఔన్నత్యమంతా వీరి శ్రమను పునాదులుగా చేసుకొనే విస్తరిల్లింది. గతం వీరిని విస్మరించింది కనుకనే వర్తమానం ఇలా అస్తవ్యస్తమైంది. ఏ సమాజం శ్రమకు విలువనిస్తుందో అదే ఎల్లప్పుడు విరాజిల్లుతుంది. రాజిగాని కథ చెబుతాను... శ్రద్ధగా వినండి.

(మునులు కూర్చున్నారు)

అదొక పల్లెటూరు– అప్పుడే తెల్లవారింది...........

**(లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్)**

## 2వ సన్నివేశం

(ఒక ప్రక్క కమలకొట్టు. లోపలకూర్చోని వుంది కమల. రెండోపక్క అరుగుపై ఒకడికి క్షవరం చేస్తున్నాడు రాజిగాడు. దూరాన గుడిలో గంటలమోత వినడుతుంది. సన్నాయి మేళం ఆవెనక తప్పెటగుళ్ళతో దేవుడి ఊరేగింపు వెళుతుండగా కమల ముందుకొచ్చి దండం పెట్టుకుంది. రాజిగాడు కూడ దండంబెట్టుకున్నాడు. ఊరేగింపు, దేవుడు వెళ్ళిపోయారు. ఊరేగింపులో ఆడిన ఒక వ్యక్తి కమలనే ఆశగా చూస్తూ అరుగుమీద కూచున్నాడు)

ఒకడు : రాజిగా, తొందరగా తలంటు పోసుకుని గుడికెల్లాలి.

రాజి : ఇదుగో సిటంలో అయిపోతాంది. (ముగింపు పనిచేస్తున్నాడు)

కమల : ఏటికావాల్నీకు

వ్యక్తి : హిహి... అదే..

కమల : అదే అంటే, చెప్పు

వ్యక్తి : రొండుగావాలి

కమల : ఆఁ!..

వ్యక్తి : ... అదే ఎయ్యి రూపాయలకి సిల్లర. రొండు ఐదొందల నోట్లు కావాలి.

కలమ : లేవు (అయినా వాడుపోలేదు) లేవన్నాగా. (వ్యక్తి లేచి బయలు దేరాడు), డబ్బాగాడు ఎదురయ్యాడు)

డబ్బా : ఏట్రా అప్పన్నా, అందరూ దేవుడి దగ్గరి కెల్తాంటె నువ్విక్కడ తచ్చాడతన్నావే?

వ్యక్తి : అదే... సిల్లరకోసం.. ఎయ్యి తీసుకోని రొండు ఐదొందలిస్తావేటి

డబ్బా : నాదగ్గర లేవురా.

వ్యక్తి : లేకపోవటమేటి. జోబీలో జిగ్‌జిగేల్‌మంటా 500నోటు కనపడతాంది.

డబ్బా : ఉన్నది ఒక్కటేరా నాయనా. రొండోది లేదు.

వ్యక్తి : ఫోజా ఉన్న ఒక్కదాన్ని అంతస్టైల్‌గా ఎగ్జిబిట్ చెయ్యాలా (వెళ్ళ బోయాడు)

డబ్బా : ఆగొరె అప్పన్నా... తాజ్‌మహల్‌లు ఎన్నీ ఒక్కటే, పార్లమెంటు ఒక్కటే, చార్మినార్లెన్ని ఒక్కటె. ఒక్కటి ఉన్నదాన్నే నలుగురు .... చూస్తార్రా ఎర్రోడా..

వ్యక్తి : దండంబెడతాన్నన్నొదిలెయ్

డబ్బా : ఆగు... ఆ యెయ్యి రూపాయలిటుతే సిటంలో సిల్లర తెచ్చిస్తాను.

వ్యక్తి : ఇదుగో, శార్‌మినార్‌లో శివుడిగుడి వున్నదా

డబ్బా : లేదు.

వ్యక్తి : తాజ్‌మహల్‌లో టెన్నిస్ కోర్టుందా?

డబ్బా : లేదు

వ్యక్తి : అట్టాగే నాజేబిలో కూడా ఎయ్యినోటు లేదు. (జేబు తిరగేసి చూపించి ఎల్లిపోయినాడు)

డబ్బా : ముదిరిపోనార్రా (అంటూ వెల్లబోయిందు. గడ్డం చేయించుకున్న వాడు వెళ్ళిపోయాడు. రాజిగాడు డబ్బాగాడ్ని చూశాడు)

రాజి : డబ్బా మావా... ఆగాగు...

డబ్బా : ఏట్రా రాజిగా

రాజి : ఇన్నిదబాయిగా అడుగుతున్నానుగదా ఐదరాబాదు తీసుకెళ్ళమని, ఒక్కమాలీ సరే అనవే. ఎప్పుడు తీసుకెళ్తా.

డబ్బా : తమరు ఐదరాబాదు ఎందుకేటి?

రాజి : ఏటిలేదు. అక్కడ సవరం జేస్తే ఎయ్యిరూపాయలిస్తారంటగదా. నిజమేనా....

డబ్బా : ....ఆఁ.... కొంపదీసి యిక్కడగూడ గెడ్డానికి యెయ్యిరూపాలియ మంటావేటి.

రాజి : మాకెవుడిత్తాడండీ ఎయ్యిరూపాయలు. సంవత్సరమంతా శాకరి సేసిందానికి శారెడు బియ్యం ఎక్కువియ్యమంటేనే యియ్యరు. ఈ వూరోలు ఎయ్యిరూపాయలిచ్చేత్తారేటి.

డబ్బా : ఇంతకీ ఐదరాబాదెల్లి నువ్వేటిసేస్తవురా రాజిగా.

రాజి : ఏంలేదండీ... అంతసంపాయించిన మాకులపోల్లు ఎలాగుంటారో ఒక్కపాలి ఆళ్ళని కళ్లారా చూద్దామని.

డబ్బా : ఓర్నియమ్మ యిపొద్దు ఎవులి మొకం చూసినానోగాని యిలాగ నవ్విచ్చేత్తన్నావేంట్రా. సవరానికి ఎయ్యిరూపాయలు ఒసూలుజేసే వోళ్ళు మంగళోల్లు కాదురా మంగ్రాజిగా.

రాజి : మంగలోలుకాదా

డబ్బా : కాదురా నాయనా

రాజి : మరీసెప్తారండీ గెడ్డాలుగీసివోలు, సవరాలుచేసివోలూ మంగలోల్లు కాపోవడమేటి.

డబ్బా : ఆపన్లు సేసేవోల్లు మీ మంగల్లేన్రా. కాని ఎయ్యిరూపాయలు ఒసూలు చేసివోలు మాత్రం మంగలోళ్లు కాదు.

రాజి : ఆళ్లొవులండి.

డబ్బా : ఆళ్ళంతా పెద్దకులస్థుల్రా.

రాజి : అంటే

డబ్బా : అంటే... మాటవరసకి రాజులు, కమ్మోళ్ళు, రెడ్లు యిలా ఒకళ్లనేమాటేంటి?.

రాజి : నాన్నమ్మను. ఈలు బుర్రలుగీస్తే ఆలు డబ్బులు వసూలు చెయ్యడమేటి.

డబ్బా : ఓరి బుర్రతక్కువ యెదవా, సెప్పిందిసరిగ్గా అర్థంచేసుకో. నువ్వు ఎవరి బుర్రగొరగాలంటే ఆళ్ళింటికెల్లిపోతావ్. లేపోతే ఏసెట్టుకాడో సెరువుగట్టుమీదో కూకోబెట్టి పనికానించేస్తావ్. కాని సిటీల్లో అలగుంటాదిరా.. పెద్దపెద్దసాపులుంటయ్. దాంట్లోన అద్దాలు, కురిసీలు, ఏసీలు, పిసీలు... యీటన్నిటికీ మదుపెడతారు. అందల మిమ్మల్ని కూలికిపెడతారు. యెయ్యేటి బుర్రకి రొండెలైనా వసూలు చేస్తారు. మీవోళ్ళకి బుర్రకింత అని యిచ్చేస్తారు.

రాజి : అయితే కొరిగేపని మాది. గడించేపని ఆళ్లది అన్నమాట.

డబ్బా : లేపోతే అంత డబ్బు ఆళ్లెందుకెడతారు. మీరు బతక్కపోతారానా? ఓసీ మాటలేలగాని... అయిదరాబాదు తీసుకపోయి అన్నీసూపెట్టెస్తా ఓ రెండేలు చూసుకో....

రాజి : రొండేలా. యింటి మంగలోడికాడ మొగమాటపడవు.

డబ్బా : ఓరి... యింటి మంగలోడివనేరా సులాగ్గా తేల్చేసినాను. లేపోతే...

రాజి : లేపోతే

డబ్బా : ఐదేలనకపోదునేటి.

రాజి : అంతావులే నాలిక్కేటి నరమా. ఏవీ నువ్వెలినప్పుడల్లా సొంతడబ్బుకర్సుబెట్టెస్తావేటి. ఎవడిబుఱ్ఱమీదో సెయ్యేసేకదా. పదిలపడకొండని నన్నొట్టుకెళ్లిపోగూడదేటి.

డబ్బా : పోనీ అలాగే సేసీద్దునుగానీ... ఈ మద్దెన సరైన పనిగాని పార్టీగానీ తగలడంలేదురా. పడమటోడు తెగవులుకుతున్నాడూ...

రాజి : మరింకేమీ

డబ్బా : ఈడువులుకుతున్నాడు. అవతల పనిజేసీవోడు దొరకద్దేటి.

రాజి : ఎలాగొలాగ నాకుమాత్రం ఐదరాబాదు సూపించాల

డబ్బా : సరే. యీదబా తీసుకెళ్తాలేరా... మరీ జోబిల బీడీ ఉందేటి?.

రాజి : బీడీ లేదుగాని యిందాక బుడ్డాడిచ్చిన రూపాయన్నది తెమ్మంటే గబుక్కున వొట్టుకొస్తాను.

డబ్బా : అలాగంటావా. ఆ మాత్రం దానికి నువ్వెందుకెళ్లడం – ఆ రూపాయిలాగిచ్చీ అలాగెల్లినేనే కొనుక్కుంటాను (రూపాయిలాక్కొని పోబోయాడు)

రాజి : ఊ. ఐదరాబాదెల్లినప్పుడు టిక్కెట్టైనా కొంటావా.

డబ్బా : టిక్కెట్టు కొంటానికి రైలుబండి నాకోసం యేసినార్రా. నాకు టిక్కెట్టు తియ్యనంత మాత్రన అది తిరగటంమానేస్తాదా. దాని మట్టుకది అటూయిటూ తిరుగుతానే వుంటాది. ఖాళీగున్నకాడ ఒక మూల పల్లక కూకుంటాను. అది ఐదరాబాదుఎల్తాది. దాంతోపాటు నానూ ఎల్తా. ఈ మాత్రం దానికి టిక్కెట్టేలసెప్పు.

రాజి : ఓవేల ఎవుడైనా పట్టుకుంటే

డబ్బా : ఎవుడా పట్టుకున్నోడు. బాతూరూంలో దాక్కోడమో, పిల్లిలాగ పక్క బోగీలోకి మారిపోవడమో సెయ్యనేటి.

రాజి : మొత్తానికి జోబిలోంచి పైసాతియ్యనంటావ్

డబ్బా : తియ్యడానికి అందలుండాలిగదరా రాజిగా?

రాజి : లేకేమి. ఎప్పుడు జూసినా ఐదొందలనోటు జోబిల నిగనిలాడతుందిటాదిగ కొత్తపెళ్లికూతుర్లాగా

డబ్బా : ఒంటిమీద యిస్త్రీచొక్కా, చొక్కాజేబులో యీనోటూ లేకపోతే బతకలేంరా (ప్రక్క నుంచి పిలుపు వినిపించింది. "ఒరే రాజిగా")

రాజి : ఆఁ!

ప్రక్కనుండి : బేగివొచ్చి గెడ్డం చేస్తావా లేదురా.

రాజి : యిదుగో ఒచ్చేస్తన్నా... నేవొస్తా. మరి ఐదరాబాదు...

డబ్బా : నేచూస్తాగా నువ్వెల్లి పనిచూసుకో.

(రాజిగాడు పిలుపు వంకగాయెల్లిపోయాడు)

డబ్బా : ఓర్నాయనో పడమటోడొస్తన్నాడు. నా అయిదేలిమ్మని అడుగుతాడు. (వెళ్లిపోబోయాడు. పడమటోడు పిలుస్తా యెదురయ్యాడు)

పడమ : ఓరే డబ్బాగా, ఆగరా డబ్బా ఒరే... (ఆగడు.. పడమటోడొచ్చాడు అంటూ రెండో ప్రక్కగా వెళ్లిపోతున్నాడు) ఓరే డబ్బాగా – ఓరి ఆగురోరే డబ్బాగా. (అంటూ వచ్చి పిలుస్తూనే డబ్బాగాడెళ్లిన వైపుగా వెళ్లిపోయాడు. ఇంతవరకూ కమల కొట్లో కూర్చోని అప్పుడప్పుడూ వచ్చిన వాళ్ళకేవో వస్తువులిచ్చి పంపుతుంది. అప్పుడప్పుడూ యింటోకి వెళ్లివస్తుంది. బయటికెళ్తున్న పడమటోడికి చాకలిబుడ్డాడు ఎదరైవచ్చాడు)

బుడ్డ : కమలమ్మా ఓ కమలమ్మా... (పలుకుతూ బయటికొచ్చింది కమల) ఇయిగోనమ్మా నీ చీరలు. (చీరలిచ్చాడు తనదగ్గర ఇంకా కొన్ని ఉన్నాయి)

కమల : నీ కోసమే చూస్తన్నా బుడ్డన్న, సిటం ఉండు.. ఇప్పుడే (అంటూ బట్టలు తనుకూర్చున్న స్టూలుపైన పెట్టి బొడ్లోంచి చీటీతీస్తూ వచ్చి) ఇదుగో యీచీటీ యెవురికీ తెలవకుండా నాయుడికియ్యి బుడ్డన్న.

బుడ్డ : నాయుడికా!

కమల : ఆఁ!

బుడ్డ : అమ్మోనావల్లకాదు. ఆనాయుడి పెళ్లాం మంగమ్మకి తెలిస్తే నాపానాలు తీసేస్తాది.

కమల : బుడ్డన్నా బుడ్డన్నా. అన్నంటోడివి నాయుడోడింటికి బట్టలియ్యడానికి ఎల్తవ్‌కదా పంచెమడతలో పెట్టి యిచ్చేయ్.

బుడ్డ : నాకేల యీ పత్రాకులు. నావల్లకాదమ్మా.

కమల : బుడ్డన్నా బుడ్డన్నా అట్టాగనమాక, ఇదుగోయీ పదిరూపాయలుంచు.

బుడ్డ : ఏటీ పదిరూపాయలు నాకే.

కమల : అవును

బుడ్డ : ఏటి, ఇలాగే చిల్లరమార్చుకంటా

కమల : మొత్తం నువ్వేతీసుకో, చీటీమాత్రం చేర్చాల

బుడ్డ : ఇకనాకుదిలీ, నేజూసుకుంతాను.

కమల : మరిందాక జడిసినావు.

బుడ్డ : డబ్బు కళ్ళజూస్తే యెవుడికైనా దైర్యంవొచ్చీదేటమ్మా?

కమల : ఒరెఒరె అట్టా మాడతెట్టకు నలిగిపోతాది. ఆ చీరమడతలో పెట్టీ.

బుడ్డ : (పెడుతూ) ఇస్త్రీ బట్టల్లో ఉత్తరాలెట్టొచ్చని యిప్పుడే తెలిసింది. ఇకనువుసింతోదిలుయ్. నాను సూసుకుంతాను. అన్నట్టు సావిత్రమ్మకీ సత్తిబాబుకీ బట్టలిచ్చేసొస్తాను. మూటసూస్తావుండూ.

కమల : సరే. (మూటలోంచి కొన్నిబట్టలు తీసుకొని వెళ్లాడు బుడ్డోడు. డబ్బాగాడ్ని వెంటబెట్టుకొచ్చాడు పడమటోడు)

పడమ : అదిగాదురా డబ్బాగా, పిలుస్తావుంటే యినిపించుకోకుండా ఎల్లిపోతావేట్రా లమ్డికే.

డబ్బా : మామ్మామ, నీమాటినపడితే పలక్కుండా పోతానా.

పడమ : నా చెవుల్లో పువ్వేంపెట్టొద్దుగా నొరే, సెల్‌ఫోను కొనితెస్తానని ఐదేలు తీసుకొని ఐదువారాలైనాది. ఏదిరాసెల్‌ఫోను.

డబ్బా : ఒట్టుమామా, రేపు ఎలిపోస్తది.

పడమ : రేపు ఎలిపోస్తది. ఆ తర్వాత ఎల్లుండి ఎలిపోస్తది. సెల్లెప్పుడొస్తదీ. అది చెప్పు.

డబ్బా : నేను పట్నం ఎల్లకగానీ... ఎల్తేఎంతసేపు మామా నాయుడు బావక్కూడ ఒకటి కావాలన్నాడు. ఇద్దరికీ ఒకేపాలి తెచ్చేస్తాను.

పడమ : నాయనా నీకోదండం. ముందు మీబావకే ఒట్టుకురా. మీబావతో ఎవడుపడతాడు లట్టీ.

డబ్బా : ఒసే... అంత బయమేటి పల్లకోమామా. ఎవుడికెవుడు దేవుడు నువ్వేటి... మా బావ యింట్లో కంబారివా.

పడమ : ఈపులిహోర కబుర్లకేంగానీ. మీ బావ కంబారికన్న ముందు మా కంబారి కరెంటేయించుకున్నాడని తెలిసి... మాకంబారి పాక తగలెట్టించలేదేటి మీ బావ. నాకు సెపతన్నావుగాని మీబావని అంతదూరంలో చూస్తే... పోసుకుంటావుగాదేటి.

డబ్బా : నేనా. నన్నుజూస్తే మా బావకేజడుపు. దైర్నంగావుండుమావా నీకేటి కాదు.

పడమ : ఏదైనా ఎదుటోడికి సెప్పటం శానాసులువురా. పిరికోడు దైర్నంనూరిపోయ్యొచ్చు... పీనాసోడు దానదర్మాల గురించి సెప్పొచ్చు. పచ్చి అబద్దాలకోరు సత్యం గురించి లెక్చరియ్యొచ్చు. అతిపెద్ద అవినీతిపరుడు కూడా నీతి న్యాయాలగురించి స్పీచ్‌లివ్వొచ్చు. ఈ ప్రెపంచంలో పైసాఖర్చు లేకుండా ప్రతోడూ సెయ్యగలిగిందేటంటే... ఎదుటోడికి సెప్పడం.

డబ్బా : మావా, డబ్బా కొట్టుకొని కాలంగడిపేసే పనినాది. అదినువ్వు లాక్కోకు.

పడమ : అట్టారా దారికి. సెల్‌ఫోన్‌కి యిచ్చిన డబ్బుల సంగతేటి, రెండురోజుల్లో సెల్‌ఫోనన్నా తెచ్చివ్వాలి నాడబ్బైనా తిరిగివ్వాలి. లేపోతే యీదిలో బట్టలిప్పిచ్చేస్తాను. నాసంగతి తెలుసుగా.

డబ్బా : నాకెందుకు తెల్దుమామా.

పడమ : నేనెక్కడ్నించో వచ్చినాననీ నాకిక్కడ కులం బలంలేదనీ ఎవుడైనా అనుకుంటే మాత్రం అది పొరపాటే.

డబ్బా : నీ గురించి నేను అలాగనుకుంతానా మావా.

పడమ : నామాటిను... నీకిచ్చిన ఐదేలు నాకేటి పెద్దయిసమేంకాదు. కానీ.. పడమటోడు సెల్‌ఫోన్‌కోసం డబ్బాగానికి ఐదేలిచ్చివసూలు చేసుకోలేకపోనాడనేటాక్ బయటికొచ్చీసినాదనుకో... ఊళ్లోయిచ్చిన పదేనులక్షలకి నీళ్లొదిలేసుకోవాల్సిందేగా.. నీకు చెప్పాల్సిందేముంది.

డబ్బా : కానీ నాతో పాటు నీకూ తెలిసిందొకటుంది. ఎక్కడినుండో వచ్చినోడివి. ఓ పాతికెకరాలు కొన్నావు. పదేనులక్షలు ఊరులో తిప్పుతున్నావ్. అంటే ఏ ధైర్యంతోటి. పడమటోడు పిలిస్తే డబ్బా గాడు వొచ్చి వాలిపోతాడన్నటాక్ ఊళ్లో వున్నాదికాబట్టే కదా.

పడమ : వున్నమాట నేనెలాగ కాదంటాను.

డబ్బా : నువ్వునాకు ఐదేలు యిచ్చినమాట నేనెలాగకాదంటాను

పడమ : నాపద్ధతి ఒకటేర్రా అల్లుడూ. అవసరమని అడిగి పదేలు తీసుకుని తినీ, కాదనను, కాని నమ్మించి మోసం చేస్తే మాత్రం సయించునురా.

డబ్బా : మావా, నీకూ నీఐదేలకీ ఒక దండం. నా తలతాకట్టుపెట్టి నీఅప్పు తీరుస్తాను. సరేనా.

పడమ : హైద్రాబాదెప్పుడెల్తాన్నావు అదిచెప్పు.

డబ్బా : మనకు పనిచేస్తానని మాటిచ్చినోడు దొరకడం లేదు. అవతలోడు దొరకడమే ఆలశ్యం. ఎంటనే ఎలబారడమే.

పడమ : ఏమోరా, నాకైతే మటుకి సిన్నదో సితకదో ఒక పదవిలోకెల్లాలని గట్టిగున్నాది. పొలం అమ్మకానిక్కుడ రడీ అయిపోనాను. ఒరే అల్లుడూ, డబ్బెంతయినాకానీ పదవి మాత్రం సంపాయించాలిరా ఇకనీయిష్టం.

డబ్బా : మావా, యీదబా ఐదరాబాద్ నీతో కలిసి ఎల్లకపోతే.... ఎందుకులే చేసి చూపుతాను. ఆ సాలిగుండం ఏనుగుల స్వామి నీయెనకుంటాడు. నామాట నమ్ము.

పడమ : (దండంబెట్టు కొని) సరేరా నువ్వాపనిమీదుండు. నేవస్తా. మళ్లీ అడుగుతున్నా అయితే హైదరాబాద్ ప్రయాణంనాటికి నా చేతిలో సెల్లుండాలరా అల్లుడూ.

డబ్బా : అబ్బా నేచెప్పేగదా. మాటన్నాక మాటే. నువ్వు నిచ్చింతగా ఎల్లు (పడమటోడు వెళ్లిపోయాడు) అర్జంటుగా ఐదేలు సంపాయిచ్చి సెల్లు కొనకపోతే యీ పడమటోడితో కష్టమే ఎవడ్ని పట్టెయ్యాలా, ఏటి మార్గమూ – (ఆలోచిస్తూ అరుగుపై కూచ్చున్నాడు. ఇంతవరకూ కొట్లో కూర్చున్న కమల కొడుకు ముందుకొచ్చాడు)

క. కొడుకు : అమ్మా, నేను దొడ్డికెల్తన్నా (అంటూ అరుగుమీదనించి దూకాడు, వాడి కాలు తగిలి యిస్త్రీ బట్టలు కిందపడిపోయినావి అవన్నీ ఒక్కటొక్కటి ఏరి అక్కడపెట్టి కొడుకు నిక్కరిప్పుకుంటూ బయటికెళ్లాడు. కానీ బట్టల్లో కనిపించిన చీటీని అదేదో పనికిరానిదన్నట్టు కిందపడేశాడు. అదిచూసిన డబ్బాగాడు వచ్చి దాన్ని తీసుకొని అరుగుపైన కూర్చొని చీటీ విప్పి చదువుతున్నాడు. బయటినించి వచ్చిన బుడ్డడు లల్లాయిపాడుకుంటూ యిస్త్రీబట్టలు తీసుకొని వెళ్లిపోయాడు. చీటీ చదివిన డబ్బాగాడు పైకి లేచాడు).

డబ్బా : ఆహా ఆహా! ఇది చాలు, ఇకనడిపిస్తా (అంటూ కొట్టుదగ్గరకొచ్చాడు లోపల్లించి వచ్చిన కమల వెతుకుతుంది) ఏటొదినా అలాగ ఎతుకుతున్నావ్.

కమల : ఆ... అదీ... యిక్కడ బుడ్డన్న యిస్త్రీ బట్టలు పెట్టి ఎలిపోయినాడు.

డబ్బా : సిటంముందే వాడొచ్చి ఆ యిస్త్రీ బట్టలు తీసుకుపోనాడులే.

కమల : ఏటీ తీసుకుపోనాడా.

డబ్బా : ఏటొదినా అంతకంగారూ. బట్టల్లో ఏదన్నా దాచినావేటి.

కమల : నేనేటి దాస్తానూ, ఏటిలేదు.

డబ్బా : ఏదో పోగొట్టుకున్నట్టు చింతగా వున్నవేటొదినా.

కమల : చింతా, నాకేల, నీతల్లిదండ్రులపున్నేన నాకెనాడూ చింతలేదురా డబ్బాగా.

డబ్బా : ఈడబ్బాగాడు ఏమాటా ఊరికే అనడులే ఒదినా. ఆలోసించి చెప్పు.

కమల : పోరా, బేపిలాగ ఎల అలాగరుస్తావ్. పోయ్యిమీద పప్పు పొంగిపోతాదేమో (వెళ్ళబోయింది).

డబ్బా : వదినా నాతో పెట్టుకోకు ఇటురా చూడు ఈ తెల్లటి చొక్కా జేబులో ఏటికనపడతంది.

కమల : ఏటికనడతాంది. కొత్తనోటెట్టుకు తిరుగుతావ్. అదేగా.

డబ్బా : ఒసే, ఒకపాలి దగ్గిరకొచ్చి చూ(డ్రాదేటి – నోటు పక్కన చీటి కనపడతాది.

కమల : చీటీయా... ఏం చీటీ

డబ్బా : మరీ అంత అమాయికంగా మొకమెట్టకు ఒదినా. తిన్నగా నాగుండెలోకి చూడు. నువ్వు నాయుడికి రాసిన చీటీ (తీశాడు అందుకోబోయింది కమల) ఆఆఁ (అంటూ జేబులో పెట్టుకున్నడు)

కమల : నీ చేతిలపడ్డదా....

డబ్బా : మరందుకేగదా తెలిసినాదా.

కమల : మరిదీ మరిదీ, నీకు పున్నెముంటాది. అది బయటెట్టకు ఆ నాయుడమ్మ నన్ను బతకనియ్యదు.

డబ్బా : అంత బయ్యంతో యీ బాగోతం యేల.

కమల : ఏటి సెయ్యమంటావ్ సెప్పు. ఆడీలర్‌గాడి మీద కంప్లెయింటు లున్నాయని ఆడ్నితీసేసి మరొకరికి డీలర్ షిప్ యిస్తారని తెలిసి ఆశపడి అదినాకిప్పించమని అడగటానికి నాయుడికాడ కెల్లినాను.

డబ్బా : ఉజ్జోగం కోసమెల్లి ఉంపుడుగత్తెవైనావన్నమాట

కమల : నాకర్మ

డబ్బా : ఇప్పుడు నెత్తిబాదుకుంటే లాబమేటి. అయినాయిదొకందుకు మంచిదేలే.

కమల : ఏటామంచి. నాయుడమ్మ చేత రోజూ తిట్టించుకోడమా.

డబ్బా : అదికాదు గాని నిజం చెప్పు, ఒకప్పుడు నీకొట్టుకొచ్చిన ప్రతి వోడూ కన్ను కొట్టేవోడు. నాయుడొచ్చిపోతున్నకాడ్నించి ఆన్యాసెన్సు ఆగిపోలా.

కమల : నా యాపారం కూడ తగ్గిపోయిందిగా.

డబ్బా : ఏటి నాయుడు బావ ఏమివ్వడా.

కమల : ఆ... గీసి గీసి నెలకోరెండేలు చేతిలో పెడ్తాడు. అతనొచ్చి ఎల్లాడోలేదో కంబార్లు, అడ్డపొగదీ, ఒకరనేటి ఒకటిమీదొకరు ఎంకవ్వయిరీకొస్తారు. ఆళ్లనిబతిమాలుకొని పైసా పరకాయిచ్చుకునేసరికి సరి, పోలేరమ్మ పోగేసింది ముత్యాలమ్మ మాయం చేసినట్టే.

డబ్బా : అయితే నాయుడు బావవల్ల లాభం లేదంటావ్

కమల : ఇవన్నీయెందుకు నాయుడువల్ల సుకంకన్నా నాయుడమ్మ నోటికే జడిసి పోవాల్సొస్తంది.

డబ్బా : అయితే యీ చీటీని...

కమల : నా కిచ్చీవా....

డబ్బా : నా కేటి లాభం?....

కమల : .... అప్పుడెప్పుడో అడిగావ్ నానొప్పుకోలేదు. చీటీగుట్టు కాపాడు. నీకోరిక తీరిపోతాది.

డబ్బా : వామ్మ. ఇంతఛాన్సు యిస్తావనుకోలేదు, కానీ... ఇంతకంటే అర్జంటు అవసరమొకటి వచ్చిపడింది. ఒక అయిదు వేలు సర్దగలవా, నాకు డబ్బు సర్దుబాటయిందనుకో నీ డబ్బు నీకిచ్చేస్తాను. కోరిక మాట అప్పుడు లేదనుకో నాసాయానికి నీసొమ్ము సెల్లు, ఐదేలు....

కమల : అంత డబ్బునాదగ్గరెక్కడిది. ఆ స్టోరు సాఫీగా నడిచినా నా కష్టాలుతీరే. దాంట్లో సస్పెండయితినీ. రోజుకి వందరూపాయలమ్మితే యెక్కువ... దానికంటే నాకిదేసులువు.

డబ్బా : నీకు సులువే. కాని నాకు కష్టం. నా అవసరమట్టాటిది.

కమల : మరిదీ మరిదీ, నీకాళ్లట్టుకుంటాను, నామాట కాదనకు.

డబ్బా : శశ ఇదేంపనీ... నువ్వెళ్లు నేనేదో ఒకటి ఆలోచిస్తాను

కమల : చీటీ సంగతి పొక్కిన్వికూ (వెళ్లింది)

డబ్బా : ఏటదీ, ఒకాడకూతురు బతకటానికి సిన్న కొట్టెట్టు కొని సరుకులమ్ముకోవాలంటే ఒక పెద్దన్నగాడితో రంకెట్టుకోవాలి అగుట్టు కాపాడుకునేందుకు మరొకడికి పైట పరచాలా. లోకం అలాగుంది...

మరి మన సంగతేటి. ఏటేటి ఇష్ణుమూర్తి చేతిలో చక్రంవున్నట్టు మన చేతిలో చీటీ వున్నాది చూద్దాం. ఆ అరసవిల్లి సూరినారాయణమూర్తి ఎటునడిపిస్తాడో. (డబ్బా వెళ్లిపోతుండగ బయటికొచ్చి పిల్లాడి కేక...)

పిల్లులు : అమ్మా.... అమ్మా....

కమల : (లోపల్నుంచి) ఏట్రా....

పిల్లలు : కడుగు కడుగే....

కమల : వస్తున్నా వుండు....

పిల్లా : అమ్మా కడగవే... (అంటుండగా జగ్గుతో నీళ్ళతో కమల బయటికొచ్చింది. అదే సమయంలో రాజిగాడు యిందాకపోయిన దార్నించి వచ్చి .... పక్కకి వెళుతున్నాడు)

కమల : రాజిగా రాజిగా ఇలరా రా....

రాజి : ఏటమ్మా...

కమల : పొయ్యి మీద తాలింపు సగంలో వున్నదీ. బయట గుంటడు దొడ్డికూర్చుని వున్నాడు. వాడికి కాళ్ళుకడిగి తీసుకురా (జగ్గు చేతి కియ్యబోయింది)

రాజి : ఏటమ్మా? నాను కడగలా.....

కమల : ఏపీ కడగవా....?

రాజి : ఎంత కులం తక్కువోడినయినా మగోడినేనా కాదా

కమల : మగోడివి కాబట్టే మగపిల్లోడికి కడగమన్నాను. నీకేటి ఆడపిల్లకి కడగమన్నానా. మొకం అలాగపెట్టేవేటి. ఇదే నాయుడు పెళ్లాం చెవితే చెయ్యావా?

రాజి : అయమ్మ ఊసేల. ఈపని నాను సెయ్యను.

కమల : ఏటి సెయ్యవా నాను సెప్పరాని పనినీకేటి సెప్పినానో సెప్పరాదా. కాదూ... ఊళ్లో పురుళ్ళూ, పున్యాలు అయితే నీపెళ్లాం ఎళ్ళదా ఆ సెండాల–మంతా నెత్తికేత్తుకొని పారపోసియ్యదా. ఇదీ అలాటిదే నీకేదన్నా కావాలంటే అడుగు. కోనిసెయ్యననడానికిలేదు. ఊరందరి పన్లుసెయ్యాల. సేతి లెట్టింది ఓట్టుకెల్లితినాల.

రాజి : పిల్లాడ్ని సేతిలెట్టి కడగమంతన్నావ్. ఇంక తినడానికేటుంటాది.

కమల : అంటే నీకేటీ యివ్వకంటే పనిజేయించుకుంటానా. ఆ నాయుడి పెళ్లాం ఏటిస్తాదని అలాగ సాకళ్ళూ మంగళ్ళూ అందరూ మూగిపోయి మరీ పన్లు చేసేస్తారూ. ఎప్పుడైనా అప్పుయిమ్మనాలి అప్పుడు చెపుతాను (బయటికెళ్ళబోయింది)

రాజి : అంతకోపమైతే ఎలగ

కమల : కాదూ, నీ కళ్ళకి ఎలాగ కనిపిస్తన్నా(్రా. నీ పెళ్ళం వొచ్చి అడిగినా నువ్వొచ్చి అడిగినా ఏనాడైనా లేదన్నానా. బియ్యమంటె బియ్యం, పప్పులంటే పప్పు, ఉప్పంటే ఉప్పు వొట్టుకెళ్లిపోతారు. డబ్బుకేనాడు పట్టుపట్టా(్రా.

రాజి : కిరాణకొట్టు వున్నాక.....

కమల : ఆ వుంటే ఆరువిచ్చేయ్యాలని రూలుందే(్రా నీకు. ఆ నాయుడి పెళ్ళాంకాడ వందల ఎకరాలున్నాయ్. ఏది ఒక ఎకరా అడిగియిప్పించుకో...

రాజి : ఆ యమ్మలాగ ఎకరాల్లేవు. నీలాగ కిరాణకొట్టూ లేదు. యిదుగో నావల్ల తప్పైపోనాది సెమించు. నానేకడిగేస్తాను యిప్పుడేకాదు - ఇకనీ బట్టి నువ్వు ఎవులికి కడిగీ మంటే ఆళ్ళందరికీ కడిగేస్తాను. సరేనా (జగ్గు తీసుకున్నాడు)

కమల : అట్టా యినుకో (అంటూ లోపలికెళ్లింది. రాజిగాడు జగ్గు వంకచూశాడు. కమల వెళ్ళిన వంకచూశాడు. నిస్సహాయంగా బయటికి నడిచాడు. విషాద సంగీతం వస్తావుంది. క్షణాల తర్వాత నిక్కరు చేతబట్టుకొని వచ్చి యింట్లోకి పరుగెత్తాడు. రాజిగాడు నిరామయంగా నడుస్తూ వచ్చాడు. జగ్గులోపలికి విసిరి అరుగు పైన కూలబడ్డాడు. చేతివంక చూసుకున్నాడు. కళ్లల్లో నీళ్ళుతిరిగాయి. పొదిలోంచి కత్తితీసి చేతిపైన కస్సన కోసుకున్నాడు. రక్తం కారుతోంది. కన్నీళ్లు ఆగిపోయినాయ్. ప్రతీకారంతో ఉద్వేగంగా చూస్తూ పొదితీసు కొని వెళ్లిపోయాడు. దప్పుల హోరు తీవ్ర స్థాయికి చేరుకుంది.)

**(లైట్స్ ఆఫ్ - లైట్స్ ఆన్)**

## 3వ సన్నివేశం

(అది రాజియ్య ఇల్లు – దాన్ని ఇల్లు అనేకంటే పాక అనడమే సబవు. ఇంట్లోని పరిస్థితిలాగే ఇంటి ముందు కూడా చిత్తడి, చిత్తడిగా ఉంది. లోన చిన్న కుక్కి మంచంమీద కూర్చొని రాజియ్య తండ్రి నర్సింహులు సన్నాయి వాయిస్తున్నాడు. అదొక విషాద రాగం– రాజియ్య పెళ్ళాం ఈరమ్మ వచ్చి గుడ్లురుముతూ నర్సింహుల్ని చూస్తోంది. ఆమె చూసిన కొద్దీ రాగం తారాస్థాయి నందుకుంటోంది. రాగం స్థాయి పెరుగుతున్న కొద్దీ ఈరమ్మలోని వీరం ఇంకా పై స్థాయికి పోతుంది. ఇలా ఇద్దరూ ఒకరినొకరు సవాళ్ళు విసురుకున్నారు. ఇంకా పై స్థాయికి చేరుకుంటూండగా పొడిదగ్గు వచ్చి సన్నాయి రాగంలో కల్సిపోయింది – అదే అదనుగా భావించి ఈరమ్మ ఒక్కదుటున నర్సింహులు మీదకెళ్ళి తోపు తోసింది)

ఈరమ్మ : ముసిలిగొరకడు కానా.... ఒక్క సిటం తిండి ఆలిసిమైతే ఆ.. గ... లేవా! మనమేటి రెడ్లుమా! నాయుళ్ళమా! కాపోలమా! ఏలయ్యేసరికి టపాల్న వంటండోసి నీ గిన్నెలపోసీడాకీ.... (ఒక సత్తుగిన్నెతో వచ్చింది).... ఇదిగో బుక్కు... నాయుడింటికానుండి తెచ్చినాను. ఇంతరవ్వ ఆలిసిమవ్వనివ్వవు... బుక్కు. (దభీమని కొట్టింది. ఆ దెబ్బకు దగ్గుతెర మళ్ళీ ముంచుకొచ్చింది. దగ్గుతున్నాడు అదేపనిగా...)

పొద్దున్నెల్లినాను నాయుడోరింటికి – ఆల ఇంటిపనంతా సేసుకొనీసరికి బారడు పొద్దెక్కింది. ఒక పఱ్ఱాకంటే ఎవులైనా పడతారు – గిన్ని కడిగి, ఇల్లుకడిగి, పిల్లా పచుక ఒళ్ళు కడిగి, కసువులు తీసి, కళాపులు జల్లి, పేడెత్తి, పెంటెత్తి.... ఒద్దమ్మా ఈ బతుకు... నాయుడమ్మకి సేసీవోళ్ళు దొరకాలిగానీ సెప్పడానికి సిగ్గైనా పడదు... ఆ సింగయ్యగారి మడిలో గాబుతీత ఉందంటే తవ్వడు కూలైనా వస్తాది ఎల్తానంటే ఆహా!... ఎల్లనించ్చిందేటి?.... పిడకల కుచ్చి రెడుదుమురాయే ఈరీ అన్నాది. ఎలగెలి పొస్తను. ఒక్కదాని సేత సాలొండం కొండంత కుచ్చిరెట్టించింది. సాకల్లు మంగళ్ళని కూలీనాలీపనులకెళ్ళనిస్తారేటి? రెక్కలు ముక్కలు సేసుకొని ఆ కుచ్చిరెట్టుకొచ్చీసరికి ఇయ్యలయ్యింది.

నా కోడలు తిండెట్టడం లేదని ఊరంతా సెప్పడాకి... పియ్... పియ్... పియ్... మని ఊదుతున్నావ్. ఎట్టినానుకదా! గూదనిండా బుక్కు. (దగ్గులోంచి ఒక కెళ్ళ బయటకొచ్చి నర్సింహులు ముందున్న అన్నం గిన్నెలో పడింది – దగ్గు తగ్గింది – ఆయాసం తగ్గింది – నర్సింహులుకి కొద్దిగా బలమొచ్చింది)

నర్సి : ఇందల ఉమ్మికెళ్ళ పడ్డాది.

ఈరమ్మ : నీకెవుడు దగ్గమన్నాడు

నర్సి : దగ్గొత్తే ఏటిసెయ్యాల?

ఈరమ్మ : కెల్లపడితే నానేటి సెయ్యాల?

నర్సి : ఇది తీసేసి... మరొక గిన్నెలేసితే.

ఈరమ్మ : మరొకగిన్నె లేసి తేవాలా? బాగా పోత్రించినావురా ముసిలోడా?

నర్సి : నువ్వెట్టిన సల్లటి బువ్వ మూడుపూటల తిని పోత్రించనా?

ఈరమ్మ : సల్లటిదికాతో ఇంటిల ఏటున్నాదిరా ముసిలిగండడా ! మావు ఉడుకుడుకుది తిని నీకు సల్లడిది ఎడతన్నాం...? రాలిపోకు... నోర్మోసుకొని తిను...

నర్సి : నాను తినను... (గిన్నె దూరంగా నెట్టేడు)

ఈరమ్మ : నీ తోటి పడటం మా కస్టమై పోతంది. (గబుక్కున వెళ్ళి ఒక మూల నున్న చిన్న ట్రంకు పెట్టె తెరచి, మెడల్స్ బయటకు తీసి నేలకేసి కొట్టింది.) ముసిలిగండడు కానా! నువు సంపాంచేసి మాకేవిచ్చేసినావన్రా అలగ రాలిపోతన్నావు. ఇయ్యేకదా! ఈ బూర నేర్సుకోడాకి రెండెకరాల భూమి తగలెట్టేసినావు. మంగలోడివయ్యుండి రైతులకాడ, నాయినా, బాబని మంచిమాటలాడుకొని బతికితే ఆళ్ళే కలోగంజో పోసేవోరు. ఆళ్ళిచ్చిన దాంతోటి బతుకెళిపోయినా, రెండెకరాల పంటా మిగిలిపోయి ఏడాదికేడాది సెక్కాముక్కా కొనుంటే రెండూ నాలుగయ్యాదీ కాదా! అహ ! అలగసేసినావు? బుర్రలు గొరగడం మాసేసి బూరొట్టుకొని ఊళ్లలో తిరిగినావు... బాపన శివయ్య తోటి నీకు పంతమా! అతగాను ముదంగం వాయిస్తే, నువు ఈ పిప్పీ

వాయించినావట. అతగానెక్కడెక్కడ కసేరీ లెడితే నువ్వూ అక్కడే కసేరీ లెట్టినావట. అంపోలుకి పేరు బాపనయ్య తెత్తాడో, ఈ మంగలోడు తెత్తాడో సూసుకోండని సేలంజీలు సేసినావట. తెచ్చినాడండీ పేరు... ఇల్లూ వాకిలీ పట్టడంలే... ఆ బాపనయ్యకి నీకూ పోలికా? ఆ బాపనయ్య సత్తే ఊళ్ళుకి ఊళ్ళు బోజీలెట్టారు. నీకో, బతికుండగానే తిండానికి రెండు మెతుకులు దొరకడంలే. ఊర్లో ఆ బాపనయ్యకి ఇగ్రహం, ఇగ్రహం ఎట్టారు? ఇగ్రహం ఎట్టిన సోటుకి శివయ్య సెంట్రని పేరెట్టినారు. నీకో నీ దిబ్బ మీద దీపమెట్టే వాళ్ళే ఉండరు.

నర్సి : తిండెట్టమన్నప్పుడల్లా ఈ ఎక్కాలు సదవడం నీకు అలవాటే.

ఈరమ్మ : అలబాటా! అయితేటి నీకు నాను తిండెట్టం లేదా?

నర్సి : ఎందుకెట్టడం లేదు. ఇదిగో వన్నంగిన్నెల కెళ్ళ పడిపోయిందంటే ఇంత సదువు సదివినావు. ముసలోడ్ని, ఉసురుమనిపించకు, పురుగులు పట్టిపోతావు. ఈ సల్లటిది తినలేను. ఉడుకుడుకుది ఒకముద్దఎయ్యి తింటాను.

ఈరమ్మ : నీమాటే ఖాయం కానీ! ఏ కర్రన అగ్గి ఉంటే అదే కాల్తాది.

(పైట తప్పించి కడుపు చూపించింది) ఇదిగో ! ఇది సూడు ! మావవైనా, తండ్రివనుకొని సూపిస్తన్నాను. వోరం రోజులబట్టి ఈ కడుపుల ఒక్క మెతుకేస్తే, అది పుండు అయిపోవాల, ఆ మెతుకే నా బతుకు బుగ్గిసేసియ్యాల.

నర్సి : నిబ్బగా !

ఈరమ్మ : నిబ్బగే మావా ! నీ కంట మాకెవలున్నారు సెప్పు. నీ కెట్టకంట మావు తినేత్తామా? ఈ పూటకి ఈ సల్లటిది తినేయ్ ! కేజీ రూపాయి బియ్యం వస్తాయి. వచ్చినెంటనే ఇడిపించి ఉడుకుడుకుది కడుపునిండా ఎడతాను.

నర్సి : కార్డు తనకా ఎట్టీసావు? ఎలగ ఇడిపిస్తావ్ బియ్యం.

ఈరమ్మ : నా పత్రాకులేవో నాను పడతాను. అయినా ఆ డీలర్‌గండడు నెలనెల బియ్యం అమ్మితేనే! ఆడు నాయుడు మనిసి – ఆడ్ని సూస్తేనే ఊళ్ళో వాళ్ళు ఉచ్చ పోసుకుంతున్నారు. ఏటి సేస్తాం సెప్పు.

నర్సి : నువ్వేటిసేస్తావో నాకు తెల్దుగానీ... నోటికి రుచి తగలి ఎన్నాళ్ళయిందో...

ఈరమ్మ : తప్పక ఎడతాను – ఈ దపాకి ఆ ఇది తినీ మావా!

నర్సి : ఓ... తినేత్తా.

ఈరమ్మ : ఉండు, పచ్చి మిరపకాయ తెత్తాను. దాంతోని తినీద్దువుగానీ.. (లోపలికెళ్ళింది)

నర్సి : మాట పెలుసుగానీ నీ మనసు ఎంత మంచిదో నాకు తెల్దేటి?.... కెళ్ళదేటున్నాది, తీసి అవతలేసిస్తే అదే పోతాది... అయిన అది ఎవలికెళ్ళ? నానోటిలోది కాదేటి?.... నా నోట్లోది – మళ్ళా నాకడుపులోకి ఎల్తాది తప్పేటి? ... దాన్ని అసయ్యించుకుంటే ఎలాగ... అమ్మీ! ఆ గిన్నె ఇలగ తే... ఆ సల్లటిది తినేత్తాను, తే... కడుపు మాడతంది.

ఈరమ్మ : (లోనుండి) ఆ వత్తన్నాను (ఈలోగా కుక్క గబగబ వచ్చి గిన్నె దగ్గరకు వెళ్తోంది)

నర్సి : అమ్మీ ! అన్నం తినీడాకి బేపి వత్తందే !

(కుక్క ఇంకా దగ్గర కొస్తోంది – ఇక లాభం లేదనుకొని తనే పరిగెత్తబోయి పడిపోయాడు – కుక్క గిన్నెలో మూతి పెట్టేసింది – పడిపోయిన వాడు అలా ప్రాకుకుంటూ ముందు కెళ్తు న్నాడు)... ఛీ! ఛీ! అది నా తిండే ముండకానా! నా కడుపులోదీ నీక్కావలే... (కుక్కమీద పడ్డాడు... ఇద్దరి మధ్య అన్నం నేలపాలయ్యింది. నేల మీద పడిన అన్నం తనడానికి కుక్కతో కలియబడుతున్నాడు – బయటనుండి రాజియ్య పరిగెత్తుకుంటూ వచ్చాడు – లోపలి నుండి ఈరమ్మ కూడా వచ్చింది.)

రాజి : ఛీ ! ఛీ ! (కుక్కను నాలుగు తన్నులు తన్ని విడిపించాడు – కుయ్, కుయ్ మంటూ వెళ్ళి పోయింది కుక్క)

ఈరమ్మ : ఓలమ్మా వన్నమంతా నేలపాలయిపోనాది. (కిందపడింది గిన్నెలోకి ఎత్తుతుంది)

రాజి : (తండ్రిని కుదురుగా కూర్చోబెడుతూ) పోతే పోయింది. దానిమీద మీద ఏల కలబడ్డావు – సూడు ఎలగ కర్సీసుందో.

నర్సి : ఆకలికి ఓర్సుకోలేపోనా(న్రా.

రాజి : రా! ఇలగ కూకో! (చెయ్యి పట్టుకుతీసుకెళ్ళి, కుక్కి మంచంలో కూర్చోబెడుతున్నాడు)

నర్సి : (కొడుకు చేతిని ఆసరాగా కూర్చోబెడుతుండగా, కొడుకు మణికట్టుకు కట్టిన బ్యాండేజీ చేతికి తగిలింది. అందోళనగా...) ఏట్రా! ఈ కట్టేట్రా?

రాజి : ఏటిలేదులే.

నర్సి : ఏటి లేక పోడమేట్రా – అంత కట్టు కట్టినావు. (ఇంతలో ఈరమ్మ కంగారుగా)

ఈరమ్మ : ఏదిలాగ సూపించు.. (పరీక్షగా చూసింది) నాకర్ధమై పోనాది, చేతిమీద కోసుకున్నావు గదా!

రాజి : ఎహే ఏటీ లేదంటే ఏల అలగ గింజుకుంతావు.

ఈరమ్మ : ఏయ్ ! నిబ్బగ సెప్పు, గాటెట్టుకున్నావా? లేదా!

నర్సి : సెప్పురా ఏటయ్యిందో.

ఈరమ్మ : ఏటవుతాది, ఎవులిమీదో కోపమొచ్చింటాది. ఆలనేటిసెయ్యలేక సెయ్యి కోసుకున్నాడు. ఈతిత్తవ అలబాటే కదా! ఎంతని నెత్తిగొట్టుకొని చెప్పుతాను. ఇలాంటి పని మానమని. ఇంటాడా సేత్తాడా? సూడు ఎలగ ఒళ్ళంతా పుళ్ళు సేసుకున్నాడో! నాకు తెల్దేటి ఏ పొద్దో ఆ కత్తి గుండెలోన దించుకుంటాడు. నీకు పున్నెముంటాది. ఇకనబట్టి ఈ పొది నువు ముట్టుకోకు.

నర్సి : ఎవులేటన్నారయ్యా.

ఈరమ్మ : సెప్పు. ఎందుకింత గాచారం సేసుకున్నావు?

రాజి : కిరాణ కొట్టు కమల లేదా?

ఈరమ్మ : ఆc ! ఆc!

రాజి : అదీ....

ఈరమ్మ : అదీ.... ఏటన్నాది!

రాజి : పిల్లాడి ముడ్డి కడగమన్నాదేఁ ! (కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు)

నర్సి : అంత మాటన్నాదా! ...దాన్తల్లి.... (లేవబోయి పడ్డాడు) నువుగానీ కడిగేసినావేట్రా?

ఈరమ్మ : కడిగీసినావేట్రా... ఓలమ్మో ఇంత పొడుగు సాగదీస్తన్నావు... (రాజియ్యతో) పోల్నే సిన్నపిల్లాడేగదా... దేవుడికి కడిగినాననుకో.

నర్సి : ఏలనుకోవాల?... దానికి సెప్పి నాది కడిగించీగలవా?

ఈరమ్మ : నీది?

నర్సి : అవును... నాదే

ఈరమ్మ : ఈల్తోటి ఎలగ పడ్డమురా దేవుడా! ... (గొంతు నొక్కుకొని) మనూరి నాయుడే దానిది కడుగుతున్నాడు... దానికీ నాయుడికీ.... ఇదేటమ్మో! ఎవులైనా ఆలకిస్తే అందరొచ్చి నామీద పడిపోతారు గావాల?... (రాజిగాడితో) ఇదిగో అదేటి ఉదుంలో ఎట్టుకోకుండ....

రాజి : ఇంత వయపొచ్చినోడ్ని ఆ మాత్రం ఇలువిచ్చింది కాదు. (బాధపడ్డాడు)

ఈరమ్మ : ఇదేటి నీ పిచ్చిగానీ... వయసుని బట్టి ఇలవిత్తారా సెప్పు. నా వయసేటి సిన్నదా, సితకదా! పెద్దోలమాట అలాగుంచు! ఆరేడేళ్ళ గుంటలు ఈరీ అంతరు. ఒలే ఈరమ్మ అంతరు– ఓస్ మంగల్దానా అంతరు. పెద్ద ముండాకొడుకులు మూతులు ముంగి పోతుల్లాగెట్టుకొని సూత్తుంతరుగానీ, ఒరే పెద్దదాయిరా ఏట్రాపిలుపులని ఒక్కడూ గదమాయించడే. ఇకన ఆ పెద్దనా గండలకైతే సెప్పలేము. బోసిడీ అంటారు. లంజా అంటారు. లమ్డీ అంటారు. సంవత్సరానికీ ఆళ్ళిచ్చే పదికుంచాల గింజలకు మన బతుకులు అమిర్చేసినట్టు అనబగించాలా! అనబగించాలంటే.. ఎక్కడి కెలిపోతాం. ఎందల పడిపోతాం.

నర్సి : ఎందలోనైనా ఏల పడిపోడం, మనమేటో సూపెడితే ఆళ్ళే గౌరవిత్తారు.

ఈరమ్మ : ఆఁ ! నువు సూపెట్టినావులే బూర !

నర్సి : ఏటెప్పుడు బూర బూర అని ఈక ముక్కను తీసీసినట్టు తీసిపారెత్తావ్.

ఈరమ్మ : తీసీకంట... నీలాగ మెడలేసుకొని తిరగమంతావేటి?

నర్సి : అవును తిరిగినానే... అందికే అన్ని మెడల్స్ వచ్చినాయి.

ఈరమ్మ : ఏటిసేసుకుంటావ్... కూటి కొచ్చిందా? కూర కొచ్చిందా?

నర్సి : బతుకంటే తిండేనేటి? మర్యాదో!

ఈరమ్మ : అది మాత్రం ఎక్కడున్నాది? ఈ బూర ఊదటం ఇని, ఇని, ఇని అబ్బా ఎంత సక్కగా ఊదుతున్నాడని లోకవంతా మెచ్చీసుకొని నిన్ను నర్సింహులు పంతులనో, నర్సింహుల్నాయిడనో పిల్సేసినారేటి? మంగలోడు మారాజైపోతాడా? ఆడిసేతిలోని పొది పంచాంగమై పోద్దా?

నర్సి : మంగలోడు, మంగలోడు అని మనకిమనం సులకన సేసుకుంటావేటి? మంగలోడంటే ఎవడనుకున్నావే –

(గబా గబా చిన్న ట్రంకు పెట్టెలోంచి ఒక పుస్తకం తీసాడు – పేజీలు తిప్పి ఒక పాటను అందుకున్నాడు)

పాట : వినవే ! వినవే ! వినవే
మన కుల ఘన వీరగాథ
వినరా వినరా వినరా
మన ఘనత తెలిపే శూరగాథ
యజ్ఞం, యాగం, భోగం
క్రతువు, రుతువు, శ్రార్ధం
మంత్రం, యంత్రం, తంత్రం
మంగలి లేనిది లేదే యోగం

వినవే – వినవే – వినవే 2
త్రాడునుకోసి, ఆయువుపోసి
మాలిన్యం తన ఒంటికి పూసి
మాయను మహిలో సత్యం చేసే
మహా మహితాత్ముడు మంగలి

వినవే – వినవే – వినవే 3
బెమ్మే చేసిన బొమ్మే మనిషి
ఆ బొమ్మకు ఉన్న కంపును చూసి

ఈక తోక పేలు గోలు అన్నీ తీసి
సుందర రూపం ఇచ్చే శిల్పే మంగలి
వినవే – వినవే – వే.... (దగ్గు ముంచుకొచ్చింది– ఆయాస పడుతున్నాడు. రాజియ్య, ఈరమ్మ చెరో ప్రక్క పట్టుకున్నారు.)

రాజి : అయ్యా ! అయ్యా !

ఈరమ్మ : ఆయాసపడకు మావా! ఇలగ సేరబడు

రాజి : సేరబడు.. నిదానం

ఈరమ్మ : (ప్రక్కనున్న గ్లాసుతో నీళ్ళుదీసి) ఈనీల్తాగు ... (నీళ్ళు పట్టింది) ఆఁ ! ఆఁ

రాజి : సుబ్రంగా ఉందా?

నర్సి : పర్లేదు... కొంచెం నిదానించింది.

రాజి : అలగ తొంగో

నర్సి : ఒరే నాయినా !

రాజి : అయ్యా!

నర్సి : ఓరయ్యా! నీచెత్వమనేటిది సూసే కళ్ళలో నుంటాదిగానీ సూసిన వస్తువులోన ఉండదురా. లోకం మనల్ని ఎప్పుడు సులకన కళ్ళతోనే సూసింది. పేనానికి పేనంగా సంగీతం నేర్సినాను. కళ్ళుమూసుకొని ఇన్నంతసేపు సెవుల్లో అమృతం పోసినట్టుందనీ వోరు. కళ్ళు తెరిస్తే నాను, నా కులం కనబడీది. మంగళ వాయిద్యమంతా మంగలోడి మేళమై పోయింది. మనూరి బాపనయ్య శివయ్య బాబుండీవోడు– మృదంగం వాయించీవోడు – తప్పుమాట గొప్ప వాయిద్యగాడు – నా అంతటోడే సన్మానాలు, బిరుదులు– గవర్నమెంటు పదవులు – ఒకదానిమీదొకటి మిడతల దండులాగ వచ్చిపడీవి. నా కొక్కటీ మచ్చుకైనా రాలే! అతగానెంత తెలివైనోడంటే, నా గురించి నా ఎదుటే పొగిడీవాడు. నలుగురులోన ఒక్కమంచి మాటాసెప్పీవోడుకాదు. నాతోటి ఎవులు మాట్లాడిన ముకం పేడ కడిలాగ పెట్టీవోడు. సీ! దీనెమ్మ! బతుకు! తూ! కళాకారుడన్నోడు తక్కువ కులంలో పుట్టకూడదని ఎన్నిసార్లు నన్నునేను శపించుకున్నానో ఆ భగమంతుడికే తెలియాల.

ఈరమ్మ : ఇప్పుడికైనా ఒప్పుకుంటావా! ఇలవలేని జనమలు ఈదిన పడకూడదని....

నర్సి : ఇలవ లేదనకు. ఇలవ ఇవ్వడం లేదంతే.

(మంచంపైన దిండు క్రిందున్న పుస్తకం తీసాడు) ఇదిగో ఇది సూడు... ఇది మన కులపురాణం. నాభికా పురాణం. ఇది సదివితే నీకే తెలుస్తాది. మన కులం కూడా బేమ్మర్లంత గొప్పకులమని.

రాజి : (పుస్తకం తీసుకున్నాడు) ఏటి ఇందలుందా మన కులం బేమ్మర్లంతా గొప్ప కులమని.

నర్సి : అందికేకదా మనల్ని నాయి బేమ్మర్లనేది.

రాజి : అయితే మనమూ బేమ్మర్లమేనన్నమాట.

నర్సి : అది సదువు... సదువు...

ఈరమ్మ : (గబాల్న అతని చేతిలోని పుస్తకం లాక్కుంది) ఏటి సదివేది పేడ. నీకేవైనా బుద్దుందా? ఈ పిప్పీ ఊది నీ బతుకు బుగ్గి సేసుకున్నిది చాల్దా? ఈ పుస్తకమిచ్చి మమ్మల్ని ఏ గంగలో తోసీద్దివని నీ ఉద్దేశ్యం.

నర్సి : (ఈరమ్మ చేతిలోని పుస్తకం లాక్కున్నాడు) నీకేటి తెల్సని అలగ రాలిపోతన్నావ్! ఇందయ్యా సదువు.. (పుస్తకం రాజియ్య చేతిలో పెట్టాడు )

ఈరమ్మ : (మళ్ళీ పుస్తకం లాక్కుంది) సదివినావంటే నానొప్పుకోను. నానసలే మొండిముండను.

రాజి : (ఈరమ్మ సేతిలోది లాక్కున్నాడు) చట్ ! నాను సదువుతాను. సదివే తీర్తాను. ఇదొక్కటే కాదు... నాను తెలివైనోడ్ని అవ్వాలంటే ఏటేటి సదవాలో సెప్పురయ్యా! అన్నీ సదువుతాను. నాకు సదువు సెప్తావయ్యా!

నర్సి : నాను సెప్పలేనుగానీ! మన కిష్టప్పంతులు నాన్నమ్మ లేదా?

రాజి : అవును బాపనోళ్ళ బామ్మ.

నర్సి : ఆయమ్మ గొప్ప పండితురాలు. మనలాటోళ్ళపట్ల ప్రేమ ఉన్న మనిషి. ఎల్లి ఆమెను సదువు సెప్పమను... సక్కగా నేర్పుతాది.

రాజి : ఎల్తాను... బామ్మకాడ సదువు సెప్పించుకుంటాను. (విసురుగా వెళ్ళాడు)

ఈరమ్మ : ఓరి ముసిలోడా ఎంత పన్జేసావురా! ఉడుకుడుకుది తింటానని ఇప్పుడే ఏడ్సినావు. ఒక రెండొందలు సంపాయించి ఆ డీలర్ గాడి దగ్గర తనఖాపెట్టిన రేసన్ కార్డు ఇడిపించుకొచ్చి, బియ్యం తెమ్మని కొడుక్కి సెప్పడాకి నీకు నోరురాలే. సదువయ్యా బేపనయ్యవవుతావని పుస్తకమిచ్చినావు. నీకు... కుట్టుగర్ర తో రెండు చురకడెలితేగానీ బుద్ధి రాదు (లోనకెళ్ళింది కుట్టుగర్ర తీసుకురావడానికి)

నర్సి : సురక లెడతావే.. ఎట్టుకో. నీకలవాటే గదా! ఇదిగో ఇక్కడ కొబ్బరి పెంకుతో కొట్టినావు. ఒకపాలి కత్తొట్టుకొని గుండు గీసేసినావు. ఇప్పుడు సురకలెడతావా? ఎట్టుకో..

ఈరమ్మ : (వస్తూ) నీకు... ముసిలోడికానా ఏడు.

(చాలా బలంగా కుట్టుకర్రతో కాల్చింది)... ఏడు.

(బాధను చూడలేనన్నట్టు కళ్ళు మూసుకుంది)

నర్సి : (ఏడ్వడానికి బదులు నవ్వుతున్నాడు) హో... హో... హో....

ఈరమ్మ : (కళ్ళుమూసుకొనే) ఏడుస్తున్నావా?

నర్సి : లేదు నవ్వుతున్నాను.. హో....హో...హో....

ఈరమ్మ : నవ్వుతున్నావా? కాలుతున్న కుట్టుపుల్ల సేతిలో ఎడితే నవ్వుతున్నావా? (కళ్ళు తెరిచింది)

నర్సి : ఈరమ్మా! మనింట్లో అగ్గేసి మూడు రోజులయ్యింది. కుట్టుగర్ర ఇంకా ఏల కాలుతాది? అందుకే నవ్వుతున్నాను. హో... హో... హో... (అది ఏడుపుగా మారిపోయింది)

ఈరమ్మ : మావా !

నర్సి : ఇంత ఉడుకన్నం ఎట్టవా!

ఈరమ్మ : ఎడతాను మావా ! తప్పకుంట ఎడతాను....

**(లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్)**

## 4వ సన్నివేశం

(అది శివ్య సెంటర్. ఆ సెంటర్లో శివయ్య విగ్రహం ఉంది. ఆ విగ్రహానికొక చెయ్యి విరిగిపోయింది. ఆ విగ్రహం చుట్టూ డబ్బాగాడు అసహనంగా తిరుగుతున్నాడు)

డబ్బా : ఈ పంతులు పూజ చేసుకొని వస్తానన్నాడు. ఎప్పుడికి వస్తాడో, ఏటో... సదివిన మంత్రాలు చాలు రావయ్యా బాబు! వీళ్ళ తాతల దండ్రుల కాలంలో గుడి, గుడి సుట్టుపక్కల కైలాసం లాగ కనిపించేది. మాన్యం బూవులు బాపనోళ్ళ సేతుల నుండి ఎప్పుడు రైతులసేతులకెళ్ళి పోనాయో, పంతుళ్ళ పని మెంతులై పోయింది. బేమ్మర్ల పరిస్థితి ఈ ఇగ్రహంలాగ అయిపోయింది. ఇంక దీపాలెవుడు ఎడతాడు – పూజ లెవుడు సేస్తాడు – బామ్మ బాధ పడలేక గానీ కిష్టప్ప పంతులు మాత్రం ఇటువైపు వస్తాడేటి?

మనకొచ్చిన ఆఫర్, మరొకరికి ఇచ్చీసి, ఆ డబ్బు మనం తీసుకోవచ్చా? ఇది దరమమా? అదరమమా? సబవా? సబవుకాదా? నిన్న రాత్రి కిష్టప్పంతుల్ని కలిసి అడిగితే ఈ పొద్దు కార్తీక పున్నమి పూజ పూర్తయ్యాక సెపుతానన్నాడు. ... పంతులు గానీ 'యస్' అంటే ఐదువేలుకోసం మరో పార్టీ ఎతుక్కోవాల.

కిష్టప్ప : వెధవ ఎలా దారికాచాడో! అవినీతిలో నీతిఉన్నట్టు, అధర్మంలో ధర్మం తగలడినట్టు చేసే వెధవ పనులకు ధర్మసందేహాలొకటి. అవతల ఆఫరిచ్చింది ఎవరయ్యా అంటే చెప్పడు. ఎందుకిచ్చిందో చెప్పరా అంటే అదీ చెప్పడు. పాత్రలు, పరిసరాలు ఏవీ చెప్పకుండానే కావ్య న్యాయం జరిగిపోవాలంటాడు వెధవా! అవతలి ఆడదాని అనుపానులు తెలిస్తే ఖర్చుతో కూడిన పనైన కొన్ని క్షణాల్ని రసప్లావితం చేసుకొందామనే తీట మనస్సు పీకుతోంది. ఏదీ ... లంగరందనివ్వడంలేదే! .... మనమెందుకు బయట పడటం! వాడికన్నా మనమేనేటి తక్కువ తిన్నది?

(డబ్బాగాడే పంతులు దగ్గరకొచ్చి, ప్రక్కకు తీసుకెళ్ళాడు)

డబ్బా : ఏటండి బాబూ! ఏదో ఒకటి తేల్చమని అవతల నాకు ప్రెసర్ పెట్టేస్తంది. గబుక్కున సెప్పండి... ఇది సబవా! కాదా?

కిష్టప్ప : ఒరే! ఇలాంటి ఆఫరొకటుందని నన్ను టెంప్ట్ చేస్తున్నావా! లేకపోతే నిజంగానే ధర్మాధర్మాల గురించి ఆలోచిస్తున్నావా?

డబ్బా : మీరేదైనా అనుకోండి! ముందైతే సెప్పాలి! ఇది ఎలాటిపని?

కిష్టప్ప : ఇది సబవు కాదురా!

డబ్బా : ఎంచేత!

కిష్టప్ప : పందెంలో ఒడ్డి ఆడదాన్ని ఓడిపోవడానిగ్గానీ, అమ్మీడానికిగానీ, హక్కుండేది ఒక్క భర్తకే. నువు కాదు కదా! అలాంటి పని నువ్వెలా చెయ్యగలవు.

డబ్బా : అంతకు మించి మరో మాట లేదు కదా?

కిష్టప్ప : ఏ పురాణం చూసుకో.....ఏ కావ్యంలో వెతుక్కో... ఏ ఉద్గ్రంధాన్ని తిరగేసుకో ఎక్కడా ఇంతకుమించి ఉండదు.

డబ్బా : స్సరే! చాన్సు పోయినట్టే! కమలా! ఒక్క ఐదువేలు అప్పు చేసైనా ఇచ్చెయ్యగూడదా! నీకు టెన్షన్ తప్పిపోను – నాకు అవసరం ఒడ్డెక్కిపోను.

కిష్టప్ప : ఏమిత్రా! కమలా! అంటే ....

డబ్బా : కిరాణా కొట్టు కమలండీ...

కిష్టప్ప : ఒరే ఆగాగు .....ఒక్కమాట

డబ్బా : ఉండండి! ఎవడో ఒకడికి బొక్కెట్టి ఐదువేలు సంపాయించాలా! లేకపోతే ఆ పడమటోడు గుడ్డలిప్పించేత్తాడు.

కిష్టప్ప : అది కాదురా! నా మాట పూర్తిగా వినకుండానే గుర్రంలా పరుగెడతావే! నేను చెప్పింది పూర్వం కాలం మాట. అంటే ద్వాపరి, త్రేతాయుగాల ధర్మం – ఈ కలికాలంలో అందునా ప్రజాస్వామ్యం వచ్చాక ధర్మం, న్యాయం, చట్టం, సబవు వేరేగా ఉంటాయి.

డబ్బా : ఏవిటో అది.

కిష్టప్ప : నీకు ఉదాహరణతో చెప్తానుండు... ఆ మధ్య మా బావ ఒకడు గృహ ప్రవేశం చేస్తే వైజాగ్ వెళ్ళాను.

డబ్బా : వెళ్తే.

కిష్టప్ప : అంతెత్తున ఆరంతస్తుల బిల్డింగ్ కట్టేశాడు. క్రింద నుంచి పైకి ఒక్కసారి చూసి అడిగాను ఇదేంటి ఇంత చిన్న స్థలంలో ఇంత ఎత్తున కట్టేస్తే కార్పొరేషనోళ్ళు ఏవన్లేదా అని. దానికేమన్నాడో తెల్సా. రోడ్డు వెడల్పు చేసేటప్పుడు వాడి ఫ్రెండ్ బిల్డింగ్ కొట్టేశారట. దానికి ప్రతిఫలంగా భూమి పోయినందుకు మిగిలిన స్థలంలో ఎంత ఎత్తు కట్టుకున్న ఫర్వాలేదని, డెవలప్‌మెంటల్ రైట్స్ ఇచ్చారుట. ఒకవేళ వాళ్ళు కట్టుకోకపోతే ఆ హక్కులు ఇంకొకరికి అమ్ముకోవచ్చుట. దాన్ని టిడిఆర్ అన్నారుట. అంటే ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంటల్ రైట్స్ – ఆ రైట్స్‌ను కొనుక్కొని ఇంతెత్తున కట్టాను బావ అన్నాడు. ఇప్పుడు కమల విషయంలో నీ ప్రపోజల్ కూడా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఎంజాయ్‌మెంట్ రైట్స్. నిరభ్యంతరంగా నువ్వు అమ్ముకోవచ్చు. యథారాజా తథా ప్రజా!

డబ్బా : భలే కిరి కిరి పెట్టావే! ఒక్క సిటంలో దరమాన్ని అటుదిటు చేసావ్. ఐతే ఇప్పుడు నేనీ ఉత్తరం ఎవరికైనా అమ్ముకోవచ్చంటావు.

కిష్టప్ప : నాలాంటి శ్రేయోభిలాషులకు చవగ్గా ఇస్తే ఇంకా పుణ్యం.

డబ్బా : నీకు ఓపికుందా?

కిష్టప్ప : ఓపికుందని కాదు, కోరిక ఉందని మాత్రం గట్టిగా అనగలను.

డబ్బా : ఇదిగో ఒక ఐదువేలు ఇలగపడీ... (చీటీ పంతులు చేతిలోకి విసిరాడు)

కిష్టప్ప : అయిదు వేలా...?

డబ్బా : నోరంత సాగదీస్తావేల!.... సగానికి సగం తగ్గించా.

కిష్టప్ప : డబ్బిచ్చేసరికి రెండు రోజులవుతుంది.

డబ్బా : ఈలోగా ఏవో తిప్పలు పడతాను.

కిష్టప్ప : అవును గానీ ... ఈమధ్య పడమటోడి ఎనక తిరుగుతున్నావ్ ఏటి సంగతి.

డబ్బా : ఏదో ఒకటి కడుపులోని కరకరమనే ఆకలి తీరాల. ఇస్త్రీ బట్ట కరకర తగ్గకుండా దర్జా ఎలగ బెట్టాల.... అదిగో పదమటోడు ఇటేవస్తన్నాడు. ఆ ఉత్తరమిటు ఇయ్యిమీ...రడీ కేష్ వర్కవుట్ అవుతాదేటో పెయిత్నిస్తాను.

కిష్టప్ప : మధ్యలో మాట తప్పడమా..... ఇదిగో అయిదువేలు! అన్నట్టురోయ్! పిల్లాడి చదువు కోసం మా ఇంటికి వస్తుంది. ఉత్తరం చెయ్యి మారిన భోగట్టా చెప్పేసేయ్ – మా ఇంటి ఉత్తర దిక్కున పశువుల పాకుంది. అందులోకే లాక్కుపోతాను.

డబ్బా : ఎల్లెల్లు... అదృష్టవంతుడివి.... (కిష్టప్పంతులు ఒకవైపుకు ముందుకు కదిలాడు)... అటెక్కడికి?

కిష్టప్ప : మా ఇంటికి?

డబ్బా : మీ ఇల్లు ఇటు... మర్సిపోతే ఎలగ?

కిష్టప్ప : ఒరేయ్ నీ లాజిక్ తగలెట్ట? ఉత్సాహం ఉరకలేస్తోంది.

డబ్బా : కమలింటికి పరుగెడతన్నావు కదా!

కిష్టప్ప : ఆలస్యం అమృతం విషం కదరా!

డబ్బా : బంగారంలాంటి సంస్కృతంని ఇలాంటి పద్దుకుమాలిన పనులకి వాడీసి దానిన సంపీసారండీ! ఎల్లెల్లు.

కిష్టప్ప : సొద్దు పెట్టావుగా... ఇంక ఈవేల్టికి పనవ్వదు... అది రూఢీ! మా ఇంటికేపోతాను. (విగ్రహం వెనక్కి వెళ్ళాడు. డబ్బాగాడు అటు తిరగడంతో అతనికి కనిపించకుండా కమల ఇంటివైపుకి పరిగెత్తాడు. పదమటోడు డబ్బాగాడికి ఎదురుగా వస్తున్నాడు)

డబ్బా : మావా! నీకాడకే వద్దామని

పదమ : ఏహ్! అన్నీ టొంకులే... ఎధవాని.... ఎధవా!

డబ్బా : ఒట్టు మావా

పదమ : నీ ఒట్టుతో నిన్ను తగలెట్టా. మాట మీద నిలబడవేమిరా?

డబ్బా : మావా! నమ్మకపోతే నావల్ల గాదు....ఇదిగో నీ అయిదువేలు నువు తీసుకో. సెల్ కొనుక్కొంటావో... ఆ ముఖలింగం దేవుడికి ముడుపు

కట్టుకుంటావో నీ ఇష్టం. కానొకటి ఈ ఒక్కరోజుకి నమ్మితే రేపు శ్రీకాకుళం ఎల్లి సెల్ కొనుక్కొస్తాను. ఆ సెల్ నీకన్న నాకే ఉపయోగమెక్కువ. నాకంటే నాకు కాదు. నీపని మీదే!

పడమ : (డబ్బు తీసుకొని) అంటే.....

డబ్బా : ఇప్పుడు పెతీ దపా హైదరాబాద్ ఎల్లాలంటే ఎంత కష్టమో నీకు తెల్దా. అదే సేతిలో సెల్లుందనుకో, మనల్ని మినిష్టర్‌తో కలుపుతానన్న రాయలసీమ పెద్దమనిషిని ఎక్కడున్న పట్టీవొచ్చు. మనకు మనిషి దొరకడమాలిస్యం – పని అవ్వడం ఎంత సేపూ....

పడమ : అయితే అతగాని వివరాలు ఉన్నాయా!

డబ్బా : ఒక్క అతగానిదేకాదు. గవరమెంటులో పనులు సేయించగలోలందరి పేర్లు ఉన్నాయి.

సోమిరెడ్డి, రామిరెడ్డి, పేరిరెడ్డి, నాగిరెడ్డి, నాగార్జున రెడ్డి, నాగరాజారెడ్డి, నాగభూషణరెడ్డి, నాగ చైతన్యరెడ్డి, నాగేశ్వరెడ్డి, నాగమల్లేశ్వరెడ్డి, నాగరత్నం రెడ్డి, నాగమునిరెడ్డి, నాగభైరవ రెడ్డి, అదలగుంచు ......

హరిబాబు, గిరిబాబు, నాగబాబు, సూరిబాబు, సత్తిబాబు, నత్తిబాబు, కన్నబాబు, చిన్నబాబు, పెద్దబాబు ఇదిలగుంచు–

పడమ : అయితే ఫోన్‌లో దొరుకుతాడేమో సూడు! నంబరుందా?

డబ్బా : ఎందుకులేదు.... పద మీ ఇంటికెళ్లి ఫోను చేస్తాను... నీ అనుమానం తీరిపోద్ది.

పడమ : (జేబులోంచి సెల్‌ఫోను తీసాడు) ఇదిగో సెల్ .... చెయ్యిఫోను.

డబ్బా : మావా!

పడమ : నాయుడికి జడిసి ఎన్నాళ్ళు ఊరుకుంటాం. నిన్నే తెప్పించీసాను. సేసి మాట్లాడు.

డబ్బా : (ఫోను తీసుకున్నాడు, ఏదో నెంబర్ చేసాడు)

హలో! హలో ఆఁ! నమస్కారం రెడ్డిగారూ! నేనండీ శ్రీకాకుళం నుండి మాట్లాడుతున్నాను. సోవినాయుడ్ని ...ఆఁ! ఆఁ! హలో ... హలో

(పడమటోడితో) సిగ్నల్స్ వీక్... సరిగ్గా ఇనబడ్డం లేదు... ఆఁ! అన్నా! అన్నా (పడమటోడితో) అక్కడ అన్న అంటేనే గౌరవం...అన్నా! అన్నా! (సిగ్నల్ కోసం నాలుగు ప్లేస్‌లు మారుతంటే ఆ వెనక అతన్నే అనుసరిస్తున్నాడు పడమటోడు) ఆఁ! అన్నా! అయితే బయల్దేరి పోతాం....ఆఁ! ఇక్కడే ఉన్నాడు. ఒక్క దపా మాట్లాడన్నా! (సెల్ ఇచ్చి) మాట్లాడు,.... మాట్లాడు....

పడమ : హలో! హలో! కట్ అయిపోయింది.

డబ్బా : మళ్ళా చేస్తానుండు.

పడమ : ఇంకేలలే? ఎలగ ఎల్తన్నాం కదా!

డబ్బా : ఈ వోరంలో వచ్చీమన్నాడు ఎలిపోదాం.

పడమ : ఇదెలగ వాడడమో నాకొచ్చీ దాకా ఇది నీ దగ్గిరే ఉంచు. భూవి అమ్మేస్తన్నాను.

డబ్బా : ఇంక తిరిగి సూడకు – పదవి తన్నుకొస్తంది.

పడమ : మీ నాయుడు బావ గురించే కొంచెం బెంగగుందిరా.

డబ్బా : ఆ భయ్యమైతే నాకూ ఉన్నాది.... కాని తెగించాలి మావా! పదవి రానీ ఏదో ఒక మంత్రమేస్తాను.

పడమ : నువ్వే జెప్పాల్రోయ్!

డబ్బా : తలపెట్టిన తర్వాత తప్పదుకదా! మావా!

పడమ : ఏట్రా

డబ్బా : ఇప్పుడు ఆ అయిదువేలు నీకంత అవుసరమా!

పడమ : ఏం?

డబ్బా : ఆ ఏవీ లేదు.... పది రూపాయిల వడ్డీకి తెచ్చి నీకిచ్చాను. మాటపోకూడదు కదా? వడ్డీదేముంది? అందుకని ....ఒకేళ నీకు అవుసరం లేకపోతేనే! ఎలాగు పొలం అమ్ముతున్నావు... సముద్రంలో కాకి రెట్ట ఇదెంత....?

పడమ : (తిరిగి ఇస్తూ) మళ్ళెప్పుడిస్తావ్?

డబ్బా : హైదరాబాద్ నుండి వచ్చినెంటనే....

పడమ : పొలం అమ్మకమైపోతంది.... పదవికి ఢోకా ఉండదుకదా?

డబ్బా : నాకొొదులు మావా!

పడమ : అయితే కిష్టప్పంతులు కాడ ముహూర్తం పెట్టించు.

డబ్బా : దేనికి సావడానికా? ఆళ్ళ నాన్నమ్మ....మహాతల్లి మజ్జిగౌరమ్మ.... ఆయమ్మ తోటి పెట్టిస్తాను ముహూర్తం. నువ్వెళ్ళు!

పడమ : స్సరే అయితే! (ముందకెళ్ళాడు)

డబ్బా : (ఒక చేతిలో ఐదు వేలున్నాయి.. మరొక చేతిలో సెల్ ఉంది - రెండింటిని మార్చిమార్చి చూసాడు)

లౌక్యం ఉండాలిగానీ, సౌఖ్యం ఎంతసేపు?... ముందు పంతులెక్క డున్నాడో పట్టుకోవాలి. ఈపాటికి ఒంటికి సెంటు రాసేస్తున్నాడేటో?

(వెళ్లిపోయాడు డబ్బాగాడు.... కిష్టప్పంతులు హడావిడిగా పంచెసర్దుకుంటూ వస్తున్నాడు - అతనివెనక పరుగులాంటి నడకతో వస్తున్నాడు పడమటోడు)

పడమ : పంతులుగారు! పంతులుగారు! ఎక్కడ్నుంచీ!

కిష్టప్ప : ఏవిటీ! ఎవిటీ! వెంటపడి మారీ ఎక్కడ్నుంచీ, ఎక్కడ్నుంచీ అని అడుగుతారేఁ! చూసారుగా!

పడమ : చూసీ...

కిష్టప్ప : (గతుక్కుమని) ఇదిగోండి! మా తాతగారి విగ్రహంమీద ఒట్టేసి మరీ చెబ్తున్నాను... నాకే దురుద్దేశ్యం లేదు... ఇదిగో ఈ అగరొత్తుల డబ్బాకొనుక్కొని వచ్చేశాను. కొట్టునిండా మనుషులే. ఏంమాట్లాడతానండి!

పడమ : చూసీ అడుగుతానా పంతలుగారూ! ఇంతకూ ఈ డబ్బా ఎక్కడకొన్నారు.

కిష్టప్ప : అది చూళ్ళేదా!

పడమ : అదేగదా అడుగుతున్నాను.

కిష్టప్ప : హమ్మయ్య... స్సరి! స్సరి! ఇంతకూ మీపనేంటో?

పడమ : ఏంలేదు! ఒక పదిరోజుల్లో అయిద్రాబాదు ఎల్లాలి. మంచి మూర్తం పెడతారని.

కిష్టప్ప : తప్పకుండ! ఇంటికొచ్చేయండి! మీకేమిటండీ సింపుల్‌గా కనిపించే శిబిచక్రవర్తి లాంటివారు... వస్తామరి! పూజకు వెళవుతుంది... వస్తానూ.. (కంగారు తగ్గాక వెళ్ళిపోయాడు. పడమటోడి జేబులో సెల్ రింగయ్యింది. అయితే అది మ్యూట్‌లో వుంది. నంబర్ చూసి తీశాడు)

పడమ : హలో! ఆఁ! చెప్పు మామయ్య... ఆఁ అవునా! కాని సెల్లు రింగు బయటికి రాదు.. అదంతేలే... ఆఁ! ఆఁ! ఆఁ! నేనొచ్చే సరికి ఆఁ! అయిపోయేటట్టు సూడండి. మనవాళ్ళందరిని కూడగట్టు.... ఆలోసిచొంద్దు... ఎంతైనా పర్లేదు... ఉంటానుమరి... (సెల్ జేబులో వేసుకుని. విగ్రహానికి మొక్కాడు). పంతులుగారు ముహూర్తాలు పెట్టడంలో, జాతకాలు సెప్పడంలో మీరు ఆ రోజుల్లో గొప్ప పవర్‌ఫుల్లట, నేననుకున్న పని ఆటంకంలేకండ అయిపోతే మీ ఇగ్రహం బాగుసేయిస్తాను. కాదు! కాదు! కొత్త ఇగ్రహం సేయిస్తాను. సరేనా..

**(లైట్స్ ఆఫ్ - లైట్స్ ఆన్)**

## 5వ సన్నివేశం

(బామ్మగారి ఇల్లు. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబం– బామ్మ గొప్ప తెలివైంది. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్ భాషలు చదువుకుంది. వయస్సులో ఉప్పొంగిన భావుకత వలన, సంగీతంపట్ల వున్న మక్కువ వలన పల్లెటూరిలోని కిష్టప్ప పంతుల తాత (శివయ్య పంతుల్ని) పెళ్ళిచేసుకొని ఈ మారుమూల ప్రాంతంలో చిక్కుకుంది. లేకపోతే ఆమె జీవితం వేరే విధంగా ఉండేది. ఆ వూరిలో అందరికీ తల్లో నాలుకలా ఉంటుంది. అందుకే అందరూ బామ్మ అని ప్రేమతో పిలుస్తారు.)

బామ్మ : ఏవిట్రా ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. సెంటు అంత దట్టిస్తున్నావ్ ఏవిటి సంగతి...

కిష్టప్ప : (లో నుండి వస్తూ) ఆఁ! ఏవిటే.

బామ్మ : ఆ ఏవిటే అని నన్ను ప్రశ్నించడం కాదు – నిన్ను అడుగుతున్నాను – సమాధానం చెప్పు. అంత పొద్దెక్కితేగానీ లేవనివాడివి, ఈ రోజేవిటి సూర్యుని కన్నా ముందుగానే లోకాన్ని కంట జూచావు – వెధవది లేచిన వెంటనే నాలుగు కప్పులు కాఫీ లోనకు వెయ్యిందే కాలు మంచంమీంచి క్రిందికి దించవు. అలాంటిది లేచీ లేవగానే శుభ్రంగా స్నానం చేసేసావు – తండ్రి ఆబ్ధికం నాడైనా ఆ ఛండాలం జర్దా కిల్లీ ఉమ్మేసి నోరు పుక్కిలించరా అంటే వినకుండానే ఒక ప్రక్క కిల్లీ నవుల్తూనే దాంతోపాటు మరో ప్రక్క మంత్రాలు కూడా నవిలి నవిలి మింగేస్తావు.

ఇవన్నీ ఒక ప్రక్కన పెడితే గోవు, కన్నతల్లి లాంటిది, కంబారితెచ్చిన గడ్డి పరకలు రెండు తీసి దాని ముందు వెయ్యరా అంటే ఏనాడైనా చెవిన వేసుకొని ఆ పశువుల పాక వైపు కన్నెత్తైనా చూసావా? అలాంటిది తెల్లవారి లేచి ఇప్పటికి మూడుసార్లు పాకలోకి వెళ్ళివచ్చావు. ఏవిటీ ప్రకృతి వైపరీత్యమన్నది నాడౌట్.

కిష్టప్ప : వైపరీత్యం, నాదికాదే! నీది. బ్రాహ్మణ్యం వెధవది నిద్ర పోవడంలోను, కాఫీ త్రాగడంలోను, పశువులకు గడ్డెయ్యడంలోనూ ఉండదే! సంప్రదాయాల్ని పాటించడంలో ఉంటుంది. కట్టుబాట్లను తు.చ. తప్పకుండా అమలు చెయ్యడంలో ఉంటుంది.

బామ్మ : నేనంటున్నది అదే ... కట్టుబాట్లు అమలు చెయ్యమనే.

కిష్టప్ప : ఆ పని ముందు నువ్వు చెయ్!

బామ్మ : నేను ఉల్లంఘించినది ఎప్పుడు?

కిష్టప్ప : ఎంత నంగనాచివే! కులం తక్కువ వాళ్ళందర్నీ తీసుకొచ్చి వంటింట్లో విస్తళ్ళు వేసి వడ్డించి మరీ తినిపిస్తావు. పూజగదిలోకి తీసుకెళ్ళి ప్రసాదాలు పెడతావు. హెచ్చుతగ్గులేకుండా చదువులు చెబుతావ్.... అంతటితో ఆగుతావా! ఆ మాలపిల్లపై కాపోళ్ళ కుర్రాడెవడో అఘాయిత్యంచేసాడని, వాడ్నిజైల్లోపెట్టించిన వరకు నిద్రపోయావు కాదు.

బామ్మ : అలాంటి వాడ్ని ఉరితియ్యాలి.

కిష్టప్ప : ఇదిగో ప్రతిదాంట్లోనూ తలదూర్చేస్తున్నావు. పెద్దవాళ్ళ కళ్ళలో పడ్డం మంచిది కాదు చెబుతున్నాను.

బామ్మ : ఎవరిమో ఒకరం అండగా నిలబడకపోతే చిన్నవాళ్ళను బ్రతకనిస్తారట్రా.

కిష్టప్ప : బయల్దేరిందండి వీర వనిత.. మా తాత నిన్నెలా భరించాడే.

బామ్మ : ఎంత సపోర్టనుకున్నావ్. మీ తాత నీలాంటి పిరికివాడయితే అప్పుడే వదిలేసి పోయేదాన్ని.

కిష్టప్ప : నువుపోయింటే ఆయన మిగిలుండేవాడు. చక్కని సంగీత విద్వాంసునికి ఇంతటి విధ్వంసకురాలు ఎలాదొరికిందో.

బామ్మ : అతని సంగీతాన్ని నేను ఆనందించేదాన్ని... నా సోషల్ సర్వీస్‌ని అతను ప్రోత్సహించేవాడు.

కిష్టప్ప : ఇద్దరూ కల్సి పిల్లలను పట్టించుకోక, నా తండ్రికి ఏ విద్యా అబ్బిందికాదు... ఎంత గట్టి పిండానివే! మొగుడు పోయాడు! కొడుకు

పోయాడు! కోడలు పోయింది! నువ్వుమాత్రం తిష్టవేసేసి కదలడం లేదు, లోకాన్ని ఉద్ధరించడానికి.

బామ్మ : లోకం సంగతలా ఉంచు. ఆ పాకలోకి అన్నిసార్లు ఎందుకెళ్తున్నావో చెప్పు.

కిష్టప్ప : వెళ్ళడం కాదు, ఈ వేళంతా ఆ పాకలోనే ఉంటాను. నీకేమైనా అభ్యంతరమా!

బామ్మ : నాకు అభ్యంతరమెందుకు? పశువుల మీద అంత ప్రేమ పుట్టినందుకు సంతోషిస్తాను గానీ.

(బయటి నుండి బామ్మగారూ అని కేక వినిపించింది)

కిష్టప్ప : అదిగో కమల!

బామ్మ : (కిష్టప్పను విస్మయంగా చూసింది)

కిష్టప్ప : (ద్వారం వరకెళ్ళాడు) రండి! రండి!

(కమల కొడుకుతో సహా లోనకు వచ్చింది. కుర్రాడి చేతిలో పలకుంది. ఒక మూలగా కమల నిల్చుంటే ఆమె నంటుకొని నిలబడ్డాడు కొడుకు.)

బామ్మ : ఆ తులసి చెట్టుకి నీళ్ళు పోసి వస్తాను. ఆ కుర్రాడిచేత అ, ఆ లు దిద్దించు.

(బయటకు వెళ్ళింది. అదే అదునుగా భావించి కమలకు దగ్గరగా వచ్చి చెవిలో ఏదో గొణిగాడు – అర్థం కానట్టు ముఖం పెట్టింది కమల. దాంతో కాస్తా విడమర్చి చెప్పాలని ప్రయత్నం చేసాడు.)

కిష్టప్ప : డబ్బాగాడు విషయమంతా చెప్పాడుగా ....

కమల : ఏ విషయం?

కిష్టప్ప : (గోడకొక్కేనికున్న షర్టు జేబులోంచి చీటీ తీసాడు). ఇదిగో చీటీ.

కమల : ఏం చీటీ...

బామ్మ : (బయట నుండే) ఒరేయ్! దిద్దిస్తున్నావూ?

కిష్టప్ప : ఆఁ! ఆఁ! (వచ్చేస్తుందేమోనని హైరానాపడుతున్నాడు. చీటీ తీసి చేతికివ్వబోయాడు. ఇచ్చేస్తే చేయి జారి పోతుందనుకున్నాడు. కానీ

ఆమెకు పూర్తిగా అర్థమయ్యేటట్టు చెప్పాలనే ప్రయత్నంలో) ఇదిగో నువు నాయుడికి రాసిన చీటీ – విషయమంతా చెప్పితే ఐదు వేలిచ్చి నేను కొనుక్కున్నాను. అర్థమైందా! (పంచె మడతలో దాచాలనుకొని విరమించుకొని గోడకున్న షర్టుజేబులోనే పెట్టేసి పిల్లాడి ముందు కూర్చున్నాడు – బయట నుండి బామ్మ వచ్చింది)

కిష్టప్ప : అ...... ఆ.....ఇ.....ఈ....... ఇదిగో కమల! ఇందాకట్నుండి పెయ్య ఒకటే గోల పెట్టేస్తుంది. ఆ పాకలోకి వెళ్ళి దానికింత కుడితి పెట్టి రాకూడదూ!

బామ్మ : నేనిప్పుడు కోవెల నుండి వచ్చిన అరటిపళ్ళు పెట్టానుగానీ .. నువు దిద్దించు. నువ్వు వెళ్ళి కుడితి నీళ్ళు తాగించు.

కిష్టప్ప : (కిష్టప్ప బామ్మ మీద బుసలు కొడుతూ నొసలుతోనే కమలకు సైగ చేసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు)

కమల : పంతులుగారు నొచ్చుకున్నట్టున్నారమ్మా!

బామ్మ : వాడిమొహం!

(బయట నుండి చాకలి బుడ్డడి కేక వినిపించింది)

బుడ్డ : అమ్మా! బట్టలు.

బామ్మ : (బయట కొకసారి ద్వారం వరకూ వెళ్ళి చూసి) బుడ్డన్నా! కాస్సేపాగు వస్తాను.

బుడ్డన్న : (బయట నుండే) అలగ కానీయమ్మా!

(చుట్టూ చూసి లోనకెళ్ళింది – బామ్మ : ఆమె వెళ్ళిపోవడంతో కమల, పిల్లాడు కాస్త ధైర్యంగా ఫీలయ్యి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఆ తర్వాత కమల దృష్టి, చీటీ ఉన్న చొక్కామీద పడింది. అది తీసి దాచేస్తే బాగుణ్ణు అనుకుంది. కానీ బాగుండదేమోననే భావన కలుగుతోంది. కొడుకు కూడా తననే చూస్తుండటంతో బాగా బిడియ పడుతోంది. అయినా తెగించడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చి ముందుకెళ్ళబోయింది. ఈలోగా రెండు పాత చీరలు, పంచెలు పట్టుకొని లోనుండి బయటకొచ్చింది బామ్మ).

బామ్మ : వెధవకి ఇంత వయసొచ్చినా మాసిన బట్టలు ఒకచోట పెట్టుకోవడం చేతకాదు....ఇళ్ళంతా బట్టలే .... (అనుకుంటూ గోడకున్న చొక్కాను తీసి పాత బట్టల్తో కలిపి బుడ్డన్నకు వెయ్యడానికి బయటకు వెళ్ళింది. కమల చాలా రిలీఫ్ ఫీలయ్యింది. బామ్మ బుడ్డన్నతో మాటలు చెబుతూనే ఉంది. కమల బయటకు చూస్తోంది)

ఒరేయ్! బట్టలు వేసినవి వేసినట్టే తీసుకొస్తున్నావ్. నాలుగు ఉతుకులెయ్యరా. తెల్లగా వస్తాయి.

బుడ్డన్న : ఎన్ని ఉతుకులుతికితే మాత్రం ఏటి లాభమమ్మా! ఏ సెరువులోనైనా సేరడు నీల్లుంటేకదా? మీవి కాబట్టి ఆ మాత్రం నీలు సిలకరిస్తాం గానీ, దేవరోళ్ళవిగానీ, కోవిటోళ్ళవిగానీ, ఇతర అనాదసనాద కులాలోలివి ఉతుకుతావేటమ్మా?

బామ్మ : ఉతక్క! ఏం చేస్త్రారా?

బుడ్డన్న : ఇటు నుండి అటు మడతలపెట్టేసి పొద్దు పొయ్యే సరికి తిరిగిచ్చీడమే.

బామ్మ : ఓరి వెధవా! మడి బట్టల్రా! కాస్తా శుభ్రం చేసి తగలడరా!

బుడ్డన్న : బాపనోళ్ళకి మోసం సేత్తే పాపం కదమ్మా! ఎవులి సంగతి ఎలగున్నా మీవి మాత్రం సుబ్రంగా మల్లి పువ్వుల్లాగ సేసి ఇచ్చేత్తాం. నానొత్తానమ్మా! (బుడ్డన్న అక్కడ నుండి వెళ్ళిపోయాడు. బామ్మ లోనకు వచ్చింది)

బామ్మ : కమలా! వంటింట్లో ఉప్పిండి ఉంది. ఆ పిల్లాడికి తెచ్చి కాస్తా పెట్టమ్మా!

కమల : అలాగే బామ్మ గారు!

(వంటింట్లోకి వెళ్ళింది. బామ్మ, బామ్మ అంటూ బయటనుండి కిష్టప్పంతులు కేకలు వేసుకుంటూ వస్తున్నాడు... ఆ అరపులు విని బామ్మ ప్రక్క గదిలోకి వెళ్ళింది. పిల్లాడొక్కడే అక్కడున్నాడు. బామ్మకోసం, కమలకోసం అటూ ఇటూ చూసాడు.)

కిష్టప్ప : బామ్మ! బామ్మ! ఇంతలో ఎక్కడికెళ్ళింది. పూజలో కూర్చోనుందా? ఇది వేళకాదే! అవును కమల సంగతేమిటీ! ఇందాక మనంచేసిన సైగల్ని అర్థం చేసుకొని పాకలోకి వెళ్ళి మనకోసం వెయిట్ చేస్తోందా!...

ఏవిటో అలవాటు తప్పిన వ్యవహారం అయ్యేసరికి అంతా అయోమయంగానూ, అవకతవకలుగానూ ఉంది.... అవును వీడ్ని అడిగితే ఎంతో కొంత సమాచారం దొరక్కపోదు... నాయినా... చిన్నోడా!

మీ అమ్మ ఇంటికెళ్ళి పోయిందేవిట్రా?...

క॥కొ॥ : లేదు... అలా ఎల్లింది. (కమల వెళ్ళిన వైపు చూపించాడు)

కిష్టప్ప : అటువెళ్ళిందా? అటువెళ్ళి కుడివైపు తిరిగితే వంటగది, ఎడమవైపుకి తిరిగితే నా పడకగది. ఓహో! ఏవిటీ అదృష్ట విశేషం! స్సరే బుజ్జిగా! మా బామ్మ ఎక్కడున్నట్టు...

బామ్మ : (పక్కనుండి వస్తూ) ఇక్కడే ఉన్నట్టు!

కిష్టప్ప : (గతుక్కుమన్నాడు) యేవిటే ఇక్కడే వున్నావా!...

బామ్మ : అవును... ఎందుకంత కంగారు పడుతున్నావ్?...

కిష్టప్ప : నాకు కంగారేవిటే!... ఎక్కడున్నావని అడిగాను దట్స్ ఆల్!

(లోనుండి కమల ఒక ప్లేట్‌లో ఉప్పిండి వేసుకొని వచ్చింది)

కమల : బామ్మగారూ!

కిష్టప్ప : (కమలచేతిలోని ప్లేటుచూసి ఒళ్ళు బాగా మండిపోయింది) అది నీకా నీ కొడుక్కా.

కమల : బామ్మ బాబుకి పెట్టిమంది.

కిష్టప్ప : ఆ తినండి! బాగా తినండి! బాబు ఒక్కడికేం ఖర్మ! వాడిచదువు అయిపోయాక నువ్వుకూడా ఇక్కడే భోంచేసి, హాయిగా నిద్రపోయి, బ్రహ్మముహూర్తాన వేకువ జామున లేచి, పెరట్లో నుయ్యింది, దాంట్లోంచి నీళ్ళు తోడుకొని, స్నానం చేసి... అన్నట్టు చన్నీళ్ళు చెయ్యాల్సిన అవసరం లేదు... రాగి గంగాళంలో వేడినీళ్ళు కాగబెట్టుకొని, స్నానం చేసేసి, పూజచేసేసి, అలవాటుంటే... లేకపోతే టిఫిన్ తినేసి... ఇష్టపడితే ఇంటికెళ్ళొచ్చు....

ఇదిగో మా ఇంట్లో చదువుల సరస్వతి ఉందిగా... ఈ శిక్ష పరాయివాళ్ళకుకూడ వద్దురా భగవంతుడా! (అని చేతులెత్తి గోడవైపు

తిరిగి దండం పెట్ట బోయి గోడకు చొక్కాలేకపోవడం గమనించాడు)... ఏదీ ఇక్కడ చొక్కా ఉండేది! ఏమయ్యింది!

బామ్మ : చొక్కా సంగతి ఎందుకు? ఏదో చొక్కారిస్తున్నావుగా కానీ...

కిష్టప్ప : నన్ను పూర్తిగా హీటెక్కించకు... చెప్పు చొక్కా ఏమైందో...

బామ్మ : చొక్కా... చాకలి వాడికి వేసానురా!

కిష్టప్ప : ఆఁ! ఎంతసేపయ్యింది

బామ్మ : ఇప్పుడే! ఈపాటికి బుడ్డన్న రేవుకెళ్లింటాడేమో

కిష్టప్ప : కొంపమునిగింది! (బయటకు పరుగుతీసాడు)

బామ్మ : కమలా! ఇంకాసేపు చదివిస్తాను నువ్వెళ్లి నీపని చూసుకో.

కమల : అలాగే బామ్మగారూ!

(బామ్మ లోనకెళ్ళింది. కమల వీథిలో అడుగుపెట్టబోతుండగా బయట నుండి డబ్బాగాడు, గబగబా వచ్చాడు).

డబ్బా : కమలా ఇక్కడున్నావా?

కమల : (ఓ ప్రక్కకు తీసుకెళ్ళింది) నువు మనిషివేనా? ఇంత పన్జేస్తావా? నీ ఉత్తరం కొనుక్కున్నానని నా వెంట పడ్డాడా ఆ పంతులు.

డబ్బా : దాన్ని తిరిగి తీసుకుందామనే, ఇదిగో డబ్బులు తీసుకొచ్చాను. పంతులెక్కడ?

కమల : సాకిరేవుకెళ్ళాడు.

డబ్బా : ఎందుకూ!

కమల : ఆ సీటీ ఉన్న సర్టు బామ్మ ఉతకడానకి ఏసింది... అందుకని..

డబ్బా : స్సరే అయితే ఎలాగైనా నీ చీటీ తెచ్చి నీకిచ్చేస్తాను... ఇక్కడే ఉండు.

(వచ్చినంత స్పీడుగా వెనక్కి వెళ్ళాడు డబ్బాగాడు – కమల మళ్ళీలోనకొచ్చింది.

బామ్మ : మళ్ళీవచ్చావేం?

కమల : ఏవీ లేదమ్మా! ఇంకొంచెంసేపుండి పిల్లాడ్ని తీసుకెళ్ళిపోతాను.

బామ్మ : స్సరే! ఈ వత్తులు కాస్తా చేసిపెట్టు.....

(తన చేతిలోని పత్తి కమల చేతిలో పెట్టింది)

కమల : బామ్మగారూ! పిల్లాడు బుద్ధిమంతుడౌతాడు కదూ!

బామ్మ : పెద్దోళ్ళం, మనం బుద్ధిమంతులమైతే పిల్లలు ఆటోమేటిక్‌గా అవుతారు.

కమల : బామ్మగారూ!

బామ్మ : (చెంగున కట్టిన ఉత్తరం తీసింది) ఏంటమ్మా ఇది.

కమల : ఏటి బామ్మ.

బామ్మ : మా కిష్టిగాడి జేబులో దొరికింది. ఇది నువు రాసిందేకదా!

కమల : అయ్యెయ్యె.... అది పంతులు గారికి రాయలేదమ్మా!... అది నాయుడికి రాసింది. డబ్బాగాడి సేతిల పడింది.

బామ్మ : అయితే ఆ డబ్బాగాడు మావాడికిచ్చి ఉంటాడు. దీన్ని పట్టుకొని నిన్నొక ఆటాడించాలను కుంటున్నారు.

కమల : అవునమ్మా. పంతులుగారికి తిరిగి డబ్బు లిచ్చేసి ఉత్తరం తీసుకోవాలని డబ్బాగాడు ఇక్కడకి వచ్చాడు.

బామ్మ : చూసాను... చూసాను... ఇద్దరూ చాకిరేవు నుండి వస్తారు. ... రానీ...రానీ వెధవలకి మక్కెలిరగగొడతాను.... ఒరే నువ్వెళ్ళి ఆ అరుగు మీద కూర్చొని దిద్దుకోరా! (పిల్లాడు పలక పట్టుకొని బయటకు వెళ్ళిపోయాడు)

ఇప్పుడు వాళ్ళు వొచ్చాక. (చెవిలో ఏదో చెప్పి బామ్మ లోనకు వెళ్ళిపోయింది. కమల ఇప్పుడు కాస్తా హుషారుగా ఉంది. కిష్టప్పంతులు, డబ్బాగాడు గొడవ పడుతూ బయట నుండి వచ్చారు).

పంతులు : ఇదిగో కమల ఉంటుందని చెప్పానా?

డబ్బా : నానడుగుతుంది కమల గురించి కాదు – ఉత్తరం గురించి. ఇదిగో మీ డబ్బు. నా ఉత్తరం నాకిచ్చీ.

కిష్టప్ప : వెధవ మళ్ళీ అదే మాటంటాడు. నా జేబులో ఉంది ఇదే.. తీసుకో.. నా డబ్బులు నాకిచ్చేసెయ్.. లేకపోతే కమలను (చేయి పట్టుకున్నాడు)

కమల : చెయ్యోదులు

కిష్టప్ప : ఏవిటే పెడపరం – నన్నెవరనుకున్నావే.

కమల : ఎవరైతే నాకేటి? నా జోలికి వచ్చేరంటే మర్యాదగుండదు.

డబ్బా : ఒసేయ్ కమలా?

కమల : మాటలు మర్యాదగా రానీ...

డబ్బా : నువు రాసిన ఉత్తరముంది జాగర్త.

కమల : నాను ఉత్తరం రాయడమేట్రా? ఎవలికి రాసాను.

డబ్బా : నాయుడికి

కమల : ఏది?

డబ్బా : (పంతులు వైపు చూస్తూ) చూపించు ... చూపించు.

కిష్టప్ప : ఏవిటి చూపిస్తానురా నీ పిండాకూడు– చూసావుగా .. ఉత్తరం బదులు తెల్లకాగితం ఉంది.

డబ్బా : చూడు పంతులూ! నాను కనబడతున్నంత మంచోడ్నికాను. మర్యాదగా ఆ ఉత్తరం ఎక్కడ దాచావో చెప్పు.

కిష్టప్ప : చెప్తే అర్థం చేసుకోవేమిరా! నీ దగ్గర నుండి తీసుకున్న ఆ ఉత్తరం చొక్కా జేబులో పెట్టి, ఆ చొక్కా ఇదిగో ఈ సిలక్కొయ్యకే తగిలించాను. చొక్కా మా బామ్మ చాకలోడికి వేసిందంటే చాకిరేవుకు పరిగెత్తాను. వెధవది ఏనాడూ ఆ ముళ్ళ కంపల్లోకి, ఆ రాళ్ళ గుట్టల్లోకి వెళ్ళలేదు. అలాంటిది కాళ్ళకి చెప్పులైనా వేసుకోలేదు. చూసావుగా చొక్కాను ఉడకబెట్టేసి ఉంటే అక్షరాలు కరిగిపోయా యనుకోవచ్చు. అదీ లేదుగా.. కాగితం కాగితం లాగే ఉంది. అక్షరాలు మాత్రం మాయమైపోయాయి.

డబ్బా : ఎన్నిసార్లు సూపిస్తావా తెల్లకాయితాన్ని.

కిష్టప్ప : ఏం చేయమంటావ్? నాదగ్గరుంది ఇదే. ఇది తీసుకొని నా డబ్బు నాకిచ్చెయ్!

డబ్బా : పంతులు నీకు మతిగానీ పోయిందేటి? నేనీకిచ్చిందేటి. నువ్వు నాకిస్తున్నదేటి?

కిష్టప్ప : ఒరేయ్ ఇదంతా అనవసరం. నేన్నీకు అయిదువేలిచ్చానా లేదా!

డబ్బా : ఇచ్చావు.

కిష్టప్ప : అందుకు ఫలితం నేను పొందానా?

డబ్బా : నాకనవసరం. ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఎంజాయిమెంట్ రైట్స్ అన్నావు కదా! నేను ట్రాన్స్‌ఫర్ చేసీసాను. ఇక నువు ఎంజాయ్‌మెంటు చేసావా లేదా అన్నది నాకు సంబంధం లేదు.

కిష్టప్ప : (కమలతో) ఇదిగో నీ ఎదురుగే వాడంత స్పష్టంగా చెప్పాడు కాబట్టి, ఇక నేనెంత మాత్రం సహించను. నువ్వు ఊహూ...హు...హూ అనడానికి లేదు. పద పాకలోకి...(చెయ్యి పట్టుకొని లాగాడు) చెప్పు తెగుతాది – అన్నమాటలు వినపడ్డాయి. ... ఏవిటే నువ్వేనా ఇంత మాటన్నది (లో నుండి బామ్మ వచ్చింది).

బామ్మ : నేనురా అన్నాను... ఇప్పుడు కమల కూడా అంటాది. ఊఁ!...

కమల : చెయ్యొదలకపోతే చెప్పుతెగుతాది.

కిష్టప్ప : (చెయ్యి వదిలేసాడు) బామ్మ!

బామ్మ : కమలా! నీకు ఇంత అందాన్నిచ్చిన దేవుడు, దాన్ని కాపాడుకొనే ధైర్యాన్నివ్వడా? ఇచ్చాడు. కానీ నువు ఇంతవరకు ఆ ధైర్యాన్ని చూపించలేదు.

కమల : ధైర్యం చూపించాలనే అనుకుంటాను... కానీ ఎనకాముందూ ఎవులున్నారమ్మ!

బామ్మ : ధైర్యమనేది నీకు సంబంధించిన విషయం... వెనకా ముందూ మనుషులెందుకు చెప్పు!

కమల : ఏటిసెప్పమంటావమ్మ! ఒక్కోడు ఎలాగుంటాడో తెలుసునా తల్లీ! ఏటున్నాయని అడుగుతాడు... ఏటి కావాలో సెప్పడు... కొట్టంతా సూత్తాడు... నన్నుజూసి లొట్టలేత్తాడు... వంకాయలెంతంటాడు... వంకరసూపుల్తోటి ఒళ్ళంతా తడువుతాడు.... కొంతమంది వస్తారు! కొనీది ఉండదు, సచ్చీదీ వుండదు గంటలు గంటలు అలాగా కూకుండిపోతారు... ఏట్రా ఎల్లండిరా గండల్లారా! అని గసురుకుంటే

– అప్పటికప్పుడు జేబులో సెయ్యేట్టి అయితే ఒక అగ్గిపెట్టియ్యంటాడు... తాగినోడు, తిరిగినోడు, పనిలేనోడు, పనికిమాలినోడు... అందరికీ లోకువేఁ! ఒక్కోపాలి అనిపిస్తాది. ఎందుకీ జన్మ... సుబ్బరంగా ఏదోఒకటి తాగిసి సచ్చిపోదునా అనీ... అయితేటి... గుంటడుండిపోనాడు.... నాపేనం తీసుకోగలను గానీ... ఆడిపేనం తీసీలేనుగదా! అంచేతేనమ్మ! నాయుడికి లొంగిపోనాను.... నెలకొక్కపాలి వచ్చానా, అతగానొచ్చి ఎల్లున్నా కానుండి పోకిరి ఎదవల గోల తగ్గిపోనాది.

బామ్మ : నాయుడమ్మ గోల ఎక్కువైంది.

కమల : నీకు తెలంది ఏటుంది బామ్మ! నాయుడమ్మ తిడితే తిట్టిందిలే, తంతే తన్నిందిలే అని భరిస్తాన్నానుగానీ, ఈ బెంజారెదవల బాధపడలేమమ్మా!

బామ్మ : ఈ వెధవల బాధ లేకపోతే ఈ పనిమానేస్తావా!

కమల : నీ పాదాల సాచ్చిగా!

బామ్మ : (మూలనున్న వ్యాసపీఠం తీసి కమల చేతికిచ్చింది) ఇదిగో అది నీ అరుగుమీద పెట్టు. రేపటినుండి నీ అరుగుమీదే పురాణం చదువుతూ కూర్చుంటాను. ఎవడొచ్చి అల్లరి చేస్తాడో చూస్తాను. వెళ్ళు! (కమల వెళ్ళిపోయింది – డబ్బాగాడు జారుకోబోతున్నాడు) నువ్వెక్కడికి.

డబ్బా : అదే బామ్మ! అసలా రోజు ఏమైందంటే....

బామ్మ : నువ్విప్పుడో కొత్త కథ అల్లక్కర్లేదు గానీ... ఇదిగో మీ ఇద్దరి మధ్య ట్రాన్స్‌ఫర్ అయిన ఎంజాయిమెంట్ రైట్స్. (ఉత్తరాన్ని తీసి నిలువుగా చించేసింది. ఇద్దరూ తలలు దాచుకున్నారు). ఒరేయ్! ఆడది ఆనందంగా ఉన్నప్పుడు ఆమెలో అన్నకు ఒక చెల్లి కనబడుతుంది. తండ్రికి ఒక కూతురు కనబడుతుంది. భర్తకు ఒక భార్య కనబడుతుంది. కానీ అదే ఆడది ఆపదలో ఉంటే ఎవడికైనా అమ్మే కనిపించాలిరా. అప్పుడేరా మనది మానవ జన్మ అనిపించుకుంటుంది. ఈ మాటలు పశువులు విన్నా పరశించిపోయి ఆచరిస్తాయి. ఇంతకన్నా ఎక్కువ చెప్పక్కర్లేదనుకుంటాను....

(కమలతో) ...నువ్వెళ్ళమ్మా! (కమల పిల్లాడిని తీసుకొని వెళ్ళిపోయింది)

కిష్టప్ప : వేదాల్లోను, ఉపనిషత్తుల్లోను ఇంత కన్న ఎక్కువగానే ఘోషించారు. అదొక ఘోష. దీందొక శోష. (ఒక ప్రక్కకు వెళ్ళిపోయాడు)

డబ్బా : నాకేటి మంచిగ బతకాలని ఉండదనా? అచ్చే! పరిస్థితులనుకూలిస్తే మంచి పనులు సెయ్యడంలోన గిన్నీసు బుక్కు ఎక్కిపోనా? కానీ లాభమేటి. బామ్మ మాటకన్న బతుకుబాట బలీయమైంది. సూద్దాం ఎండ్ల మల్లేసు. ఏదారి సూపుతాడో – (మరో ప్రక్క వెళ్ళిపోయాడు – వీళ్ళిద్దరూ వెళ్ళిపోయాక బయటి నుండి చాలా గాబరాగా రాజిగాడు వచ్చాడు.)

రాజి : బామ్మగోరు

బామ్మ : ఎవర్రా అది!

రాజి : నేనమ్మా మంగలి రాజిగాడ్ని

బామ్మ : ఏవిట్రా ఇలావచ్చావు. ఆ చంకలోని పొది బయట పెట్టేసి లోనకు రా!

రాజి : ఇది పొది కాదమ్మా ! పుస్తకం (తీసి చూపించాడు)

బామ్మ : పుస్తకమా?

రాజి : అవునమ్మా ! నాను సదువుకుంటాను. నాకు సదువుసెప్పండమ్మా ! (కన్నీరు పెట్టుకొని కాళ్ళమీద పడ్డాడు)

బామ్మ : ఒరే రాజియ్య లే... లే... ఏంటిది... లే

రాజి : మీ గురించి మా అయ్య సెప్పాడమ్మా! నువు బాగా సదువు సెబుతావని, మా బోటోళ్ళని అబిమానంగా సూత్తావని. ఎలాగైనా నాకు చదువు సెప్పాలమ్మా. సచ్చి మీ కడుపున పుడతాను.

బామ్మ : మళ్ళీ పుట్టడమెందుకురా. నువు నా కొడుకువి కావేటి? ఒరే ఒకప్పుడు బ్రాహ్మణుడంటే సమాజానికీ తండ్రిగా నిలబడి దాన్ని ముందుకు నడిపేవాడు. ఆ కులంలో పుట్టిన దాన్ని, నీకే కాదురా ఈ ఊరు ఊరికే తల్లిని. చెప్పరా నువ్వెందుకు చదువు నేర్చుకోవాలను కుంటున్నావు.

రాజి : (తన వేదనంతా చెప్పాడు ఆంగికంలో)

బామ్మ : ఒరేయ్ రాజియ్యా! నిజమో అబద్ధమో తెలియదు గానీ ఒక మంగలిని బ్రాహ్మణునిగా చెయ్యమంటే తెనాలి రామకృష్ణ వేళాకోళమాడాట్ట. కానీ ఈ రోజు నేను శపథం చేస్తున్నాను. నీకు అష్టాదశ పురాణాలు, పంచకావ్యాలు చెబుతాను.

రాజి : నీ దయమ్మా

బామ్మ : గీతను బోధిస్తాను.

రాజి : కల్లుగీతమ్మా

బామ్మ : భగవద్గీతరా!

రాజి : బోధించమ్మా !

బామ్మ : ఇక నుండి నువు నాయీ బ్రాహ్మణుడివి కాదు –ఒక నవ్య బ్రాహ్మణునిగా మల్చి నిన్ను ఈ ఊరికి అప్పగిస్తాను. కానీ పట్టు వదలకుండా రోజూ వచ్చి చదువుతుండు. ప్రారంభించు.... ఓం....

రాజి : రాజిగాడి గొంతు ఓంకారంతో ప్రతిధ్వనించింది.

**(లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్)**

## 6వ సన్నివేశం

(శివయ్య సెంటర్)

ఆ ఊరిపై అప్పుడే చీకటి వల విసిరినట్టుంది. వీధి దీపాలు, వెలిగితే వెలుగేమనకుంటుందో, వెలగకపోతే చీకటి ఎక్కడ చిన్నబోతుందోనన్న సందిగ్ధంలో వెలిగి ఆరి వెలుగుతున్నాయి. నాయుడు కంబారి అసిరిగాడు ఒక కావిడిలో ఖాళీ బిందెలుతో వచ్చాడు. భుజం మీద కావిడి క్రిందకు దించి నోట్లో చుట్ట పెట్టుకొని వెలిగించాడు. గట్టిగా పొగ గుండెలనిండా పీల్చి వదిలాడు. సిలకట్టు చెంగు సర్దుకుంటూ వెళ్ళి ఆప్రక్కనున్న తుప్పల చాటుకెళ్ళి మరుగుకి కూచ్చున్నాడు. మరో పక్కనుండి రాజిగాడు ఒక చేతిలో పలక, బలపం మరో రెండు పుస్తకాలు పట్టుకొని బామ్మ ఇంటి వైపు వెళ్ళాడు. ఆ దగ్గరకెళ్తే తప్పా అలా చదువుకుంటున్నది రాజిగాడని గుర్తు పట్టలేరు. ఈలోగా మరో ప్రక్క నుండి అడ్డపొగది అక్కడకొచ్చి క్రిందపడి ఉన్న కావిడ, బిందెలు చూసి, ఒక బిందె తీసి ప్రక్కనున్న తుప్పల్లో దాక్కుంది. అసిరిగాడు తిరిగొచ్చి బిందెలేకపోవడం చూసి గతుక్కుమన్నాడు.

అసిరి : ఓరెవుఁలా! నా బింది తీసింది... అది నా బింది కాదురొరే. నాయుడోరిది... నాను నాయుడోరి కంబార్ని... బిందెపోయిందని నాయుడమ్మకి సెప్పినానంటే ముందు నాపేనాలు తీసేత్తాది. తర్వాత మీ ఇల్లమీద పడిపోద్ది.... బిందె దొరికే వరకు ఇళ్ళన్నీ గాలించేత్తాది.. ఊరంతా అగ్గెట్టించెయ్యనా బిందె దొరికే వరకు వొగ్గదు... ఒరే మీకు పున్నెముంటాది నా బింది నాకిచ్చేయ్యెండెహే....

అడ్డపొగ : (నవ్వుతూ బింది పట్టుకొని వస్తోంది) సేనా గొప్ప మొగోడండి నాయుడోరి కంబారి.

అసిరి : అడ్డపోగ దానా! నీ పనా ఇది.

అడ్డపోగ : హాసికానికైనా నాయుడోరి వస్తువుల మీద సెయ్యేసే దమ్ము ఎవలికున్నాది... అవుఁనా! నాను మైలు దూరంలో ఉన్నే నాసుట్ట

వాసన బట్టి సేప్పేత్తానన్నావు.. పక్కనే ఉన్నా పసిగట్ట లేకపోనావు.. నువ్వేమి మొగోడివిరా!

అసిరి : నామాట సెల్లించీ రాదేటి నానెలాటి మగోడినో తెలిసి పోతాది.

అడ్డపోగ : ఇదిగో ఇలాంటి ఇగటాలే వద్దు... పెళ్ళి కాక మునుపు నా మనునుకి నచ్చి నోడివి గాబట్టి ఈ మాత్రం సనువైన నీకిస్తున్నాను. నానేటి నీతి జాతి లేనిదాని అనుకున్నావేటి!... మంచి వయసులోన మొగుడ్ని వగ్గేసినాను.. కానీ ఎప్పుడైనా నీతి తప్పినట్టు ఎరుగుదువా!... మళ్ళొకపాలి ఇలాంటి ఊసెత్తినావంటే మట్టుగు నీ కంటికి గూడా కనబడను జాగర్త!

అసిరి : పోన్లే! పోన్లే! మళ్లెప్పుడులగ అనను

అడ్డపోగ : నాకు తెల్సురా! నువ్వా నాలాగ నికార్సయినోడివే! ఇదిగో... ఈ ఇరవై రూపాయిలిడికో...

అసిరి : నా కొద్దులే

అడ్డపోగ : ఏవిరాఁ!

అసిరి : పౌరుషం నీకేనేటి నాకులేదా!... నీ మొగుడ్ని ఏల ఒగ్గేసి నావని ఎన్నాళ్ళ బట్టి అడుగుతన్నాను... ఎప్పుడూ సెప్పవు... ఈ పొద్దు సెబితేనే నువ్విచ్చిన డబ్బులు తీసుకుంతాను.

అద్దపోగ : అయితే సెబుతాను ఇను. నువ్వెరగవా! నా పెళ్ళయ్యినాటికి నానెంత పిటపిట లాడు తుండే దాన్నో.

అసిరి : అబ్బా.

అద్దపోగ : నాకు సిన్నప్పుడు నుండే సుట్ట అలవాటు.

అసిరి : ఆ వాసనకే నువ్వంటే ఇష్టపడ్డాను.

అద్దపోగ : ఆ పొద్దుటి ఊసు తల్సుకుంటుంటే ఇప్పటికీ సిగ్గేస్తంది... ఇప్పుడు కాదులే మళ్ళా దపా సెబుతాను.

అసిరి : అయితే ఇంద.. నువు సెప్పినప్పుడే తీసుకుంటానులే (డబ్బులు తిరిగి ఇవ్వబోయాడు)

అడ్డపొగ : ఆపొద్దు మా తొలిరాత్రి కార్యం.... నన్ను గదిలో ఎట్టారు.. ఇంక నా పెనిమిటి రాలే ఆ మనిషి కోసం ఎదురు సూత్తూ... కూకున్నాను. అప్పటికే సుట్టతాగి అరగంటైపోనాది. నాలిక పీకీత్తంది. ఏటి సేస్తాను. ఆగలేకపోనాను. సుట్ట ముట్టించి కొంగుఅడ్డమెట్టుకుని రెండు బుక్కలు పీల్చేసినాను. అదిగో సరిగ్గ అప్పుడే నా పెనిమిటి లోపలికొచ్చినాడు. నా కొప్పులెట్టాలనుకుని ఇన్ని మల్లిపూవ్వులట్టుకుని వచ్చినాడు మారాజు కొడుకు. కంటబడిపోనాను. సుట్టసూసీసినాడు.

అసిరి : ఏటన్నాడు!

అడ్డపొగ : దేవుడులాటోడు.. ఏటంటాడు. నోట్లో సుట్టుండగా, కొప్పులో పువ్వులెట్టనన్నాడు. ఎలాగ దొరికిపోనాను. తెలిసిపోయింది. ఇక సెప్పక బయ్యమేటి? మనసులోని మాట సెప్పేసినాను. నువ్వెట్టు మాను, నోట్లో సుట్టమాత్రం తీయ్యనన్నాను. తెచ్చినపూలు తెచ్చినట్టే పొట్టుకొని అవతలికెల్లిపోనాడు. అత్తారింటికెళ్ళిన దాన్ని ఎల్లినట్టే కన్నోరింటికి ఎలిపొచ్చినాను. అప్పటినుండి సుట్టే మొగుడనుకున్నాను. సుట్టే సంసారమనుకున్నాను. సుట్ట లేకుండా బతకలేకపోతన్నాను. సుట్టతోటే సవ్వాలనుకుంటున్నాను.

అసిరి : ఎంత గొప్పదానివే అప్పల నర్సమ్మ!

అడ్డపొగ : అబ్బ! నువ్వొకడివేను రా... ఆ పేరుతో పిలుస్తావు. అందుకే నువ్వంటే ఇష్టం రా!

అసిరి : కానీ ఏటి లాభం... ముట్టనివ్వవు... అంటనివ్వవు. ఈ మాటలకేగాని మంగలి రాజిగాడేమన్న నీకంటపడ్డాడేటి.

అడ్డపొగ : నాయుడోరి మంగలోడేనా. ఆడుకనపడక పోడమేటి

అసిరి : ఏటి చెప్పమంటావు మా పత్రాకులు. నెత్రోజులు బట్టి ఆడి అజా పజా లేదు. ఆడి పిలకట్టుకుని ఈడ్సుకురమ్మంటది నాయుడమ్మ. కనబడితేకద ఈడ్సుకురాడాకి.

(బయటినుండి కావిడిలో నిండుబిందెలు మోసుకొస్తున్న బారికోడు అడుగులు నిట్టూర్పులు విన్పించాయి)

అడ్డపొగ : అదిగో! బారికోడు వస్తున్నాడు. ఆడు సూత్తే మనిద్దరి మీద నాయుడమ్మకి తగిలించేత్తడు. ఆడెల్లాక వత్తాను. (రాజిగాడు వెళ్ళిన బామ్మ ఇంటి వైపు వెళ్ళింది. బారికోడు నీళ్ళబిందెల్తో కావిడి మోసుకొచ్చాడు.)

అసిరి : ఈ దపా ఇంత ఆలస్యమైపోనాదేటి. నానొచ్చి ఎంతసేపయిందను కుంటున్నావు

బారికోడు : బాగుందైతే! నానేటి ఆటలాడుతున్నాను. నువ్వేమో సదును రోడ్డుమీద లైట్లెలుగులోన గబగబ నడిసి నాయుడింటికెల్లిపోతావు. నానేమో గతకల్లోన, సీకట్లోన తడుముకుంటూ ఎల్లి సెరువుకానుండి నీళ్ళు మోసుకురావాల. ఒక రోజు ఇటుకాసి నాకిచ్చేసి అటు కాసి నువ్వెల్రాదేటి.

అసిరి : నువ్వన్నది మరీ బాగుంది! ఈ పని పంపకం సేసింది నానా? కంబార్లం అయినతర్వాత బుగతలు సెప్పింది సేస్తామా. మనమిష్టమెచ్చినట్టు సేస్తామా.

బారికోడు : సెయ్యి నాయిన సెయ్యి! నోట్లోన మాటలున్నోడివి. నాయుడింట్లో నీమాట సెల్లుబాటు అవుతది. కానీ! కానీ!

అసిరి : అయితే యేట్రా నీ ఉద్దేశం! నా మాటలిని నాయుడు నాయుడమ్మ నిన్ను కష్టపెడుతన్నార్రా.

బారికోడు : అన్నిమాటలు నానుఅనలేదు. నీకోదండం. ఆళ్ళకు తగిలించీకు. (ఖాలీ బిందెల కావిడ బుజాన వేసుకుని ఉసూరుమంటూ వెళ్ళిపోయాడు. అతను వెళ్ళగానే గబుక్కున అక్కడకు వచ్చింది అడ్డపొగది).

అడ్డపొగ : ఒరేఁ అసిరిగా!

అసిరి : ఏమి!

అడ్డపొగ : ఆ రాజిగాడు బామ్మ బడిలో సదువుతున్నాడ్రా!

అసిరి : అమ్మిడియమ్మ! సదువుతున్నడా?

అడ్డపొగ : అవును

అసిరి : అడ్నినాయుడింటికి తొలుకెల్తాను పద.

అడ్డపొగ : ఆడిసంగతి తర్వాత సూసుకోరా. ముందాకావిడి నీళ్ళు నా ఇంట్లో పోసీద్దువుకాని రా.

అసిరి : ఇదిగో ఓ పనిచెయ్యి. ఒక బిందెడు నీళ్ళట్టుకుని ఎల్లిపో... రాజిగాడితో మాట్లాడి నానొచ్చి కాలీ బింది తీసుకుంటా.

అడ్డపొగ : ముండ ఊరికి ఎంత కరువొచ్చింది నాయిన! ఒక బింది చాలవు. అంత దూరం ఎల్లలేను. ఒకపన్చేయ్. రెండుబిందెలు నెత్తిమీద ఎట్టేయ్. ఒట్టుకెల్లిపోతాను. నువ్వొచ్చేసరికి కాలిచేసి వుంచుతాను.

అసిరి : సరే పట్టు! (రెండు బిందెలు ఒకదానిమీదొకటి పెట్టి ఆమె నెత్తిమీద పెట్టాడు.)

(రాజిగాడి దగ్గరకు వెళ్ళున్నాడు అసిరిగాడు – బామ్మ ఇంటి ముందు పాఠాలు చెబుతోంది. ఆమె ముందు కొంతమంది కూర్చొని వున్నారు. వాళ్ళలో రాజిగాడున్నాడు)

బామ్మ : ఇది మీకెంత వరకు అర్థమౌతుందో చెప్పలేనుగానీ, మీరంతా తెలుసుకోవడం చాలా అవసరం.

అందరు : సెప్పండి! సెప్పండి!

బామ్మ : ఈ భూమిపుట్టి నాలుగువందల అరవైకోట్ల సంవత్సరాలైంది... ఎంత?

అందరు : నాలుగువందల అరవై సంవత్సరాలు

బామ్మ : నాలుగువందల అరవై కోట్ల సంవత్సరాలు. ప్రతి పది కోట్ల సంవత్సరాలకి ఒక సంవత్సరం అనుకుంటే ఇప్పుడు భూమి వయసెంత?

రాజి : నలబైఆరు

బామ్మ : అబ్బో! బాగానే గ్రహిస్తున్నవే!.... ఆ లెఖ్ఖన 42 ఏళ్ళ వయస్సులో జీవం ఏర్పడింది. 44 ఏళ్ళ వయస్సులో రాక్షసబల్లులు పుట్టాయి. ఒక నెల కిందటే కోతి నుండి మనిషి పుట్టాడు. ఆది మానవుడు అనాగరికంగా సంచరించాడు. ఏది దొరికితే అదితిన్నాడు. వాననుండి, ఎండనుండి, రక్షణలేకుండా బ్రతికాడు.

రాజి : ఒహో!

బామ్మ : పోయినవారమే ఆధునిక మానవుడు ఆవిర్భవించాడు. నాగరికత నేర్చుకున్నాడు – ప్రకృతిమీద ఆదిపత్యం సంపాయించాడు. సరిగ్గా ఒక గంట క్రితమే మనిషి వ్యవసాయం కనిపెట్టాడు. సంచార జీవితం మానేసి, స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. తనకు కావలసింది పండించుకుని తినడం నేర్చుకున్నాడు. ఒక్క నిమిషం క్రితమే పారిశ్రామిక విప్లవం వచ్చింది సుఖమయ జీవితానికి అలవాటుపడ్డాడు – వేగం పెరిగింది, నీటిమీద, నేలమీద, ఆఖరికి గాలిలోకూడ వాహనాలు నడుపుతున్నాడు. భూమిని స్వర్గంగా మార్చుకున్నాడు. అయితే ఈ టైమ్‌లోనే భూమిని ఓ చెత్తబుట్టలా చేశాడు.

రాజి : నువ్వ సెప్పింది సేనా చిత్రంగా వుంది బామ్మ! ఈ లెక్కన ఇప్పుడు నా వయస్సు ఎన్నికోట్లు బామ్మ?

బామ్మ : ఎన్ని కోట్లా!

రాజి : అవును బామ్మ! నాదేకాదు మా వాళ్ళ అందరి వయస్సు కొన్ని కోట్లల్లో వుంటది.

బామ్మ : ఏంట్రా నువ్వు చెబుతున్నది నాకర్ధంకావటం లేద.

రాజి : పోయినోరమే మనిసి నాగరికత నేర్సినాడన్నావు. అంటే ప్రపంచలోని అందరూ నాగరికత నేర్సి కొన్ని వందల సంవత్సరాలైంది. కాని మాకుమాత్రం అది అంటలేదు. ఆది మానవుడు ఏది దొరికితే అది తిన్నాడన్నావు. మాము సేత్తున్నపని అదే. మాకు ఎండనుండి వాననుండి రచ్చణ లేదు. ఆడికి లేని ఎట్టిసేకర మానెత్తినుంది. తెలివైన మనిసి ప్రకృతిమీద అధికారం సంపాయించాడా? ఆ కోవలోకి మావువొస్తామమ్మా! ఎవసాయం ఎప్పుడమ్మా ఆరంభించింది? మరి మాకులాల కెవలికి ఎవసాయం మాటేతెల్దు. బతుకు సుకమయం సేసుకున్నాడా! సుకమన్నమాట మాకులాల వారికొచ్చీసరికి ఇంకా ఎన్ని యుగాలు పడతదో! ఏటమ్మేట మ్మేటమ్మా! మనిసి నేలమీద, నీటిమీద, గాలిలోన వాహనాలు నడుపుతున్నాడా!... అలగ నడుపుతున్నోడు ఏ కులపోడో, ఏ తెగోడో, ఏ వర్గపోడో ఒక్క దపా లెక్కలు సెప్పీస్తే సచ్చి నీ కడుపున పుట్టీవోడ్ని. ఈ భూమిని స్వర్గంగా మార్సుకున్నాడా? దీనమ్మ ముండమొయ్యా! సొరగమంటే ఎలగుంటదో

తెలిస్తేకదా. భూమిని ఎలాటి సొర్గంగా మార్సినాడో అర్ధమవ్వడానికి ఆకల్తో నకనకలాడే కడుపమ్మా సొర్గమంటే, సాలీసాలని గుడ్డటమ్మా సొర్గమంటే, కారిపోతున్న ఇల్లమ్మా సొర్గమంటే. ఈ భూమ్మీద ఏ సుకాలున్నాయో, ఏ సొర్గాలున్నాయో, అవి అనుబవించడానికి ఏటిసెయ్యాలో మాకేటి తెల్దని, మీకు తెల్దేటమ్మా. ఈ లెక్కన మావుఁ మాలాంటి కులపోలం ఆది మానవులమో! అంతకుముందున్న జంతువులమో! పసువులమో! పచ్చులమో! పురుగులమో సెప్పగలవేటమ్మా. ఈ పొద్దు మాసెడ్డ బాద పెట్టేసినవమ్మా! మనుసంతా కెలికీసినావమ్మా! అమ్మా! బుఱ్ఱలోకి గేనమొస్తే గుండెలోకి బాద ఎగదన్నుకొస్తదేటమ్మా! అమ్మా! అమ్మా! మంగలికత్తికి మాటలొచ్చినట్టు ఏదో వాగేసినాను... ఏటనుకోకమ్మా! ఏటనుకోకమ్మా! (కళ్ళు తుడుచుకుంటూ వెళ్లిపోయాడు. అలా వెళ్తున్న రాజిగాడికి అసిరిగాడు ఎదురయ్యాడు)

అసిరి : ఒరేయ్ రాజిగా!

రాజి : (ఆగాడు)

అసిరి : నాయుడు నిన్ను తీసుకురమ్మన్నాడు... రా! ఎల్దాం (చెయ్యిపట్టుకుని లాగాడు)

రాజిగాడు : (చాలా సీరియస్‌గా చూసి) చెయ్యొదులు

అసిరి : (ఆ చూపుకి ఖంగుతిన్నాడు) రావా!

రాజిగాడు : రాను

అసిరి : నాయుడు అడిగితే నువ్వేటి సేస్తొన్నావని సెప్పాల!

రాజిగాడు : బామ్మ బడిలో అచ్చరాలు దిద్దుతున్నాని సెప్పు. ఇస్కూలు పిల్లలకాడ గుణింతాలు నేర్పుతున్నాని సెప్పు. కాలేజి పిల్లలకాడ లెక్కలు సెప్పించుకుంటున్నాని సెప్పు. మొత్తంమీద పెపంచాన్ని సదువుతున్నానని సెప్పు. (అదే ధ్యాసలో వెళ్లిపోయాడు. అసిరిగాడు నిర్ఘాంతపోయి నిల్చుండిపోయాడు)

**(లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్)**

## 7వ సన్నివేశం

(నాయుడి గారి ఇల్లు. అదొక కోటలా ఉంది. ఆ కోట వరండాలో నాయుడికి గెడ్డం గీసి, ఒళ్ళంతా మర్ధన చెయ్యడానికి ఏర్పాటులు జరుగుతున్నాయి. ఇద్దరు కంబార్లు గుండిగల్లో నీళ్ళు పోయడం, స్నానానికి సంబంధించిన సరంజామా సర్దడంలో తలమునకలుగా ఉన్నారు. నాయుడి భార్య మంగమ్మతో ఒకామె మాట్లాడుతూ నోట్లో చుట్టపెట్టుకొని అడ్డపొగను గుప్పు, గుప్పున ఊదుతోంది)

మంగమ్మ : ఇన్నాళ్ళబట్టి నువ్వు అగుపడకపోయాసరికి ఒక బెంగలాగై పోయిందంతే నమ్ము.

అడ్డ : (సుట్టనోట్లో ఉంచుకొని) నాకూ అలాగే ఉంది. నీతోటి ఊసులాడక పోయాసరికి నాలిక పిడసకట్టుకు పోయినట్టయింది వొదినా. ఈ పొద్దు ఊసులు సెప్పీ, సెప్పీ నానైనా తుటాయించిపోవాల. లేదూ ఇనిఇని నువైనా తిరగబడిపోవాల.

మంగమ్మ : అన్ని ఉన్నాయేటే.

అడ్డ : మల్ల.

మంగమ్మ : ఎన్నైనాసెప్పు ... నువు ఆ నాయారలు కమల గురించి సరిగ్గా సెప్పడం లేదే.

(వీళ్ళిలా మాట్లాడుతుండగా బారికోడు బయట నుండి ఒక నీళ్ళ కేను భజంమీద పెట్టుకొని మోసుకొని వచ్చాడు. దాన్ని తీసుకొని లోనకెళ్తున్నాడు అసిరిగాడు.)

అడ్డ : నాను సెప్తున్నది నిజం – నమ్ము. నా నోటిలోని సుట్టెంత నిజమో, నా మాటంత నిజమొదినా!

మంగమ్మ : అయితే సెప్పు! సెప్పు.

బారికోడు : అమ్మా! నీళ్ళ కేనుకి డబ్బులిమ్మంతన్నారు.

మంగమ్మ : (విన్నాది కానీ వినిపించనట్టే ఉన్నాది)

అడ్డ : (చుట్ట మళ్ళా పెట్టుకుంది) మాయన్నను అనుకున్నోళ్ళది ప్యాపం వొ్యాదినా.

మంగమ్మ : సుట్టతీసి సెప్పరాదేటి?

బారికోడు : అమ్మా డబ్బులు.

మంగమ్మ : (నోర్మూసుకొని ఉండు అన్నట్టు చూసింది బారికోడ్ని) నువ్వు సెప్పు.

అడ్డ : (చుట్ట తీసింది. కానీ అంతలోనే మళ్ళీ పెట్టుకోబోయింది)

మంగమ్మ : (చుట్ట ఉన్నచేయి నోటివరకెళ్ళకుండా అడ్డగించి) సెప్పు..... సెప్పు.

అడ్డ : ఏటి సెప్పుతానొదినా! ఆ కమల ఇప్పుడెవుడ్ని ఇంటికాసి రానివ్వడంలేదు.

మంగమ్మ : మీ అన్నా?

అడ్డ : నీమీదొట్టు ... ఏటయ్యిందో గానీ అటు కాసి మా అన్న రావడంలేదంటే నమ్ము. (రెండు బుక్కలు పీల్చి చుట్ట తీసేసింది).

మంగమ్మ : ఇందల అబద్దం లేదు కదా!

అడ్డ : కళ్ళెదుట మనిసి కనిపిస్తుంట అబద్ధమని అంటావేటి వొదినా?

మంగమ్మ : ఆ మనిసెప్పుడు కనిపించదులే – తొంగుంటే మంచండు – తినబోతే కంచండు –

అడ్డ : (చుట్టలోనకెళ్ళింది) కానీ.. ఏటో ఉన్నట్టుండి మారిపోనాడు.

మంగమ్మ : సుట్ట తియ్,.

అడ్డ : ఎంత మారిపోనాడు? కమల రానివ్వడం మానేసిన కానుండి గెడ్డంపెంచేసి, పిచ్చోడి లాగ అయిపోనాడు... ఆ మాత్రం కానుకోలేవేటి వొదినా.

మంగమ్మ : ఎహ్! గెడ్డం మాసింది రాజిగాడు రాక.

అడ్డ : పల్లకో వొదినా! నువ్వొక సత్తికాలం మనిషివి. నూతుల్లో నీరు బాగలేవని కేనుతోటి తెప్పించుకోవడం లేదా? మంగలోడు రాకపోతే గెడ్డాలు పెంచేత్తారా? బ్లేడుతోని గీసుకుంటారుగానీ.

మంగమ్మ : (కొత్త ఆలోచన మనిషిని నిలవనియ్యడం లేదు). నీకీ ఆలోచనే రాలేదు సెప్మా! మంగలోడి పేరుజెప్పి.... ఒలే నువ్వెళ్ళు .... నాకు పనుంది.

అడ్డ : ఒక సోలడు బియ్యం సెంగునెయ్యరాదా?

నాయుడు : (లోనుండి) రాజిగాడొచ్చినాడురా !

మంగమ్మ : అదిగో మీయన్న పిలస్తన్నాడు – నానెల్తాను. ఏటనుకోకు –మల్ల దపా వచ్చినప్పుడు కుంచెడు దాన్యమిత్తాను. దంచుకొని, ఇంటిల్లపాది తిందురుగానీ – పాదులకి బీరకాయలు ఇరగకాసినాయి – ఓ నాలుగిస్తాను, పచ్చడిలాగ సేసుకుందువు గానీ– అప్పటికి పెసరకల్లం కూడా అయిపోతాది – వడినిండా పెసలేసిత్తాను– పెసలు ఎందలేసుకున్నా రుసిగా వుంటాయి. ఆ పొద్దుటికి ఇంట్ల ఉల్లిపాయలుంటే ఉల్లిపాయలు, మిరపకాయలుంటే మిరపకాయలు, ఇదిగో రెండు సేతులనిండా తీసి ఇత్తాను, అలగేనా! నానెల్తాను మరి.

అసిరి : అమ్మా! మేగమెత్తింది – సెనక్కాయలు సంచులకు ఎత్తమంటావేటి?

మంగమ్మ : (ఒళ్ళుమండి) సెనక్కాయలున్నాయని నాకు తెల్సులే నువ్వెళ్ళు.

అడ్డపొగ : (చుట్టతీసి నేలకేసి కొట్టింది) మాగొప్ప దానవు. నోట్లోనే బూర్లువండీసావు. దార బోసేస్తది దర్మాత్మురాలు. ఊళ్ళోని ఊసులు, దీని మొగుడు తిరుగుళ్ళు అన్నీ సెప్పిత్తే, ఇది ఆడి బొడ్డొట్టుకొని ఊడబొడిసేస్తాది. ఒడిలో సోలడు బియ్యామెయ్యమంటే మట్టుగు ఎయ్యదు. (వెళ్ళబోతున్న దాన్ని సెనక్కాయలిస్తాను అటుపక్కనుండి రమ్మని సైగచేశాడు అసిరిగాడు. డబ్బాగాడు ఇంట్లో నుండి సెల్‌లో మాట్లాడుకుంటూ వచ్చాడు).

డబ్బా : మావా? నానిప్పుడు మా బావ ఇంట్లోనే ఉన్నాను. మంగలోడి మీద పీకల్దాకా ఉన్నాది. ఇదే అదును – నువ్వెలిపొచ్చి నావంటే – ఒక ఉరుము మనమీద ఉరిమినా పిడుగు అటు పడిపోతాది. మనం సేఫ్... మామ్మావ... నాకు మాత్రం ఏటీ తెలీనట్టే ... అం ఆ!..! హైదరాబాద్ సంగతి తెలీదు.... తెలిస్తే నన్ను ఈపాటికి అడిగీసేవోడు కదా! – కనబడ్డాను. మా బావ సూసినాడు, మాయప్పా సూసింది, కానీ ఇద్దర్లో ఎవ్వలీ ప్రెస్తావన తేలేదు. ఆ! ఆ! మాయప్ప! చొక్కారించడం

ఆరంభిస్తే చచ్చిపోయిందాకా ఆపదు! ఆం! ఆం! లేదు.. లేదు ఆళ్ళ పొలం దగ్గరి పొలం ఆళ్ళకి సెప్పకంట అమ్మేస్తాన్నామనే బాధ తప్పించి మరొకటి లేదు – నీకెందుకు నాన్జాసుకుంటునుకదా నువ్వెలిపొచ్చి! నువ్వు వచ్చిందాక నానెక్కడికి ఎళ్ళను... రా!రా! బేగిరా!

మంగమ్మ : (లో నుండి టీగ్లానుతో వచ్చి, డబ్బా గానితో) ఇందా! .. (బారికోడితో) ఏవిరా!

డబ్బా : (టీ గ్లాసు అందుకొని, వేడిగా ఉండటం వలన, పైమీద తువ్వాలు అరచేతిలో చుట్టుకొని దాని మీద టీగ్లాసు పెట్టుకొని త్రాగుతున్నాడు)

బారికోడు : నీళ్ళకి డబ్బులిమ్మంతందాయమ్మా! పైసలివ్వకపోతే ఈదపా కేనివ్వదట!

మంగమ్మ : ఏటి ఊరొదిలి ఎలిపోతాంరా! ఇలాటి పద్దుకుమాల్నొలి పెద్దరికానికే నీటికి కరువొచ్చింది. ఒరే తమ్ముడూ!

డబ్బా : అప్పా! నా దగ్గర డబ్బులెక్కడివి. ఇది ఉన్నా కర్చుబెట్టను నీకు తెల్సు.

మంగమ్మ : ఛీత్ నీకు డబ్బులడుగుతాను .... అన్నీ అమ్ముకుని బతుకతంది సూడూ! దాని నెంబరుందా!

డబ్బా : ఉందుంది... (గబగబా నెంబర్ డయల్ చేసి ఇచ్చాడు)

మంగమ్మ : (సెల్ తీసుకొని) ఇదిగో నేను మంగమ్మని... నాయుడి పెళ్ళాన్ని! కాదేటి నీకు వేలు బాకా? .. లచ్చలు బాకా? ఏటన్నిదపాలు డబ్బులివ్వండి .. డబ్బులివ్వండి అని తినేస్తన్నావ్. ఊరొదిలి ఎలిపోతామా మేము.. ఊరి నాయుడంటే అంత గౌరవం లేదా నీకు... బయ్యంలేదా నీకు .. మర్యాద లేదా నీకు.. మంచి లేదా నీకు..

(లో నుండి నాయుడొచ్చి సోఫాలో కూర్చున్నాడు) ఎంత ఇవ్వాలి నీకు సెప్పు....ఎంతా? మూడొందలు. మూడొందలకు ముఖం సూసినావు కావన్న మాట. మూడొందలెకరాల భూమి, వందెకరాల తోటలు, నాలుగు మేడలు, ఒక మిల్లు, ముప్పై గేమాల మీద పెద్దరికం – సుట్టు పక్కగేమాల్లోని పిల్లా పీచు అన్నీ వదులుకొని ఎలిపోయి నీ మూడొందలు ఎగ్గొట్టేస్తామా? .. కాదు మేమేమేటి కడుపు చేత బట్టుకొని ఈ ఊరొచ్చినాము?... తిండిలేకొచ్చినాము? తిప్పలకిలేకొచ్చినాము?

.. ఏటె మాకంట నవ్వు గొప్పని అంతరాలిపోతన్నావ్? అయిన నిన్ను అన లాబమేటిలే? .. నీలంటిదాని చేత కొట్టు ఎట్టించిన ఆ దేవుడ్ని అనాలి...... మరెక్కడా దొరకనట్టు నీ నీలే రుచీగా ఉంటాయని చప్పరిస్తన్నాం సూడూ... మాది .. మాది బుద్ధి తక్కువ.

(తపీమని కట్ చేసి ఫోను డబ్బా గాడి కిచ్చింది. మళ్ళీ తీసుకొని టపటమమని ఏదో నెంబరు నొక్కి.... మంగమ్మ మాట్లాడుతుండగా, నాయుడు జేబులోంచి మూడొందలు తీసి బారికోడికిచ్చి ఎల్లమన్నాడు – వాడెల్లిపోయాడు) – ఇదిగో కిష్టప్పపంతులు మా ఇంటి మంగలి మారాజు రాత్రి ఇస్కూలులోన సదువుతున్నాడట. రాత్రి మన కంబార్లు పట్టుకొని అడిగితే రానుగాక రాను పొమ్మన్నాడట. నువ్వొకపాలి ఆడింటికి సొయాన ఎల్లి వస్తాడో రాడో అడిగేసిరా.. ఏటీ .. ఆడింటికి నువ్వెల్లడమేటా... ఇలాటి పనులు సెయ్యక పోతే ఇకన బట్టి మా ఇంటికి రాకు.. (ఫోన్ ఆపేసి డబ్బాగాడి చేతిలో పడేసింది).

పిల్లి గుడ్డిదైతే ఎలకొచ్చి ముడ్డి మీద తన్నిందట– అలగుంది మన తిత్తవ .. నువు నిజంగా నామీద ఒట్టేసి సెప్పు... నువు గెడ్డం ఏల గీసుకోలేదు.

నాయుడు : ఒసే! నీకు తెల్దేటి?

మంగమ్మ : మాకు తెల్సింది సెప్పమని అడగడం లేదు. మాకు తెలీనిది సెప్పు.

డబ్బా : తెలీనిదా? అదొకటుందా? ఏటి బావా అది.

నాయుడు : అదేటో నువ్వే సెప్పు.

మంగమ్మ : ఒరే తమ్ముడు! డబ్బాగా! రాజిగాడి మీద వంక ఎడతన్నాడు గానీ. అదికాదురా! (ముక్కు చీదింది)

డబ్బా : మరేటప్పా! ఏటి బావా? పోనీ బావ అన్నట్టు నువ్వేసెప్పీగూడదా?

మంగమ్మ : మంగలోడు రాకపోతే బ్లేడుతో గీసుకోలేడా? అదేటది? ఇలాగుంటాదిరా?

డబ్బా : రేజర్!

మంగమ్మ : దాంతో చేసుకోలేడా?

డబ్బా : అవునిదీ నిజమే కదా బావా?

నాయుడు : చెప్పుతో కొడతాను నిన్ను.

డబ్బా : అది నిజం ఏలగవుద్ద అప్పా!

మంగమ్మ : ఆ కమల రానివ్వడం లేదని దాని మీద బెంగతో గెడ్డాలు మీసాలు పెంచీసాడు రా నాయనా!

నాయుడు : ఏయ్! నోర్ముయ్! ముయ్! ఎల్తే ఎలిపోతన్నాడని అరుపులు! మానేస్తే ఇలాటి ఏడుపులు – ఎలగ సచ్చీది. ఒరేయ్ డబ్బాగా!

డబ్బా : బావా!

నాయుడు : మంగలోడు రాకపోతే బ్లేడుతోనో, రేజర్తోనో గీసుకోవచ్చురా! అదీకాకపోతే ఊరు గొడ్డుబోయిందా మరొకడ్ని పిలిపించుకొని శు భ్రం చేయించుకుంటాం – కానీ ఇక్కడ ముక్యం అదికాదు. వాడెందుకు రావడం లేదో – పనుండా? ఒంట్లో బాగులేక? ఎక్కడికైనా ఎల్లాడా? ఊరి పెద్దగా ఇవన్నీ ఆలోచించొద్దు ఒకేళ ఆడి బుర్ర తిరుగుడు లావై మానేసాడనుకో ! అడ్నొక దార్లో పెట్టాలా వద్దా!

డబ్బా : పెట్టకపోతే ఎలాగ అవుద్ది?

నాయుడు : ఆడ్ని కరంటు స్తంబానికి కట్టి నాలుగు దెబ్బలు ఎయ్యాలా వద్దా?

డబ్బా : ఎంతమాట!

నాయుడు : నాయుడు అన్నోడు తప్పు చేసినా, ఒప్పుచేసినా ప్రజలు ఒప్పుకున్న పద్దతిలో సెయ్యాల్రా! నేను రోజు గడ్డెం గీసుకుని నున్నగ తయారైపోయి, మంగలోడు నామాట ఇనడం లేదని నలుగురులో పెట్టి తంతే ఆడిమీద సింపతీ కలిగిపోదురా !

డబ్బా : అంతే కదా! మాసిపోయిన బవిరిగడ్డమేసుకుని అడ్ని నాలుగు పీకితే! ఊర్లో ఎవుడైనా మాట్లాడగలడేటి? అవునప్పా! ఇన్ని ఇసయాలు బావ మనసులో ఉంటే నువ్వెప్పుడూ దాని గురించే ఆలోచిస్తావేటి.. వదిలీ... ఛత్ అదొక గబ్బుది. దాని గురించేటప్పా మీ ఇద్దరూ గొడవ పడటం .. మనమేటి? మన కుటుంబమేటి? మన కులమేటి? నీ స్థాయి ఏటి? నీ హెూదా ఏటి? (ఆమెలో వస్తున్న ప్రసన్నతను గుర్తించాడు)..

వదిలీ యప్పా.. వదిలీ...వదిలీ .. అవును ఆ వస్తున్నోడు పడమటోడి లాగున్నాడు.

మంగమ్మ : (ముక్కు చీదుకుంటూనే) అవును... ఆడే...

నాయుడు : అవున్రా డబ్బాగా?

డబ్బా : బావా!

నాయుడు : పడమటోడికి మన కొబ్బరితోట ప్రక్కన పొలముంది కదా!

డబ్బా : ఆఁ! పదెకరాలుంది?

మంగమ్మ : అది మన డబ్బాగాడే మద్దినుండి కుదిర్సినాడుకదా!

డబ్బా : నాను కుదిర్సినాను నిజమే! కానీ ఎప్పుడు ? మా బావ లచ్చ రూపాయలకాడ ఎనక్కి జారిపోతే కదా, బేరం పడమటోడివరకు ఎల్లింది. బావేమో కోడిగుడ్డుమీద ఈకలు లెక్కెడతాడు.

నాయుడు : బోరమీద జేసి తంతాను. నువ్వు గుండెమీద చెయ్యేసుకొని చెప్పురా ఏ ఇసయమైన తిన్నగా సేస్తావురా నువ్వు.

డబ్బా : సర్లే బావ! నన్నెప్పుడు నమ్మినావనీ.

మంగమ్మ : అసలు సంగతి మాటాడరాదా! ఒరే తమ్ముడు ఆ పడమటోడి పొలం మనకైనట్టు సెయ్యిరా. అడుగు! అడుగు! (నాయుడు భుజం మీద తట్టింది).

నాయుడు : అది అమ్మజూపుతున్నాడా?

డబ్బా : ఆ ముక్క నాకు తెలీదు మరీ! .. ఎంత జెబుతున్నాడో!

నాయుడు : ఒసే! అది తెల్సుకుందావనే రమ్మన్నాను.

డబ్బా : బావా! నువ్వు సెబితే వినవుకానీ. భూమీ పుట్ర దగ్గిర పైసాపరక ఒకరవ్వ జబరగా ఇసరాల.

మంగమ్మ : అప్పుడది కొనుంటే ఇప్పుడు ఈడ్ని బతిమాలుకోవలసిన పనుండేదికాదు... యాకండి ముప్పై ఎకరాల ముక్క ఒక్కాడే వుండేది... పడమటోడు మనూరొచ్చి ఒక పుష్కరమయ్యిందిరా డబ్బా!

డబ్బా : పుష్కరం దాటింది గావాల...

మంగమ్మ : ఎలగొచ్చినాడు, ఎలగైనాడు. మన మట్టిసారమలాటిది.

నాయుడు : మట్టిసారం కాదు మనుసుల సాయమలాటిది.... పై ఊరోడెవడొచ్చిన ఆలమీదపడి నాకీడానికి కొంత మంది ఉంటారు. ఈల వల్ల ఆలెంతటోళ్లైన అవ్వగలరు.

డబ్బా : సైబీరియానుండి ఫెలికాన్ పచ్చులొచ్చి తేలినేలాపురంలో కాపురముంటున్నాయి. ఆటికెవులు సాయమో! ఇండోనేషియా నుండి తాబేళ్ళొచ్చి కళింగపట్నం సముద్రమొడ్డున గుడ్లెట్టి ఎల్లిపోతయి. ఆటిమీద పడి ఎవులు నాకేస్తన్నారో... ఎవడదృష్టంకి ఎవుడుకర్తలు.

మంగమ్మ : మీ అరుపులాపండి... వస్తున్నాడు.

(పడమటోడు లోనకొచ్చాడు)

పడమ : నమస్కారం నాయుడు గారూ!

(అని పై మీద తువ్వాలు తీసి కింద దులుపుకొని కూర్చోబోయాడు – డబ్బాగాడు అడ్డుపడి)

డబ్బా : మామ్మావ ఏటి కిందకూకుండి పోతన్నావేటి... ఇలగరా....!

మంగమ్మ : (ఎలెర్ట్ అయ్యింది. సోఫామీద ఎక్కడ కూర్చో పోట్టేస్తాడోనని) ... కిందన కూకుండి పోతావా ...ఈ స్టూలు మీద కూకో కంట.

పడమ : నాయుడు ముందు కూకోడమా?

మంగమ్మ : ఈ మర్యాద పొలం అమ్మకానికి ఎట్టినప్పుడుంటే బాగుణ్ణు.

నాయుడు : నాను మాట్లాడతాను కదా! నువ్వెల్లి టీసేసి పంపు

(మూతి వంకర్లు త్రిప్పుకుంటూలోనకెళ్ళింది) ఏటిలాంటి పన్జేసేవేటోయ్!

పడమ : ఇంట్లో ఆపదొచ్చి....

నాయుడు : శశ! అమ్మొద్దంటానా... కానీ పక్క పొలం వోడిని కదా? ఒక్క ముక్క నాచెవినెయ్యొద్దా?

పడమ : (స్టూలుమీద నుండి దిగి మళ్ళా కింద కూర్చున్నాడు) అవసరం అలాటిది?

నాయుడు : పిల్ల పెళ్ళికుదిరిందా? ...అప్పులు తీర్చడానికా? .. చదువులకి డబ్బు అవుసరమైందా?

పడమ : (ఏవీ చెప్పలేకపోతున్నాడు).

డబ్బా : ఏదోలే బావ! ఇంటిగుట్టు బయటకెలగ సెప్పుకుంటాడు! రైతు అయి భూవినే వదులుకుంటున్నాడంటే వచ్చిన బాధెలాటిదోమరి?

నాయుడు : ఎలాటిదైనా కానీయ్! మనమేటి ఒట్టిన ఇచ్చీమంటావురా? అవతలోడు ఇచ్చినదాని మీద ఒక పైస జబరగే ఇసుర్తాంగదా!

డబ్బా : ఓ నాకేల తెల్దు.

నాయుడు : సూడు మరి ఎలాటి పన్జేసాడో!

(మంగమ్మ టీ గ్లాసు తీసుకొస్తూ)

మంగమ్మ : అందుకొనే నా నరుస్తుంటాను- ఊరుని కసింత కట్టుబాటులో పెట్టయ్యా అని (టీగ్లాసు పడమటోడి చేతిలో పెట్టి) తాగు.... తమ్ముడూ! ఇది నలుగురి నోట్లో నానిందనుకో మీ బావకెంత సులకనరా?

డబ్బా : ఇందులో సులకన, బరువు అనే మాట ఏటుందిగానీ

మంగమ్మ : ఏటుందా?పొలం పక్కన పొలం నాయుడు కొనలేకపోనాడంటే తెలీక కొనలేదంటారా? డబ్బులేక కొనలేదంటారా? సులకన సెయ్యడం ఎంతసేపు?

నాయుడు : పోనీ ఆ బేరమైనా ఎవుల్తోటి – పై ఊరోడితోటి, అదైనా ఏ ఊరు? సికాకుళం – ఆడైనా ఎవడు లాయర్! ఏరికోరి ఒక లాయర్ని తెచ్చి నా ప్రక్క భూవి కట్టబెడితే రేపు ఆడితో నాకెంత పీకులాట.

డబ్బా : లాయర్కాదు గవర్నరైతే మట్టుగు మనూరొచ్చి నీకన్నా మొనగడానిపించుకుంటాడా?

నాయుడు : ఈ ముద్దుల ముచ్చుమాటలే కొంపలు ముంచుతాయి.

పడమ : అవసరం పీకమీదకొచ్చింది. మా బావమరిదికిసెప్తే నాకు తెలిసినోడున్నాడు. వారంల డబ్బు చేతికొస్తదంటే తొందరపడి అగ్రిమెంటు సేసీనాను. ఈ తప్పు కాయాల.

నాయుడు : ఆ లాయర్తోటి వచ్చే పేచీలు ఎవడు కాస్తాడు – ఆడి కన్ను పడితే నా తోట నాకు మిగుల్తాదాసెప్పు..... నాకొంప ముంచావ్ కదోయ్! పోనీ... ఒక పన్జెయ్!

పడమ : ఏటది?

నాయుడు : ఆడితోటి చేసిన అగ్రిమెంటు కేన్సిల్ చేయించీ... ఆ డొప్పుకున్నది నానిస్తాను.

డబ్బా : ఏటంత బతిమాలాలేటి బావా! మరెక్కడా భూవిదొరకనట్టు .. అగ్రిమెంటు కేన్సిల్కి బయానాకి రెట్టింపు ఇచ్చుకోవాలనుందనుకో అదంతా మనం పెట్టుకోవాల్సివస్తాది. ఏమంటావ్ మావా?

పడమ : అంతంతే .. లాయర్ కదా! అగ్రిమెంటు గట్టిగా బిగించి కాయితాలు కూడా అతగాడి దగ్గిరే ఇడుకున్నాడు.

డబ్బా : చచ్చింది గొర్రె.

నాయుడు : అది చావలేదురా... దేన్నయినా చితక్కొట్టి చచ్చేటట్టు సెయ్యగలవురా లమ్డీకే! ఆడొప్పుకుంటాడేమోనని ముక్కకి ముక్క అందించి ఎలగ తప్పిస్తాన్నావో తెల్సుకోలేన్రా నేను.

మంగమ్మ : మద్దిన ఆడి మీద పడతావేటి?

నాయుడు : నీకు తెల్దు నువు పల్లకో! ఏవిరా నీకెంతస్తా మన్నాడ్రా ఈ పడమటోడు.

డబ్బా : నాకా! ఆమాట నిరూపించగలవా? .. మరింకో మాటొద్దు నిరూపించగలవా?

మంగమ్మ : అదికాదురా.

డబ్బా : అప్పా! నీ చేమాకులొద్దు...ఓయ్! మావా! ఎకరా ఎంతకి తెగ్గొట్టారు సెప్పు.

పడమ : జిరాయితీ పదెకరాలు ఎకరా మూడు లెక్క. గవర్నమెంటు పోరంబోకు ఒక ఎనబైసెంట్లుంది – దానికో రెండిచ్చినట్టు.

డబ్బా : ఆ లెక్కన మొత్తం ముప్పై రెండు... బయానెంత ఒక పదిహేనేనా పుచ్చుకున్నావా?

పడమ : అంతే!

నాయుడు : సూడు! తెల్సినట్టు ఎంత కరక్టుగా చెబుతున్నాడో.

డబ్బా : బావా! దేనికి అగ్గి ఉంటే అదే కాల్తాది. నాకు తెలిసి సెబుతున్నానో, నాను సెప్పమన్నట్టు అతగాను సెబుతున్నాడో అది వొదిలీ.. బయానాకి డబలంటే ముప్పయ్ ఆc! ఖరీదులో కొరవా పదిహేను. మొత్తం నలభై అయిదు లచ్చలు పెట్టి కొనాల్సిన ఖర్మ ఏటంటాను. కొనకతీరదంటావా? అంత కన్న జాత్తైన పన్నెండకరాల మడి సెక్క ఇరవై అయిదు కిప్పిస్తాను. డబ్బు రడీ సేసుకుంటావా? రేపే క్రియసిటీ ... ఏమప్పా!

నాయుడు : ఎవుల్దిరా.

డబ్బా : మరవన్నీ ఏల!

రేపు క్రియచీటికి ఎల్లబారుదుమా? ఆవేశపడకు నష్టపోతావు దేవుడా అని బుర్రబాదుకుంటే, నాను, అతగాని దగ్గిర తినీసీనా? నువ్వై అయిపోనావు... మరొకడామాటంటే సూపించీద్దును నా తడాఖా!

మంగమ్మ : మీ బావ మాటలు పట్టుకొని ఈంద్రబడతావేట్రా! (బయటినుండి అమ్మా అని పిలుపు వినిపించింది. ఆ వస్తూన్నానంటూ బయటకెళ్ళింది మంగమ్మ)

డబ్బా : ఓస్ నాను ... అలగ పట్టించుకుంటే ఎంత అప్పజెల్లిలివైతే మట్టుగు మళ్ళ గుమ్మం ఎక్కుతాను? అయినా బావ కోపం సంగతి నాకు తెల్దా? తాటాకుల మంట .. ఎంత అపకారం చేసినా బాబ్బాబు అని వచ్చి ఒక్క దండ మెట్టిస్తే చాలు కరిగిపోయి సెమించాను పో అంటాడు.

(ఒక దండం పెట్టేసి అవతలికిపో అన్నట్టు సంజ్ఞ చేసాడు)

పడమ : (దండంపెట్టి) నాయుడు బాబూ .. తప్పయిపోయింది సెమించాల....

నాయుడు : బాగా ఆలోచించుకొని సెప్పు. నా పక్కపొలం మరొకడు కొనడమంటే నాకెంత నామర్ధ... సొమ్ము కాసింతెక్కువైనా పర్వాలేదు... ఏంటటావు..

పడమ : రెండురోజులు టైమియ్యండి నాయుడుగారు.

నాయుడు : అలాగే ఎల్లు... (పడమటోడు వెళ్ళిపోయాడు. బయటనుండి రెండు పాలపాకెట్లు, రెండు మజ్జిగపాకెట్లు పట్టుకుని వచ్చింది మంగమ్మ)

డబ్బా : (మాట మార్చడంకోసం) ఏటి రోజుకి నాలుగు పేకట్లు కర్సు అవుతాయాప్పా!

మంగమ్మ : ఏటిసేస్తాం! ఒగ్గొడ్డు ఇంట్లోఉంటే ఈ బాదలేకపోను.... గేద సచ్చిపోయిన కానుండి సెయ్యి ఇరుసుకున్నట్టుంది.

డబ్బా : బావా! చింతాడ సంతకెళ్ళి మంచి గీదను కొనుక్కు రమ్మంటావేటి?...

నాయుడు : కమీసను ఏసీడానికా?

డబ్బా : ఏమ్మనిసి తియ్యి... ఇదేటప్పా నామీద ఇలగ తయారయినాడు – ఒక మాట గేపకమెట్టుకో బావా! మీనాయిన కాలంలో వచ్చినోళ్ళతోటి, పోయినోళ్ళతోటి ఈ ఇల్లెంత కళకళలాడీదీ. పొద్దున్న ఎత్తిరిస్తే పొయ్యి అర్ధరాత్రి దాక బోగీమంటలాగ కాల్తుండీది. ఇంటికొచ్చిన మనిసి తినకంట ఎల్లడమేః!.. అంతొద్దు... వచ్చినోడికి ఒక సల్లబొట్టైన ఇవ్వరా... తియ్యిండీ....

మంగమ్మ : నువ్వన్నిదీ నిజమే... కాని గీదకొని దాని ఉసురేల పోసుకోడం.

డబ్బా : ఏటీ కుడితైనా పోయ్యకూడదనుకున్నరేటీ?

మంగమ్మ : ఇగటం సాలుగానీ... మేపుకి ఎక్కడైనా ఒక సేరదు జాగావదిల్నార్రా?... కడగడానికి ఏ గుమ్మిలోనైనా ఇన్ని నీళ్ళున్నాయిరా!

డబ్బా : అయితే ఈ లెక్కన... మెరకమీద గెడ్డపనులు జరుగుతున్నయి. ఆ గెడ్డొచ్చీవరకు గేదె ఊసెత్తొద్దంటారు.... మరి ఆవో!

నాయుడు : మంగళొరం సంతకెళ్ళే మాటుంటే సెప్పు... ఆవు కొనుక్కుందాం.

మంగమ్మ : ఆవైతే కడిగే బేజారుండదు... ఇందా! ఈ మజ్జిగ తాగు.

నాయుడు : పెరుగు దొరుకుతాదేమో సూడలేకపోనావా! మజ్జిగేటి రుసుంటాది.

మంగమ్మ : ఎన్నయినా అనడానికి నీకు హక్కుంది. ఎంత అయినా తినడానికి ఆడికి హక్కుంది – ఏమంటావురా

డబ్బా : అప్పా! ఈ పొద్దు నా చెయ్యి కిందండి మీ చేతి కూరాకు తింటున్నాను... ఎల్లకాలం ఇలగే ఉండిపోతాది? ముత్యాలమ్మ దయవల్ల నాసెయ్యి మీద కొచ్చిన్నాడు మీకు తినిపించనా!...

నాయుడు : అదేకదా నాభయ్యం.

డబ్బా : అంత జడిసి పోకు బావా!

నాయుడు : ఓ రెల్లురా! నీ మాటలు ఇప్పుడివా?

డబ్బా : ఎల్తానెల్తాను.. వస్తానప్పా. (వెళ్ళిపోయాడు)

మంగమ్మ : కాకి కళ్ళు ఎంగ్రిడికల మీదున్నట్టు ... ఎప్పుడు ఆడి మీదే నీ దృష్టి.

నాయుడు : మీ దెక్కించుకోమంటావా?

మంగమ్మ : ఒసే .. నాకు సొంత పిన్నమ్మ కొడుకు... ఆ మాత్రం ఇలవిస్తే ఏటి తగ్గిపోతావా? సిగ్గు శరము లేనోడైపోయి సరిపోయింది. లేపోతే ఇటు కాసి వస్తాడేటి?

నాయుడు : ఏటి నష్టమో! ఆడెలాంటాడో తెల్సా?

మంగమ్మ : ఎవురి పీక తీసేసినాడో!

నాయుడు : ఎవుల్దైనా తీసిగల్డు .. ఆడికి సొంతమూ, పరాయి అని తేడా లే. మందు నుండి చెబుతున్నాను. ఎంత దూరముంచితే అంతమంచిది.

మంగమ్మ : పల్లకో!

నాయుడు : పల్లకోడం కాదేఁ! .. ఆడుగొర్రెల్లో కలిసిపోనాడనుకో గొల్లోడు కూడా కనిపెట్టలేడు మనిషని. నక్కల గుంపులో జొరబడ్డాడనుకో నక్క కాదుకదా, దాని అక్క కూడా కానుకోలేదు. ఆవు పొదుగు కింద దూరి పెయ్యలాగా పాలు తాగేగల్డు. తేనె పట్టు మీద కెల్లాడంటే ఆ ఈగల్ని కుట్టేసి మరీ తేనె జుర్రీగల్డు... అంత గొప్పోడు.

మంగమ్మ : లేదులే... నీకు ఆడోళ్ళు నచ్చినట్టు మగోళ్ళు నచ్చర్లే...

(బయటినుండి కిష్టప్పంతులొచ్చాడు)

కిష్టప్ప : ఇది చాలా అన్యాయం ! ఘోరం ! ఇహ ఈ దెబ్బతో ప్రపంచం అంతమైపోవడం ఖాయం, తప్పదు, తప్పదు, తప్పదు...

నాయుడు : ఏటయ్యింది పంతులు

కిష్టప్ప : ఏటవ్వడమేటండీ, ఈక, తోక తీసుకుంటూ, బుర్ర, బొచ్చు గీక్కొంటూ, బ్రతకాల్సినోడు గ్రంథాలు పట్టుకు తిరుగుతున్నాడు. పొది పట్టుకోవాల్సిన చేతితో పుస్తకాలు పట్టుకోవచ్చా? చెప్పండి.

నాయుడు : రాజిగాడేనా?

కిష్టప్ప : అవును – అన్నీ చంపుకొని మరీ వాడింటికి వెళ్ళానండీ.... అదిగో ఎలా వస్తున్నాడో చూడండి?

(మంగలి రాజిగాడు చంకలో పురాణాన్ని పెట్టుకొని వచ్చాడు)

నాయుడు : రాజిగా !

రాజి : ఏమిఁ!

నాయుడు : గెడ్డాం గియ్యడాకి రమ్మంటే రాకంట ఏం జేస్తున్నావురా.

కిష్టప్ప : ఏం చేస్తాడు? పురాణాలు పట్టుకొని తిరుగుతున్నాడు. ఒరేయ్ పాపం మూట గట్టుకుంటున్నావు తెల్సుకో.

బారికోడు : అయ్య గెడ్డాం ఎలగ మాసిపోయిందో సూడు

అసిరిగాడు : మీసాలు నోట్లోకి ఎలిపోతన్నాయి.

బారికోడు : సంకల్లో వరిదుబ్బలు మొలిసిపోనాయి.

అసిరిగాడు : నిగనిగలాడే మనిసి ఎలగ నల్లబడిపోనాడో సూడు

కిష్టప్ప : అయిందేదో అయింది. తపీమని వెంటనే పని ప్రారంభించు.

రాజి : నానే ఎందుకు గియ్యాలి. నువ్వాపని సెయ్యొచ్చుగా.

కిష్టప్ప : చూసారా నాయుడుగారూ వాడి ఒంటి తివురు... నేను బుర్ర గొరగాలంట, నేనాపన్జేస్తే నువ్వేటి చేస్తావురా.

రాజి : గుళ్ళో మంత్రాలు సదువుతాను.

కిష్టప్ప : హమ్మా! ఎంతఘోరం... ఎంతఘోరం...

నాయుడు : రాజిగా ఏట్రా నువ్వు మాట్లాడేది.

రాజి : అవునయ్యా ! లేపోతే నీలాగ ఎవసాయం సేస్తాను. ఇంకా కాపోతే కూలి పన్జేసుకుంతాను. అదీ లేపోతే ఇదిగో ఈళ్ళలాగ కంబారితనం సేసుకుంతాను. నాను మాత్రం ఈ మంగలి పని సెయ్యను.

నాయుడు : ఏట్రా పేల్తన్నావు.

కిష్టప్ప : నాయుడుగారూ ! మీరుండండి ! ఒరేయ్ వెధవ ! బుర్ర తక్కువ గాడిద కొడకా! నీకాపని చెయ్యమని చెప్పింది మేము కాదురా,

ఆ భగవంతుడు. ఒరేయ్ వెధవ ! తెలుసుకో బ్రాహ్మడు – అంటే నేను దేవుని ముఖం నుండి పుట్టాడు – రాజు అంటే నాయుడు గారు ఆ దేవుని భుజాల నుండి పుట్టారు. – మన పైడిశెట్టి లేడు వాడు, వాడి కులస్థులంతా దేవుని తొడల్లోంచి పుట్టారు. ఇక నీబోటి మంగలి, చాకలి, సాలి, కంసాలి, వడ్డెర, వడ్రంగి, ఎరకల, యానాది– లాంటి శూద్రులంతా అతని పాదాల నుండి పుట్టారు. చిన్నచిన్న కులాలన్నీ చిన్న చిన్న పనులు చేసుకొని బ్రతకాలిరా !

రాజి : సాయిబులు, కిరస్తానీలు, ఎక్కడి నుండి పుట్టారు? ఎవడికి పుట్టారు?

కిష్టప్ప : అదీ... అదీ... వాళ్ళది వేరే మతం రా! మనదేవుడంత గొప్పవాడు, మరెక్కడా లేడురా.

రాజి : దేవుడి మాటకేమో గానండీ – మన పూజార్లంత గొప్పోల్లు మాత్రం మరెక్కడా లేరండీ.

కిష్టప్ప : చూసారా నాయుడు గారు, ఎంతలేసి మాట్లాడుతున్నాడో.

రాజి : నాయుడ్ని ఎందుకు కలుపుతావ్ పంతులూ! మీ గొప్పతనం గురించి నాను చెబుతాను ఇను. పెళ్ళి, పేరంటం, చావు, తద్దినం, కార్యం, ఖర్మం ఏదీ మంగలోడులేకంట కాదు–

సకల తీర్థంబులు, సకల యజ్ఞంబులు

తలలు గొరగకున్న ఫలము లేదు

మంత్ర జలముకన్నా మంగలి జలము హెచ్చు.

– కానీ పెళ్ళిలో నీవు తీసుకొనే దానికి బియ్యం తెమ్మంటావ్. మంగలికిచ్చేదైతే ధాన్యం సరిపోతాయంటావు. అంత గొప్పోడివి.

కిష్టప్ప : ఒరే ఒరే ఒరే నువ్వూ నేను సమానమట్రా!

నేను భూసురుడ్ని... సాక్షాత్తూ బ్రహ్మ అవతారాన్ని, నా హృదయం పాల సముద్రంరా, అది మహావిష్ణువుకి స్థిర నివాసం – నా నాలిక బ్రహ్మలోకంరా, అక్కడ బ్రహ్మ సరస్వతీ సమేతుడై ఉంటాడు. నా కాయం, యావత్తూ కైలాసం – పరమశివుడు అను నిత్యం శివతాండవం చేస్తూంటాడురా. అలాంటిది నువ్వూ నేను సమానమా?

రాజి : అలాగా ! అయితే ఇవిగో (జేబులో చిన్న గుడ్డ సంచి తీసాడు- దాంట్లోంచి ఒక్కో వస్తువు తీసి చూపిస్తూ చెప్పాడు)

కత్తెర - ఇది కాలపురుషుని స్వరూపం- పెరిగినదాన్ని కత్తిరించుకుపోతాది.

దువ్వెన - ఇది శివుని స్వభావంకి నిదర్శనం - అడ్డదిడ్డమైన దాన్ని అదుపు చేసి ఒక పద్ధతిలో పెడతాది.

ఇది వస్త్రం - భూదేవి లాగ కుళ్ళుని, కల్మషాన్ని తనలోకి తీసుకుని దాసుకుంటుంది.

ఇది అద్దం - సూర్యునికి ప్రతినిధి - కాంతిలో రూపాన్ని, జ్ఞాన కాంతిలో స్వరూపాన్ని తెలుసుకొమ్మని సెపుతాది.

ఇది మంగలి గిన్నె అనుకుంటున్నావు. కానీ కాదు, క్షురకర్మ అనే పవిత్ర క్రతువుకిది కలశం- సాక్షాత్తూ బ్రహ్మే కలశంగా అవతరాం పొందాడట. మా కుల కథానాయకుడైన నాభికుడు ఐదుగురు రాక్షసుల్ని చంపి వారి శవాల నుండి కత్తి, కత్తెర, దువ్వెన, గోరుగుండు, మైలబిల్ల తయారు చేసినట్టు మా నాభికాపురాణం చెబుతున్నాది. కాబట్టి వస్తాదో, రాదో తెలీని పుణ్యం కోసం మంత్రాలు జెప్పే మీ రుత్తే ఎంతో పవిత్రమైనప్పుడు, మనుసులకు అందాన్ని, ఆరోగ్యాన్నిచ్చే మారుత్తి ఎందుకు పవిత్రం కాదు. నెత్తిమీద శఠగోపం పెట్టే మీకు దండాలు పెడుతున్నప్పుడు - నెత్తికి నూనెరాసి, మర్ధన జేసి, మైలతీసి, మీ ఒంటి గబ్బుని, జబ్బుని మా ఒంటికి పూసుకొని సేవలు చేసే మాకెందుకు మొక్కరు. (స్టూలు మీద కూర్చున్నాడు)

నాయుడు : (అది చూసిన నాయుడికి కోపం నషాళానికి ఎక్కిపోయింది - వెనకనుండి ఒక్క తన్ను తన్నాడు) -

లమ్డీకే... (రాజియ్య ముందుకు పడ్డాడు - పురాణం కింద పడింది) - చంపేస్తాను నిన్ను. ఈ పదకం, ఆ పదకం అని నాలుగు అచ్చరాలు నేర్సుకొండిరా అని గవర్నమెంటు సెప్పుతుందంటే దేనికిరా? మీకిచ్చే ఫించను డబ్బులు ఎంతోస్తందో, ఎంత ముడతందో తెల్సుకుంటారని, బేంకులవి లోన్లు ఇచ్చినప్పుడు వెయ్యికి బదులు రెండువేలు అని

తప్పుడు రాతలు రాసిస్తే గుర్తుపడతారని. సబ్సిడీలవి ఇచ్చినప్పుడు ఒకరి డబ్బు మరొకరు తీసుకోకంట కానుకుంటారని. అంతేగాని ఏకంగా మొదటికే మోసం తెస్తున్నావే. పంతులకే పాఠాల్జెప్తున్నావే. లమ్డీకొడకా! నా ఎదురుగా కుర్చీమీద కూకుంటావా?

మంగమ్మ : ఎలుగుబంటికి ఈక లెక్కువ, మంగలోడికి మాటలెక్కువని వట్టిగే అన్నారేటి. కులం బుద్ధి సూపించుకున్నాడు.

రాజి : కులం ఊసెత్తకమ్మా.

నాయుడు : ఏట్రా ఆడోళ్ళమీద అరుస్తున్నావు – నరికేస్తాను నిన్ను... జాగ్రత్త! ఒరేయ్ అసిరిగా...

అసిరిగాడు : అయ్యా !

నాయుడు : ఆ కత్తి, కత్తెర తెచ్చి ఆడి సేతికియ్యి.

అసిరిగాడు : (క్రింద పడిన కత్తి, కత్తెర తెచ్చి) ఇంద.

నాయుడు : ఒరే బారికా?

బారికోడు : అయ్యా

నాయుడు : ఆ మంగలి గిన్నెల నీళ్ళుపోసి ఆడికియ్యిరా.

బారికోడు : (నీళ్ళు పోసిన మంగలిగిన్నె తెచ్చి) ఇంద.

నాయుడు : ఏట్రా ! ఎవుడ్రా మీ కులానికి కథానాయకుడు ! ఎవడు – ఎవడన్నాడు పంతులూ!

కిష్టప్ప : నాభికుడంటా ! ఎవడో త్రాష్టుడు.

నాయుడు : నిన్నిక్కడ ఈ స్థంబానికి కట్టి కొడితే వాడొస్తాడ్రా ! ఒరేయ్ ! తిమింగిలాలు, సొరచేపలు, బలొచ్చు, పొగరు పట్టొచ్చు – విర్ర వీగచ్చు. ఇలుసు పరిగిలు ఎంతని కొవ్వుతాయిరా. ఎంతని బలుస్తాయిరా. ఎంత బలిసిన ఇంతేన్రా ! సింహాలు, పులులు, ఏనుగులు మదించొచ్చు, కొవ్వొచ్చు – పొగరు పట్టొచు... కుందేళ్ళు.... ఇంతే, అంతకుమించలేవు– మద్దిచెట్లు, గుగ్గిలం, గంధం, టేకు ఎంత ఎత్తైనా పెరగొచ్చు. ఇరగబడొచ్చు. గడ్డిపరకలు... ఇంతే... అంతకు మించలేవు. – నువ్వూ, నీ కులం, నీ బోటి గాళ్ళు... ఇంతే... ఇంతే,

ఎంతని బలుస్తారు. ఎంతని కొవ్వుతారు... నా కొడకా ! నీయమ్మ నీ యక్క నీ ఆలీ... పెడితే తినాలి. కొడితే పడాలి... నొప్పి అయితే ఏడాలి, సంతోషమైతే నవ్వాలి. ఎక్కువైతే మాత్రం బతకనివ్వను. సంపేత్తాను... సంపేత్తాను... రా! గెడ్డం గియ్యి.

(అంటూ కుర్చీలో కూర్చున్నాడు నాయుడు – ఏమి జరుగుతుందా అని అందరూ ఉత్కంఠతో చూస్తున్నారు. రాజియ్య నెమ్మదిగా వెళ్ళి క్రీమ్ తీసుకొని గెడ్డంకిరాసి బ్రెష్‌తో గట్టిగా రుద్దాడు. పొంగు ఎక్కాక కత్తి తీసుకొని గెడ్డం గీస్తున్నాడు. అందరూ కొంత రిలాక్స్ అయ్యారు.)

కిష్టప్ప : ఈ బుద్ధి ముందు ఉంటే ఎంత బాగుండేది. అనవసరంగా తిట్లూ, తన్నులూ తిన్నావ్. నీ పెళ్ళాం పిల్లలు అదృష్టవంతులు. చంపకుండా వదిలేసారు. పోన్లే కట్టెవంకర పొయ్యి తీర్చింది.

నాయుడు : ఓస్ పొయ్యంటే గుర్తొచ్చింది ! పంతులూ !

కిష్టప్ప : అయ్యా.

నాయుడు : ఆ పురాణం తీసి ఆ పొయ్యిలో పడేయ్. వీడికి పట్టిన దెయ్యం వదిలిపోద్ది.

కిష్టప్ప : మా మంచి మాటన్నారు. ఏదో దెయ్యం పట్టిగానీ లేకపోతే రాజిగాడు ఎలాటోడో మనకు మాత్రం తెలీదా! ఏనాడూ ఒక పొల్లు మాట అనగా విన్నామా? ఏదో గాలి సోకింది. అంతే!

(పంతులు పుస్తకం దగ్గరకు వెళ్ళబోతున్నాడు)

రాజి : పంతులు ఆగు

కిష్టప్ప : మళ్ళీ ఏటొచ్చిందిరా !

రాజి : ఆ పురాణాన్ని నేనే పొయ్యిలో ఏసి తగలెడ్తాను.

కిష్టప్ప : మరీ మంచిది. ఏవండీ నాయుడు గారూ !

నాయుడు : కానీలే.

కిష్టప్ప : ఒరేయ్ రాజిగా ! అలాగే కానివ్వరా ! నీవు ఎంతో గొప్పవాడిగా భ్రమింపచేసిన ఆ పురాణాన్ని నీ చేతులతో నువ్వే తగలెట్టెయ్యిరా! కాల్చెయ్యిరా ! కాల్చి బూడిద చేసెయ్యరా !

రాజి : చేసేస్తాను. కానీ మిమ్మల్ని గొప్పోల్ని చేసిన పుస్తకాల్ని, పురాణాల్ని అదే పొయ్యిలో ఏసి కాల్చేస్తావా?

కిష్టప్ప : మళ్ళీ మొదటికొచ్చాడండీ !

నాయుడు : ఏరా తన్నులు సాల్లేదా ! కోపం తెప్పించకు.

కిష్టప్ప : ఒరేయ్ అనవసరంగా నాయుడు గారికి కోపం తెప్పించకు. ఎంతో సహనంతో క్షమిస్తున్నారు. పరిస్థితి అర్థం చేసుకో.

రాజి : అర్థం చేసుకున్నాను పంతులు ! అర్థం చేసుకున్నాను. అర్థం చేసుకున్నాను. నన్ను చితకదన్ని, నా అమ్మను, ఆలినీ, అప్పను బూతులు తిట్టి, నా చేతికి తల అప్పగించి గెడ్డం గియ్యమన్నాడంటే–

నానేటి సెయ్యలేననే గదా !

నా గుండెకు ధైర్యమనేది తెలీదనేగా !

నా రక్తానికి సిగ్గు, శరమూ లేవనేకదా !

నా చెయ్యి ఈకలు గీసి గీసి గీసి ఒక ఈక పైకి లేసినట్టు – కూడా లెగలేదనే గదా! గెడ్డం గీసిన కత్తిని గొంతులో దించలేననే కదా, అర్థమైంది!... పరిస్థితి అర్థమైంది.

(పురాణాన్ని చేతిలోకి తీసుకున్నాడు)

అర్థమైంది... బాగా అర్థమైంది... మా బతుకులు మార్చడానికి కావాల్సింది పురాణాలు కాదు.. ఇంకేటో కావాలి... ఇంకేటో కావాలి... ఇంకేటి కావాలో తెలుసుకుంటాను. (విసురుగా వెళ్ళిపోయాడు)

నాయుడు : పంతులు!

కిష్టప్ప : అయ్యా!

నాయుడు : ఇంతసెప్పినా ఈడికి బుఱ్రకెక్కడం లేదేటి యింక ఈడేటి తెలుస్సుకుంటాడు?

కిష్టప్ప : ఏమోనయ్య! పుస్తకాన్ని చదివిన మస్తకం ఊరుకుంటదా.. చూస్తుంటే ఈ వెధవలో సప్త సముద్రాలుకూడా చల్లార్చలేని అగ్గి ఏదో ఉందండి.

నాయుడు : ఉన్నీ... ఆ అగ్గేదో ఆడ్నే కాలుస్తది.

కిష్టప్ప : నిజానికి అలాగే జరగాలి. కాని మనదేశంలో మతం మంటగానీ కులం కుంపటిగానీ ఒకసారి వెలిగిస్తే అది ఎంతటికీ చల్లారదూ. ఎవడ్ని కాల్చేస్తదే చెప్పలేం.

నాయుడు : అయితే ఇప్పుడేటి సేయ్యాలంటావు.

కిష్టప్ప : వీడి ఉనికి, తిరుగుళ్ళు ఒక కంట కనిపెడతా వుండటం మంచిదికదాండి.

నాయుడు : నువ్వు ఆపనిమీదే ఉండు.

కిష్టప్ప : చిత్తం! (బయటికెళ్ళిపోయాడు)

నాయుడు : ఎవ్వడ్ని నమ్మలేం! సమస్యపుడితే చాలు దానిమీద పడి బతికేయడానికి సూస్తారు.

మంగమ్మ : ఇంతకూ... నువ్వు గెడ్డం గియ్యందీ...

నాయుడు : ఆకమల మీద బెంగెట్టుకొనే గియ్యలేదు. సరిపోద్దా!... ఒరే!

కంబార్లు : అయ్యా!

నాయుడు : ఆ మంగలి కుల పెద్ద ఉంటాడు. ఆడ్ని పిల్సుకు రాయండి.

కంబార్లు : అలాగేనయ్యా!

నాయుడు : (జేబులోంచి సెల్ తీసి నంబర్ డయల్ చేసాడు) ఒరే డబ్బాగా! మంగలి రాజిగాడి సంగతి తేల్చాలి. నువ్వొకపాలి అర్జంటుగా రా!

**(లైట్స్ ఆఫ్ - లైట్స్ ఆన్)**

## 8వ సన్నివేశం

రాజిగాడి ఇల్లు-

అరుగుమీద కుక్కిమంచం మీద పడుకొని ఉన్నాడు నర్సింహులు. దుప్పటి ముఖంమీద నుండి ముసుగేసి ఉన్నాడు. ఈరమ్మ గబగబా బయటనుండి వచ్చింది.

ఈరమ్మ : మావా! మావా? (అని పిల్చి దగ్గర కెళ్ళబోయి- భళుక్కున వాంతి చేసుకుంది)

నర్సి : ఈరమ్మ! వాంతుల్జేసుకుంటాన్నావు. రాతిరి తిన్నది అరగలేదనుకుంటా!

ఈర : అరగనంత కూడూ కూరా మనకెక్కడిదిగానీ... అది కాదు మావా!

నర్సి : మరింకేటి అమ్మీ?

ఈర : మూఁడ్రోజులబట్టి కక్కుకుంతన్నాను... నీ కొడుక్కి అర్థమవ్వడం లేదు... నీకూ తెలీడంలేదు.

నర్సి : అర్థమవ్వడం లేదా! ఆఁ! అయితే ఇప్పుడర్థమయ్యింది

ఈర : అయ్యిందా! ఏటో సెప్పు.

నర్సి : ఏటంటే.... పెళ్ళిబంతులుకీ సావుకూడులకి ఎల్లావు. పాసిపోయింది తిన్నావో, పులిసి పోయింది తిన్నావో, పాడయ్యింది తిన్నావో మూఁడ్రోజుల బట్టి ఒకటే వమనం... డాటర్‌ని అడిగి ఒక మాతర ఏసుకులేపోనావా!

ఈర : సరిపోయింది... కాదు మావా! మా యత్త.... ఎప్పుడు వాంతులు సేసుకోలేదా!

నర్సి : మీయత్త... వాంతులు... అంటే... ఆఁ!... ఆఁ!... ఆఁ!...

ఈర : అవునవును.....

నర్సి : ఓలమ్మ ఈరమ్మ.. ఎంత చల్లటి మాటసెప్పావే!

... ఏటీ నీ కడుపున ఈ నర్సింహులు పడ్డాడా?

ఈర : కాలు జారి పడిపోగలవు... జాగ్రర్త...

నర్స : పడితే పడ్డానులే... ఏటి సేద్దును..

నీకేటి సేద్దును... సెయ్యి కట్టేసినట్టయిపోయింది... ఇదే పెద్దకులపోల కోడలివైతే ఎంత గందికిసే సీద్దురో... నగనట్రా సెయ్యించి మెడల ఏసేద్దురు.. సీవంతం... గీవంతం అని ఏటేటో సేసేసి భోజీలు ఎట్టేసి ఊరంతా గుబ్ మనిపించీద్దురు... మంగలోడ్ని.... మంగలోడింటిలో కడుపైనా, కానుపైనా ఎవడిక్కావాల.... ఆ అమ్మీ.... అమ్మీ... ఇలగ కూకోయే!! (మంచం మీద కూర్చోబెట్టాడు) ట్రంకుపెట్టెలో నుండి మెడల్స్ తీసాడు) ఆఁ! ఇదిగో! ఇది ఎండిది! నాకెన్ని ఇబ్బందులొచ్చినా అమ్మలేదు... ఇది నీ మెడల ఎత్తన్నాను. పిల్లడు పుట్టేవరకు ఇదిలాగే ఉంచుకో! పుట్టిన తర్వాత కరగబెట్టేసి ఎండిమొల్తాడు సెయ్యించి నడుంకి కట్టీ. మాతాత మెడలోనిది నానడుమికి కట్టుకున్నానని గర్వపడాలి. ఏ ఇలవలేదని నన్ను తీసిపారసినట్టు దీన్ని తీసిపారియ్యకు...

ఈర : మావా!

నర్స : పారీవులే.. నాకు తెల్సు... అన్నట్టు ఒక్కమాట! అమ్మీ! ఇకన బట్టి ఏ కూడు బడితే ఆకూడు తినకు.

ఈర : అలగంటె ఎలగ.....

నర్సి : ఇదిగో... ఎవరేమనీసినా, సాకల మంగళ్లు తలంచుకొని సల్లగ ఏల ఎలిపోతారు సెప్పూ... తెల్దుకదా? ఎవులో ఒకలు ఏసిన సల్లని తిండి తినితిని రక్తం సల్లబడిపోతాది... చావ సచ్చి సల్లగై పోతారు... నా మనవడు అలగవ్వడానికి ఈల్లేదు... ఆడు పుట్టిన కానుండి ఉడుకుడుకు బువ్వ తినాల... ఊదూదుకుని బువ్వ తినాల. ....ఇదిగో ఈ పొద్దునుండి ... (క్లార్నెటే తీసాడు) ఏ బ్యాండులోనో సేరిపోయి నాను డబ్బులు సంపాయిస్తాను.

ఈర : ఆపట్రాకులు నువ్వీ వయసులో పడలేవుగానీ... (చెంగులోవి తీసి చూపించింది) ఇదిగో రెండొందలు – సిటంల ఎల్లి కార్డు ఇడిపించుకొని రేషన్ షాపు కాడకెళ్ళి బియ్యవొట్టుకొస్తను... ఉండు పొయ్యి ఎత్తిరించి ఎల్తాను. వచ్చేసరికి ఎసరు మరిగిపోతే బియ్యం గబాల్న ఉడికిపోతాయి. నీకీపొద్దు ఉడుకుడుకు బవ్వఎడతాను.

| | | |
|---|---|---|
| నర్సి | : | ఓలమ్మో! పొయ్యి ఎత్తిరించేసి ఎలిపోతే పాక అంటుకోగలుది. |
| ఈర | : | ఓస్... మన పొయ్యిల గుగ్గిలందూలాలు మండిపోతాయి. కాలి, కాలి ఇల్లంటుకోడాకి. పిడక... మన బతుకులాగే బుస్సున లెగుత్తాది... తుస్సున ఆరిపోతాది.. నీకు ఓపికుంటే లెగిసి కుట్టు ఇవతలకి రాకంట కచ్చిక కసింత ఎగదొయ్యి.. సిటంల ఎలిపొస్తను (వెళ్ళబోయి వెనిక్కి వచ్చింది) మావా! నిన్ను తిట్టుకున్నానుగానీ... నీకొడుకు పద్దేలు సదువుతుంటే, పాటలు పాడుతుంటే ఎంత ముచ్చటగున్నాడో! |
| నర్స | : | నాను సెప్పలేదా! నా మీదకు గయ్యిన లెగిసినావు. |
| ఈర | : | లేదు.. లేదు... సదవాల్సిందే.. సదువే మావా! మనిసికి పశువుకి మద్దిన ఉన్న తేడా తెలియజెప్పేది. ఉండు ఆలిస్యమైతే ఆ డీలర్‌గాడు బియ్యం అయిపోనాయంటాడు. ఆడితోటి ఒక నరకమైపోతుంది. (గబగబ వెళ్ళింది) |
| నర్సి | : | (సంతోషంతో క్లార్నెట్ వాయిస్తున్నాడు) బయట నుండి నాయుడు కంబార్లు కులపెద్దను ఈడ్చుకుంటూ వచ్చారు – వారితోపాటు డబ్బాగాడు ఉన్నాడు. |
| కులపెద్ద | : | ఇక్కడుంది లొసుగు. (అందరూ అర్థం కానట్టు చూసారు) నువ్విక్కడ మా బాగా రాగాలు తీస్తున్నావుకానీ నాయుడు నన్ను పిలిసి నువ్వేం కులపెద్దవు కట్టుబాటుతెల్దా? అని అంతెత్తున నామీద ఎగుర్లాడినాడు – ఇక్కడ ఈడు ఏటిసేస్తన్నాడో సూసినారా? తండ్రి సన్నాయి రాగాలు తీస్తుంటే, కొడుకు సదువులు సదవడా! పదండి నాయుడికి సెప్పిద్దుం. |
| డబ్బా | : | ఒరే! ముసల్నాకొడుకా! పిల్రా నీ కొడుకుని. |
| నర్సి | : | ఏటిబాబూ? ఏటి ఇంటి మీదకు ఎలిపొచ్చినారు? |
| కుల | : | నీ కొడుకు సేసిన పనివల్ల మొత్తం కులానికి సెడ్డపేరొచ్చిందిరా? ఎంత నమ్మకమైన జాతిరామనది. పెద్ద కులపోలి కళ్ళల్లోకి సూసి ఎరుగుదుమా? ఆళ్ళు మనల్ని ఒక మాటంటే ఎదురు చెప్పి ఎరుగుదుమా? ఎప్పుడైనా ఆళ్ళ మనసులు కష్టపడో, కోపంతోటో ముఖమ్మీద ఉమ్మేసినా తుడుసుకొని ఎలిపోతాం. నాలుగు దెబ్బలు ఏసినా అలాగ భరించుకెళ్ళిపోతాం... అంత మంచి కులంరామంది... |

ఎంతోమంచోళ్ళ మనే గదరా తలకాయలు మనసేతుల్లో పెట్టేసి నిచ్చింతగా కళ్ళు మూసుకుంతారు. అలాంటి కులానికి ఇంత సెడ్డపేరా?

అవున్రా! నీకు తెలీదా? మనం కులంకి తక్కువైనా, కూటికి లేకపోయినా, ఎంత ఇలువిస్తార్రా? ఈ గామంలో ఎపుడైనా మనల్ని పరాయోడిగా సూస్తార్రా? అయినింటిల్లో మనమే. వంటిట్లో మనమే! పెళ్ళిలోమనమే! సావులో మనమే! సాకలి మంగళ్ళు లేనిదే ఏ సంసారమైనా ఉంటాదిరా? ఇప్పుడిప్పుడు తగ్గిపోతుందిగానీ గేమాల్లో పెద్దలకు సలహాలవి ఇవ్వాలంటే మంగలోళ్ళే ఇచ్చివోర్రా అందుకే మంగలోడ్ని మంత్రి అని పిలిసీవోరు. ఇకన నాయుడు ఎలాటోడో నీకు తెల్దా? నాయుడమ్మ అప్పుడప్పుడు ఒక మాట ఇసిరేస్తది కానీ.

అసిరి : ఏయ్ఁ!

కుల : అదేటి! చెడుకోరా? చ చ ! మన మేలుకోరే మనల్ని నాలుగు అంటాది. నాయుడో! గడ్డి కుప్పలాటోడు.

బారి : ఏయ్ఁ!

కుల : ఎన్ని బాధలున్న లోపుట లోపుటే కుములుతాడు, గానీ ఒక్కమాట, ఒక్కమాట ఎవుడికైనా అంటాడ్రా? అలాటి నాయుడ్ని ఎదిరించి, ఊరుని ఎదిరించి, ఊరిలోని రైతుల్ని ఎదరించి ఏటి బాగుపడి పోదుమని రా! రాజిగాడి ఉద్దేశ్యం! మంగలి పని మానేసి మినస్టర్ పన్జేస్తాడ్రా నీ కొడుకు.

డబ్బా : ఏయ్ఁ! ఉపన్యాసం ఆపు.. ఓరే ముసలోడా నీ కొడుకుని పిలిసి నా గెడ్డం గియ్యమన్రా! రేపు నాను ఊరెల్లాలి.

నర్సి : బాబ్బాబు! నీకు కావాల్సింది గెడ్డం గియ్యడమే కదా! నాను గీస్తాను. నా కొడకుని వదిలియ్యండయ్యా! (వెళ్ళి గూటిలోని పొదితీసుకొని వాళ్ళ ముందు కొచ్చాడు)

డబ్బా : ముసల్నా కొడకా! సరిగ్గా నిలబడలేక పోతున్నావ్! చేతులు వొణికిపోతున్నాయ్! నువ్వెలగ గీస్తావురా గెడ్డాం. (నర్సింహులుని తోసేడు. అతను కిందపడిపోయాడు)

కులపెద్ద : (లేవదీసి) అయ్యేయ్యే! ఈ వయసులో నీకీ తిప్పలేల? కొడుక్కి నాలుగు కీకలేస్తే ఆడు దార్లోకి రాడా సెప్పు.

నర్సి : (పట్టుకున్నవాడ్ని విదిలించుకొని) వొదులు.. ఆడు దారిలోనే ఉన్నాడు. నువ్వే దారి తప్పి మాటాడుతన్నావు.

కులపెద్ద : నావి దారి తప్పిన మాటలా! ...పదండి నాయుడికాడకెళ్ళి సెప్పిద్దుం.

కళ్ళా : సెప్పిద్దుంగానీ ఆగు... నీతోటి వాదనలేల గానీ... రాజిగాడేడ్రా?

నర్సి : అదిగో వస్తున్నాడు... (రాజిగాడిలో చిన్న చిన్న మార్పులు కనిపిస్తున్నాయి. ఇంతకుముందు లేని ధైర్యమేదో ముఖంలో ప్రస్ఫుటమౌతోంది. మోకాళ్ళ వరకున్న చిలకట్టూ ఇప్పుడు కిందకు దిగింది. బాడీ స్థానంలో ఒక చొక్కా వచ్చింది. పొదిలాగ పట్టుకున్న పుస్తకాల్ని ఇప్పుడు పుస్తకాల్లాగే పట్టుకుంటున్నాడు. చొక్కా జేబులో ఒక పెన్సిలుంది).

రాజి : (వాళ్ళను చూసి ఏమాత్రం బెదురు లేకుండా) ఏటి?

... ఏటిలగ వొచ్చారు.

డబ్బా : ఏటా మెడపోత్రమేట్రా?... రైతులం వొచ్చినావనే జంకు జడుపు లేకుండ బుర్రెత్తుకొని కళ్ళలో కల్లెట్టి మరీ మాట్లాడుతున్నా వేట్రా?

రాజి : నానేటి దొంగతనం సేసినాను... నీకాడ జడిసిపోడాకి.

కుల : సేన మాటాడినావు నోర్మూయ్యిరా! నీనోటిపోత్రంతోటి మంగలోలికెవుడికి ఊల్లో బతుకులేకంట సేసీనట్టున్నావు.

రాజి : మీ అందరి ఊసునాకేల? నానీమంగలపన్జెయ్యడం మానేసినాను.

నర్సి : (ఈలవేసి) సెబాసో!....

డబ్బా : మానేసి....

రాజి : కూలోనాలో సేసుకొని బతుకుతాను..

డబ్బా : నీలాగే ఊళ్లో మంగల్లంతా అంటే... తర్వాత చాకల్లంటే! ఆ తర్వాత కమ్మర్లు, కుమ్మర్లు, సాలెలు, కంసాల్లు... ఒకలి తర్వాత మరొకలు ఇదేమాటంటే.

| | | |
|---|---|---|
| రాజి | : | ఆళ్ళిందరి ఊసునాకొద్దు... నాను ఇకన బట్టి ఎవుడింటికి రాను.. ఎవుడికి గెడ్డాలు, మీసాలు గియ్యను. సవరాలు సెయ్యను. |
| కులపెద్ద | : | మరి తిండో |
| రాజి | : | మీరెవులు నాకు పొల్లాయిలివ్వొద్దు. మా మెవులం కూటికి, కూరకి, గెంజికి, అంబలికి అన్నం ముద్దకు మీగడవ లెక్కం... మా బతుకులేదో మాము బతుకుతాం. మమ్మల్ని వదిలెయ్యండి. |
| డబ్బా | : | నీకేవైనా పిచ్చి పట్టిందిరా? తొత్తుకొడకా! ఒంటిమీద స్పృహ ఉండే మాట్లాడతున్నావా? |
| రాజి | : | ఇదిగో ఇలాటి అవమానమే వొద్దు. |
| డబ్బా | : | ఒరే మా మాటలు ఇనకపోతే ఇక్కడతోటి ఆగదురా? ఇంకా ఎక్కువైపోతాది? |
| రాజి | : | నాకిష్టం లేని పని నాచేత ఎలగ సెయ్యిస్తారు. |
| డబ్బా | : | ఎందుకిష్టం లేదు |
| రాజి | : | దానికి కారణమేటుంటాది? |
| డబ్బా | : | నువ్వు మంగలి పన్జెయ్యడానికి మాత్రం కారణమున్నది. |
| రాజి | : | ఏటది? |
| డబ్బా | : | నువ్వు మంగలోడిగా పుట్టినావు కాబట్టి. అది నీ కుల వృత్తి కాబట్టి. |
| రాజి | : | నీ కులవృత్తేటి? అది నువుసేస్తన్నావా? నువు సెయ్యనప్పుడు? నానెందుకు సెయ్యాలి. |
| డబ్బా | : | మాటకు మాటనేర్సినావు రా... కులవృత్తి మానీసి మరొకపని నేర్సుకున్నాడ్ని ఎవరు బలవంతం సెయ్యర్రా? సాకలి నర్సిగాడి కొడకు సదువుకొని, ఎమ్ఆర్ఓ దగ్గిర బంట్రోతుగున్నాడు. ఆడొచ్చి బట్టలుతకమంటున్నాంరా! మీ మంగలోడే ఎంకటసామి తమ్ముడు పోలీసైనాడు ఆడొచ్చి. మా గెడ్డాలు గియ్యరా అంటున్నాంరా! ఓరి ముసిలోడా? ఆడెవుడ్రా? శ్రీకాకుళంలో సెలూన్ పెట్టుకున్నాడు... |
| కుల | : | మంగలి సూరిగాడు. |

డబ్బా : ఆడ్ని ఆపని వొదిలేసి వచ్చేసి ఇక్కడు బుర్రలు గొరగమటున్నాంరా! పట్నంల సెలూనెట్టుకున్నాడు... పైసా పరక సంపాయించు కుంటున్నాడు.... మనూరి రైతులకన్నా దర్జాగా బతకతన్నాడు. ... పట్నమెలిపోనాడనే మాటే గానీ ఊళ్లో రైతు కుటుంబాల్ని వదిల్నాడురా.

కుల : శ! శ! ఎవలింట్లో పెళ్ళి, పేరంటమని తెలిస్తే సాలు ఎలిపొస్తడు – మంగలరికం సేసుకొని ధాన్యమో, బియ్యమో మోసుకొని ఎలిపోతాడు.

డబ్బా : నానొకపాలి సూసినాను ఆడి పెళ్ళం ఒంటిమీద ఎంత బంగారముందని?

నాలుగు పూటలు తిన్నోడు, నలుగుర్లోన తలొంచుకెలిపోతే మర్యాదరా!

కుల : మా సిన్నకులాలకి ఎప్పుడుకీ అదే సేమం.

డబ్బా : నాను సెబుతుంది మీగురించేర్రా? మాకేర్రా? కూటికి లేకపోయినా, కులానికెక్కువైతే సాలురా? ఏటిసేసినా సెల్లిపోతాది.

రాజి : ఆరోజులు పోనాయి?

డబ్బా : అంటేర్రా నీ ఉద్దేశ్యం! (మీద కెళ్ళాడు)...

రాజి : మీద మీద కొస్తన్నావేటి?

కుల : అయ్యయ్య!... (డబ్బాగాడ్ని దూరం జరిపినాడు)

డబ్బా : ఒరే! అయిద్రాబాద్ తీసుకెళ్ళమని బతిమాల్తుంటే, అమాయకంగా అడుగుతున్నావనుకున్నాను... కానీ మిగిలిపోనావురా! కడుపులో సేనా ఉన్నాదిరా!... కక్కిస్తాను... లఖ్మీకొడకా కక్కిస్తాను... ఇదిగో ఇదే ఊళ్ళో నువ్వు రైతులందరిళ్ళకు తిరిగి తిరిగి బాబూ! నాయినా! తప్పయిపోయిందీ మీ గెడ్డాలు గీస్తాను... రండీ మీ సవరాలు చేస్తాను అని నువ్వు బతిమాలు కొనేటట్టు చెయ్యకపోతే నా పేరు సిల్లంగి సోవినాయుడే కాదు!

రాజి : ఇదిగో నాను చెబుతున్నాను ఇను.. నాను మళ్ళా నా సేతితో మంగలి పొది ఒట్టుకుంటే, మళ్ళా నాసేతులతో ఎవడికైనా గెడ్డం గియ్యాల్సొస్తే, సవరం సెయ్యాల్సొస్తే మా కులం పెద్దది, మా కులం గొప్పది అని బులిసిపోతున్న మీ పెద్దన్నగాళ్ళ కెవలికీ సెయ్యను... అదిగో

అక్కడున్నారే బారికోడు, అసిరిగాడు – ఒకడు మాలోడు, మరొకడు మాదిగోడు– ఆళ్ళకి గీస్తాను...

బారికోడు, అసిరిగాడు: (బిక్కమొకమేసారు) ...

డబ్బా : రాజికీయం గూడా నేర్సినావన్నమాట. ...పదరా' కులపెద్ద.. నాయుడితో సెప్పీద్దుం... సెప్పీద్దుం అన్నావుకదా! పదా! సెప్పీద్దుం...

(ముగ్గురు కదిలారు – వాళ్లవెనకే అసిరిగాడు, బారికోడు కూడా వెళ్ళారు)

నర్సి : ఒరే అయ్యా! ఇన్నాళ్ళెందుకు బతుకుతున్నానా అనిసేనా దిగులు పడిపోయీ వోడ్నిరా... ఇప్పుడు తెల్సిందిరా ... ఎందుకు బతికున్నానో... (ఈరమ్మ వచ్చింది) అయ్యాః! ఈరమ్మ నెలతప్పిందిరా! అమ్మీ... ఈరమ్మా!...

ఈర : ఏం మావాః!

నర్సి : నాకొడుకు గోప్పోడైపోనాడే... ఎంత గోప్పోడైనాడంటే...

ఈర : ఉండుండు... ఎసట్లో బియ్యం పోసేసివత్తాను... (ఈరమ్మలోనకెళ్ళింది... నర్సింహులు పాటందుకున్నాడు...)

పాట:

వినవే – వినవే – వినవే
మనకుల ఘన వీరగాథ
ఈ నరసింహ పుత్రుని శూరగాథ ॥వినవే ॥

1 కాకులు నిండిన కారడవిలో
ఒక కోయిల కూసింది
విలువే లేని ఉల్లి చేనులో
ఒక మల్లియ పూసింది
ఉల్లికి మల్లికి తేడాతెల్సి
ఊరే మురిసింది ॥ వినవే ॥

2 ఊరికిసేవలు చేసిన చేయి
కలమే పట్టింది

ఆ కలమే బలమై కలవారికి
ఎదురై నిల్చింది
కారుమబ్బులు కమ్మిన వేళ
తళతళమని మెరుపే మెరిసింది
అది ఫెళఫెళలాడి
ఉరుమై ఉరుమింది ॥ వినవే ॥

(పాట మధ్యలో ఈరమ్మ వచ్చి వాళ్ళతో కల్సి పాడింది... పాట పూర్తవుతుండగా అన్నం తెస్తానని లోనకు వెళ్ళి... కంచంలో వేడి, వేడి అన్నమేసి పట్టుకొని ఒక ముద్దచేసి తినిపించబోతుండగా... దగ్గ తెరక్రమ్ముకొచ్చి నర్సింహులు నేల కొరిగిపోయాడు. అంతవరకు కమ్ముకున్న మేఘం కురవడం ప్రారంభించింది).

**(లైట్స్ ఆఫ్ - లైట్స్ ఆన్)**

## 9వ సన్నివేశం

బామ్మగారి ఇల్లు

(వర్షం ఉండీ ఉండీ పడుతుంది, బామ్మ హడావిడిగా ఒక సూట్కేసులో బట్టలు సర్దుకుంటుంది)

బామ్మ : ఈ అమ్మాయింక రాలేదు– ఆ వెధవ బట్టలు తీసుకురాలేదు. (బయటినుండి బస్సు హారను వినిపిస్తుంది) ఉండరా వెధవ నువ్వు హారను కొట్టినంత మాత్రన ఇక్కడ పనులు తెమలొద్దేవిటీ! (బయటికి చూసి గాబరాగా మళ్లీ లొనకొచ్చింది). ఒరేయ్ కిష్టప్ప

కిష్టప్ప : (లోనుండి వస్తూ) ఇదిగో ఈ చీరెలు పెట్టుకో చాలు... ఇస్త్రీవి లేకపోతె కొంపలు మునిగిపోవుగా! వెళ్తున్నది తీర్థయాత్రలకు! పెళ్ళికి కాదు.

బామ్మ : రోజుకో చీరకట్టుకున్నా ఏడు చీరలొద్దట్రా!

కిష్టప్ప : నీకు వయస్సు పెరిగేకొద్దీ స్టైల్ పెరుగుతుంది సుమీ

బామ్మ : ఒరే పాకిస్తాన్ ప్రసిడెంట్ భుట్టో తనను ఉరితీసేముందు నున్నగా సేవ్ చేసుకున్నాట్ట. అదిచూసి నీలాంటి విలేకరెవడో చచ్చేముందు ఈ సోకేమిటో అని అడిగితే భుట్టో ఏమన్నాడో తెలుసా! "I will enter the new world with a clean face" అన్నాట్ట వయస్సు పెరిగినప్పుడేరా అందంగా కనిపించాలి. ముఖ్యంగా దేవుని దగ్గరకెళ్లినప్పుడు. దేవుడు కూడా ఇది ఎవర్తో చాలా బాగుందని తొందరగా తీసుకెళ్లిపోతాడురా. (మళ్ళీ హారన్ వినిపించింది)

కిష్టప్ప : తొందరగా బయల్దేరవే!

(బయటినుండి చాకలి బుడ్డిగాడు నెత్తిమీద బట్టల మూటతో పట్టుకుని పరుగెత్తుకుంటూ వచ్చాడు)

బుడ్డ : అమ్మా! ఇగోమ్మా నీ కోకలు.

(నెత్తిమీద మూటలు స్టూలుమీద పెట్టాడు – బయటినుండి బుడ్డిగాన్ని తరుముకుంటూ వచ్చిన ఒక కుర్రాడు – బుడ్డిగాడి మీదపడి పక్కకు తోసేసాడు)

కుర్రాడు : లక్ష్మీకే – ఇప్పు... ఇప్పు...

బుడ్డ : ఇప్పుతానులాయండి

కుర్రాడు : ఇప్పీసిఇయ్యిరా

బుడ్డ : ఒంటిమీద్ది ఎలాగిచ్చేత్తానండీ! రేపు ఉతికిచ్చేత్తానులే....

కుర్రాడు : ఓర్రేపు నాను విలేకరి ఇంటర్వ్యూకెల్తన్నాన్రా.

బుడ్డ : ఎల్తే! ఇదే ఏసుకొని ఎల్లాలేటి?

కుర్రాడు : నాకున్న దాంట్లో ఇదే మంచిందిరా! అయినా నా సర్టు ఎవుడేసుకోమన్నాడ్రా.

బుడ్డ : సూడమ్మా ఈలమాటలు! ఈయాలప్పుడు మీకోకలు ఇస్త్రీపెట్టేసి ఇవతకొచ్చీసరికి వర్షం పడుతంది. అలివిగాని సలేస్తుంది. ఏటిసేద్దునూ అని ఆలోసించీసిరికి ఈ బుస్‌కోట్ కనపడ్డాది. తొడుక్కూని ఎలుపొచ్చినాను.

బామ్మ : (బుడ్డిగాడు తెచ్చిన బట్టలు సూట్కేసులో సర్దుకుంది) స్సరి... స్సరి... ఇదిగో బాబు! నీ షర్టు ఉతికి రేపిస్తాడులే...

కుర్రాడు : నువ్వు ఈదిలోకి రా! నీ పన్చెస్తానురా నా కొడకా... (కోపంగా చూస్తూమారీ వెళ్లాడు)

బామ్మ : ఒరేయ్ః! కిష్టాయ్!

కిష్టప్ప : ఆ బామ్మ!

బామ్మ : నేనుండనని ఇంటిపట్టున చేరకుండా తిరిగేవు! ... ఆ తులసిమొక్కకి నీళ్ళుపోసి ఇంట్లో దీపం అదీ వెలిగిస్తూ ఉండు... ఆవులవి జాగ్రత్తా.... ఎవరిదైనా సెల్ తీసుకుని మాట్లాడుతుంటానులే..

కిష్టప్ప : ఇదిగో... నువ్వెళ్లిపోయినా ఇక్కడ పనులకు ఆటంకం కలగనివ్వనులే..

బామ్మ : అంటే ఏ... ఏ... పనులు చేస్తావుట.

కిష్టప్ప : అన్నీనూ...

బామ్మ : అన్నీ అంటే!

కిష్టప్ప : ఫర్ ఎగ్జాంపుల్... చదువులు... నువ్వ చెప్పే చదువులున్నాయి చూడూ... అవన్ని నిక్షేపంగా కొనసాగుతాయి.

బామ్మ : ఎవరి చదువులు!

కిష్టప్ప : అందరివీ... ఫర్ ఎగ్జాంపుల్... కమల కొడుకు... వాడికి చదువుపెప్పకుండా వదిలేస్తానా!... నీ ఆరోగ్యమది జాగ్రత్తా.

బామ్మ : ఆ కుర్రాడికి చదువు చెప్తావట్రా!

కిష్టప్ప : నాకు గొప్ప అవకాశం కదటే... వాడుకోను!

బామ్మ : నీ ప్రాప్తాన్ని ఎవడు తప్పించగలడు. (బయటి నుండి బామ్మగారు అని కేక వినపడింది)

కమల : (చేతిలో ఒక సూట్కేసు పట్టుకుని లోనకొచ్చింది) వెళ్దామా బామ్మగారు!

కిష్టప్ప : ఏవిటి నువ్వుకూడా వెళ్తున్నావా!

బామ్మ : నువ్వేమి కంగారుపడకు... కుర్రాడ్ని ఉంచేస్తుంది. నువ్వు చెప్పాలనుకున్న పాఠాలన్ని చెప్పేసేయ్. నీ టెన్షనంతా కుర్రాడి గురించేగా.

కిష్టప్ప : బామ్మ!

బామ్మ : (కుర్రాడ్నిలోనకు పిల్చింది) ఒరేయ్! నువ్వుండిపోరా. పంతులుగారు నీకు రోజూ పాఠాలు చెప్తాడంటా. ఏరా కిష్టప్ప వీడ్నిఇక్కడే వుండనీ నీకూ తోడుంటాడు.

కిష్టప్ప : వీడు తోడు! నీకు అంతా వేళాకోలం అయిపోయిందే!

కమల : నాను కూడా బామ్మకు తోడుంటాలనే ఎల్తున్నానండి.

కిష్టప్ప : నువ్వు బామ్మకుతోడు... నాకు వీడు తోడు... బాగుంది. ఏమే! ముసల్దాన వీళ్ళంతా వస్తున్నారని నా చెవిలో వేస్తె నేనుకూడా రాకపోదునా.

బామ్మ : ఎందుకూ! తీర్థయాత్రలంతా నిన్ను కాపలా కాయలేక చచ్చేదాన్ని... పదమ్మా వెళ్దాం. ఇదిగో ఆ సూట్కేసు అవతల పెట్టు.

కిష్టప్ప : (గుర్రుగా చూస్తూ సూట్కేసుతీసుకుని బయటపెట్టాడు) కొంప దాటండి వర్షం తెరిపిచ్చింది.

బామ్మ : వెళ్లొస్తాం ... జాగ్రత్తా!

కిష్టప్ప : జాగ్రత్తే! వెళ్లండి వెళ్ళండి

(బామ్మ, కమల, పిల్లాడు బయటకు వెళ్లిపోయారు)

కిష్టప్ప : హమ్మ ముసల్దానా! కోడి పిల్లను రక్షించినట్టు రక్షిస్తున్నావుకదే. ఆకాశంలో గెద్దలాడుతుండగా ఎంతకాలంమని కాపాడుతావే! ఖర్మకాలి పద్ధతి చెడింది తప్పా స్వభావరిత్యా కమలది కూడా మంచి బుద్ధే. మా ముసల్దాని కస్టడిలోకి వచ్చాక మనిషే మారిపోయిందటున్నా రందరూ. నాయుడ్నికూడ రావద్దని చెప్పేసిందట. అంత మంచిగుణం అలవడ్డం మాటల్తో పనికాదు. ఇదిగో నన్ను సూడండి పూజచేస్తున్నంత సేపు అనిపిస్తావుంటది మంత్రమొక్కటే మోక్షసాధనమని. కానీ బయటికొచ్చి చెప్పుల్లో కాలుపెట్టకముందే మనసు మోహంలో పాదాలు దూర్చేసి కోరికల వెనుక పరుగు తీస్తుంటది. మళ్లీ మొదలు మాయ, మతలబు, మాటలగారడి, జుట్లు ముడేయటం, తంపులు పెట్టడం, తన్నుకు చస్తుంటే చూస్తూ ఆనందించటం – ఒర్నాయినో జీవితం ఇలాగే ఎందుకుందో ఎంత పట్టున అర్థంకాదు. కమలలాగ. అన్నట్టు కమల గురించి మనసు ఇంత పట్టు పట్టుకూర్చుందెందుకు? మనం మరీ అంత పట్టుదలకు పోకూడదేమో. కాకి వాలినట్టు, పండు రాలినట్టుండాలి కాని, మరీ కొమ్మట్టుకు దులిపేసినట్టుండకూడదు సుమీ. వయసుకు తగిన బాణీ ఎంచుకోవాలికదా. మందలిద్దాం, ముందు మనసుని మందలిద్దాం. విన్నాదా కమల మాట మర్చిపోవచ్చు. లేదో కమలని మందలిద్దాం, ఇదా పద్ధతి, అదా విధానం అని ప్రతిదానికి వంకలు పెట్టామనుకో వినేవాడుకూడా ఏదో పంతులు బుద్ధులు సెబుతున్నాడులే అనుకుంటాడు, కాని మనబుద్ధి కమలమీద పడిందని ఎవడికి అనుమానం రాదు. పంతులుగా పుట్టడం ఇదో అడ్వాంటేజ్. దాన్ని వాడుకుందాం.

(బయటినుండి పడమటోడు వచ్చాడు)

పడమ : పంతులుగారూ!

కిష్టప్ప : అయ్యా! నమస్కారం! ముహూర్తం కోసమేనా!

పడమ : అవునండీ.

కిష్టప్ప : కార్యమేమిటీ?

పడమ : మీరు రహస్యంగా ఉంచుతానంటే మొత్తం సెప్పేస్తాను.

కిష్టప్ప : రహస్యాన్ని కాపాడ్డం నా వృత్తి రహస్యం – చెప్పండి భయంలేదు.

పదమ : హైదరాబాద్ వెళ్ళాలి – ఒక రాజకీయ పనిమీద

కిష్టప్ప : రాజకీయమా? అయితే నాయుడికి తెలియనివ్వకండీ. దెబ్బకొట్టేస్తాడు.

పదమ : నాభయం అదే! పంతులుగారు!

కిష్టప్ప : మీరు నమ్ముకున్నాదేమో డబ్బాగాడ్ని – మీరు అనుమానిస్తున్నదేమో నాయుడ్ని – వాళ్ళిద్దరూ ఒక కులస్థులు, బంధువులు – అయితే ఒకటి నిజం! డబ్బాగాడికి డబ్బు పెడుతుండాలి గానీ బంధుత్వంకన్నా స్నేహానికి విలువిస్తాడు – మదువు ఆగిపోతే మాత్రం వెనకా ముందూ ఆలోచించడు – మెడకు చుట్టేస్తాడు.

పదమ : ఏదో ఒకటీ, దిగిపోయాను. ఏంజేత్తాం.

కిష్టప్ప : లేదు లేదు మీది చాలా మంచి నిర్ణయమే. గత శ్రీరామ నవమినాడు రాముడి కళ్యాణం చేయించారు చూడండి, అప్పుడు మీ జాతకం చూసాను. అద్భుతంగా ఉంది. వుబ్బిస్తున్నాననుకోకపోతే ...ఒక్కటి చెప్తాను... జిల్లా మొత్తాన్ని ఏల్తారు కాకపోతే కాస్తా జాగ్రత్తగా ప్లాను చేసుకోవాలి... దైవసహాయం కోసం, మీకు ఖాళీ దొరికినప్పుడల్లా ఓం నమశ్శివాయ అనుకోండి!...

పదమ : రోజు కెన్నిసార్లు అనాలి.

కిష్టప్ప : దేవుడ్ని స్మరించుకోవడానికి లెఖ్ఖేటండీ!
మీకెప్పుడు తీరుబడి అయితే అప్పుడే...
ఇంతకన్న ఇంకేమీ అక్కర్లేదు–

పదమ : అవసరమైతే చెయ్యిద్దాం... పూజలవీ...

కిష్టప్ప : ముందుమీరు హైదరాబాద్ వెళ్ళిరండి...
నిజానికి మీ జాతకరీత్యా ... ఇవేమీ అక్కర్లేదు... అయితే పైన మబ్బులున్నాయి... ఇంట్లో గొడుగుంది... పట్టుకున్నామనుకోండి... వర్షమొస్తే వాడుకుంటాం... లేదూ... చేతిలో ఉంటుంది... తప్పేముంది... చెయ్యించాలని మీకనిపిస్తే... ఆతర్వాతే హోమం చెయ్యిద్దాం... ఇంకేమక్కర్లేదు.

పడమ : తొందరేమీ లేదు... చూసి చెప్పండి.

కిష్టప్ప : ఇహ చూడ్డానికేంలేద్సార్! ఇలాంటి అలాంటి జాతకం కాదు– గట్టిగా పట్టుబడితే ఉత్తరాంధ్రనూపేస్తారు.

పడమ : ఉత్తరాంధ్రానే

కిష్టప్ప : అంత తెల్లబోతారేంటండీ – గజకేసరి యోగముందండీ! మూడు జిల్లాల్లో ఎదురులేని నాయకులవుతారు... అయితే నరఘోష తప్పడానికీ గోదానం, సువర్ణదానం, సంవత్సరానికో సారి చేయండి – మీరనుకున్నది జరగకపోతే జంధ్యం తెంపేసుకుంటాను.

పడమ : అంతమాటలెందుకుగానీ... నాకు ముందూ వెనకా వుండీ మంచీ చెడ్డా చెబుతూ మరే నన్ను నడిపించాలి.

కిష్టప్ప : బ్రహ్మ దీవెన, బ్రాహ్మణ దీవెన ఉన్న వాడెవడూ చెడిపోడండీ.... మీకొక్క మాటచెబుతాను మీరేమనుకోనంటే...

పడమ : చెప్పండి... చెప్పండీ!

కిష్టప్ప : నేను చెప్పడం కన్నా, మీరు అర్థం చేసుకోవడం ముఖ్యం. మనదేశాన్ని ఏలిన మన చక్రవర్తులుగానీ, విదేశీయులుగానీ బ్రాహ్మణుడ్ని ప్రక్కనపెట్టుకొనే పాలించారు – ఇది ముస్లిమ్‌ల వరకు చక్కగా సాగింది. ఆఖరకు అక్బర్ దగ్గర తోడరమల్లుడనే బ్రాహ్మడు ప్రధాన మంత్రిగా ఉండేవాడు. ఇంగ్లీష్ వాళ్లు మాత్రం వాళ్ళ మతాన్ని ఇక్కడకు దిగుమతి చేశారు.

రెండు వందల ఏళ్లకే బిచాణా ఎత్తేశారు. కాబట్టి నేను చెప్పొచ్చేదేమిటంటే, ప్రక్కన బ్రాహ్మణుడ్ని పెట్టుకోవడమంటే జ్ఞానాన్ని జ్ఞానాన్ని పెట్టుకోవడ మన్నమాట. మా నాయుడి లాంటి మూర్ఖులకు ఈవిషయం అర్థంకాదు. నన్ను మంగలాడింటికి వెళ్లి ఆ రాజిగాడ్ని పిల్చుకురమ్మని పురమాయించిందా మహాతల్లి. ఏవైందీ! వాడెదురు తిరిగాడు. ఇహ ఏవుంది నాయుడి గొప్ప!

పడమ : నేనూ ఇన్నాను! ఆ రాజిగాడు చాలా పొగరెక్కి ఉన్నాడు–

కిష్టప్ప : వాడు పొగరెక్కితేనే మీరు కుర్చీ ఎక్కగలరు.

పడమ : అదేటండీ!

కిష్టప్ప : అదంతే!... రాజకీయంలో ఎదగాలనుందా చాలా! సెప్పండీ!

పదమ : మీతో చెప్పదాకి బయమేటి! నేనైతే ఉబలాడపడతన్నాను గానీ స్థానికుడ్ని కాను, నన్ను లేవనిస్తారా?!

కిష్టప్ప : ఉత్తరాంధ్ర గొప్పదనం అదేగా! ఇప్పుడు వైజాగ్ అంతా పెద్ద పారిశ్రామిక నగరమా? ఈ మూడు జిల్లాల వారికీ ఎన్ని ఫ్యాక్టరీలున్నాయో లెక్కచూడండి! కాలేజీలున్నాయో కనుక్కోండి! యూనివర్సిటీలున్నాయో అడగండి! మొత్తం అన్నీ బయటివాళ్లవే. మావోళ్ళు గొప్పోళ్ళు అవ్వాలని అనుకోరు – గొప్పవోళ్లు మనకు తెలిస్తే బాగుణ్ణు అనుకుంటారు – సిఎం, పిఎం లు కావాలని తపించరు – వీళ్ళు వెళ్ళిన వెంటనే భుజం మీద చెయ్యి వేసి ఇంటర్వ్యూ ఇచ్చేస్తే చాలు పొంగిపోతారు – ఇప్పుడే సిఎంని కలిసొచ్చానని చెబుతూ సంతోషపడిపోతారు. మాకు పద్మశ్రీలు, భారతరత్నలు రావాలని ఆశపడరు – ఆ వచ్చినవాళ్ళకు సన్మానాలు చేసి సరదా పడిపోతుంటారు. గత ఎలక్షన్సులో వైజాగ్ సీటు నాదని ఒక్క లోకల్ లీడర్ అనలేకపోయాడు గానీ ఇద్దరు నాన్‌లోకల్స్ నాదంటే నాదని కొట్లాడుకున్నారు. –

అంచేత మీరు ధైర్యం చేయగలిగితే, కాస్త డబ్బు ఖర్చు పెట్టగలిగితే మీరొక ఎదురులేని నాయకుడు కాగలరని నా నమ్మకం. ఇది నేను సెప్తుతున్నది కాదు.... మీ జాతకం చెబుతున్నమాట.

పదమ : (రెండు, చేతులు జోడించి) ఏం చేస్తారో బారమంతా మీదే. ఇక్కడివాడ్ని కాదు.

కిష్టప్ప : ఆభావన మీ బుర్రలోంచి తీసెయ్యండి. పాండవులు కూడా అజ్ఞాతవాసం పూర్తయ్యాక హస్తినకు వెళ్ళి దుర్యోధనుడితో యుద్ధం చేసారు. కానీ మీరు అధికారాన్ని చేపట్టడానికి నేటివ్ ప్లేస్‌కు వెళ్ళక్కర్లేదు. ఇక్కడే, ఈ ప్రాంతమే మీకు అనుకూలం. శుభం భూయాత్!

**(లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్)**

## 10వ సన్నివేశం

నాయుడి ఇల్లు–

నిన్న ఆరంభమైన వర్షం అలానే కురుస్తోంది – మధ్య మధ్యన చిన్న తెరిపిస్తుంది. గానీ వర్షపు చిత్తడి మాత్రం వదల్లేదు.

నాయుడు : ఒరే డబ్బాగా!

డబ్బా : బావ!

నాయుడు : ఆ పడమటోడు రెండు రోజుల్లో వస్తానన్నాడు – మళ్ళా కనబడ్లేదు –

డబ్బా : ఏటో బావ! నాను కూడా ఆపొద్దు ఇక్కడ సూడటమే–

నాయుడు : రిజిస్ట్రీ సేసీ సుంటాడా?

డబ్బా : ఉండు అడుగుతాను. (జేబులో ఫోను తీసాడు – నంబరు నొక్కాడు) నాట్ రీచ్‌బుల్ వస్తంది బావా!

నాయుడు : ఆడికి సెల్ ఉందేట్రా?

డబ్బా : ఇప్పుడు లేని దెవడికీ? మనూరు అవతల పాకలేసుకొని బాతులోలున్నారు సూడు!

...ఆళ్ళకి కూడా ఉన్నాయి. సేతిలోన సెల్లు – పాకలోన టివి! నవ్వుంటే వాడవుగానీ...

మంగమ్మ : ఎందుకు వాడడు... పడక గదిలోకి ఎల్లి, తటపులు బిడాయించుకొని– అర్ధరాత్రి వరకు కుస్ కుస్ కుస్ మని మాట్లాడుతాడురా నాయినా...

డబ్బా : పల్లకో అప్పా నువు మరీ చెబుతావ్. తలుపులు బిడాయించుకుంటే, వన్నారిలోనున్న నీకెలగ ఇనబడిందే.

నాయుడు : దాని మాటలుకేటీ వదిలీ లేరా!

మంగ : ఎలగ ఇన్నానో నువు సెప్పరాదేటి?

నాయుడు : ఒసే అంత సరదాగుంటే నువ్వేసెప్పు నాకేటి భయ్యమూ?

డబ్బా : నాకు టెన్షన్ గుంది... ఎవరో ఒకలు సెప్పండి.

మంగ : ఒకరోజు రాత్రి మీ బావకన్న ముందు గదిలోకెళ్ళి మంచంకింద దాగున్నాను. నన్ను సూసుకోలేదు. తలుపులేసేసి, మంచమెక్కి ఇకన ఒకటే ఇక.. ఇకలు, పక.. పకలు... అర్ధరాత్రి అయ్యింది.

డబ్బా : అవతలెవలు అప్పా!

మంహ : అది తెలుసుకుందావనే ఫోనాపి వరకు ఆగి, ఎల్లి సూస్తును గదా!

డబ్బా : తెల్సిందా?

మంగ : మీ బావ అంత తక్కువోడా?

మాటలు అయిపోయినెంటనే నెంబరు సెరిపేసినాడురా!.

డబ్బా : అమ్మ దొంగ బావా! అవతల ఎవలు బావా?!

నాయుడు : సెప్పుదీసి కొడతాను.

డబ్బా : నాకెందుకు లే గానీ!

నాయుడు : ఆ పడమటోడి నెంబరు రాసి ఇయ్యి. (గబగబా నెంబరు రాసి ఇచ్చాడు) అవున్రా ఆ రాజిగాడి సంగతి ఏటయ్యింది – (పడమటోడి నెంబరున్న చీటీ జేబులో పెట్టుకున్నాడు).

డబ్బా : బావా! నాను కాబట్టి ఓర్సుకున్నాను గానీ నువ్వైతే మాత్రం ఆడిబుర్ర పెటీల్మని పేలగొట్టీద్దువు– ఆడంటాడు– రైతుల బుర్రలు గియ్యడట... ఇదుగో ఈల్లవి... మాల మాదిగల బుర్రలు గీస్తాడట.

అసి : ఆడుగీస్తే మాత్రం మావు గీయించుకుంటామా?

బారి : కాఫీకొట్టుల్లో రెండు గలాసులుండేవి. ఇప్పుడు తీసేసినారు... ఆలుతీసేస్తే మట్టుకు మావుతాగేత్తాన్నామా?.

అసి : మా ఒబ్బిడి మాకుండదా? ఇక్కడ మా గలాసులు ఏరేగా ఎట్టుకోవడం లేదా? ఇలాటి ఇసయాల్లో ఎవుడినీతి ఆడికుండాలి గానీ ఎవుడి కెవుడు సెప్పగలడు.

నాయుడు : అయితే ఆడు రాజకీయం సేత్తన్నాడ్రా!

డబ్బా : సరిగ్గా నాను ఇదే మాటన్నాను.

నాయుడు : ఇవన్నీ ఆడి కెవులు నేర్పిస్తన్నార్రా?

డబ్బా : ఎవుడు నేరిస్తారు బావా! ఆడి బుర్రకు పుట్టిన పురుగది.

కాకపోతే మన బేమ్మర్ల బామ్మ ఉంది కదా! ఆయమ్మ దగ్గర అక్షరాలవి నేరుస్తున్నాడు.... కానీ ఇలాంటి చేష్టలంటే బామ్మమాత్రం ఊరుకుంటదా?

మంగ : లేదు లేదు. ఇలాంటివి మొదట్లోనే తెంచాలి... ఆ పంతులకి సెప్పి ఆలింటికి రావద్దని చెప్పమను.

డబ్బా : ఆలింటికి ఎల్లడం మాటకేవిగానీ బావా!... అదిగో రాజిగాడి పెళ్ళాం మనింటికే వస్తంది.

నాయుడు : అదేలవొస్తంది... ఒరేదాన్ని రానియ్యకండిరా!

డబ్బా : అబ్బా ఆగు!

నాయుడు : నీకు తెలీదు. ఆలు నాగడప తొక్కడానికి వీల్లేదు

డబ్బా : ఒక్క రెండునిమిషాలు ఆగు! ఎందుకొస్తందో సెప్పనీ!

(లోనకొస్తున్న ఈరమ్మని గుమ్మం దగ్గరే ఆపింది మంగమ్మ)

మంగ : ఏ మొకమెట్టుకొని నా ఇంటికొచ్చినావే!

ఈర : రాకూడని నేరం మావేటి సేసినావమ్మా!

(మంగమ్మ లోనుండి వస్తూ ఫైర్ అయిపోయింది)

మంగ : ఒలే! కూటికి లేనిదానా! కులం లేనిదానా!... నీకు నోరెలాగ తిరుగుతందే! కాదూ.... నీకు నాలిక ఎలగ తిరగతందే! మనిసంత మనిసి! సెట్టంత మనిసి! ఊరికి నాయుడు! పదిగేమాలకి ఉచ్చ! అలాంటి మనిసి గెడ్డం గియ్యమంటే గియ్యి కంట ఒంటి పోత్రం మాటలాడుకొని ఎలిపోస్తే, పెల్లానివై ఉండి ఏట్రా అలగా పొగరుపడి పోతన్నావని సిల్లా పల్లా సితకొట్టీ కంటా, ఏవినేరం సేసినావని, ఆనా గండడు సేసిన్దానికి సేమాకులు యెడతన్నావే సేమాకులు! ఊర్లోని రైతుల మాట వినకపోతే తినడానికి బువ్వ ఎలగొస్తాది? తాగడానికి దప్పికెవలు పోస్తారే – గిన్నెలోకి గెంజెలగొస్తాదని ఆ బాడుకోవుని అడక్కంటా...

ఈర : ఏటన్నావమ్మా! తిండికి బువ్వెలగొస్తాదా! గిన్నెలోకి గెంజి ఎలాగొస్తాదా? ఈ కులరుత్తి మానెత్తిన రుద్ది మాసేత ఎట్టిసేకిరి సెయ్యించక పోతే కూలీనాలీ సేసుకొని మావు బతగ్గలమమ్మా! గొప్పు కెళ్తామంటే మంగల్దానవు నువ్వేటి సెయ్యగలవు? ఉడుపుకెళ్తామంటే మంగల్దానవు నీకేటివస్తాది? కోత కొస్తావంటే మంగల్దానవు నీ వల్ల అవ్వదు... మాకేటి రాదు రాదు... రాదు రాదు... అని మాకొచ్చింది కూడా మర్సిపోయినట్టు సేసేస్తన్నారు కదమ్మా! ఆకరకు ఆ ఉపాదిహామీ డబ్బంతా అలాగ ఊరంతా తింతన్నారు. మాకెవరైనా పిలుస్తున్నారా? ఒక పైసా ఇస్తన్నారా? ఎవసాయపు పనులకి మమ్మల్ని ఎల్లనిస్తన్నారా?

నాయుడు : ఒసే.. ఎవసాయపు పన్లు చెయ్యడానికి నువ్వేటి రైతు పుట్టుక పుట్టినావేఁ!

ఈర : ఏ కష్టమో చేసి కడుపు నింపుకోవాలి గదయ్యా!

మంగ : రేపుటినుండి నువ్వూ, నీ మొగుడు పొలం పనులకెళ్లి పోయండి. ఆడు నాగలొట్టుకొని దున్నేస్తుంటే, నువు మునుం పోసేసి ఇత్తనాలు ఏసేద్దువు గానీ...

ఈర : దేవుడు కాలుసేతులు అందరికీ సమానంగే ఇచ్చినాడు.

డబ్బా : ఇప్పుడేల వచ్చినావు.....

ఈర : రాతిరి మా మావ సచ్చిపోనాడు.

నాయుడు : అయితేఁ!

ఈరమ్మ : సూస్తన్నారుకదా! ఒకటే ముసురు... సచ్చినోడ్ని దహనం సెయ్యాలి. కసిన్ని పిడకలిస్తారని.

నాయుడు : ముసురంటే అందరికీ ముసురే.... పిడకలు నా దగ్గిరెక్కడివి?

మంగ : ఇంత పెద్ద ఊరులోన పిడకలే పుట్టలేదురా! లేవు... లేవు... మాకాడ లేవు

ఈర : లేవు... లేవు... లేవు.. ఊరంతా ఇదేమాట అంటున్నారు. కాదు మీరే అనిపిస్తున్నారు... ఇది మంచిది కాదు. మీరేటి జయమై పోరు.

డబ్బా : ఏటే సాపాలేడ్తన్నా వేటే?

ఈర : తంతేనాలుగు తన్నండి... కొడితే నాలుగు కొట్టండి. ...అయ్యా! నీ కాలుమొక్కుతాను... సచ్చిన శవం ఇంట్ల ఉండిపోనాది... వంజిడికఱ్రలు ఒక గంపడు పిడకలివ్వండి.... మాకేటి వట్టినివ్వొద్దు... మీరే పనే జప్పితే ఆపన్జేసేస్తాను.

నాయుడు : ఏ పన్లు సేత్తారే! గవర్నరు ఉజ్జోగాల్జేస్తారా? పెసిడెంట్ పదవుల్జేస్తారా? మీ కులరుత్తి సేసుకుంటాడో లేదో ఆడ్ని సెప్పమను.

ఈర : దానికీ దీనికీ లంకేటి సెప్పయ్యా!

డబ్బా : మరి దేనికీ దేనికీ లంకో నువ్వే సెప్పు. ... ఆడేటన్నాడో నీకు తెల్సు? ...రైతులకెవలికీ మంగలపని సెయ్యనన్నాడు. అందుకే ఇప్పుడు రైతులెవలు ఒక్క పిడక ముక్కైనా ఇవ్వనంటున్నారు.

ఈర : ఆ మనిషికి పోగాలం వచ్చి ఏమాట బడితే ఆమాట పేల్తన్నాడు... అవన్నీ మనసులో ఎట్టుకుంటారా? అయ్యా! అమ్మా! ఆ మనిషి అన్న మాటలే గానీ నా ముకం సూడరా! మా ఇంట్లో నాను పురుళ్ళు పొయ్యలేదా! సావులు, నమర్తలు సెయ్యలేదా? ...మీయప్పజెల్లిలు పట్నంల సదువుతున్నప్పుడు కాలుజారి కడుపు సెయ్యించుకుంటే, మీ మొగుడు పెళ్ళాలు ఇద్దరు ఆ పొద్దు నన్ను బతిమాల్తే, సికాకుళం ఆస్పత్రికి తీసుకెళ్ళి....

మంగ : ఒలే గుండె మీజ్జేసి తంతాను... లంజికానా!

ఈర : తన్నమ్మా! ...లోపుటి వన్నీ బయటకొస్తాయి.... తన్ను...

నాయుడు : (పరిస్థితి గమనించాడు... ఇంకా సాగదియ్యకూడ దనుకున్నాడు) ... ఇదిగో నువుపల్లకు!... నీక్కావాల్సింది పిడకలేకదా! ఒరే డబ్బాగా....

డబ్బా : ఇచ్చి పంపిస్తాను... రాయేఁ!

మంగ : పిడక కాదు... కచ్చిక గూడా ఇవ్వకూడదు.

నాయుడు : ఆఁ! సులకన దానితోటి నీకేటి?... ఎల్లే....

ఈర : ఆఁ! బరువైనోళ్ళ బాగోతం నాకు తెల్దుమరి.

(ఈరమ్మ పిడకల కుచ్చిరవైపు డబ్బాగాడి వెనుక వెళ్ళింది)

మంగ : నీకు సేతగాకపోతే ఆ నాయకరమేదో నాకప్పగించు...

నాయుడు : ఎందుకు? నలుగురిలోన పరువు తీసిడాకా?

మంగమ్మ : నీ మొకానికి పరువొకటి?

నాయుడు : మాటలు తగ్గించు.

మంగ : మనింటి గుట్టు బయట పెడతుంటే సాతకానోడిలాగ సేతులు నులుపుకొని కూకున్నావు?

నాయుడు : ఏటి సెయ్యాల? దాని నోట్లో నోరెట్టి మరింత పరువు తీసుకోవల?

మంగ : ఈళ్ళను దున్నపోతుల్లాగ ఎందుకు మేపుతున్నావ్? అంతేసి జీతాలిచ్చి ఎందుకుపెంచుతున్నావ్? దానినోటిలోంచి సెబ్బరం మాటొచ్చినెంటనే ఒరే దాని గుడ్డలిప్పి తన్నండ్రని సెప్పలేవా? నోరుపడిపోయిందా నీకు?...

(మరో పక్కనుండి ఈరమ్మ గంపడు పిడకలు నెత్తిమీద పెట్టుకొని వెళ్తోంది)

మంగ : ఒలే ఆగేఁ!

ఈరమ్మ : ఏటమ్మా!

మంగ : సావు పేరు సెప్పి అన్ని మోసుకుపోతన్నా వేటేఁ?

ఈర : ఇవేగదా!

మంగ : ఏది దించు (గంపదించింది) మీ మావ ఆరడుగుల జబరైనా మనిషా? చేపామాంసం తినీసి కండలు తిరిగి బలిసిపోనాడా? ఆడ్ని తగలట్టేడానికి అన్ని మోసుకెలిపోతన్నావ్?

ఈర : మోసుకెలి పోతన్నానా... మీ భూములు మోసుకెలి పోతన్నానా? మీ బాగ్యాలు మోసుకెలి పోతన్నానా?

మంగ : వల్లయితే అంత పన్జేసీదానవే.

ఈర : నీకెన్ని ఇయ్యాలనిపిస్తే అన్ని ఇయ్యి.

మంగ : ఆశకంతుండాలే. ....ఎల్లి తీసుకోమంటే నెత్తికన్ని ఎత్తుకుంటావా?

ఈర : నానెత్తుకో లేదమ్మా! అదిగో మీ తమ్ముడే ఇచ్చినాడు.

మంగ : అడికేటి బులిపించి నావో!

ఈర : బులిపించినానా? బులిపించిడానికి నాకేడేటున్నాదమ్మా!

మంగ : ఏవీ ఆడదానికావేటి? ...ఏవన్నావే ..నాను, నా మొగుడు ఆపొద్దు నిన్ను బతిమాల్నామా?...

ఈర : అమ్మామ్మా! ఇదిగో నీ కాళ్ళట్టుకొని మొక్కుతున్నాను. అవతల శవముండి పొయ్యింది. నా వల్లగానీ, నా మొగుడి వల్లగానీ ఏ తప్పు జరిగినా కాయండి. నన్ను ఎల్లనియ్యండి!

మంగ : ఒక్క పిడకముక్క ఇవ్వను...

ఈర : మళ్లీ మొదటికొచ్చిందీ యమ్మా! నాకేటీ సావు... ఆడి బదులు నాను సచ్చినా బాగుండేది.

మంగ : సచ్చిపోవాలనికున్న దానివి... ఇన్ని పిడకలట్టుకుపోతారేఁ!.. కట్టి కాల్చగ మిగిలినవి, అమ్ముకుందువనే గదా!

ఈర : ఓలే! పాలు, పిడకలు, అమ్ముకోడానికి, డబ్బుకోసమని గడ్డి తినే కులం కాదునాది. ఇచ్చినట్టే ఇచ్చి ఇంత కిలంకంయానికి ఎడతన్నావో నాకు తెల్దనుకోకు. నీ సెల్లి సంగతి ఎత్తినానని నీకు రోషం పొడుసుకొచ్చింది... మమ్మల్మి బూతులు తిడతారు. మాకు రోసం రాకూడదు... మీకు ఒళ్ళు కొవ్వితే మా ఒంటె మీద సేతులేస్తారు... నోరెత్తగూడదు... మిమ్మల్ని అనేపనిలేదమ్మా!... అదిగో ఆ దేముడు! ఆ ముండాకొడుకు ఎక్కడున్నాడో గానీ ఆడ్ని ఒట్టుకొని ఆడి బుర్ర గొరిగి పిండి సుక్కలెట్టాలి. ఇదిగో! మా మావకు దానం సెయ్య లేననుకుంతన్నావేమో! నా కాళ్లు సేతుల్ని పుల్లల కింద పెడతాను. నా రొమ్ముల్ని పిడకల్లుగా పేరుస్తాను... నా ఒంటికి అగ్గెట్టుకుని శవం మీద పడిపోయి దాన్ని కాల్సి నాను బూడిదై పోతాను. మాలోటోళ్ళం బతకదానికే కాదమ్మా! సావడానికీ, సచ్చింతర్వాత ఆబూవిఁలో కల్సిపోడానికీ మీ మీద ఆధారపడాల! థూ! నువ్వూ వొద్దు... నీ పిడకలూ వద్దు. ఇదిగో! నాను ఒట్టిమనిషిని కూడా కాదు... నన్నింత ఉసురుపెట్టినారు... నా ఉసురు తగలకపోదు.

(పిడకల గంపను ఒక్క తన్ను తన్ని వెళ్లి పోయింది).

డబ్బా : బావా! కథ సేనాదూరం ఎలిపోతంది. (అప్పుడే బయటనుండి కిష్టప్పంతులు వచ్చాడు)

కిష్ట : ఇదేమిటి? పెరట్లో ఉండే పిడకలు, పుల్లలు ఇక్కడున్నాయి.

మంగ : ఒరే డబ్బాగా!

డబ్బా : అప్పా!

మంగ : నాను ఎలాంటి ఇంట్లో పుట్టినాను! నా తండ్రి ఎన్ని ఎకరాల రైతో నీకు తెల్దా? ఎన్ని గేమాలు అతని సేతికింద ఉన్నాయో నీ వెరగవా? ఈ మనిషా పెద్ద ఆపీసరని నాకిచ్చి చేసార్రా?... ఎమ్మెల్యేనో, మినిష్టరనో నన్ను కట్టబెట్టినార్రా!.... నలుగురిలోనింత గౌరవంగా బతుకుతాననే కదరా! .... నాసేతికింద పదిమందిని తిప్పు తాననే కదరా! ... ఈ సేత కానోడికిచ్చి ముడెట్టినారూ ... ఏదిరా! ఆ గౌరవం ఏటయ్యింది... ఒక మంగల్దాని సేత ఒలే అనిపించుకున్నాను.... ఇకన నానేమొకం పెట్టుకు తిరుగుతాను. ... ఒరే... ఒరే... ఓరి డబ్బాగా... ఇకన బతకనురా!....బతికి లాభం లేదురా! .... ఒరే... ఎక్కడరా... ఎక్కడరా... ఆ పురుగుల మందు డబ్బా ఎక్కడరా!

నాయుడు : ఒసే! నీకేమైనా పిచ్చా!

మంగ : ముట్టుకోకు... చాతకానోడో.... సెయ్యి తియ్యి...

డబ్బా : అప్పా! ఆగు... ఆగు... అంత ఆవేశపడితే ఎలాగ?

ఇదిగో ఈ నీళ్ళు తాగు... తాగు...

మంగ : (నీళ్ళు తాగింది) అవున్రా! ఇంటిపక్కన ఇల్లు, పొలం పక్కన పొలం కలిసొస్తే ఎవులైనా కొనాలని ఆశపడతారు... ఆఖరకు అడుక్కున్నోడు... ఆడు అడుక్కుంటున్న ఈది ప్రక్కన ఈది కలిసొస్తే వదిలేస్తాడా? అలాటిది పదెకరాలు... ఆ పడమటోడు... నువ్వా సూసినావు కదా! ఎవడికో అమ్మేస్తుంటే ఆడ్ని యేటి సేసినాడురా ఈ పెద్దమనిషి. ఆడు కనీసం ఖాతరు సెయ్యలేదు... ఈ పొద్దు దీనిసేతిలోన ఇంత అవమానమా?... ఎలాగ బతకాలో సెప్పు.

నాయుడు : (ఏమీపాలుపోక) పంతులూ! ఇదిగో పడమటోడి నెంబరు ఫోను చేసి ఆనాకొడుకుని అర్జంటుగా రమ్మన్నానన్జెప్పి రమ్మను.

కిష్టప్ప : (నంబరు చీటీలో చూస్తూ డయల్ చేసాడు) ఆఁ రింగవుతోంది. ... (ఆ రింగుటోన్ డబ్బాగాడి జేబులోంచి వస్తోంది. డబ్బాగాడి గుండెలో రాయి పడింది.)

డబ్బా : బావా! అర్జంటు పనుంది వస్తానుండు.

నాయుడు : ఆగు! (రింగుటోన్ ఆగిపోయింది)

డబ్బా : ఒక్క నిమిషంలో వస్తాను.

నాయుడు : కదలకంట ఆగు... పంతులు ఆ సెల్ ఇయ్యి. (రీడయల్ చేసాడు – మళ్ళీ డబ్బాగాని జేబులోంచి రింగ్ టోన్ వినిపిస్తోంది) ... ఇది పడమటోడి నెంబరేనా?

కిష్ట : మీరిచ్చిందే నండీ!

నాయుడు : నీ జేబులోంచి రింగ్ వస్తందేంట్రా?

డబ్బా : అది వేరు... ఇది వేరు... బావ (టప్మని సెల్ చెవి దగ్గర పెట్టుకొని) హలో.... హలో...

నాయుడు : ...రింగ వస్తుంటే హలో అంటావేట్రా... నొక్కి మాట్లాడురా!

డబ్బా : బావా! అదీ... అదీ...

నాయుడు : ఏది ఇలాగియ్యి... (ఆ సెల్ తీసుకొని చూశాడు) 98480 23456

కిష్ట : (నాయుడిచ్చిన పేపర్లోకి చూస్తూ) అదే నంబరు.

నాయుడు : ఇందాక పడమటోడికి సెయ్యిరా అంటే ఫోన్ చేసి నాట్ రీచ్బుల్ వస్తుందన్నావ్?

డబ్బా : అదేటంటే బావా!

నాయుడు : నోర్ముయ్! అన్నీ అబద్దాలే! నాకాపొద్దే అనుమనమొచ్చింది. ఆడి దగ్గర డబ్బుల్దిని నీకేవీ తెలీనట్టు నాటక మాడినావు.

డబ్బా : అవును... పదివేలిస్తానంటే కక్కుర్తి పడ్డాను. అంతకంటే నాకేపాపం తెలీదు.

నాయుడు : ఇలాంటోడ్ని పెట్టుకొని నాయకరం సెయ్యలేదు. ....నువ్వు మీసాలు తిప్పలేదంటావ్?

మంగ : నిన్నంత ఎనకేసుకొస్తాను గదరా... ఆమాత్రం ఈసోసం లేకపోయిందిరా నీకు... ఆ డబ్బులేవో నాకిమ్మంటే నానిచ్చుందునుకదరా!

నాయుడు : ఇంట్లో వాళ్ళు ఇలాగ గోతులు తవ్వుతుంటే బయటోడికి బయ్యం ఎక్కడనుండి వస్తాది... ఇంతకూ ఆ పడమటోడు ఎక్కడున్నాడురా?

డబ్బా : ఏమో బావ నాకైతే తెలీదు. ...ఆ పొద్దు సూడ్డమేః!

నాయుడు : నిజమేనా... ఇదీ టొంకులేనా?

డబ్బా : నీ మీదొట్టు... లేదు.. లేదు... నామీద ఒట్టు... అన్నవరం సత్యన్నారాయణసోమి మీద ఒట్టేసి సెపుతున్నాను... ఆడెక్కడున్నాడో తెల్దు. (సెల్‌ఫోన్ రింగయ్యింది)

నాయుడు : సూడది ఎవరో?

కిష్టప్ప : 040– అంటే హైదరాబాద్ నుండి..

నాయుడు : ఇలాగియ్యి... (సెల్ తీసుకుని విన్నాడు)

(ముఖంలో రంగులు మారాయి. స్పీకర్ ఆన్ చేసి అందరికీ వినబడినట్టు టీపాయ్ మీద పెట్టాడు – అవతల పడమటోడి గొంతు వినిపిస్తోంది)

పడమ : అల్లుడూ! మీ బావ నా గురించి అడగలేదు కదా! ఆః! అడిగినా నాకేదీ తెలీదని బుకాయించు! తలతీసి మొలేస్తాడా ఏటి? అల్లుడూ! ఏ ముహూరర్తాన నీ నోటితో అన్నావోగానీ అల్లుడూ! నిన్ను డైరక్టరుగా చూస్తానని, మనకి డైరక్టర్ పదవి ఖాయమైపోతంది. ఫైలు కూడా సిఎమ్ సంతకంకి ఎలిపోయింది. అల్లుడు నానిక్కడికి వచ్చేసరికే మా కేస్టోల్లు నలుగురు ఎమ్మెల్లేలు, మన గురించి మోపుచేసి పెట్టేసారు.... ఏటల్లుడూ ఇంత శుభవార్త చెబుతుంటే ఊ, ఆః! అనవేటి?... హలో! హలో!

నాయుడు : హలో!

పడమ : ఆc! అల్లుడూ! మీ బావ ఏటి ఫైర్ అయిపోతాడో నని బెంగ బెంగ గుండీదిరా! కానొరేయ్! మొన్న నువు భూమి విషయంలో ఇచ్చిన గుమ్కీ చూసిన తర్వాత ఎంత దెబ్బ అయినా కాసేస్తానని నమ్మక మేర్పడి పోయింది. మీ అక్క సపోర్టు గొప్పదిరా! అక్క సపోర్టు ఆలెక్కనుంటే బావ చేసేదేటుంటాది తొక్క! ఒరే! ఈ పనులన్నీ చూసుకొని ఒక వారం రోజుల్లో వచ్చేస్తానల్లుడు. ఉంటా మరి.

నాయుడు : నీయమ్మ! (సెల్ తీసి నేలకేసి కొట్టాడు)

**(లైట్స్ ఆఫ్ - లైట్స్ ఆన్)**

## 11వ సన్నివేశం

రాజిగాడి ఇల్లు :

వర్షం కురుస్తూనే ఉంది. ఇంటి గడపలో నర్సింహులు శవముంది.

శవంతలాపిన దీపం వెలుగుతోంది.

అగరొత్తులు పొగలు కక్కుతున్నాయి.

అంతకన్నా ఎక్కువగా ఈరమ్మ సెగలు కక్కుతోంది.

ఆమె చుట్టూ ఇరుగు పొరుగువాళ్ళున్నారు.

ఈర : ఈడేటి మూడు యాభైలు బతికేస్తాడు?

కాలకు మేకులు దిగ్గొట్టుకొని కలకాలం భూమ్మీద ఉండిపోతాడు?... ఈడికి సావురాదా!... ఈడి దిబ్బమీద దీపమెట్టరా!... ఇంత పన్జేస్తావా నువ్వా!... ఊరికి నాయుడివయ్యుండి, ఇంటి మంగలోడు సస్తే కాస్టానికి కఱ్రపుల్ల దొరక్కుండసేస్తావా? ఇది దరమ్మా! ఇది నేయమా! కాదు ఈఊళ్లోన అడిగేవోడు లేకా! లేకే మరి!

పన్జేస్తో!

రాజి : ఏటది?

ఈర : పాతిస్తో!

రాజి : దేనికైనా ఒక రవ్వ తెరిపివ్వాలి గదా! బుడ్డన్నా! ముసురొదుల్తాదంటావా?

బుడ్డన్న : వదల్దమా? లావు అవ్వకపోతే సేనా! మేగం సూడు నల్లగ ఎలగకమ్ముకొనుందో! మరొకరోజు లాగీటట్టుంది!

ఈర : మరొకరోజా! ఎలగమ్మ ఇలగైతే... నిన్నటి బట్టి మంగలీది లెవులు పొయ్యి ఎత్తిరించలేదు. పచ్చిమంచినీళ్లు ముట్టలేదు. పాపమంతా మనకి సుట్టుకుంటది గావల?... అదిగొ పెద్దయ్య వత్తాన్నాడు. (కులపెద్ద వచ్చాడు - పూర్తిగా తడిసిపోయిన్నాడు)

రాజి : 'కులపెద్ద వెనక కర్రలో, పిడకలో మొసుకొస్తున్నారేమోనని చూసి నిరాశపడి) ఎల్లిన పని అవ్వలేదా?

కులపెద్ద : ఊహూ...! ఊరు ఊరంతా ఒకటే కట్టు! నాయుడి మాట కాదని బతకలేమంటారు. .... మన బుర్ర తిరుగుడు అందరి కుంటాదేటి?

ఈర : బుర్ర తిరుగుడా!

కులపెద్ద : కాదా! అప్పుడికి నెత్తీనోరు కొట్టుకొని సెప్పుతునే వున్నాను. ఇంటేనా? నేఏ గొప్పోడినని ఎగుర్లాడినావు.. ఇప్పుడుసూడు ఏటయ్యిందో....

ఈర : ఏటయితే అదే అయింది! ... నాయుడి మాటంటే నువ్వు కిందపడి నాకీసోడివి కదా! మరి నీ మాటకేది ఇలవా?

రాజి : నువు పల్లకో! దిగువీది, ఎగువీది, కొత్తపేట, ... ఎక్కడా పుంజిడి పిడకలు పుట్టలేదా!

కులపెద్ద : లేదురా! పుడితే నానుంచుకుంట్నాన్రా!.. లేపోతే నన్ను తగలెట్టుకోడానికి దాసుకుంటాన్రా! ... ఒరే ఇద్దరమూ ఒక ఈడోళ్ళం... రేపు నానూ ఆపాటోడ్నేగదరా! పుట్టిన కుటుంబానికి, కులానికి, ఊరికి, జిల్లాకి పేరు తెచ్చినాడురా మీ అయ్యా! ఆడికర్మే ఇలగుంటే రేపు నాబోటోడి గతేట్రా?... తల్సుకుంటుంటే బయ్యేమేస్తందయ్యా! కాలు, సేతుల్లో వణుకు పుట్టి పోతందరానాయనా!

రాజి : నువు అనవసరంగా గాబరాపడకు... ఇలగరా! కూకో ...ఇదిగో పెద్దయ్యను అక్కడ కూకో బెట్టండి. (అక్కడున్న వాళ్ళు పెద్దయ్య చెయ్యిపట్టుకొని మరోవైపు తీసుకెళ్ళారు – ఒక్క మెరుపు మెరిసి, పెద్ద ఉరుము ఉరిమింది – బుడ్డయ్య ముందుకొచ్చాడు)

బుడ్డన్న : రాజన్నా!

రాజి : అన్నా!

బుడ్డన్న : ఇన్నాళ్ళుబట్టి ఈ ఊరికి సేవలు సేసిన సేతులు సాపి అడుగుతాను. ఇళ్ళిల్లు తిరిగి నాలుగు పుల్లలిమ్మని కాల్లొట్టుకుని బతిమలాడుతాను. నన్నొక్కపాలి రైతులకాడకెళ్ళమంటవా.

రాజి : వద్దులే! ఆ లెవరు ఇవ్వరు గానీ! నేతగాళ్ళు, గీతగాళ్ళు, కమ్మరోళ్ళు, కుమ్మరోళ్ళు, వడ్డెరోళ్ళు, ఉప్పరోళ్ళు ఉన్నారు – ఆళ్ళ దగ్గరికెళ్ళి మన అవసరం ఇలగుందని సెప్పు.

బుడ్డన్న : అలగే! (విసురుగా వెళ్ళాడు)

పక్కనున్నోళ్ళు : అదిగో అడ్డపొగది వస్తంది! (అడ్డపొగది వచ్చింది)

ఈర : (నేల మీద చెయ్యిరాస్తూ లోగొంతులో) అమ్మ! వచ్చినావు!

అడ్డపొగ : ఏటీ గాచ్చారం! ఎప్పుడూ?

ఈర : నిన్న రాత్రి... మారాజు కొడుకు వరసకు మావైనా ఏ పొద్దు అలగ సూడలేదమ్మా!... కాసిన తండ్రిలాగే సూసినాడే తల్లీ!.... ఏ పొద్దూ ఒక మాటనుకొని ఎరగం! ఏవి జాతకమో! మారాజులాగ బతికినాడు... ఇంటా, బయటా ఎక్కడి కెల్లినా గవురం.. గవురం... గవురమే నమ్మా!... అవి బిల్లలా... అవి పతకాలా అవేటవి!.. నాకు నోరే తిరగదు... మెడల్సు, సాలువాలు... ఒకటా రెండా పుట్టుక్కి మంగలోడు గానీ... సావుకి సెక్రవర్తేనమ్మా! (ముక్కుచీదింది) మావాఁ! నాకేటి సెప్పకండ ఎలిపోతావా! మాటాడవా! నాను ఈరమ్మను మావాఁ! మాటాడవా!

అడ్డపొగ : దేవుడు ఈడ్సుకెల్లిపోయిన తర్వాత ఈరమ్మంటే ఇంటడా? సూరమ్మంటీ సూస్తాడా?... మనం గుండి దిటవు సేసుకోడమే!

పక్కనున్నోళ్ళు : అవునంతే... అక్కడకా రుణం సరి.

(మరో ప్రక్కనుండి బుడ్డన్న వచ్చాడు)

బుడ్డన్న : రాజన్నా! అటుసూడు! బామ్మకాడ నీతో కల్సి సదుకుంతున్న కమ్మరి నాగేసు, కుమ్మరి వీరేసు, సాలి సోమయ్య, కంసాలి కనకం – ఆళ్ళదగ్గరకెళ్తుంటే ఆళ్ళే ఎదురొచ్చినారు రాజన్న. (బుడ్డన్న చెప్పినోళ్ళంతా గొడుగులేసుకొని వాళ్ళ పనిముట్లు తడిసిపోకుండా వచ్చారు).

కుమ్మరి : రాజన్నా! ఇదిగో! మా కుమ్మరి సారె! బూదేవిలాగ తిరిగి తిరిగి ఇరుసు అరిగి ఇరిగిపోయింది. భూమాత గోస లాగే మా సారెను

పట్టించుకున్నోళ్ళు లేరు. ఇది తీసుకొని మీ అయ్య శవాన్ని దహనపర్చు.

సాలె : రాజన్నా! ఇదిగో మా మగ్గం! ఇరిగిపోయి మా వృత్తిలాగే మూలపడిపోయింది. మీ అయ్యకు, మాకు పెద్ద తేడాలేదు. అతగాను పేణం పోయిన శవం. మేము పేణమున్న శవాలం. ఇది మాకెలాగు పనికి రాదు. మీ అయ్యకైనా పనికొస్తాదని తెచ్చినాను.

కమ్మరి : ఊపిరి తిత్తుల్ని గాలితిత్తులుగా మార్చుకొని గుండెను కొలిమిగా ఊది ఈ ఊరోళ్ళకు నక్కు, నాగలి సేసి ఎవసాయానికి పేనం పోసినాం. ఈగాలి తిత్తి మీ అయ్యకు పేనం పొయ్యలేదుగానీ, పేనం లేని మీ అయ్య శవాన్ని కాల్చడానికి పనికొస్తది... ఇదిగో తీసుకో.

(మరికొంత మంది ముందుకొచ్చి ఇదిగో ఇవి వడ్రంగుల ఇళ్ళలోని కర్రా, కలపా! ఇవి ఉప్పరోళ్ళ తట్టా, గంపా! ఇదిగో ఇవి మావి. ఇవి మావి. అని తలో పనిముట్టు వేశారు)

అందరూ : మేమంతా నీకు అండగా ఉంటాం. నీవు మాకు ఒక కొండగా నిలబడు. (అందరూ ఏకమై పాటందుకున్నారు)

పాట:

చూసారా చేతివృత్తి సాధనాలు
భగభగ మండే విస్ఫులింగాలు
హక్కు కొరకు మొక్కవోని
రుధిర బింబాలు
కులాహంకార తలను కూల్చి
నేలవేల్చు యూపస్థంబాలు – ॥చూసారా॥

కుమ్మరి : మట్టిరీతులు సదివి సదివి
పుట్టతెన్నులు ఎతికి, ఎతికి
మట్టిముద్దలు తొక్కి, తొక్కి
సారెచక్రం తిప్పి, తిప్పి
మట్టికుండగ మల్చినోళ్ళం
వంటకండగ నిల్చినోళ్ళం

సాలె : మా ఒంటి నరములు తీసితీసి
పోగులుగా ఏర్చి కూర్చి
రేయి పగలు మార్చి మార్చి
పడుగు పేకలుగా నేసి నేసి
మనిషి మానమై బతికినోళ్ళం
బట్టకట్టగ బతుకు లేనోళ్ళం

కమ్మరి : ఎయ్! అస్సు.. ఎయ్! అస్సు..
గుండెల నిండా సమ్మెట పోటులు
శరీరమంతా చెమటల ఊటలు
ఊపిరి తిత్తులు కొలిమిగ చేసి
చేతుల బలిమి కలిమిగ మార్చి
పంట సిరులు పంచిన వృత్తి మాది
ఎల్ల పనులకు తల్లి మాది. ॥చూసారా॥

పాట పూర్తవ్వగానే నర్సింహులు శవాన్ని తీసుకెళ్ళి పనిముట్లతో దహనం చేస్తున్నారు –

ఒక ప్రక్క మంట మండుతోంది

మరో పక్క వారి గుండెలు మండుతున్నాయి.

రాజన్న మాటలతో

రాజి : నాకు బొమ్మ చెప్పింది

ఒకప్పుడు మన వృత్తులకు నలుగురిలో ఎంతో గౌరముండేది. తిండికి లోటుండేదికాదు. మనపూర్వీకులు ఈ వృత్తి ఉంటే సాలు భుక్తి ఉంటాదనీ నమ్ముకోవడం వల్ల వాళ్ళ దృష్టి భూముల మీదకు ఎల్లలేదు – ఆస్థుల మీదకెళ్ళలేదు – కేవలం వృత్తి నైపుణ్యం పెంచుకుంటే సాలనుకున్నారు. వృత్తి పనోళ్ళు, సేవాకులాలు, యాచక కులాలు – ఈ మూడు రకాలవాళ్ళు సమాజంలో అనాథ కులాలుగా మిగిలి పోయారు. చేతి వృత్తులతో తయారైన వస్తువులన్నీ ఇప్పుడు మిషన్లు పెట్టి తయారు చేస్తున్నారు. ఆ మిషన్లు కొనే స్థోమత మనలో ఎవులికీ

లేదు. అందువల్ల అటు వృత్తి, ఇటు ఉపాది రెండూ లేక మనం అలమటిస్తున్నాం. ఒక ఉద్యోగి ఇరవై సంవత్సరాలు పన్జేని రిటైరైపోతే జీవితాంతం పెన్షన్ ఇస్తన్నారే! మనకులాలచేత ఈ వృత్తులన్నీ తరతరాలుగా చేయించారు. ఇప్పుడు మీ అవుసరం మాకు లేదని మమ్మల్ని రిటైరైపోమ్మంటన్నారు. మాకేది పెన్షను? ఎంతని ఇస్తరు. ఏ లెక్కన లెక్కకడతరు. ఎన్ని తరాల సర్వీసని లెక్కకడతరు. సెప్పండి! సెప్పండి! నోరు మెదపండి! ఈ దేశంలో కొంతమందికి తల్లికడుపులో ఉన్నకానుండి వేదమంత్రాల ఘోష ఇనబడుతుంటాది. మరికొంత మందికి తల్లి పేగులు పెట్టే ఆకలిఘోస ఇనబడతాది. కొంత మందీ పుట్టీనాటికే జీవితాంతం సరిపడ సంపదా, ఆస్థిపాస్తులు తల్లిదండ్రులు కూడబెట్టి ఉంచుతారు. మరొకొంత మందికి పసితనం నుంచే కూలీ నాలీ చేసుకొని పొట్ట పోషించుకోవాల్సిన పరిస్థితి ఉంటాది. కొంతమంది ఈ భూమ్మీదకు వచ్చేనాటికే వాడిబట్టలుతికే వాడెవడో, క్షవరం చేసేవాడెవడో, గెడ్డంగీసేవాడెవడో అంతా నిర్ణయమైపోయి ఉంటాది. మరికొంతమంది పుట్టీనాటికీ ఒరే నువు ఈ మగ్గం గోతిలో మగ్గిపోరా, ఇదిగో నువ్వే మట్టి పిసుక్కుని బతుకురా అని పనులు అప్పగించ బడతాయి. పెద్దోళ్ళు పుట్టేసరికి సేవకులు రెడీగ వుంటారు, చిన్నోళ్ళు పుట్టేనాటికి సేవలు రడీగా వుంటాయి. ఇది ఇలాగే తరతరాలు ఇంకా ఇంకా ముందు సాగాలనే మనగురించి ఎవుడు ఎక్కడ ఎప్పుడు మాట్లాడలేదు..... ఆళ్ళు మాట్లాడడం లేదని మనం మాట్లాడకుండా ఉండరాదు. మనం మన గొంతివ్వాల... మన వేదన వెల్లబుచ్చుకోవల. మన బాదేటో సెప్పుకోవల... మన తరపున మనోడంటూ... మన గురించి మాట్లాడేవోడు, వాదించే వోడు, పోరాడేవోడు ఉండాల. పంచాయితీల్లో ఉండాల, మండలాల్లో ఉండాల, జిల్లాల్లో ఉండాల, అసెంబ్లీలో ఉండాల.

అందరూ : అవును... అవును...!

రాజి : ఏ కులం వాడు పదువుల్లోకి ఎక్కితే... ఆ కులం గురించి ఆలోసించుకుంటున్నారు. ఏ వర్గం వాడు అధికారంలో ఉంటే ఆ వర్గం గురించి పనులు సేసుకుంటున్నారు. అది మనకేనా సేతకాదు.

మనం సిన్నోల్లమే కావచ్చు, సీమలమే కావచ్చు, కాని మనందరం ఏకమైతే, ఒక మాటమీదుంటే, ఒక బాటలో నడిస్తే మనలోంచి ఒక నాయకుడు రాడా? ఆడ్ని మనం గెలిపించుకోలేమా?

అందరూ : గెలిపిస్తాం... గెలిపిస్తాం...!

రాజి : కాబట్టే మనలో ఒకడికి పంచాయితీ పెసిండెంటు పదవి వదలమని నాయుడ్ని అడుగుదాం! ఎందుకంటే స్వతంత్రం వచ్చిందగ్గర్నుంచి ప్రెసిడెంటు పదవి వాళ్ళింట్లోనే ఉంది.

బుడ్డన్న : ఎవులో వద్దు..! ప్రెసిడెంటుగా నువ్వే ఉండాల!

అందరూ : అవును... అవును...

రాజి : ఎవులన్నది తరువాత ఆలోసిద్దాం. మన పనిముట్లతో కణ కణ మని మా అయ్య సెవం ఎలా కాలిపోతుందో అలాగే ఆ నాయుడు పెద్దరికం, అహంకారం, పొగరు, పోత్రం కాలిపోవాల.

అందరూ : అవును... కాలి బూడిదైపోవాలి.

బుడ్డన్న : (అటుగా వస్తున్న బామ్మను చూసి) అదిగో బామ్మ వస్తుంది. (బామ్మ కమల కొడుకుతో సహా వచ్చింది)

రాజి : ఎప్పుడొచ్చావు బామ్మ!

బామ్మ : ఇప్పుడే ! ఇంటికి రాగానే ఇలా అని తెలిసింది. పరుగెత్తుకొచ్చాను.

కొడుకు : రాజియ్యా! మా అమ్మ.... మా అమ్మ... (ఏడుస్తూ ఏమీ చెప్పలేకపోయాడు)

రాజి : ఏమయ్యింది బామ్మ! ...

బామ్మ : తప్పిపోయింది..... కనిపించకుండా తప్పిపోయింది..... హరిద్వార్, ఋషికేష్ చూసుకొని... కాశీకి వెళ్ళాం కాశీలో తప్పిపోయింది. ఎంత వెతికినా కనిపించలేదు.

కొడుకు : బామ్మ..... మా అమ్మ ఇంకరాదా?... చచ్చిపోయిందా?..

బామ్మ : లేదు నాయనా వస్తుంది.... తప్పకుండా వస్తుంది (వడిలోకి తీసుకుంది)

(అక్కడి జనం : "అయ్యెయ్యో గంగలో మునిగిపోయింటది" –

"ఈ బతుకింక చాలనుకుందేటో"

"గుంటడు దిక్కులేనోడైపోనాడు"

(ఇలాంటి సానుభూతి మాటలతో ఆ ప్రాంతం నిండిపోయింది)

**(లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్)**

## 12వ సన్నివేశం

నాయుడి ఇల్లు

(ఇళ్ళంతా డల్‌గా ఉంది. అందరిలోనూ ఏదో నీరసం ఆవహించి ఉంది. నాయుడి మనసులో ప్రతీదీ ఎదురు తిరుగుతున్న భావనుంది. ఎందుకిలా జరుగుతుందో అర్థం కావడం లేదు. అక్కడకు మంగమ్మ కాస్త ధైర్యంగా మాటలు విసురుతోంది. పదవి దక్కిందిగానీ, చేసిన ప్రయత్నం పట్టుబడి పోయిందనే అపరాధ భావనతో ఉన్నాడు పడమటోడు).

మంగ : ఎక్కడ నుండో వచ్చినోడికి పెద్ద పదవులు కట్ట బెడితే ఇక్కడే పుట్టి పెరిగినోళ్ళ ఏటైపోవాలి? నలుగిరిలోన మాకు ఎంత పలచన?

పడమ : అమ్మా! ఆ మాటెత్తకండి! అది పదిహేనేళ్ళ కిందటి సంగతి. ఊరుకాని ఊరొచ్చి నాను. సొంత తల్లి కన్నా పెంచిన తల్లికే ప్రేమక్కువ అంటారు. ఈ పదవి వల్ల ఏటైన సెయ్యగల్గితే మాసొంతూరుకి చేసుకుంటానా! నన్ను పెంచిన తల్లి ఋణం తీర్చుకుంటాను గానీ.

నాయుడు : గొప్పగా తీర్చుకున్నావు! పొలం అమ్ముతుండి ఒక్క మాట సెవిట్ల ఎయ్యలేదు... రుణం తీర్చుకుంటాడట రుణం....

పడమ : నాయుడుగారూ! ఇదిగో ఇవి సేతులు కాదు కాళ్లు.... ఇవి పట్టుకొని ప్రేదేయపడ్తున్నాను. సేనా సొమ్ము కర్సుపెట్టి ఈ పదవి తెచ్చుకున్నాను. మీ సపోర్టు లేకపోతే నాపని గుండు సున్న.

నాయుడు : నానెవుడినండీ సపోర్టు ఇయ్యడాకి... నాకేటుందని అంత ప్రాదేయపడిపోతున్నావు. నాకు నిజంగా నువ్వు ఇలువ ఇచ్చీవాడెవైతే... నాయుడుగారూ! ఇదిగో నాకీ అవకాశమొచ్చింది... నేనీ పదవి తెచ్చుకుంటున్నానని అనకపోదువా! ...ఇదిగో కుక్కకి ఇచ్చిన ఇలువ కూడా ఇవ్వలేదు.

డబ్బా : పులెనక నక్క తిరుగుతాదని రెండింటిని ఒక గాటన కట్టేస్తామా బావా... పులి పులే... నక్క నక్కే...

మంగ : కొంత మందికి నక్కల పొత్తే ఇష్టమౌతాది.. అయింది.

పడమ : నాయుడు గారూ! నానీ ఊరొచ్చిన కానుండి సూస్తన్నారు... నా కేదో వుందని పొగరు పడిపోయే మనిషిని కాను. ఈ వూళ్లో ఓ పాతిక ఎకరాలు కొన్నానంటే నేనిక్కడేదో సంపాయించి కొనీలేదు. మా సొంతూరులో పదెకరాలు అమ్మీసి ఆ డబ్బుతెచ్చి ఇక్కడ మదు పెట్టినాను. కానీ నానేనాడైన నా దగ్గర ఇంతుందని రాలిపోనానా? సరే... ఈ ప్రాంతంలో నా కులస్థులు ఎక్కువ మంది లేకపోవచ్చు... వైజాగ్ దాటిన తర్వాత మా వాళ్ళు ఎంత మందున్నారో మీకు తెలీన్దికాదు... అలగని ఎప్పుడైనా నాదో గొప్పకులమని పొంగిపోనానా? ఈ జిల్లాలో మా వాళ్ళు పదవుల్లో లేకపోవచ్చు... రాష్ట్రం మొత్తం మీద మావాళ్ళు ఎమ్ఎల్ఏలు ఎంత మంది వున్నారో, ఎమ్.పి.లు ఎంతమందున్నారో, మంత్రులు ఎంతమంది ఉన్నారో సెప్పమంటే పోను నెంబర్లతో సహ చెబుతాను... అవి ఈ పొద్దు కొత్తగా తెచ్చుకున్నవి కాదు... మొదటనుండి వున్నివేః!... ఇదంతా ఎందుకు సెబుతున్నానంటే నాను పొగరు బోతు మనిసి కాను అన్జెప్పడానికే... ఇంత సెప్పి బతిమాలు కుంటున్నా ఇన లేదనుకోండి...

నాయుడు : ఏటి సేత్తావ్!

పడమ : అబ్బే! ఏటో చేసేస్తాననా? నా కర్మరా! అని బాధపడతాను.. అంతకు మించి ఏటి సెయ్యగలను సెప్పండి. కాదూ... కూడదంటే రాజీనామా ఇచ్చేత్తాను....

(అసరిగాడ్ని తోసుకొని రాజిగాడు, కులపెద్ద, చాకలి బుడ్డన్న మరికొంతమంది లోనకొచ్చారు).

నాయుడు : ఒరే ఈ నా కొడుకుల్ని....

పడమ : నాయుడు నువ్వాగు... ఏటి సెప్పండి!

రాజి : నా తండ్రి సస్తే దహనం సెయ్యడానికి తట్టిడు పిడకలు ఇమ్మంటే ఇవ్వలేదు... ఎవ్వలూ ఇవ్వొద్దని ఊరంతా కట్టడి సేసాడు. అదేనా ప్రెసిడెంటుగా సెయ్యాల్సిన పని

బుడ్డన్న : ఈ పొద్దు మా రాజయ్యకయ్యింది... రేవు ఎవులికైనా.. ఇదే గతిపట్టిస్తాడా?

కులపెద్ద : రాజన్న! నాయుడిని అడగాలనుకున్న వన్నీ నిదానంగా అడుగు... ముందూ పెసిడెంటు పదవి గురించి అడుగు.

నాయుడు : పెసిడెంటు పదవి?... దాని సంగతి ఇప్పుడేల!

రాజి : ఈ వూరి పెసిడెంటు పదవి మాలో ఒకడికి ఇవ్వాలి.

నాయుడు : ఏటేటీ?...

రాజి : ఈ ఊరి పెసిడెంటు పదవి మా అనాథకులాలకు ఇవ్వాలి.

నాయుడు : ఇంత వరకు ఆమాట ఎవడి నోటిలోంచి రాలేదు. ... సొతంత్రం వచ్చిన కానుండి మా ఇంట్లో వాళ్ళే ప్రెసిడెంటు పదవి సేత్తన్నారు.

రాజి : అందుకే ఇప్పుడు పదవి మాకివ్వాలని అడుగుతున్నాం.

నాయుడు : ఇస్తేమట్టుకు పెసిడెంటు పదవి మీలో ఎవుడైన సెయ్యగలడా?!

అందరూ : మా రాజయ్య సెయ్యగల్డు.

నాయుడు : నువ్వా! పెసిడెంటు పదవి నువ్వు సేస్తవా.

రాజి : నువ్వే సెయ్యగలిగినప్పుడు నాను సెయ్యలేక పోవడమేటి? ..నువ్వు నాకన్నా దేంట్లో గొప్పోడివి?

నాయుడు : ఒరే రాజిగా!

రాజి : రాజిగా కాదు!. రాజయ్యా!

నాయుడు : నువ్వూ, నేనూ సమానమా?!

రాజి : ముమ్మాటికీ సమానమే!

నాయుడు : కాదు... కాలేవు...

రాజి : ఎందుకు కాదో... సెప్పు...

నాయుడు : ఒసే ఇందల కొత్తగా సెప్పడానికేటుందిరా? నువ్వెన్ని జన్మలెత్తినా మాతో సమానం కాలేవు. నాయుడు వస్తన్నాడంటే చుట్టూ ఉన్నోళ్ళు భయంతో, భక్తితో లేచి చేతులు జోడించి మొక్కుతారు. అదే మంగలి

రాజి గాడొస్తన్నాడంటే దానికి కూకున్నోడు కూడా లెగడు. అదీ నీకు, నాకు మనిద్దరినున్న తేడా! ఏ గాడిద కొడుకురా నూవ్వూ, నేను సమానమని సెప్పింది? ఏ తలమాసినోడురా, నీకు, నాకు తేడా లేదని సెప్పింది?

రాజి : మరలాంటప్పుడు ఏ గాడిద కొడుకు నువ్వూ, నేనూ ఇద్దరం బీసీలమని చెప్పింది. ఏ తలమాసిన్నా కొడుకు నిన్ను, నన్ను ఒకే లిస్టులో పెట్టింది?

నాయుడ : ఒరే రాజిగా!

రాజి : మీ గుండెలమీద సెయ్యేసుకుని సెప్పండి. ఒక డ్యాం కడితే భూములు కోల్పోయినోళ్ళకు నష్టపరిహారంమిత్తారు. పేకేజీలు ఇస్తారు. కానీ మిషన్లు, ఫ్యాక్టరీలు వచ్చి మా బతుకులే కోల్పోయినాం. మాకేదీ నష్టపరిహారం? మాకెవులిచ్చినారు ప్యేకేజీలు? ఇవ్వలేదు... ఇవ్వరు. ఎందుకంటే మాకోసం అడిగే నాథుడులేడు. అనాథలం... అనాథకులాలోళ్ళం.

మంగమ్మ : ఓలమ్మ నీ గుండెల్లో ఇంత ఇసముందా? మీకు, మాకు ఎప్పుడైనా ఎత్యాసం ఉందిరా? ఎదవ కూతలన్నీ కూసి నువు మమ్మల్ని ఏరేగా సూస్తన్నావుగానీ, మిమ్మల్ని మేము ఎప్పుడైనా తక్కువగా సూసాంరా? ముంజూరు నుండి వంటగది, పడకగది, తానాలగది ఎక్కడికి కావాలంటే అక్కడి కెలిపోతారు. మా ఇళ్ళు మీ సొంతమన్నట్టు తిరుగుతారు గదరా! నువు మంగలోడివి, నువు సాకలోడివని, లోనకెందుకొస్తావని అడ్డగించినావురా.

రాజి : అడ్డగిస్తే ఇంట్లోని సాకిరి ఎవడు జేస్తాడు? నీ అవసరానికి నువు రమ్మంటున్నావు. నా మీద ప్రేమతోనా నువు లోనకు రమ్మనేది.

నాయుడు : ప్రేమకాదా! ప్రేమతోటే గదరా కులం తక్కువైనా వరసలు పెట్టి మరీ అన్నా, మావా, బావా అని పిలుస్తున్నాం! అదే వరసల్తో మీరు పిల్చినా పలుకుతాం గదరా!

రాజి : అది నిజమే! కానీ నీకెప్పుడు కోపమొచ్చినా మంగల్నాకొడకా అంటావు. నాకు కోపమొస్తే నీ కులం పేరెట్టి తిట్టగల్నా?! తిడితే పడతారా?

నాయుడు : మక్కలిరగ దంతాం.

రాజి : అది నిజం.

మంగమ్మ : పండుగలకీ, పబ్బాలకీ ఇన్నేసి పప్పులు దొబ్బుకెల్తారుగా!

రాజి : మీ గూదల నిండా మెక్కి, మిగిలిన పాచివి మా ఒడిలపోస్తారు.

మంగమ్మ : ఇప్పుడునుండి వండినెంటనే ఉడుకుడుకువి రాజీగా రారా అని పిల్చి ఎట్టండి. ఈడేమో ఉప్... ఉప్.. అని ఊదూదుకొని తింటాడు.

రాజి : మీకు ఒక పంటలో నష్టమొస్తే మరో పంట ఏసుకుంటారు. ఎవసాయమే లాభసాటి కానప్పుడు ఆ భూముల్ని అమ్ముకొని ఏపారాలు చేసుకుంటున్నారు – కాంటాక్టులు చేసుకుంటున్నారు. పంట మార్చుకోడానికే, వృత్తి మార్చుకోడానికి స్వతంత్రమున్నోళ్ళూ మీరు. కానీ మా పరిస్థితి అదికాదు. తాతల తండ్రుల నుండీ మాకు భూముల్లేవు... పుట్టల్లేవు... ఆస్తుల్లేవు... అంతస్తుల్లేవు.

మీరు ఎనకబడిన వాళ్ళైతే మీకన్నా ఎంతెంతో ఎనకెనకవెనక ఎక్కడో ఉన్నోళ్ళం మేము. అందుకే బి.సి.లకు కేటాయించిన పంచాయితీ నేను పోటీ సేస్తాను. నువ్వు పోటీలో వుండకంట నన్ను పెసిడెంటును సెయ్యి. (బామ్మ వచ్చింది)

నాయుడు : సూడు! నువుసెప్పిన చదువు ఎలగ కొంపముంచిందో

బామ్మ : అది కొంప ముంచడం లేదు. కళ్ళు తెరిపింస్తోంది.

నాయుడు : నీకేమైన పిచ్చిపట్టిందా!... ఆళ్ళకి బుద్ధి లేకపోతే సదువుకున్నదానివి బాపన ఇంట్లో పుట్టినావు. నీకుండక్కర్లేదా సెప్పు.

బామ్మ : నాయుడూ! సదువుకున్నాను కాబట్టే, బ్రహ్మణ్ణ ఇంట్లో పుట్టాను కాబట్టే వీళ్ళందర్నీ వెనుకేసుకొచ్చాను. బ్రాహ్మణపుట్టుకకు అర్థం అధికారంలో ఉన్న వాడి ప్రక్కన చేరడం కాదు. అంధకారంలో, మగ్గుతున్న వాడికి వెలుతురు చూపించడం, అధఃపాతాళంలో త్రొక్కి వేయబడిన వాడ్ని పైకి తీసుకురావడం.

నాయుడు : అంటే ఈళ్ళను పదవుల్లో కూసోపెట్టేస్తావా? ఈల బతుకులేటి? ఈల వాలకాలేటి? ఈల ఎవ్వారాలేటి? ఈల తల్లిదండ్రులుగానీ, తాతముత్తాతలు గానీ పూర్వీకులుగానీ ఏనాడైనా ఒక పదవీపాదూసేసి

ఎరుగుదురా! నలుగురిలో గౌరవమర్యాదలు తెలిసినోళ్ళా? తెలివివిజ్ఞానం ఉన్నోళ్ళా?

బామ్మ : ఎక్కువ మాట్లాడుతున్నావ్ నాయుడూ! పెళ్ళి అయ్యాక నీ పెళ్ళామొచ్చి నిలబడింది. పదవొచ్చాక ప్రజలొచ్చి నిలబడ్డారు. కానీ నీ యమ్మ నిన్ను కంటున్నప్పుడు, నీ తల్లికి ధైర్యం చెబుతూ నిన్ను ఈ లోకంలోకి ఆహ్వానించింది ఒక మంగలిదే గుర్తుంచుకో!

కుమ్మరోళ్ళంటే ఎవరో తెల్సా? మట్టికి జీవం పోసిన కళా తపస్వీలు. మానవ చరిత్రలో క్రొత్త అధ్యాయానికి రూపకర్తలు – వీళ్లు లేకపోతే ఇప్పటికీ పచ్చిమాంసం తింటుండేవాడివి. సాలెవాళ్ళు! ఈ రోజు నువ్వు పాలిష్టర్, టెర్లిన్ వేసుకోవచ్చు. కానీ ఒకనాడు మానవాళి మానం కాపాడిన వాళ్లు. చరఖాచక్రం సృష్టించిన శాస్త్రజ్ఞులు – వీళ్ల పూర్వీకులు లేకపోతే నీ పూర్వీకులు కూడా అనాగరికంగా నగ్నంగా తిరగాల్సి వచ్చేది. ఇక చాకలోళ్ళు! నువు పంచెలో మలమూత్రాలు పోసుకుంటే నీతో కాపురం చేసిన నీ పెళ్ళాం గానీ, నీ కడుపున పుట్టిన పిల్లలుగానీ వాటిని ఉతికి ఆరెయ్యమంటే అసహ్యించుకుంటారు. అలాంటి నీ బట్టల్ని –
ఉతికి ఆరేసి శుభ్రం చేసి నీకు తెచ్చి ఇస్తారు. ఆ పని నీ తల్లి కూడా నీ చిన్నప్పుడే చేస్తాది. కానీ నువు చచ్చేవరకు ఆ చాకిరీ చేసే తల్లీ, దండ్రీ అన్నీ నీకు ఆ చాకలోళ్లే. నువ్వూ, నేనే కాదు, ఈ సమాజానికి సంస్కారమన్నది ఉంటే వీళ్ల కాళ్ళకు నమస్కారం పెట్టాలి. పెట్టు నమస్కారం.

నాయుడు : బామ్మ!

బామ్మ : పెట్టలేవు... నాకు తెలుసు... పెట్టక్కర్లేదు... గౌరవించక్కర్లేదు... కనీసం అవమాన పర్చకూడదనే ఇంగితం కూడా లేదు మీకు.

రాజి : అతనితో మనకింక మాటలెందుకు బామ్మ! నాయుడూ మీబోటి కులాలన్ని మావల్లే గెల్సి రాజ్యాలేలుతున్నారు. ఇక నుంచి రాజ్యాధికారంలో మావాటా మాకివ్వకపోతే చూస్తూ ఊరుకోం.

నాయుడు : ఏటి సేస్తారురా!

రాజి : ఏటి సేస్తామా! నీ పెసిడెంటు పదవి మాకొచ్చేవరకు మావోళ్ళంతా సాకలి, మంగలి, సాలె, కంసాలి, వడ్డెర, వడ్రంగి పలులేవి సెయ్యం.

(రాజయ్యకి జై అనుకుంటూ వెళ్లిపోయారు)

**(లైట్స్ ఆఫ్ - లైట్స్ ఆన్)**

## 13వ సన్నివేశం

రాజిగాడి ఇల్లు

(రాజిగాడి చుట్టూ అందరూ కూర్చున్నారు. ఈరమ్మ అందరికీ టీ గ్లాసులు అందిస్తోంది)

బుడ్డన్న : రాజన్నా! గుణమైనోడు ఒక్కడుంటే సాలు, కులమంతటికీ పేరొస్తాదట అలగ నువ్వొక్కడవు మీకులానికే కాదు! మొత్తం మన అనాధకులాలందరికీ పేరుతెచ్చినావు.... ఒక్కరోజు మనం పనులకెళ్ళకపోయేసరికి మొత్తం ఊరు ఊరంతా ఊడికిపోతంది.

రాజి : అందరికీ ఇదేసెప్పడం... నాయుడు దిగొచ్చేవరకు ఎవరూ పనుల్లోకెళ్ళకండి! ఆళ్ళ పనులు ఎలగసేసుకుంటారో మనం సూద్దాం.

(బయటనుండి ఒక వ్యక్తి వచ్చాడు)

వ్యక్తి : ఒరే రాజిగా!

అందరూ : మర్యాద! మర్యాద!

వ్యక్తి : మర్యాదా! రాజిగా అన్నమాట మర్యాద కాదేట్రా?

.... మీ పిచ్చిగానీ ఒక ఆఫీసులో ఆఫీసరుంటడు, బంట్రోతూఉంటడు. ఆఫీసర్ని ఆఫీసరు గారంటారు. బంట్రోతుని బంట్రోతుగారు అంటార్రా! అంటే మాత్రం అది అందంగా ఉంటదా? అంచేత రాజిగాడు ఎప్పుడికి రాజిగాడే!... ఒరే రాజిగా!

అందరూ : నోర్మూయ్!

వ్యక్తి : (నోర్మూసుకున్నాడు)

బుడ్డన్న : రాజన్న అనిపిలు!

వ్యక్తి : ఉహూ.. ఉహూ... (నోర్మూసుకునే) రా... జ... న్నా!

బుడ్డన్న : మూతిమీద చేతులు తీసి ఇప్పుడు చెప్పు!

వ్యక్తి : రాజన్నా! ఇంట్లో పిల్లప్రసవం అయ్యింది. ఆర్.ఎం.పి.డాక్టరొచ్చాడు... అంతా సక్రమంగా కాన్పయిపోయింది. పిల్ల నలుగురిలో కల్సిపోయింది. కానీ మిగిలిన కార్యక్రమం....

బుడ్డన్న : మిగిలిన కార్యక్రమం అంటే?

వ్యక్తి : అంటే ఏటని చెప్పుతాం... మీ అందరికీ తెలిసిందే కదా! .. ఈ నోటితో ఏటని సెప్పుతాను.

ఈర : అదేటో సెప్పయ్యా పర్లేదు. మాము మాసేతుల్తో సేసీది మీరు మీ నోటితో సెప్పడానికి సెబ్బరమైపోతాదా? ... సెప్పు పర్లేదు.

వ్యక్తి : ఏటుంది... మావీ.. అదీ... అతికష్టం మీద ఎత్తి ఒక దాకలో పెట్టి ఒక చోట ఇద్దాం. అది ఎక్కడో ఒక్కాడ పడెయ్యాలంటే అందరూ అసయ్వ పడి నావల్ల గాదంటే నావల్ల గాదంటున్నారు... అందుకనీ నీపెల్లాన్ని తోలితే..

ఈర : మంగలి రాజిగాడు పెళ్ళాన్ని తోలితే అదొచ్చి నీపిల్లకడుపులోని కుళ్ళంతా దాని కడుపులోనెట్టుకుంటే నీకూతురు, నీ ఇల్లు, నీవాకిలి శుబ్రమైపోతాది. ఆ తర్వాత మీఇంటి సాకల్దొచ్చి పుట్టిన పిల్లాడికి కాపీసి, నలుగురాసి, పసుపురాసి, ఆడి చీవుడు తీసి, ఆడి ముక్కు కడిగి, ముడ్డి కడిగి, ఉచ్చగుడ్డలు తడిపి ఆడి కింద నానా సేవలు సేస్తే అడు పెద్దోడై మళ్ళీ మామీద ఎక్కుతాడు – నా పిల్లల మీద సవ్వారి సేస్తాడు. అడికి నన్ను సూపించి అదిగోరా మనింటి మంగల్దాయి! తిట్టు... దాన్ని తిట్టు! లంజికానా! లమ్డీకానా! అని లోకంలో ఎన్ని తిట్లు ఉన్నాయో అన్ని తిట్లు నేర్పించీ! ఒరే రాజిగా అని నా మొగుడ్ని పిల్సి ఈడ్ని గుఱ్రబండనుకోరా అని ఆ మనిసి భుజాల మీదెక్కించీసి మమ్మల్ని ఎలగతన్నాలో, ఎలగతొక్కాలో నేర్పించు! ఇవన్నీ సూసిన మా పిల్లలు మా బతుకులింతేగావాల అని సరిపెట్టుకోని బతికేత్తారు. ఇదిగో! మీ అందరికీ ఇదే సేప్పడం! సరిపెట్టుకొనే బతుకుకన్న సావు మేలు!

వ్యక్తి : ఇప్పుడు నన్నేటి సెయ్యమంటారు.

ఈర : ఏటిసెయ్యాలో మమ్మల్ని అడిగితే మావేటి సెప్పుతాం? ... సాకళ్ళా మంగళ్ళా మేమూ సమానమని పదవులు, ఉద్యోగాలు అనుబగించెత్తాన్నారేఁ! మీ మనసుల్ని అడుక్కోయండి! మీకు మనసుంటే అదిసెప్తాది సమాధానం.

రాజి : నాయుడు దగ్గిరకెళ్ళి పెసిడెంటు పదవి మాకొదిలీమని సెప్పు!

వ్యక్తి : నాను సెపితే ఇంటాడా?

రాజి : మీకులస్థుడే మీమాట ఇనకపోతే మావెందుకినాలా!

కుల : శవం తగిలెట్టడానికి పుంజిడి పిడకలిమ్మంటే ఇచ్చారా? మా ఇంట్లో సావుకి నువు సాయం సెయ్యావుగానీ మీ ఇంట్లో పుట్టుక్కి మామొచ్చి సాయం సెయ్యాలా? ... రాజన్నా! ఒప్పుకోవద్దంటే ఒప్పుకోవద్దు. (వ్యక్తి వెళ్ళిపోయాడు. బామ్మ ముందుగా, ఆమెను వెంబడిస్తూ కిష్టప్పంతులు వస్తున్నాడు)

కిష్టప్ప : ఇదిగో బామ్మా! నీకే శెప్పేది! ఆగు.. వీళ్ళ ఇళ్ళలో నువ్వు తిరగడమేంటీ ఛండాలంగానూ!

బామ్మ : ఒరేయ్! వీళ్ళ ముందు గొడవ పడటం మర్యాదగుండదు. నువ్వు ఇంటికెళ్ళు.

కిష్టప్ప : నేను వెళ్ళను. నువ్వవస్తేనే నేను వెళ్తాను. ఏమిటలా చోద్యంచూస్తారు. మీరైనా పెద్దావిడకు కాస్తా చెప్పండ్రా! ఈ రొంపిలోకి దిగొద్దని.

బామ్మ : ఒకరు చెబితే, నేనిందులో దిగలేదురా – మానెయ్యమంటే మానెయ్యడానికి.

కిష్టప్ప : తర్వాత వాళ్ళూవాళ్ళూ కల్సిపోతారే. మధ్యలో మనం ఇరుక్కుపోతాం. ఇలాంటివి ఎన్ని చూడలేదు?

బామ్మ : బ్రాహ్మనుడివయ్యుండి అంత భయమెందుకురా.

కిష్టప్ప : భయపడక ఏవుందని రొమ్మువిరుచుకు తిరుగడానికి. బ్రాహ్మణుడిగా పుట్టి ఏమిటి అనుభవించాను. మాతాతలు, వాళ్ళ తాతలు అనుభవించారేమో! నాకేవిటి మిగిలిందని ఒంటి మీద ఈ జందెప్పోగుతప్ప. – ఇదిగో ఇప్పటికే ఊళ్ళో గుసగుసలు ప్రారంభ మయ్యాయి ఈ పెంటతా నీవల్లే వచ్చిందని –

బామ్మ : నేను ఖాతరు చెయ్యను.

కిష్టప్ప : నువ్వెందుకు చేస్తావు? ఊళ్ళో వాళ్ళు తన్నేది నన్నుగదా! ఇంత దుస్సాహసం కూడదేః! పిల్లలకు చదువులని వీడ్ని ఇంట్లోకి తెచ్చావు.

పెద్దలకు చదువులని వాళ్ళందర్ని తెచ్చావు. దాన్ని తీర్ధ యాత్రలకు తీసుకెళ్ళావు – అక్కడ అదేమయ్యిందో తెలీదు – వీడు మాత్రం పర్మనెంటుగా తగులుకున్నాడు – మనిట్లోనే భోజనం – పడక – అన్నీను – వాడి అమ్మ ఎవడ్ని తగులుకుందో ఎక్కడకి పోయిందో నీకేమైనా తెలుసా?

కమలకొడుకు : (దుఃఖం ఆగడంలేదు)

బామ్మ : చటౕ! నోర్ముయ్! ఇంకొక్క మాటొచ్చిందో చంపేస్తాను జాగ్రత్త! (ఆ గద్దింపుకి అందరు అదిరిపోయారు – బయటనుండి పోస్ట్‌మెన్ వచ్చాడు)

పోస్ట్‌మెన్ : బామ్మగారు! మీ ఇంటికెళ్ళాను. ఇక్కడున్నారంటే ఇక్కడకొచ్చాను.. మీకు ఉత్తరం వచ్చింది.

బామ్మ : ఎక్కడనుండి... ఎవరు రాసారు.

పోస్ట్‌మెన్ : ఫ్రమ్ అడ్రస్ లేదు.... స్టాంప్ మాత్రం కాశీ అని ఉంది

బామ్మ : ఏదిలా ఇవ్వు... (గబగబా తీసుకొని చదివింది) నాయనా ఇది మీ అమ్మే రాసింది. మీ అమ్మ బతికే ఉంది... ఒరే అప్రాచ్యుడా, కమల గురించి ఏవేవో ఇన్నావే! ఇదిగో ఇది చదువు... వొద్దు.. నీలాంటి వాడికి ఆ ఉత్తరంతాకే అర్హత కూడా లేదు... రాజన్నా నువు చదువు!

రాజన్న : (కమల గొంతు) ప్రియమైన బామ్మగారి పాదపద్మములకు నమస్కారములు! నాకొడుకు సుఖంగా ఉన్నాడా అని అడిగి మిమ్మల్ని అవమాన పరచలేను. అమ్మవారి ముందు పూసిన పువ్వు రోజు రోజుకి ఇడబారుతాది కానీ వాడి పోదు. ఆడూ అంతే! బామ్మగారు! నాగురించి ఆడు ఏమని అనుకుంటున్నాడో అన్న ఆలోచన నా జీవితం పట్ల నాకు ఎక్కువ భయాన్ని కలగజేస్తుంది. ఆడి తండ్రి ఆడి చిన్నప్పుడే సచ్చిపోయాడు. నాకెనకా ముందు ఎవరూలేరు. దిక్కుమొక్కు లేని సిన్న కులందాన్ని, ఏదో ఒకదార్లో నడాల... నాను బతకాల, ఆడ్ని బతికించుకోవాల. ఒక రోజు బడినుండొచ్చి నన్నడిగినాడు – అమ్మా! అమ్మా! బడిలోనందరూ నాయుడు మీ అమ్మనుంచుకున్నాడంటున్నారు.

ఉంచుకోడమంటే ఏటమ్మా అని అడిగినాడు. అలాటప్పుడు ఏటి సెప్పాలిబామ్మా! అ సిటంలో నాగుండె ఆగిపోతే ఎంత బాగుణ్ణు అనిపించీసింది. పిల్లాడున్నాడని కూడా సుడకంట పోకిరినాగండలు ఇగటాలాడీవోరు – బూతుమాటలాడీవోరు – సేయ్యిపట్టుకొని లాగీవోరు – కానీ నా సిన్నితండ్రి, నా సిట్టి కొడుకు బిక్కమొకం వేసుకొని బెదురు బెదురుగా సుస్తూ ఉండి పోయివోడు. తిండి కున్నాదో లేదో, ఆస్తులున్నాయో లేవో, మేడలు మిద్దెలున్నాయో లేవో పక్కన పెట్టు బామ్మ! మాకీ అగచాట్లేల బామ్మ! సిగ్గు సచ్చిన బతుకేలబామ్మ! కులానికి సిన్నోళ్ళమనే గదా! మావు పిలిస్తే మావెనక పదిమంది వచ్చీవోళ్ళు లేరనేగదా!

నువు మాఇంట్లో వ్యాసపీటమెట్టి పురానాలు సెప్పినకానుండి నా ఆలోచనలో సేనా మార్పొచ్చింది. నాకు కొండత ధైర్యమొచ్చింది. దేవుడు గురించి వింటే ఇంత దైర్యమొచ్చిందేc! మరి దేవుడే ఈకులాలు, వర్ణాలు పెట్టినారని అంటారు. ఇందులో ఏది నిజం, ఏది అబద్ధం – ఈ హెచ్చు తగ్గులన్నీ బాపనోళ్ళు చేసిన మాయంటారు. నువుమరి పచ్చి పదహారణాల బాపనమ్మవు. నీలోన ఆ మాయ యేలలేదు. ఇదంతా తెల్సుకోడానికి కాశీకి మించిన చోటు లేదన్నారు. పుస్తకాలు, పురాణాలు సదివితే పండితులవ్వొచ్చన్నారు. అందికే గంగలో మునిగినప్పుడు కడుపుతీపిని వగ్గీసినాను. మిమ్మల్ని తప్పించుకొని తెలుగొచ్చిన పెద్దమనిషి సాయంతో ఒక ఆశ్రమంలో చేరి సదువుకుంటున్నాను.

నిజమైన వర్ణధర్మం, కులమర్మం, చావు పుట్టుకలు ఈటన్నిటి గురించి పూర్తిగా తెల్సుకొని వస్తాను.

ఈలోపు నాను సచ్చిపోయినాను అనుకోయండి పర్లేదు కాని .... ఏ తప్పుడు పని గురించో తప్పించుకొని ఎలిపోయిందని మాత్రం అనుకోకండి. ఆ మాటలు ఇని నాకొడుకు చూసే చూపులు ఊహించుకోడానికి కూడానాకు బయ్యంగా ఉంటాది.

ఉంటాను మరి......... మీ కమల.

బామ్మ : ఒరే కర్మచండాలుడా! బ్రాహ్మణ్యం అంటే ఇదిరా! ఉత్తమ జన్మ అంటే ఇదిరా! సద్గతి అంటే ఇదిరా! సదాచారం! సత్ప్రవర్తనం ! సత్య ధర్శనం! సమ్యక్ వాక్ శ్రవణ చింతనం! ఇది! ఇదీ! ఇదీ!

(బామ్మ చెబుతున్నంతసేపు కమల కొడుకు కిట్టప్పంతుల్ని కొడుతూనే ఉన్నాడు)

**(లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్)**

## 14వ సన్నివేశం

(బయట నుండి పదమటోడు, డబ్బాగాడు వచ్చాడు – వస్తునే డబ్బాగాడు బ్రతిమాలుతున్నాడు)

డబ్బా : ఇదిగో మావాఁ! నీకు మొక్కుతాను. మా అప్పా, బావకు నిజం సెప్పు మావాఁ! నీ పదవి రాడానికి ప్లానింగంతా నాదేనని నన్ను అనుమానిస్తన్నారు. నాకిందల యేపాపం తెల్దని ఒక్క ముక్క గట్టిగా సెప్పుమావా, సచ్చి నీకడుపున పుడతాను.

పదమ : నేను పిల్లలు పుట్టకంట అపరేషన్ సెయ్యించుకున్నాను గానీ, మీ అప్పా, బావకు నీ మీద ఆ అనుమానం కొన్నాళ్ళింక అలాగే ఉండాల్రా!

డబ్బా : ఇప్పుడికిది సాల్దా? మా బావ ఎన్ని తిట్టినా, మా అప్ప ఎంత దీనిగా సూసీదిఁ! మొన్నోక పాలివస్తే మొకం మీదే తలుపేసీసింది. సెప్పక బయ్యమేటి? కళ్ళమ్మట నీళ్ళు జల జల జల రాలిపోయినాయంటే నమ్ము.

పదమ : మీ యప్పకే!

డబ్బా : నాకు

పదమ : అబ్బా! అంత ఏడిసీసినావా! అయితే ఇదిగోరా ఈ ఐదొందలుంచు (జేబులోపెట్టారు)

డబ్బా : ఇగటాలాడకు మావా! సెప్తన్నాను!... డబ్బు నాకవుసరమే గానీ, దాని కొసమేనేను బతుకుతున్నాననుకోకు.

పదమ : మరి దేనికోసం బతుకుతున్నావో సెప్పురా! దాన్నే తెచ్చి నీముందు పెడతాను.

డబ్బా : మా అప్పా, బావా – నమ్మకం సంపాయించాలా?

పదమ : వాళ్ళకన్నా ఈ ఊరు సుట్టూ ఉన్న కొండలు నయం! ఎదుటోడి బాధ సూసి కసింతైనా కరుగుతాయి. నువ్వెన్ని సెప్పినా ఆళ్ళింక నిన్ను నమ్మర్రా.

డబ్బా : నమ్మితే నమ్మినారు లేపోతే లేదు.... నీ పదవి ఎలగ తెచ్చుకున్నావో పూరాగా సెప్పీ సాలు.

పదమ : నీకేమైన పిచ్చేట్రా. వరాలివ్వని దేవుళ్ళకి వ్రతాలు సేస్తానంటావు. ఒరే! మీ అప్పా బావల మధ్య నీ పాత్ర ఎలాటిదో నాకు తెల్దా?. మీ అప్పా సుట్టంసేత పాము పట్టించీయ్యాలని సూస్తది. పాపం. మా అప్ప సెప్పింది కదా అని నువ్వు పట్టేస్తవు..... ఆ తర్వాత మీ బావ... సూడూ! మనింటి పావుని ప్రేమలేకంట ఎలగ పిసికేత్తన్నాడో లమ్డికే! అని తిడతాడు. ఎందుకొచ్చిన పర్రాకుర్రా!

డబ్బా : ఏమో మావాఁ! మా బావ ఎన్ని అన్నా కోపం మట్టుకు రాదు యానికంటే....

పదమ : యానికంటే శీకాకుళానికున్న 'కులం' జబ్బురా అది. ఆ జబ్బు ఎంతటి దంటే ఆఖరికి డాక్టర్ల దగ్గరికి, లాయర్ల దగ్గరికి కూడా కులం చూసుకునే పరిగెడతారు – నీటిలోన కనబడకంట నాచెలగుంటదో శికాకుళంలోన కులం అలగుంటది... ఒరే ఇవన్నీ ఏర్ర! మీ బావకు రాజిగాడు ఎదురు తిరిగాడు. సిన్న సిన్న కులాలన్ని దూరమైపోనాయి. రైత్వారీ కులాలనుండి కొంతమందిని రమ్మన్నాను. మరొక సిటంలో వొస్తారు – నెమ్మదిగా వాళ్ళందరిని మీ బావకి ఎగినెష్ట్ చేస్తాను. ఇక బామ్మెలాగు రాజిగాడి ప్రక్కనుంది. కిష్టప్పంతులు గాలివాటం మనిషి. మొత్తం పరిస్థితిని నాకు అనుకూలం చేసుకుంటూపోతాను. ఈ పద్దతిలో ఒక్కో ఊరు జయించుకొని ఎలిపోయినానుకో ఇకన మనకు అడ్డేటి లేదు. నెక్ష్ ఎలక్షన్లో ఎమ్మెల్యే నైపోనా. నాను ఎమ్మెల్యేనైపోతే లోకల్ కోటాకింద నీకు మంచి పదవి కట్టబెట్టగలను.... అంతవరకు నువు మీ బావకు ఎగినెస్ట్‌గా ఉండాల్సిందే... నాతో కల్సి పన్జెయ్యాల్సిందేఁ!... ఇంద ఇది తీసుకొని ఎలిపో.... (నోట్ల కట్ట ఒకటి తీసి జేబులో కుక్కాడు)

డబ్బా : ఈ డబ్బొద్దుగానీ.... (తిరిగి ఇచ్చేసాడు) అయితే మా బావకు దెబ్బకొడతానంటావ్!

పదమ : ఒకలాగ! అది తట్టుకోలేక మీబావ మనో వ్యాధితో మంచం పట్టియ్యాల్రా! ఈ ప్రాంతంలో నాను సెక్రం తిప్పాల్రా!... అందుకు

నీ సహకారం కావాల్రా!..... తిరిగి నేన్నీకు ఏటి సెయ్యాలో మొహమాట పడకంట సెప్పేరా! (బయటినుండి మనుషులు రావడంతో వాళ్ళ సంభాషణ ఆగింది – వాళ్ళకు పలకరింపుగా అటువైపుకు వెళ్ళాడు పడమటోడు)

డబ్బా : అమ్మనాకొడకా! పెద్ద స్కెచ్చేసేసినావు! ఇకన మా అప్పా బావను ఎలగ కాపాడుకుంటానో నువ్వే సూడ్రా పడమటోడా? (విసురుగా పక్కకు వెళ్ళిపోయాడు)

పడమ : (వచ్చిన వాళ్ళతో మాట్లాడి మళ్ళీ డబ్బాగాడి దగ్గరకు రాబోయాడు – డబ్బాగాడు వెళ్ళిపోవడంతో) డబ్బు సూపెడితే సాలు... వదిలిన బాణంలాగ దూసుకుపోతాడు.... ఈడికి లోపుట గుండెకొట్టుకోటం లేదు.... కరెన్సీ నోటు రెప రెపలాడుతంది! (రైతుల ద్గరకొచ్చి) అదిగో వస్తన్నాడు... మీ మట్టుకు మీరొచ్చినట్టే!

రైతులు : అంతే... అంతే...! (లోనుండి నాయుడు, మంగమ్మ వచ్చారు)

నాయుడు : ఏటి ఇలగొచ్చారు!

పడమ : నానొచ్చి సేనాసేపయ్యింది.... మీరేపని మీదొచ్చారో కానియ్యండి! నాకు టైంపడతది!

నాయుడు : సెప్పండి!

రైతు 1 : మేము సెప్పడానికి మీకు తెలీంది ఏటుంటది. ఊరంతా ఎలగుందో మీకు తెలీదా!

నాయుడు : ఏటిసెయ్యమంటారు?

రైతు 2 : ఆ రాజిగాడు అడుగుతున్నట్టు ఆ పదవేదో వదిలీగూడదా!

నాయుడు : వదిలేత్తాను... రేపునీపొలం వదిలీమంటాడు వదిలేత్తావా? మీ ఇల్లు వదిలీమంటాడు... వదిలేత్తావా? ఆ తర్వాత ఇంట్లోని ఆడోళ్ళను వదిలీ మంటాడు వదిలేత్తావా?

రైతు 2 : నాయుడు గారు!

నాయుడు : ఏం అంత సిర్రైత్తుకొచ్చిందేవి? ... ఆడు ఆడిగినవన్నీ ఇచ్చేసి ఆడి కాళ్ళ కింది దూరి పోదుమా?.

రైతు 1 : నీకు సెప్పడం రాలే! నాను సెప్తాను ఉండు. ఏటి లేదు నాయుడు! మరో వారంలో పిల్లాడి పెళ్ళి ఉంది. పెళ్ళంటే సాకళ్ళ మంగళ్ళ పని ఎంతంటాదో నీకు మాత్రం తెల్దా? మనూరిలో నీటి కెంత కష్టం? పెళ్ళంటే కావుళ్ళు, కవుళ్ళు మొయ్యాల. ... ఎవులు మోస్తారు... ఈ ముక్క పిల్లనిచ్చినోళ్ళకి తెలిస్తే సంబంధం సెడి పోతాదేమోనని జడిసిపోతన్నాడు. అంతే గదరా.

రైతు 1 : అంతే గాదు...! తగువేమో నీకూ నీ ఇంటి మంగలోడికి. మధ్యన మేమంతా ఎందుకు నలిగిపోవాల.

రైతు 2 : నువ్వు పదవి వదలవు. ఆడు పట్టు వదలడు. విషయం ఊరు దాటకూడదంటావు. ఇద్దరికీ మధ్యన మరొకడ్ని చొరబడనివ్వవు – ఏమీ ఇదిగో (పడమటోడ్ని చూపిస్తూ) ఇలాంటి పెద్ద మనిషిని పెట్టుకొని పరిష్కరించుకోవచ్చుగదా!

నాయుడు : బోరమీద చేసి తంతాను. ఈ పడమటోడు మీకు ఎంత ఇచ్చి తోలుకొచ్చినాడ్రా!

ఇద్దరు : మాకా!

మంగమ్మ : లేపోతే! పడమటోడు అంత పెద్దమనిషిలాగ ఎలగ కనిపిడిపోతన్నాడ్రా.

పడమ : ఇదిగో మర్యాదివ్వకపోతే లేదు. బోనస్‌గా ఈ అవమానాలు నాకేల! మీకు సీము, నెత్తురు, సిగ్గు, లజ్జ ఉంటే మీరే తేల్చుకోండి – నానేల ఇక్కడ? నానొస్తాను (వెళ్ళబోయినట్టు నటించాడు)

రైతు 1 : ఎవుడు నేయం అడిగితే ఆడిమీదకు నెగిసిపోవడమే పద్దతా?

రైతు 2 : ఇంక మాటలేల! ఈ సమస్య తేలుస్తావా? మమ్మల్నెల్లి ఆ రాజిగాడితో కల్సిపొమ్మంటావా!

రైతు 1 : ఏదో ఒకటి ఇప్పుడు తేలాలి!

నాయుడు : ఒసే.. తేలిపోడానికి అంత తేలికైన పనికాదిది. అర్థం సేసుకోండి! – బతకులు ఈదిన పడిపోయింది ఈళ్ళకే కాదు – అందరివీ! మట్టి దున్ని మట్టి మింగుతున్నారు రైతులు! గిట్టుబాటు ధరలు లేక గిజగిజలాడుతున్నారు! ఆళ్ళపరిస్థితి యేటి! ఊళ్ళో ఓ లక్ష రూపాయలు

వడ్డీకి తిప్పుకొని కాళ్ళమీద కాళ్ళేసుకుని బతికీసీవోళ్ళు కొందరు. ఇప్పుడు బేంకులొచ్చినాయి. మైక్రో ఫైనాన్స్‌లొచ్చినాయి – ఎవడ్ని ఆపగలం! దేన్ని ఆపగలం. ప్రపంచమే మరిపోతంటే నా మగ్గం ఆగిపోయిందీ, నా కొలివి ఆరిపోయిందీ, నా సారె తిరగలేదు అంటే నాదే తప్పా.

పదమ : రాజిగాడు అనేది అదే! మారిన ప్రపంచంతో నాను మారతానంటన్నాడు. కులవృత్తి మానేస్తేనంటే నామీద ఏలకత్తి కట్టడమని నిలదీస్తన్నాడు..... ఇది మళ్ళనామీద తొయ్యకు.

నాయుడు : ఒరే! గొడ్డు గోతిలో పడితే తలో బెడ్డ ఏస్తారురా! ఇలాటి సమస్యల్ని అడ్డం పెట్టుకొని మీలాటోళ్ళు పైకిలేస్తారురా! నాకేటి తెలీని పద్దతులు కావివి – కానీ మీ అందరూ తెల్సుకోవల్సిందొకటుంది – ఈ బవురుబల్లి అప్పల్నాయుడు బతికున్నంత కాలం ఆ రాజిగాడి ఆటలు సాగనివ్వను – ఒరే పదమటోడా! నీ ఆగడాలు సాగనివ్వను – జాగ్రతా!

మంగమ్మ : అయిద్రాబాదెల్లి పదవి తెచ్చుకున్నంత సులువు కాదు. వూరుమీద పెత్తనం సెయ్యడమంటే!.

పదమ : (అంతవరకు కప్పుకున్న వినయాన్ని తీసి అవతలికి విసిరేసాడు. సొంత యాసలో....) అవునమ్మా! వెళ్లాను... హైదరాబాదువెళ్ళి పదవి తెచ్చుకున్నాను. ఏం తెచ్చుకోకూడదా. ఈ ఊరు... ఈ ప్రాంతం మీ రాజ్యమా... మీ సొంత గుత్తాది పత్యమా... ఎవ్వర్ని రానివ్వరా! ఏవమ్మో! ఏవయ్యో పెద్దాయినా తెల్సుకో! మనిషితో మనిషి కలిసినప్పుడే సహకారం. మనసుతో మనసు కలిసినప్పుడే మమకారం. ప్రపంచమే ఒక గ్రామంలా మారిపోతుంటే ఇంకా నా గ్రామం, మా ప్రాంతం, నా పెద్దరికం అని వ్రేళ్ళాడుతారే! పోనీ పెద్దరికాన్ని పది కాలాలు నిలపుకొనే టట్టు పద్దతులుండాలిగా! ఎక్కడా? మచ్చుకు ఒక్కటి కనిపించదు – అణిచివేత – వీలైనంత వరకు అణగద్రొక్కడమే! ఏమీః! ఊరంతటిని గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తారు – కానీ ఆ డీలర్ గాడ్ని మాత్రం వదిలేస్తారు! వాడిష్టం – సరుకులు ఇస్తే ఇస్తాడు లేకపోతే లేదు ఆడ్ని ఏమి అనరు. సరకులు ఇవ్వకపోడమే మీక్కావాలి! ఎందుకు? ప్రజల్ని కంట్రోల్ చేసే పద్దతుల్లో అదొకటి! ప్రభుత్వ పథకాల్లో

ఎవడికి ఏది దక్కాలన్నా నువు తలకాయ ఊపాలి. కొన్ని పథకాలైతే ఈ ఊరి సరిహద్దులు దాటి రావు – ఎంత అన్యాం! చాకళ్ళు, మంగళ్ళతో సమానంగా రాయితీలు, రిజర్వేషన్లు అనుభవించేస్తారా? మీలాంటి మూర్ఖులకు రాజిగాడి ఊద్యమమే గుణపాఠం!

నాయుడు : ఒరేయ్! ఇంట్లోంచి బయటకునడు!

పడమ : ఆ నడుస్తాను! ఈ ఇంట్లోంచే కాదు – ఈ ఊళ్ళోంచే నడుస్తాను. నాకేమిటండీ! ఇక్కడ గాకపోతే మరొకచోటికి పోతాను – అదిగో తెలంగాణా ఇచ్చేసేటట్టున్నారు – అక్కడకు పోతాను. కానీ నాయుడూ! గుర్తుపెట్టుకో! మీ సొంత మనుషులు డబ్బాగాడిలాటోళ్ళు, నీకు మానేసి నాకు సహాయం చేస్తున్నారంటే ఎందుకు? నీలో లేనిది నాలో వాళు ళ్ళ సూస్తున్నారు కాబట్టి. అది కేవలం డబ్బుకాదు ఇంకేదో ఉంది. మరొక్కమాట పారేనీరే పనికొస్తాది. నిలవున్నది మదుగు కట్టి మురుగునీరైపోతాది. చూడు! వలసరావడమనేది ఇప్పుడేదో కొత్తగా వచ్చిందికాదు – పెళ్ళయినెంటనే ఆడపిల్ల అత్తారింటికి వలసొస్తది. ఆక్షణం నుండే ఆ కుటుంబం అభివృధి చెందడం ఆరంభమౌతాది. (వెళ్ళబోయి ఆగాడు) ఇదిగో వలస పక్షికే రెక్కలు గట్టిగా వుంటాయి. వస్తాను! (విసురుగా వెళ్ళిపోయాడు)

మంగమ్మ : ఎల్లంౘా! మీరేటింక మిడిగుడ్లేసుకొని సూస్తున్నారు..... ఎల్లండి (రైతులుకూడ వెళ్ళిపోయారు)

నాయుడు : ఏటి సెయ్యడం! ఏటితోచడం లేదు!

మంగమ్మ : ఈ తాటాకు చప్పట్లకు బెదిరిపోతామేటి?

నాయుడు : నేను బెదురుతాను! బుర్రకు బుర్ర జోడించి ఆలోచించినోడు లేడుగదా అని చింత!

మంగమ్మ : ఆడబ్బాగాడున్నా బాగుణ్ణు! మంచో చెడో ఏదో ఒకటి సెప్పేవోడు.... పిలిపించమంటావేటి!

నాయుడు : వొద్దుద్దు.... ఆడికాడై వస్తే రానీ గానీ.... ఒరే డబ్బాగా నువు రా! రా!....

డబ్బా : పిలిసినావా బావా!

నాయుడు : నక్కలాగా ఇక్కడే నక్కివున్నావా?

డబ్బా : నక్కలాగ కాదు... కుక్కలాగ.... బేపిలాగ! బావా! ఇదిగో ఈ చెప్పుతీసి కొట్టు.... కానీ పడమటోడ్ని మాత్రం నమ్మొద్దు.

నాయుడు : ఈ కొత్త రాగమేట్రా!

డబ్బా : కొత్త రాగం కాదు బావా! ... ఆ పడమటోడి ఎత్తు గడ సెస్తాను యిను.

మంగమ్మ : మాకు తెల్సుగానీ.... ఇప్పుడేటి సెయ్యాలో అది సెప్పురా!

డబ్బా : ఇప్పుడు నీకు రాజిగాడి కన్నా పడమటోడే పెద్ద శత్రువు. కాబట్టి మనం రాజిగాడ్ని మన ప్రక్కకు తిప్పుకోవాలి.

నాయుడు : అదే ఎలాగ?

డబ్బా : అదెలగంటే....

మంగమ్మ : సెప్పూ!

డబ్బా : ప్రెసిడెంటు పదవి ఆడికి వదిలీసి.....

నాయుడు : ఓస్! వదిలేత్తే

డబ్బా : ఆడెనక నిల్చినోళ్ళంతా మనపక్కకొస్తారు.

మంగ : ఇదిరా నువ్విచ్చే సలహా....

డబ్బా : ఇలాంటప్పుడు ఇంతకన్న మార్గం లేదప్పా!

నాయుడు : నువ్వు ఇలాటి సలహా సెప్పుతావని నేనూహించినాన్రా! రాజిగాడి దగ్గర ఎంత తిని రా. మాకిలాటి సలహాలిస్తన్నావ్! నువ్వు ఎంగిలి మెతుకులు ఏరుకొని తినే రకంరా! నడు! బయటకు నడు!

డబ్బా : బావా! నన్ను కొట్టు! తన్ను! సంపీ పర్వాలేదు – కానీ నాను సెప్పింది ఇను... రాజిగాడి వర్గాన్ని నువు దూరం సేసుకుంటే, ఆళ్ళను పడమటోడు దగ్గరికి తీస్తాడు. అప్పుడు నీ పరిస్థితి ఏటి? పదవులు సంగతి పక్కనెట్టి పిలిస్తే పలికేవాడు కూడ వుండడు.

ఆళ్ళు అటువైపు మళ్ళకముందే నీ మనసు మార్చుకొని ఆళ్ళను దగ్గరకు తీసుకో!

నాయుడు : ఇంక ఎంతసేపని ఆడి మాటలు ఇంటూ కూకుంటావ్.... మెడబట్టుకు తోసెయ్యకంట.

మంగ : నీవల్ల ఎన్ని తిట్లు పడాల్రా నేను... పోరా అవతలికి.... ఎల్తావా తన్నాలా?.... పోరా... (బయటకు నెట్టేసి వచ్చింది) ... ఇదిగో ఇలాటప్పుడు డబ్బుకు సూసుకోవద్దు. నాకాడ పదిలచ్చలున్నాయి. ఊళ్ళో పంచు.... కులాల వారీగా పంచితే సచ్చినట్టు ఆళ్ళే మనసుట్టూ తిరుగుతారు.

నాయుడు : నమ్ముకున్న మనుషులంతా వదిలి ఎలిపోతే.... మనిషిని ఆపదలో గట్టెక్కించేది డబ్బొక్కటేనే! పద!

**(లైట్స్ ఆఫ్ - లైట్స్ ఆన్)**

## 15వ సన్నివేశం

రాజిగాడి ఇల్లు–

(ఇంటి దగ్గర చాలా కోలాహలంగా ఉంది. ఈరమ్మ పొట్టపైకి కనిపిస్తోంది. ఏ పనిచేస్తున్న అప్పుడప్పుడు పొట్టను నిమురుకుంటోంది. అడ్డపొగది అన్నీ తానై చేసుకుపోతోంది).

అడ్డపొగ : ఇదిగో ఈరప్పా! ఈ తపేల్లోని టీ గేసుల్లో పోసి ఇక్కడ ఇడ్డాను. నువ్వు ఎవులికిమ్మంటే ఆళ్ళకి గేసుడేసి ఇచ్చుకెలిపొస్తను. ఏటంటావ్?

ఈరమ్మ : నాను అనేదేటుంది. తోడబుట్టినదానిలాగ సాయబడతన్నావు. ఎవులెవులి కివ్వాలో నువ్వే సూసుకుని ఇచ్చీకంట. ఆమాత్రం సొతంత్రం నీకుండదేటి?

అడ్డపొగ : అలగలగేc! ఆనాయుడు పెళ్ళాం నోటంట ఒక్కపాలిగూడా ఈ మాట రాలే! సేకరి సెయ్యించుకున్నప్పుడు మాత్రం గొప్ప సోబత్తు సూపెట్టేస్తాది... ఎవ్వారమొచ్చేసరికి ఎడమెట్టేస్తాది. నువ్వేటంటే అనుగానీ ఈరప్పా! సిన్నకులాలోళ్ళకున్న కలుపుగోరుతనం, ఆ పెద్దనాయాళ్ళకి రాదే!

ఈరమ్మ : (మాట మార్చాలని) కాదూ! పదిగంటల కల్ల ఇంటినుండి ఎల్లబార మన్జెప్పింది బామ్మ. ఈ మనిసేవింకా పికర్లేదు. తెల్లారికెలి పోనాడప్పా! ఇప్పుడికింక ఇంటిమొకం సూడలే!

అడ్డపొగ : నామినేసనంటే అందర్నీ కూడగట్టొద్దా! రాజిగాడేటి నాయుడి పుట్టుక పుట్టినాడు కవురెట్టేసి ఇంట్లో కూకో పోడాకి. ఓరి రాయంద్రా రాయంద్రా అని అందర్నీ ఉల్లగించడాకి ఎందంట ఎన్ని పత్రాకులు పడతన్నాడో! నువ్వేటంటే అనుగానీ ఈరప్పా! ఇలాంటివన్నీ ఆ పెద్దకులపోళ్ళకి సెల్లబాటవుతాది గానీ, సిన్నకులపోళ్ళకి సింతలు వంత లే! (బయటినుండి డబ్బాగాడొచ్చాడు)

డబ్బా : ఈరప్పా! నాయుడు మనుషులెవలూ ఇటు రాలేదుగదా!

ఈర : లేదు నాయనా! ఎవలు ఇటుకాసి రాలే! ఏవి నాయనా! అంత దీనిమీద అడుగుతన్నావు.

డబ్బా : ఏవీలేదులే! నానిక్కడే తిరుగుతుంటానులే. ఏంపర్లేదు. సరేనా!

ఈరమ్మ : అలగలగేఁ!

అడ్డపొగ : ఈడికేటి తిపారమేటి? సిటంకొక పాలి వచ్చి నాయుడి మనుసులు రాలేదా అని అడుగుతాడు. ఈడు నాయుడి మనిసి కాదేటి? ఏటో?

ఈరమ్మ : అదిగో ఎలిపొచ్చినాడు! రా! ...రా! (రాజిగాడు వచ్చాడు) ఒంటమీద కసిన్ని నీళ్ళు పోసుకుని ఒక ముద్ద తిను ఎల్ల బారు!

రాజి : అంతమంది వొచ్చినారు ఆళకి టీ నీళ్ళయినా ఇచ్చినావా? లేదా!

అడ్డపొగ : నాయినిదిగో వట్టికెళ్ళి ఇచ్చేత్తాను. (టీ గ్లాసులున్న పళ్ళెం తీసుకుని బయటకెళ్ళింది)

రాజి : స్సరే... కానీ... కానీ.. సూసినావా జనం ఎలగ మన కేసి ఎలిపొస్తన్నారో... నాయుడు కూడా నామినేషన్ ఈ పొద్దే... అక్కడెవలు మనుసుల్లేరని గయ్... గుయ్.. లాడతన్నాడట. (కులపెద్ద వచ్చాడు)

కులపెద్ద : అవున్రా! ఆ డప్పులోళ్ళు, డోలుగాలు, మేలగాళ్ళు, తాలగాళ్ళు, పగటేసగాళ్ళు, బండమీద ఏసాలోళ్ళూ ఇంతమందిని లెగ్గొట్టావు?

రాజి : నాను లెగ్గొట్టడమేటీ? ఎవులిమట్టుకు ఆళ్ళే ఎలిపొస్తుంటే...

కులపెద్ద : ఆళ్ళమటుకు ఆళ్ళొచ్చీసినా పైసోపరకో ఇవ్వాలి గదా! రోజుకూలి నష్టపోకంట.

ఈరమ్మ : నాయుడు కాడా తీసుకున్న డబ్బు కూలికింద లెక్కేసుకుంటా రట్లే!

కులపెద్ద : ఏటీ సొమ్ము నాయుడిది! సోకు మనదే... బలే... బలే.... (స్టూలు మీద కూర్చోబోయాడు)

ఈరమ్మ : ఓలమ్మ నడుం ఇర్సుకుంటాడు గావాల..... దానికసలే కోడులేదు.

కులపెద్ద : అమ్మో! (కూర్చోబోయి ఆగిపోయాడు)

ఈరమ్మ : (అది గ్రహించి రెక్కపుచ్చుకొని బయటకు నడిపిస్తూ) బయటంత పనెట్టుకుని ఇంట్లోన కూకుంత నంటావేటి? నువ్వు లేపోతే తల్లకిందులై పోదా?

రాజి : ఇదిగో పెద్దయ్యా! ఈ మేలతాళాల్నీ, మనోళ్ళందర్నీ తీసుకెళ్ళి బామ్మని ఊరేగింపుగా తీసుకురండి. మీరొచ్చిసరికే నాను రడీ గుంటాను.... ముందల నువ్వే నిలబడాల.

కులపెద్ద : నాన్జూసుకుంటాను – నా కొదిలీ. నన్నొదులు... ఓరే ఏట్రా వాయించడం... ఏదీ ఎయ్యండి దరువు... అదీ... అదీ... (ఈలలు, అరుపులు, దరువులు నెమ్మదిగా దూరమయ్యాయి)

ఈరమ్మ : ఇదిగో నామినేషన్ ఎయ్యబోతున్నావ్.. గెలిత్తే...? గెలిత్తే ఏటి గెలుస్తన్నాం. పెసిడెంటు అవ్వబోతున్నావ్! ఈక ముక్క సొగసు నెరిసిన్నాడు కాదు మొలిసిన్నాడే తెలిసిపోతాది. బట్టలు ఇస్త్రీ సెయ్యించి ఎట్టినాను... కట్టుకో! వాసననూని... దువ్వెన ఎట్టినాను నున్నగ దువ్వుకో అద్దం ముందు పొగుడ్రు డబ్బా ఇడ్డాను... రాసుకో... మీసం నోట్లోకెలిపోతంది.. ఇలగ కోరగా తిప్పు... ఏటీ బతుకని ఎప్పుడూ నెత్తి కొట్టుకునీ వోడివి... ఈ పొద్దైన కసింత తొడగొట్టు.

రాజి : ఇగటం ఎక్కువై పోతంది... తగ్గించు.

ఈరమ్మ : ఇదిగో ఊరికి పెసిడింటువైనా ఈ ఈరికి మాత్రం రాజిగాడివేః! ఇది పెసిడెంటుపెళ్ళాం ఆడ్రు. ఇదిగో పెసిడెంటు కొడుకు... ఇతగాడ్ని గుర్రప్పండేసుకుని ఎల్లి ఊరంతా తిప్పుకొనిరా!

రాజి : సిత్తం అమ్మగోరు.

ఈరమ్మ : నువు పెసిడెంటువయినాక నిన్ను సేనా గవురంగా సుత్తారంటావా? లేపోతే ఇప్పుడులాగే పెసిడెంటులంజికొడకా! ఇలగ రారా అంటారా?...

రాజి : శ! శ! వొదులు ఏలైపోతంది.

ఈరమ్మ : ఒకేల అలగ పిలిసినారనుకో! పలుకుతావా!

రాజి : మున్ముందు ఏటి జరుగుతందో ఎలాగసెప్పగలం. తానం సెసొస్తానుండు

ఈరమ్మ : సెప్పితేనే ఒగ్గుతాను. సెప్పు... పెసిడెంటు పదవి కూడా మంగలి పనిలాటిది అవ్వదుకదా!

రాజి : అవ్వదులే!

ఈరమ్మ : అవ్వదంటే కాదు. అయితే ఏటిసేస్తావో ఇప్పుడే గట్టిగా అనుకో... లేపోతే నేను సెప్పుతాను ఇనుకో.

రాజి : సెప్పు.

ఈరమ్మ : ఇదిగో గెడ్డాలు గియ్యనని వదిలేసిన కత్తి. ఎల్లప్పుడు దీన్ని జేబులో ఇడుకో? ఎప్పుడైనా అగౌరవంగా పిల్సినా, తిట్టినా కత్తితీసి పుటుక్కున గొంతుతెగ్గొయ్! ఆ దెబ్బకు నిన్నే కాదు, మనలాంటి కులాల్ని ఎవడు అగౌరవం సెయ్యడానికి జడిసిపోతాడు.

రాజి : ఈరమ్మా!

ఈరమ్మ : అవునయ్యా! నువ్వా పనిచేస్తానిని మాటిత్తేనే నానీ కడుపును మోసి పిల్లాడ్ని కంటాను. కాపోతే మాత్రం...

రాజి : ఈరమ్మా! పల్లకో.. పల్లకో...

ఈరమ్మ : తిట్లు, చులకన మాటలు, ఎకసెక్కాలు, ఇనిఇనిఇని గుండె అలసిపోయిందయ్యా! ...మన బతుకులు మన పిల్లలకొద్దు! ...ఆళ్ళు మారాజుల్లాగ బతకక్కర్లేదు. మనుషుల్లాగ బతికితే చాలు... ఆళ్ళకి ఆ మాత్రమైనా ప్రేప్తం ఉండదా సెప్పు.

రాజి : ఇన్ని పత్రాకులు పడి, ఇంతమందికి సెద్ద అయి దేనికోసమని ఇదంతా సేస్తన్నాను .... వస్తాయి... మంచి రోజులు తప్పకండ వస్తాయి.

ఈరమ్మ : సేన... ఆమాట సేన... ఎల్లు... ఎల్లి బేగి తానం సేసిరా... (రాజిగాడు లోనకు వెళ్ళాడు – ఈరమ్మ బయటకెళ్ళ బోతుండగా విసురుగా నాయుడు కంబర్లు ఒక తప్పెడ గుళ్ళోడ్ని తోసుకుంటూ వచ్చారు. గుండెమీద తప్పెడగుండు ఉంది, కాళ్ళకు గజ్జెలున్నాయి)

అసిరి : ఏవిరా! నాయుడు పిలిస్తే ఒంట్లో బాగులేదన్నావ్ – ఇక్కడ ఎలగర తప్పెడగుండు కట్టేవు–

బారికోడు : నాయుడి మాటకి అంత ఇలువలేదురా. ఇప్పురా తప్పెడ.

అసిరి : ఇప్పురా గజ్జిలు. (వాడిని క్రిందకు పడదోసి కొడతన్నాడు)

ఈరమ్మ : వదలండి రా... వదలండిరా! నాయుడైతే ఎవడికెక్కువరా! ఇష్టముంటే వస్తారు. లేపోతే లేదు.

అసిరి : గొప్ప మొనగత్తెవే నువ్వు..

బారి : పిడకల కొచ్చినప్పుడే తన్నాల్సింది.

ఈరమ్మ : (మూలనున్న రోకలి తీసింది) రారా! నువు మగోడవైతే ఎయ్యిరా! రా! రా! (ఈలోగా పరిగెత్తుకుంటూ వచ్చాడు డబ్బాగాడు)

డబ్బా : అనుకున్నంత పన్జేసాగ్రా! ఈరప్పా! నువ్వాగు! రేయ్ నువులెగు... ఒరేయ్ మీరిలా రాయండి! లమ్డీకుల్లారా! అసెట్టుకింద నిలబడి అన్నీ సూస్తన్నాను కాబట్టి సరిపోయింది లేపోతే.....

అసిరి : బారికోడే! పద బాదీద్దుమన్నాడు.

డబ్బా : ఆఁ! బాదేత్తారు మిగిల్నోలు లేరు కాబట్టి బతికిపోనారు, ఉంటే!... పులుసులోకి ఎముక లేకంట ఏరిద్దురు. నీకంత తొందరేట్రా బారికే.

బారికోడు : నాయుడి మాట తీసేత్తే కోపం రాదేంటి? ...ఈనా కొడుక్కి నాను ఎల్లి పిల్సినాను. ఒంట్లో ఊష్టమన్నాడు... ఇప్పుడో (మీదకెళ్ళ బోతున్నాడు)

డబ్బా : ఏట్రా మెడపోత్రం! చెబుతుంటే సేనా ఎక్కువ సేస్తన్నావేఁ! (లోనుండి రాజిగాడు వచ్చాడు. అతని వేషంలో కొంతమార్పు కనిపిస్తుంది. పంచెకట్టు, పూరాలాల్చీ, పైమీద కండువా వేసుకున్నాడు. మీసం మెలిదిప్పి ఉన్నాడు)

సూడండ్రా! కళ్ళిప్పి బాగా సూడండిరా! సింకిగుడ్డలేసుకుని సింపిరిజుత్తుతో ఉన్నరాజుగాడికి, కొత్తబట్టల్లో కళకళలాడుతున్న రాజయ్యకు తేడా సూడండిరా! ఒరే మనుసులందరూ ఒకటేన్రా! ఏ నాకొడుకు రెండు గుండెల్తోటి, నాలుగు మెదడులుతోటి పుట్టన్రా! మనుసుల్ని వేరుచేసేది ఏసబాసలేన్రా!... నెల పోతే నాయుడులాగ అవుతాడు, ఒక సంవత్సరం గడిస్తే పడమటోడిలాగ అవుపిస్తాడు....

నాయకత్వమనేది మన ఊహే(న్రా!... కులాల గొప్పతనమనేది మన భ్రాంతిరా! ఒకడ్ని నువు కింకరుడివి కింకరుడివి అంటే ఆడు కింకరుడైపోతాడు... ఆడ్నే నువు శంకరుడివి, శంకరుడివి అంటే ఆడే శంకరుడైపోతాడు. (బయటినుండి వినిపిస్తున్న పాట ఇంకా దగ్గరైంది) ఇప్పటిదాకా మా బావనెంత గౌరవంగా సూసినామో! ఇక నుండి రాజయ్యను అలాగే సూడాలి.

అసిరి : మావల్ల గాదు.

బారికోడు : నీ పిచ్చిగానీ, రాజిగాడు రాజౌతాడ్రా!.... పదరా పోదాం. (బయటకెళ్ళారు – బయటినుండి పాట పాడుకుంటూ ఊరేగింపు వచ్చింది. రాజిగాడు బామ్మను చూసి కాళ్ళకు మ్రొక్కాడు)

బామ్మ : విజయోస్తు! పదండి నామినేషన్ వేద్దాం!

డబ్బా : రాజయ్యకి... జై (పాటందుకున్నారు...

చూసారా చేతివృత్తి సాధనాలు

భగభగమండే విస్ఫులింగాలు....

**(లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్)**

## 16వ సన్నివేశం

నాయుడి ఇల్లు–

(నాయుడు కోపంతో ఊగిపోతున్నాడు. ఎదురుగా కంబర్లు ఉన్నారు)

నాయుడు : వాడు గుండెలు తీసిన బంటు. నమ్మక ద్రోహి. నాను చెబుతూనే వున్నాను. నువ్వే తమ్ముడు, తమ్ముడని మీదెక్కించుకున్నావ్!

మంగమ్మ : ఇప్పుడాడి గోలేల! నామినేషన్ ఎయ్యడానికి టైమైపోతంది దాని సంగతి సూడు.

నాయుడు : ఎలాగెల్తాం! ఒక్కడైనా ఎనక ఉండాలిగా. పదిలచ్చలు పంచాం – లచ్చకొక్కడొచ్చినా పది మంది ఉండాలి. ఏరి?

మంగమ్మ : ఏరి అని నన్నడిగితే నానెక్కడ నుండి తెస్తాను. (కిష్టప్పంతులు బయటినుండి వచ్చాడు)... ఏటయ్యింది పంతులు! జనాలేరి?

కిష్టప్ప : అమ్మా! అందర్నీ అడిగి చూసాను. బ్రతిమాలాను... బుజ్జగించాను... అందరిదీ ఒక్కటే మాట... రాజయ్య నామినేషన్ వేసేవరకు ఎవ్వరూ రారంట.... వాడు వేసిన వెంటనే అందరూ కట్టగట్టుకుని ఇలా వచ్చేస్తారట.

నాయుడు : పోన్లే అదీ ఒకందుకు మంచిదే.... ఆ నాకొడుకు మొకం సూడ్డం తప్పిపోతాది... పంతులు ఇప్పుడు వర్జ్యం అదీ లేదుకదా!

కిష్టప్ప : (పంచాగం చూసి) అయ్యా! వర్జ్యం మాటకేం గానీ మరో పావుగంటలో నామినేషన్ వేసే టైం పూర్తయిపోతుంది. తొందరపడితే మంచిదేమో!

(బయటినుండి అడ్డపొగది వచ్చింది)

అడ్డపొగ : వొదినా... వొదినా... వొదినా...! మాట

మంగమ్మ : సెప్పు పరవాలేదు

అడ్డపొగ : వొదినా! ఏటాజనం! ఇసకేస్తే రాలదు... అబ్బబ్బబ్బ

మంగమ్మ : మనింటికేఁ!

అడ్డపొగ : ఇంక అడుగుతావ్ఁ! అన్న ఎలచ్చన్లు ఇన్ని సూసినాను కానా! ఎప్పుడింత జనం సూళ్ళే దమ్మా! డబ్బొదినా డబ్బు... నోట్లు ఎలగిసినారో జనవలగ తిరగబడిపోనారు.

మంగమ్మ : ఇదిగో మొత్తం ఊరంతా ఉలికి పోనారట. ఇంక సూత్తన్నావేటి! ఎల్లబారకంట... ఓరి డబ్బాగాడా...! ఓరి ఉన్నోళ్ళు, లేనోళ్ళు, అయినోళ్ళు, కానోళ్ళు, గోతులు తీసినోళ్ళు, మూతులు నాకినోళ్ళు ఒరే అంతా ఇనండిరా! మీరంత ఎలిపోతే మాకేటి వట్టమైపోయిందిరా! మాకేటి నట్టమైపోయిందిరా! ఒరే రాజిగా! ఎంత రాలిపోనావురా! ఎంత ఎగిరెగిరినావురా!

అడ్డపొగ : వొదినా! వొదినా!

మంగమ్మ : ఏటే

అడ్డపొగ : మెల్లిగ తిట్టొదిన ఆడు ఇనగల్డు

మంగమ్మ : ఆడెలగ ఇంటడే! ఇక్కడున్నాడా ఏటి!

అడ్డపొగ : లేడేటి మరి!

మంగమ్మ : ఎక్కడే?

అడ్డపొగ : జనాలు, దప్పులు, డాన్సులు, మేళాలు, తాళాలు వస్తాంటే, ఆళ్ళకు ముందు రాజిగాడే కదా నడిసొస్తన్నాడు!

మంగమ్మ : ఓల్లంజా! అయితే ఆళ్ళు మనకోసం వస్తన్నోళ్ళు కాదే! మన మీదకొస్తున్నోళ్ళు!

అడ్డపొగ : ఎలగైతేటిలే వొదినా! వస్తున్నది మనింటికే కదా! సెంగున సేరడు బియ్యం ఎయ్యవా!

మంగమ్మ : ముండా నా సెంగే సిరిగిపోతుంది! పో ఇక్కడ్నించి!

అడ్డపొగ : ఊహూ! మంచిమాట సెప్పినా కోపమే ఈయమ్మకి. (మూతి తిప్పుకుంటూ వెళ్లిపోయింది)

నాయుడు : ఏటంత మంది వస్తన్నారా? అలగొక్కపాలి ఈదిలోకి చూడండి!

మంగమ్మ : (చూసింది.. తేరిపార చూసింది, ఎగిరెగిరి చూసింది) ఏవయ్యో!

నాయుడు : ఓయ్!

మంగమ్మ : అది సెప్పింది నిజమేనయ్యో! ఆళ్ళు జనాలు కాదయ్యో! ఊళ్ళు, ఊళ్ళు కదిలొస్తున్నట్టుందయ్యో!

నాయుడు : నువు మరీసెప్తావ్! ఉండు సూస్తాను... (లేవబోయాడు) అబ్బ! నడుం కళుక్కుమన్నాది... లెగలేనుగానీ... నువ్వే సూడు! నువ్వాగు! పంతులూ నువు సూసి చెప్పు! రాజిగాడున్నాడా!

కిష్టప్ప : వాడు రాజిగాడిలాగ లేడు

నాయుడు : ఓసే (శాంతం)

కిష్టప్ప : రాజుతున్న తూరుపు దిక్కులాగున్నాడు

నాయుడు : ఒసే! (ఆశ్చర్యం)... నువు సూడు! ఆ ముసలమ్మ! ఈల బామ్మ ఉన్నాదా!

మంగమ్మ : ఉన్నాది... పచ్చని పసుపు ముద్దలాగున్నాది.

కిష్టప్ప : గాంఢీవం ధరించి కౌరవ సేనను చెండుతున్న ఫల్గుణునికి బాసటగా నిల్చిన ఆడ శ్రీకృష్ణునిలాగుంది.

నాయుడు : ఓసే (వీరం)

కిష్టప్ప : రాజిగాడొక్కడే కాదు... ప్రతీవృత్తి పనివాడు తనవృత్తి సాధనాన్ని ఆయుధంగా ధరించి ఈ ప్రజాస్వామ్యంలో, ఈ పరిపాలనలో తనవాటా తనకిమ్మని నిలదీసేందుకు ఒక పాండవ మధ్యముడిలా వస్తున్నాడు.

నాయుడు : ఓసే (భయం) ఈ పంతులు మరీ జడిపించీస్తన్నాడు. మంగమ్మా! నువ్వే చూసి చెప్పు!

కిష్టప్ప : ఎవరు చూసినా ఒక్కటే! ఆ ప్రజావాహిని జపిస్తున్న మంత్రమూ ఒక్కటే! ఇన్నాళ్ళు మీ ఇళ్ళముందు పడిగాపులు పడి కూటికి, గుడ్డకు నాయినా బాబూ అని అడుక్కున్నాం! పెడితే తిన్నాం, కొడితే పడ్డాం, అవమానాలు, అవహేళనలు అనుభవించాం.

నాయుడు : ఓసే (కరుణ)

కిష్టప్ప : ఇక ఈ పరిస్థితి మారాలి – మార్చడానికి మేము దేనికైనా సిద్ధపడతాం. మా ప్రాణాల్ని సైతం లెక్కచెయ్యం! ప్రళయాన్నైనా సృష్టిస్తాం, ప్రకృతినైనా స్థంభింప చేస్తాం!

నాయుడు : ఓసే (రౌద్రం)

కిష్టప్ప : మమ్మల్ని గౌరవించి, మా మాటలను మన్నించలేదో మీ చర్మాలతో చెప్పులు కుడతాం. మీప్రేగులు త్రెంచి మా మెడలో వేసుకుంటాం – మీ కపాలాలతో ఆడుకుంటాం.

నాయుడు : ఒస్సే స్సే స్సే... (భీభత్సం)

మంగమ్మ : ఈ పంతులు పైత్యమంతా సూపిస్తన్నాడు – అడబ్బాగాడి మాట విని ఉంటే ఇప్పుడీ కష్టమెచ్చేది కాదు... పంతులయ్య! ఇలాటప్పుడు దైర్యం సెబుతావా ఇంక జడిపించీస్తావా!

కిష్టప్ప : ధైర్యం చెప్పడానికి నాకు ధైర్యం ఉండొద్దూ! అమ్మా! చినుకుకైతే గొడుగేసుకుంటాం – వాగో, వంకైతే మోకాలు వరకు తడిసినా ఫర్వాలేదని దాటేస్తాం.... కానీ వస్తున్నదేవిటి? తుఫాను, ఉప్పెన, సునామీ... (రాజిగాడు, బామ్మ మరి కొంతమంది వాచ్చారు)

నాయుడు : రేయ్ః! అంతా కట్టకట్టుకొని ఈ రాజిగాడ్ని ఎంటపెట్టుకొని వస్తే. నేను భయపడతా ననుకున్నారా. లేకపోతే ఈ పంచాయితీ పదవి ఈ రాజిగాడికి ఇవ్వడానికి ఇష్టపడతాననుకున్నారా! లేదు! నా ప్రాణమున్నంత వరకూ నేనే ప్రెసిడెంటుని... ఓరేయ్! నిన్నరాత్రి ఊరందరికి డబ్బులిచ్చాను. మర్యాదగా నాతో రండి. నామినేషన్ ఏస్తాను

జనం : మేమురాం!

నాయుడు : సంపుతాను నాకొడకల్లారా!

మంగమ్మ : నువ్వు నోర్మూయ్! చింత చచ్చినా పులుపు సవ్వలేదు. నాయినల్లార! మీరెవలు మాకు ఓట్లెయ్యొద్దు. నామినేషనేయడానికి రాండి. నిన్న డబ్బులు తీసుకున్నందుకైనా రావాలిగదా!

బుడ్డన్న : మేము రాము. అందరూ ఇక్కడే కూకోయండి! ఎవ్వరూ కదలకండి! ఏంచేస్తాడో సూద్దం. కూకోయండి!

(అందరూ కూర్చున్నాల)

నాయుడు : మీరెవులు రావొద్దు... పద మంగమ్మా! మనిద్దరమే ఎల్లి నామినేషన్ ఏసివద్దము... పద...

(బయటి నుండి డబ్బాగాడు వచ్చాడు)

డబ్బా : ఇప్పుడు నువ్వెళ్ళినా లాభంలేదు బావా!

నాయుడు : ఏం?

డబ్బా : నామినేషన్ ఏసే టైమైపోయింది.

నాయుడు : అయితే నానింక ప్రెసిడెంటుని కాలేనా?

డబ్బా : కాలేవు!... ఐదు గంటలలోపు ఒకే నామినేషన్ వచ్చింది కాబట్టి, రాజిగాడు... కాదు కాదు రాజన్న ఏకగ్రీవంగా పెసిడెంటు అయినట్టు ఎలక్షనాఫీసరు డిక్లేర్ చేసీశాడు.

జనం : రాజన్నకీ... జై... రాజన్నకీ... జై....

మంగమ్మ : కాలం కల్సిరాపోతే తాడేపామై కరుస్తాదట... ఆఖరకు ఈకముక్క.. ఒక ఈకముక్కలాటోడు ఇంతవరకు తెచ్చాడు... సాగనప్పుడు సర్దుకుపోవడమే మంచిది.

నాయుడు : ఏటి సద్దుకుపొమ్మంటవు? ఎలగ సద్దుకుపొమ్మంటవు.... మంగలి రాజిగాడంటే ఇదిగో ఇలగుంటడని, నన్నుజూసి తలదించుకొని, భయం, భయంగా పక్కకు తప్పుకుంటాడని, ఒక రూపు, ఒక తీరు, ఒక పద్దతి, నాకళ్ళకు, నామనసుకి, నా గుండెకు అలవాటైపోయింది! ఇప్పుడెలగే.... ఇప్పుడెలగ సర్దుకుపొమ్మంటావే!

డబ్బా : బావా! అటుసూడు... రాజిగాడి కళ్ళలోకి ఒక్కపాలి సూడు... ఆడు పెసిడెంటు అయినా.... ఆ కళ్ళల్లో నీపట్ల ఎంత ప్రేముందో సూడు!

నాయుడు : సూడలేనురా! ఆడికళ్ళలో భయ్యం... భయ్యం... భయ్యం తప్ప మరోభావం సూడలేనురా. ప్రేమ, అభిమానం అవి నామీదే కావచ్చు. కాని సూడలేనురా! ఒరే! ఒరే! ఆ సింపిరి జుత్తు నున్నగా దువ్వితే నాను తట్టుకోలేనురా. ఆడి సిరిగిన సొక్కా ఇస్త్రీ చేసి నిగనిగలాడితే భరించలేనురా. నాముందు ఆడెప్పుడూ వంగి వంగి ఉండాలే తప్ప, నిటారుగా నిలబడితే సూసి భరించలేనురా.

ఈరమ్మ : ఇది గిది అసలు సంగితి! నాయినా ఈ పెద్దోళ్ళు ముందు సిత్తం, బత్తెం అని సేతులు కట్టుకొని నిలబడే వోళ్ళందరికి అర్దమయ్యిందా! కసింత ఎక్కువ తక్కువలో ఈ పెద్దోళ్ళందరిదీరు ఇలగే ఉంటది.... ఈల కాడ ఇలాగే సచ్చిపోతమా!... లేదూ... సస్తే సచ్చినామని తెగించీసి తిరగబడతమా... ఆలోసించుకోయండి!

నాయుడు : పెతీవోళ్ళు మాటాడివోళ్ళే! అందుకే అందరికీ సదువొద్దని సెప్పాను.

బామ్మ : నువుపొరబడుతున్నావు నాయుడు – తెలివి ఎవడబ్బసొత్తూ కాదు. సమాజానికి మించిన బడిలేదు, జీవితానికి మించిన చదువూ లేదు. చదువు పాఠంనేర్పి పరీక్షపెడుతుంది. జీవితం పరీక్షపెట్టి పాఠం నేర్పుతుంది.

మంగమ్మ : ఈ లజ్జు గుజ్జు లేల? ఒక్కసిటం ఆగండి నాను ఒప్పిత్తాను.... అర్థం సేసుకోవేటి? మనెనకున్న మనుసులంతా జారిపోనారు.. రాౖనాను ఈ ఆస్తులు, భూములు లాగీసుకుంటో?... నాయినా రాజయ్య! ఆ మనిషితో నీకేటి రా కుర్సీమీద కూకో!

రాజి : వద్దమ్మా! మీ ఆస్థులు, మీ భూములు, మీ వన్నీ మీకాడే ఉన్నీయండి! మాకు ఆటిమీద ఆశ లేదు, మా పరిస్థితి అర్దం సేసుకోండి. మతం మైనారిటీకన్నా. కులం మైనారిటీ భరించలేనిది. అదెంత దారునంగా వుంటాదో మాకే కాదు. మీకు తెలుసు కాని మమ్మల్నేవరూ పట్టించుకోరు. పులుల్ని, మేకల్ని ఒక గొడుక్కింద కట్టేసి మీరందరూ కలిసి ఇది తినండంటే మాకు కోరల్లేవు, పంజాల్లేవు ఆఖరికి గట్టిగా అడగడానికి నోరూ లేదు. మాకేటి దక్కుతదో ఆలోసించండి. ఎక్కడినుండో వచ్చిన ఎన్నోమతాల్ని మైనార్టిలనీ చేరదీస్తన్నారు. తప్పులేదు. కానీ ఈ దేశంలో, పుట్టి ఈ దేశంలో పెరిగి ఈ దేశానికి సేవలు చేసినోళ్ళం, సరుకులు తయారు సేసినోల్లం, మీ అవసరాలు తీర్చినోల్లం, మా గురించి ఏటాలోసిస్తున్నరో సెప్పండి. ఇప్పుడు మిసన్లు వచ్చినయని మీ మనసులు కూడ మిసన్లయిపోయినయా? ఎన్ని కులాలు వృత్తులకు దూరమైపోయి, తిండికి లేక అల్లాడిపోతున్నయో మీకు అగుపించడం లేదా. అంతరించిపోతున్నయో మీకు అర్థం

కావడం లేదా? ఇల్లూ వాకిల్లూ లేకంట కొన్ని కులాలున్నాయి. ఇంకా సంచారుల్లాగే మరికొన్ని కులాలు బతుకుతున్నాయంటే మీకు సిగ్గేయడంలేదా? వార్డు మెంబరు కూడా కాని కులాలున్నాయంటే ఇది పెజాసామ్యమేనా? మా సేతుల్లో ఎప్పుడూ పప్పు బెల్లాలేనా? కొన్ని రకాల పశువులు పచ్చులు అంతరించిపోకండ కాపాడలనే అంత ఉబలాటపడతన్నారు. అంతకన్న మా కులాలు తీసికట్టా? మా పేనాలు అంత పనికిమాల్నాయా? నీకు ప్రెసిడెంటు పదవి ఒక అలంకారం, కాని నాకు ఆత్మ తృప్తి! ఒక గుర్తింపు, నన్ను మనిషిలాగ గుర్తించినారనే గొప్ప ధైర్యం! ఈ సమాజంలో, ఈ ప్రభుత్వంలో మాకూ వాటా ఇచ్చినారనే ధీమా!... మేమంతా దాన్నే కోరుకుంటున్నాం! ఈ పోరు ఆస్థులకోసం కాదమ్మా! ఆత్మ గౌరవం కోసం... అది మీకర్థం కాపోతే నాయుడమ్మ! నాయుడుబాబు! ఇదిగో అప్పుడు ఏకుర్సీలో కూకుంటే తన్నేవో ఆకుర్సీలోనే కూకుంటాను... (కుర్చున్నాడు) ఇదిగో ఇదితీసుకో. ఇది ఇన్నాళ్ళు మీ అందరి ఈకలు గీసినకత్తి, మంగలికత్తి, మంగళకరమైన కత్తి, దాంతో నాపీకకోసీ.

జనం : మేం ఒప్పుకోం... మేం ఒప్పుకోం...

సాలె : ఇన్నాళ్ళు పోరాడింది నిన్ను పోగొట్టుకోడానికా? వద్దు.... నువ్వు ఊ అను ఈ నాడి నాయుడి గుండెల్లో దింపి ఆడినాడి ఆగిపోయినట్టు సేస్తాను.

రాజి : (నాడిని చేతిలోకి తీసుకున్నాడు) మనిషి ఒంట్లో నాడి ఆడతాది. సాలోడి ఇంట్లోను నాడి ఆడతాది. ఒకటి పేనం నిలుపుతాది.... మరొకటి మానం నిలుపుతాది... వద్దు.. తప్పుకో సోమయ్య.

కుమ్మరి : రాజన్నా! సిన్నకులాల్ని సిన్నసూపు సూసినోడి కళ్ళు పొడిసేస్తను... నువ్వు ఊఁ అను

కమ్మరి : కాళ్ళు నరికేస్తాను... నన్నొదులు

రాజి : లోకానికి ఆపదొచ్చినప్పుడల్లా దేవుడు అవతారమెత్తినాడంటారు. అది నిజం అవ్వొచ్చు.. అబద్దము అవ్వొచ్చు. కానీ లోకానికి అవసరమొచ్చినప్పుడల్లా ఒక అవతారమెత్తినాడు. బట్ట అవసర

మొచ్చినప్పుడు సాలోడైనాడు, కుండ అవసరమొచ్చినప్పుడు కుమ్మరోడైనాడు, నాగలి అవసరమొచ్చినప్పుడు వడ్రంగైనాడు. ఇదీ అదీ అనికాదు దేవుడికున్న వెయ్యి సేతుల్ని వేల వృత్తులుగా మార్చి మనకి అప్పగించాడు.... ఇన్ని తరాలుగా ఈ లోకాన్ని నిలబెట్టినోళ్ళం మనం... బతికించినోళ్ళం మనం... ఇప్పుడితగాడ్ని చంపి కళంకం తెచ్చుకుంటామా? వద్దు... నామీద మీకు గౌరవం ఉంటే, మీరెవులు నొరెత్తకండి!... (ధ్యానముద్రలో వున్నట్టు వెళ్ళి కూర్చున్నాడు రాజిగాడు) ... రా! నాయుడు చంపు! నా పీక తీసుకో!

ఈరమ్మ : అయ్యా!

రాజి : ఈరమ్మా! నాదగ్గరికి రాకు... చూస్తావే నాయుడు రా చంపు!

డబ్బా : బావా! వీళ్ళకు నీపక్కన చోటిస్తే చాలు వీళ్ళు తమ గుండెల్లో నీకు చోటిస్తారు. నువు రాజయ్యను పెసిడెంట్‌గా అంగీకరించు – బిసిల బలం బలగం నీఎంట నిలబడతాది.

నాయుడు : ఓసే! (హాస్యం)

రాజి : నాయుడు! నామినేషనేసి ఇంటికెళిపోయినా నాను గెలుస్తాను. లేదూ నువు నామినేషనేసి ఎలక్షను జరిగినా నానే గెలుస్తాను. కానీ నీఇంటికెందుకొచ్చినానో తెల్సా! ఇంతరవకు నీది అనుకుంటున్న బలం నీది కాదు అది మాది అని లోకానికి సెప్పడానికి..... అయినా నువ్వా నిజాన్ని గుర్తించడానికి ఇష్టపడకపోతే.... నేను నా ప్రాణం ఒదులుకోడానికి ఎనకాడను. రా!

బామ్మ : నీలాంటోళ్ళు పదవులు, అధికారాలు, ఆస్తులు అంతస్థులు అనుభవించినప్పుడు పెద్దకులాల్తో చేతులు కలుపుతున్నారు. రిజర్వేషన్లు, రాయితీలు, పొందే టప్పుడు సిన్నకులాల పక్కన నిలబడుతున్నారు. ఈ దొంగాట ఆపి నిజంగా వెనకబడి ఉన్నోళ్ళకు కాస్త చోటుకల్పించండి. దేవుడు మీకు, మీ పిల్లలకు మేలు చేస్తాడూ.

నాయుడు : ఓసే (శృంగారం) .... (కత్తి కిందపడేశాడు) రాజయ్యా! (వెళ్లి గుండెలకు హత్తుకున్నాడు). ఓడిపోయాన్రా! నేను ఓడిపోయాన్రా! నువ్వే గెల్చావు

రాజయ్యా! నువ్వే గెల్చావు! మామనసుల్ని మభ్యపెట్టుకుని అవకాశం దొరికింది కదా అని దుర్మార్గంగా అనుభవించేస్తన్నాం గానీ మీరు, మేము సమానం కాదురా! మీ కంచాల్లో ఏసిందాంతో మాకడుపులు నింపుకున్నాం. మీకొచ్చిన అవకాశాల్ని మేం తన్నుకు పోయినాం. మేము పైపైకి ఎల్తుంటే మీరు పాతాళానికి జారిపోతన్నారు. ఇదిక్కడితో ఆపుదాం... నిన్ను మా[ప్రెసిడెంటుగా మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. మారాజిగాడు కూర్చోవాల్సింది కుర్చీలో కాదు ... ఇదిగో ఇక్కడ నాభుజంమీద.

రాజి : ఈ దేశంలో బేమ్మర్ల గురించి దేవుడాలోచించాడు. రెడ్ల గురించి రాజ్యాలాలోచించాయి. కమ్మోళ్ళ గురించి సిద్ధాంతాలు ఆలోచించాయి. కాపులు, కాళింగులు, వెలమల గురించి రాజకీయ పార్టీలు ఆలోచించాయి. హరిజన గిరిజనుల గురించి రాజ్యాంగం ఆలోచించింది. మైనార్టీల గురించి ప్రభుత్వాలూ ఆలోచించాయి. ఇంత వరకూ ఎవ్వరూ ఆలోచించంది మాగురించే.... దయచేసి ఆలోచించండి....

(రాజిగాడ్ని భుజంమీద కూర్చోపెట్టుకున్నాడు – అతనిచుట్టూ సహస్రవృత్తుల చిహ్నాలు వలయాకారంలో పరివేష్టితమయ్యాయి. ప్రజలు విష్ణుమూర్తిని చూసినంత ఆనందంగా కేరింతలు కొట్టారు)

(నైమిశారణ్యంలో సూతుని ద్వారా కథ విన్న మునులు కూడా సంతుష్టితాంత రంగులై ఆనందాన్ని పంచుకుంటుండగా వారి సంభాషణలు మాత్రం వినిపిస్తున్నవి)

మునులు : మేము అంగీకరిస్తున్నాం. చతుర్విధ ధర్మాలు జన్మతో నిర్దేశించబడకూడదు.

సూతుడు : స్వధర్మోనిధనం శ్రేయః

పరధర్మో భయావహః

స్వధర్మమంటే వ్యక్తి స్వభావానికి, ఆ వ్యక్తిలో ఉన్న సత్త్వరజస్తమోగుణాల నిష్పత్తికి అనుగుణ్యమైనదని అర్థం – అంతేకాని కులసంబంధమైనది కాదు.


రాజియ్యలోని పోరాటపటిమ, వీరత్వం, త్యాగం కాంచిన దేవతలు మహాసంతోషంతో అతనిపై పూలవర్షం కురిపిస్తున్నారు. (పైనుండి పూలవర్షం కురిసింది).

మునులు : ఆహా! రాక్షసుల్ని నిర్జించిన రామునికి దక్కిన వరమది. మీరు ఉటంకించిన ఈ కథతో మేము ధన్యులమయ్యాం మహర్షీ.

సూతుడు : ఏదీ నేటి కథా కాలక్షేపానికి మంగళం పలుకుతూ విశ్వ శ్రేయోకారక మంత్రాల్ని జపించండి

ఓం పృథ్వీశ్శాంతిః
అంతరిక్ష శ్శాంతిః
ద్యౌ శాంతిః
అవాంతర దిశా శాంతిః
అగ్నిశ్శాంతిః వాయుశ్శాంతిః
ఆదిత్యశ్శాంతిః చంద్రమాశాంతిః
నక్షత్రాశ్శాంతిః ఆపశ్శాంతిః
ఔషదశ్శాంతిః వనస్పతియశ్శాంతిః
గౌశ్శాంతిః అజాశ్శాంతిః
అశ్వశ్శాంతిః స్త్రీ పురుషశ్శాంతిః
బ్రహ్మశ్శాంతిః బ్రాహ్మణశాంతిః
శూద్ర శాంతిః దళిత శాంతిః
శాంతిరేవశ్శాంతిః శాంతిర్మే అస్తుశ్శాంతిః

**॥ సమాప్తం ॥**




*గౌరవనీయ భారత ఉపరాష్ట్రపతి శ్రీ మహమ్మద్ హమీద్ అన్సారీ గారి చేతులమీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు స్వీకరిస్తున్న డా. డి. విజయభాస్కర్*

---

సాంస్కృతిక రంగంలో సరికొత్త చైతన్యం రాజిగాడు రాజయ్యాడు. *– వార్త 17.7.2013.*

రాజిగాడికి జేజేలు *– నమస్తే తెలంగాణ, హైదరాబాదు, 18.7.2013.*

వేదికెక్కిన కొత్తవాణి – నిమ్న కులాల వారి జీవితాలకు సంబంధించిన ఇతివృత్తంతో రాజిగాడు రాజయ్యాడు నాటకం రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది.

*– ఆంధ్రజ్యోతి, 29.7.2013*

Politics Turn Melodramatic - As Rajigadu Rajayyadu Highlighted Rural Politics, Professional Performances Stuck a Chord with the Audience

*- The Hindu , 1.11.2013*

బడుగు జీవుల శ్రమకు పట్టం *– సాక్షి, తిరుపతి. 14.2.2014*

రాజిగాడు.... రాజ్యాధికారం.... *– ప్రజాశక్తి. 17.2.2014*

అసమానతల గుట్టు విప్పిన రాజిగాడు రాజయ్యాడు.

*– ఈనాడు, విశాఖపట్టణం, 15.4.2014.*

పెత్తందారు కనువిప్పుకు రాజిగాడు రాజయ్యాడు. *– సాక్షి, విశాఖపట్టణం, 15.4.2014.*

సహస్ర వృత్తుల సంకేతం. *– ఈనాడు, విశాఖపట్టణం, 16.4.2014.*

Keeping alive the Uttarandhra Flavour *- The Hindu, Visakhapatnam, 16.4.2014*

రూ. **100/-**

**EBP021**

ఎమెస్కో బుక్స్

ISBN 978-93-85829-90-1
9 789385 829901